
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 326

బుధవారం 9-8-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సూర్య అదరగొట్టగా...

మూడో టి20లో వెస్టిండీస్‌పై భారత్ ఘన విజయం - 12లో



మారుతీలో ప్రమోటర్ల వాటా ప్లస్

సుజుకీ కార్పొరేషన్‌కు షేర్ల జారీ కోసం బోర్డు గ్రీన్‌సిగ్నల్ - 13లో



లోక్‌సభలో గరంగరం..

కేంద్రంపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాసంపై లోక్‌సభలో చర్చ ప్రారంభమైంది. అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం నడిచింది.

వివరాలు 6లో ▸



ఐక్యతను పరీక్షించుకోవడానికే..

విపక్ష కూటమిలో ఒకరిపై ఒకరికి నమ్మకం ఉందో లేదో పరీక్షించుకోవడానికే అవిశ్వాసం పెట్టారని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు.

వివరాలు 6లో ▸



రాహుల్‌కు మళ్లీ అదే బంగ్లా

కాంగ్రెస్ నేత రాహుల్ లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించడంతో ఆయనకు తుగ్లక్ లేన్‌లోని బంగ్లానే తిరిగి కేటాయించారు.

వివరాలు 6లో ▸



అమెరికా అతలాకుతలం

అమెరికాను భీకర తుపాను వణికిస్తోంది. 11 లక్షల నివాసాల్లో అంధకారం అలుముకోగా.. 2,600 విమాన సర్వీసులు రద్దయ్యాయి.

వివరాలు 6లో ▸

సాయంలో కొత్త ఒరవడి

క్షేత్రస్థాయిలో బాధితులను ఆదుకోవడమే తొలి ప్రాధాన్యం

ఆ తర్వాత పర్యవేక్షణకు నేరుగా బాధితుల వద్దకు ముఖ్యమంత్రి

- కొత్త విధానాన్ని కొనసాగిస్తూ గోదావరి లంకల్లో సీఎం వైఎస్ జగన్ పర్యటన
- నాడు ఫొటో సెషన్‌లా నేతల పర్యటన
- బాధితుల వద్దకు నేరుగా వెళ్లి మాట్లాడేవారు కాదు.. నేడు తక్షణ సాయం అందించాకే జనం మధ్యకు వస్తున్నా
- దీన్నొక సరికొత్త విధానంగా అమలు చేస్తున్నాం.. పేదల సాయంలో వెనకడుగు వేయకండని కలెక్టర్లకు చెప్పాం
- నష్టపోయిన ప్రతి వ్యక్తికి పరిహారం అందించాం.. మనం ఏర్పాటు చేసిన గొప్ప వ్యవస్థల వల్లే ఇది సాధ్యమైంది
- పంట నష్టపోయిన రైతులకు నెలాఖరుకు పరిహారం.. లంక గ్రామాల వరద బాధితులతో సీఎం వైఎస్ జగన్
- బాధితుల కష్టాలు వింటూ.. పంట నష్టం పరిశీలన..

2లో



అంబేడ్కర్ కోనసీమ జిల్లా గురజాపు లంకలో వరద తాకిడికి గురైన ఓ ఇంట్లోకి వెళ్లి పరిశీలించి.. బాధితురాలికి భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

"వరద కష్టాల్లో ఉన్న ప్రజలకు తక్షణ సాయం అందాలి. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. భోజనం, నీరు, వైద్యం అందించాలి. తొలుత ఆ పని చేయండి. ఆ తర్వాతే ఆయా గ్రామాల్లో ఉన్న నా అన్నదమ్ములను, అక్కచెల్లెమ్మలను నేనే స్వయంగా వచ్చి అడుగుతాను. ఏ ఒక్కరి నుంచి కూడా నాకు అందాల్సింది అందలేదు.. కలెక్టర్ సరిగా స్పందించ లేదు.. వ్యవస్థలు సరిగా పని చేయలేదన్న మాట ఎక్కడా వినపడకూడదని కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చాం. ఇందులో భాగంగానే ఇప్పుడు పరిశీలించడానికి వచ్చాను. దీన్నొక సరికొత్త విధానంగా అమలు చేస్తూ కొత్త ఒరవడి సృష్టించాం. తక్షణ సాయం పట్ల మీరు సంతృప్తిగా ఉన్నందుకు ఆనందంగా ఉంది. - లంక వాసులతో సీఎం జగన్

రూ.200 కోట్లతో గ్రామాలకు రక్షణ గోడ

లంక కోతకు శాశ్వత పరిష్కారం

నెలాఖరులోగా టెండర్లు: సీఎం వైఎస్ జగన్

2లో

పోలీసులే ఫస్ట్ టార్గెట్!

ముందస్తు పన్నాగంతోనే వారిపై మూకుమ్మడి దాడి

పుంగనూరు వద్ద బందోబస్తు విధుల్లో ఉండగా హఠాత్తుగా విరుచుకుపడిన టీడీపీ గూండాలు

- కంటిచూపు కోల్పోయిన కానిస్టేబుల్ రణధీర్ వెల్లడి
- బాధిత కానిస్టేబుల్ కుటుంబానికి అండగా ప్రభుత్వం
- రూ.10 లక్షల సాయం
- మినిస్టీరియల్ విభాగంలో ఉద్యోగం కల్పిస్తామని ప్రకటన
- చంద్రబాబు పన్నాగాన్ని ఎండగట్టిన మంత్రులు
- కడప సెంట్రల్ జైలుకు 72 మంది నిందితుల తరలింపు

3లో



కంటిచూపు కోల్పోయిన కానిస్టేబుల్ రణధీర్‌కు ధైర్యం చెబుతున్న చిత్తూరు ఎస్పీ రిశాంత్‌రెడ్డి


మూలధన వ్యయంలో ఏపీ టాప్

- ఆస్తుల కల్పన వ్యయంలో అగ్రపథంలో ఆంధ్రప్రదేశ్
- 3 నెలల్లో 40% వ్యయం.. తొలి త్రైమాసికంలో దేశంలో ఇదే అత్యధికం
- బడ్జెట్ కేటాయింపుల్లో 2 నెలల్లోనే 29.7% వెచ్చించిన ఏపీ
- మిగతా ఏ రాష్ట్రాల్లోనూ ఈ స్థాయిలో మూలధన వ్యయం చేయలేదు
- ఏప్రిల్–జూన్ మూలధన వ్యయంపై కాగ్ గణాంకాల వెల్లడి



5లో

ఫ్యాక్ట్ చెక్



బురద రాతలే పునరావృతం

- పోలవరం కట్టక ముందు ముంపునకు గురైన గ్రామాలే ఇప్పుడూ మునక
- ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయనప్పుడు కొత్తగా ముంపు సమస్య ఎక్కడిది?
- గత నాలుగేళ్లలో రూ.1,677 కోట్లు వెచ్చించి ఇప్పటికే 8,446 కుటుంబాలకు పునరావాసం
- చంద్రబాబు నిర్వాకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఆపాదించేలా రామోజీ దుర్బుద్ధి

10లో

ఇదీ మణిపూర్ కథ..!

మణిపూర్ చరిత్ర అంటే భిన్న సంప్రదాయాలు, సంస్కృతులు కలిగిన జాతుల కలబోత. విభిన్న తెగల వారు ఒకే చోట సహజీవనం చేసే మణిహారం. మెయిటీలు, కుకీల మధ్య మూడు నెలలుగా జరుగుతున్న ఘర్షణలు రాష్ట్రాన్ని అగ్ని గుండంగా మార్చాయి. ఈ నేపథ్యంలో మణిపూర్ చరిత్ర అందరిలోనూ ఆసక్తిని పెంచింది.

6లో

పెరిగిన రొయ్యల ధరలు



- 20 కౌంట్ కేజీ ధర రూ.610
- ఇతర రాష్ట్రాల్లో రూ.510 నుంచి రూ.600 మాత్రమే
- 100 కౌంట్ ధర మన రాష్ట్రంలో రూ.205
- ఇతర రాష్ట్రాల్లో రూ.190 నుంచి రూ.200 మాత్రమే

14లో

అయినవారే రాబందులై!



మహిళలను హింసిస్తున్న వారిలో 40 శాతం మంది కొడుకులే

- వేధింపులకు గురవుతున్న వారిలో 16 శాతం మంది వృద్ధ మహిళలు
- 31 శాతం మందికి బంధువులు, 27 శాతం మందికి కోడళ్ల నుంచి చిత్రహింసలు
- హెల్ప్ ఏజ్ ఇండియా అధ్యయనంలో వెల్లడి

సాక్షి, అమరావతి: తల్లిని మించిన దైవం లేదంటారు. అమ్మను ఆది దేవతగా పూజించాలంటారు. కానీ కొందరికి ఇదేమీ పట్టడం లేదు. నవమాసాలూ కడుపున మోసి.. కంటికి రెప్పలా కాపుకాసి విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకులను చేస్తే.. రెక్కలొచ్చాక అమ్మ వారికి బరువైపోతోంది. కడుపున పుట్టిన వారి వల్లే అమ్మ అష్టకష్టాలు పడుతోంది. హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ జరిపిన తాజా అధ్యయనంలో ఈ విషయం మరోసారి రుజువైంది. దేశంలో మహిళలను హింసిస్తున్న వారిలో 40 శాతం మంది సొంత కుమారులేనని అధ్యయనం వెల్లడించింది. వేధింపులకు గురవుతున్న వారిలో 16 శాతం మంది వృద్ధ మహిళలు కాగా.. 31 శాతం మందికి వారి బంధువులు.. 27 శాతం మందికి కోడళ్ల నుంచి చిత్రహింసలు ఎదురవుతున్నాయని సర్వే తేల్చింది. ఎక్కువగా శారీరక హింస, అగౌరవం, మానసిక వేధింపుల రూపంలో చిత్రవధ అనుభవిస్తున్నారని ఆ నివేదిక వెల్లడించింది. వేధింపులకు గురవుతున్నప్పటికీ చాలామంది వృద్ధ మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేయలేని నిస్సహాయ స్థితిని ఆసరాగా చేసుకుని అయినవారే వారిని రాబందుల్లా పొడుస్తున్నారని స్పష్టమైంది.

అవసాన దశలో అన్నీ కష్టాలే

ఈ ఏడాది మే నుంచి జూన్ వరకూ నెల రోజుల పాటు 60 నుంచి 90 సంవత్సరాల వయసు గల 7,911 మంది మహిళలతో అధ్యయన సంస్థ సర్వే చేసింది. 20 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలు, ఐదు మెట్రో నగరాలు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వివిధ సామాజిక, ఆర్థిక వర్గాలను కవర్ చేస్తూ మహిళలను ఈ సర్వేకు ఎంపిక చేసింది. వారిలో 16 శాతం మంది వృద్ధ మహిళలు వేధింపులకు గురైనట్టు తెలిపారు. 50 శాతం మంది శారీరక హింసను ఎదుర్కొంటున్నట్టు వెల్లడించారు. 46 శాతం మంది తమకు ఇళ్లలో అసలు గౌరవ మర్యాదలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. 40 శాతం మంది తమ భావోద్వేగాలకు విలువ లేదని, మానసిక వేధింపులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. సర్వేలో పాల్గొన్న మహిళల్లో మొత్తం 40 శాతం మంది తాము ఎదుర్కొంటున్న కష్టాలకు ప్రధాన కారకులు తమ సొంత కుమారులేనంటూ విలపించారు. 31 శాతం మంది తమ బంధువులు, 27 శాతం మంది తమ కోడళ్ల వల్ల ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. కానీ భయం, బంధం కారణంగా తాము ఎదుర్కొంటున్న బాధల గురించి పోలీసులకు ఫిర్యాదు చేయలేకపోతున్నారు. ఒకవేళ అలా చేస్తే తమకు వేధింపులు ఎక్కువయ్యే అవకాశం ఉందని 18 శాతం మంది ఆందోళన వ్యక్తం చేశారు. 16 శాతం మందికి తమకు అందుబాటులో ఉన్న వనరుల గురించే తెలియదు. 13 శాతం మంది తమ ఆందోళనలను తీవ్రంగా పరిగణించకుండా సర్దుకుపోతున్నారు. 56 శాతం మంది వృద్ధ మహిళలకు వేధింపుల నివారణ విధానాలపై అవగాహన లేదు. తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల బాధ్యత, సంక్షేమ చట్టం గురించి కేవలం 15 శాతం మందికి మించి తెలియదు. 64 శాతం మంది వారి వైవాహిక స్థితి కారణంగా సామాజిక వివక్షను ఎదుర్కొంటున్నారు. 18 శాతం మంది లింగ వివక్షకు గురవుతున్నారు. 53 శాతం మంది వృద్ధ మహిళలు తమకు ఆర్థికంగా భద్రత లేదని చెప్పారు. బాగానే బతుకుతున్నామని భావిస్తున్న 47 శాతం మందిలో 79 శాతం మంది ఆర్థిక అవసరాల కోసం తమ పిల్లలపై ఆధారపడుతున్నారు. దేశంలో 66 శాతం మంది వృద్ధ మహిళలకు ఎటువంటి ఆస్తులు లేవు. మహిళలు చాలా వెనుకబడి ఉన్నారని నివేదిక తేల్చింది. 60 శాతం మంది ఎప్పుడూ డిజిటల్ పరికరాలను ఉపయోగించలేదు. 59 శాతం మంది వద్ద స్మార్ట్‌ఫోన్లు లేవు. 64 శాతం మందికి ఆరోగ్య బీమా లేదు. 67 శాతం వృద్ధ మహిళలు ఇప్పటికీ తమ కుటుంబాల్లో పిల్లలను సంరక్షించే పాత్రలు పోషిస్తున్నారు.

చీమల చట్నీ లొట్టలేస్తూ..

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

గల్లీలో ఉండే చిన్న హోటల్‌లోనే పొద్దున ఇడ్లీ, పూరీ, వడ, ఉప్మా ఇంకా ఎన్నో వెరైటీ టిఫిన్లు దొరకుతాయి. ఇక మధ్యాహ్నం అన్నం, రెండు మూడు రకాల కూరలు, పప్పు, చారు, పెరుగు ఇవన్నీ లేనిదే ముద్ద దిగదు. ఇక ఏ స్టార్ హోటల్‌కి వెళ్లినా చైనా నుంచి అమెరికా దాకా ఏ దేశపు వంటకాలైనా ఆర్డర్‌చేస్తే చాలు టేబుల్‌పై హాజరు... ఇవీ మైదాన ప్రాంత ప్రజల ఆహారపు అలవాట్లు. కానీ పచ్చని అడవుల్లో, ప్రకృతి ఒడిలో..అరకొర సౌకర్యాల మధ్య జీవించే ఆదివాసీలు ఏం తింటారు? వాళ్లకి దొరికే ఆహారం ఏమిటి? పౌష్టికాల సంగతేమిటి? నిజం చెప్పాలంటే వారికి ఆహారమంటే పచ్చడి మెతుకులే దిక్కు. స్వాతంత్రం వచ్చి 76 ఏళ్లు అవుతున్నా గిరిపుత్రులకు పూర్తిస్థాయి పౌష్టికాహారం లభించడం లేదు. సీజన్‌లో దొరికే గోంగూర, చింతపండు, మిరపకాయలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఆహార సేకరణ కష్టంగా మారిన సమయంలో ఎర్ర చీమలతో పచ్చడి నూరుకుని కూడా తింటుంటారు. అయితే మారిన పరిస్థితుల్లో విద్య, ఉద్యోగాల కోసం అడవుల నుంచి బయటపడుతున్న వారి ఆహారపు అలవాట్లలో ఇప్పుడిప్పుడే కొంత మార్పు చోటు చేసుకుంటోంది.



విభిన్నంగా ఆదివాసీల ఆహారపు అలవాట్లు

గోంగూర, చింతపండు ప్రధాన ఆహారం

ఎండు మిరప కోసం వందల కిలోమీటర్ల నడక..

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్, తూర్పుగోదావరి జిల్లాలు రెండు దశాబ్దాలుగా ఛత్తీస్‌గఢ్, ఒడిశాకు చెందిన ఆదివాసీలకు ఆశ్రయం ఇస్తున్నాయి.

వలస ఆదివాసీలు

వలస ఆదివాసీల్లో అనేక తెగలు ఉండగా, వీరిలో 90 శాతం మంది రోడ్డు, నీళ్లు, విద్యుత్ సౌకర్యం లేకుండా అటవీ ప్రాంత పల్లెల్లోనే ఉంటున్నారు. పోడు సాగు చేసుకోవడం, ఇంటి అవరణలోనే తినే ఆహార పదార్థాలను పండించుకోవడం వీరి జీవనశైలి.

గోంగూర.. పండగే..

వానాకాలంలో మొలకెత్తే గోంగూర ఆగస్టులో తినేందుకు అనువుగా ఎదుగుతాయి. ఆ సమయంలో ఆదివాసీలు గోంగూర పండుగ చేసుకుంటారు. చింతకాయలు అందుబాటులోకి వచ్చే వరకు గోంగూరే వీరి ప్రధాన ఆహారం. వానాకాలం ముగిసేలోగా అందుబాటులో ఉన్న గోంగూర ఎండబెట్టుకుని వేసవి వరకు వాడుకుంటారు. ఎండాకాలంలో చింతకాయలు రాగానే పచ్చడి చేసుకుంటారు. గోంగూరతో పాటు పచ్చకూర (చెంచలి), బొద్దుకూర, నాగళి, టిక్కల్ అనే ఆకుకూరలు, కొన్ని రకాలైన దుంపలను కూడా వండుకుంటారు.

కారం కావాలంటే..

మొదట్లో అటవీ ఫలసాయం తప్ప వ్యవసాయం తెలియని ఆదివాసీలను కారం రుచి మైమరపించింది. గోంగూర, చింతకాయ పచ్చడికి అవసరమైన మిరపకాయలు అపురూపమైన ఆహారంగా మారింది. దీంతో మిరపకాయల కోసమే ఎత్తయిన కొండలు గుట్టలు ఎక్కుతూ దిగుతూ.. వాగులు, వంకలు దాటుతూ రాష్ట్రాల సరిహద్దులు చెరిపేసి గోదావరి తీరానికి చేరుకునేవారు. ప్రారంభంలో భద్రాద్రి ఏజెన్సీలో కల్లాల్లో ఆరబోసిన మిర్చి పంటను దొంగలించుకెళ్లేవారట. ఆ తర్వాత ఇక్కడ పనిచేసి, కూలీగా మిర్చి తీసుకెళ్లడం అలవాటు చేసుకున్నారు. ఇక పోడు సాగు కోసం ఆదివాసీలు అడవిని నరికేటప్పుడు ఇప్ప, మద్ది, తునికి, చింత, పాల చెట్లు తారసపడితే ముట్టుకోరు. ఇక ఇప్ప చెట్టునయితే దైవంతో సమానంగా కొలుస్తారు.



చీమలు... ఆహారంగానే కాదు.. వైద్యానికి కూడా

ఆకు రాలే కాలం మొదలైన తర్వాత వసంతం వచ్చే వరకు ఆదివాసీలకు ఆహార సేకరణ కష్టంగా మారుతుంది. ఈ సమయంలో చీమలను ఆహారంగా తీసుకుంటారు. సర్గీ, సాల్, మామిడి ఆకులపై ఎర్రచీమలను వాటి గుడ్లను సేకరిస్తారు. అనంతరం ఉప్పు, కారం, టమాటా కలిసి రోట్లో వేసి రుబ్బుతారు. ఇలా తయారు చేసిన చట్నీని బస్తరియాగా పిలుస్తారు. ఎర్రచీమల్లో ఔషధ గుణాలు కలిగిన ఫామిక్ యాసిడ్ ఉండడమేకాక ప్రొటీన్, కాల్షియం సమృద్ధిగా ఉండి జ్వరం, జలుబు, దగ్గు, కంటి సంబంధిత సమస్యలు, కీళ్ల నొప్పులు తగ్గుతాయని నమ్ముతారు. అలాగే ఒంట్లో నలతగా ఉన్నా, తలనొప్పి, జ్వరంగా అనిపించినా చీమల చికిత్సకే మొగ్గు చూపుతారు. చెవులు, ముక్కుల ద్వారా చీమలు శరీరంలోకి వెళ్లకుండా ముఖాన్ని వస్త్రంతో కప్పేసుకుని చీమల గూడును ఒంటిపై జల్లుకుంటారు. వందల కొద్ది చీమలు శరీరాన్ని కుడుతుండగా.. మంట పుట్టి క్షణాల్లో ఒళ్లంతా చెమటలు వస్తాయి. రెండు, మూడు నిమిషాలు ఉన్న తర్వాత చీమలు తీసేస్తారు. తద్వారా ఒంట్లో ఉన్న విష పదార్థాలు చెమట రూపంలో బయటకు వెళ్లి ఉపశమనం కలుగుతుందని వారి నమ్మకం. కాగా, జొన్నలు, సజ్జలు వంటి చిరుధాన్యాలనే పండించి ఆహారంగా తీసుకునేవీరు క్రమంగా బియ్యానికి అలవాటు అవుతున్నారు. వ్యవసాయంలో ఎరువులు సైతం ఉపయోగిస్తున్నారు. గతంలో ఆవు పాలు తీసుకోని వీరు.. ఇప్పుడిప్పుడే పాల ను ఆహారంలో భాగం చేసుకుంటున్నారు. ఇక ప్రభుత్వ గిరిజన పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు నెమ్మదిగా మైదాన ప్రాంత ఆహారపు అలవాట్లు చేసుకుంటున్నారు.

హాస్టల్ తిండి బాగుంది..

ఇంటి దగ్గరకంటే హాస్టల్‌లో తినే ఆహారం రుచిగా బాగుంది. ఇంటి దగ్గర ఉంటే ఒక రోజు కూరతో తింటే రెండు రోజులు కారం పచ్చడితో తినాలి. హాస్టల్‌లో అయితే ఈ సమస్య లేదు. పాలు, గుడ్లు కూడా ఇస్తారు.

– తాటి చరణ్, 9వ తరగతి, గిరిజన ఆశ్రమ పాఠశాల, చర్ల.

ఎక్కువ తినాల్సి వస్తోంది

మేము ఇంతకు ముందు జొన్నలు, సజ్జలు తినేవాళ్లం. ఒక్కసారి తింటే పొద్దంతా మళ్లీ ఆకలి వేసేది కాదు. పొద్దున తిని అడవికి వెళితే రాత్రి వరకు ఆకలి అనేది ఉండకపోయేది. కానీ బియ్యంతో చేసిన అన్నం అయితే రోజుకు రెండుసార్లు తినాల్సి వస్తోంది. చద్ది కట్టుకుని అడవికి, పనికి పోతున్నాం. ఈ ఒక్క బాధ తప్పితే బియ్యంతో చేసిన అన్నం బాగుంది.

– మామిడి అరవయ్య కూలీ, రెడ్డిగూడెం ఎస్టీ కాలనీ

సోదరుడికి స్వాగతం



తొత్తరమూడివారిపేటలో సీఎం జగన్‌కు హారతులిస్తున్న మహిళలు

హాయ్.. చిట్టితల్లీ



రామాలయంపేటలో చిన్నారిని ఎత్తుకుంటున్న ముఖ్యమంత్రి

అవ్వా.. బాగున్నావా..



తొత్తరమూడివారిపేటలో వృద్ధురాలి కళ్లజోడును సరిచేస్తున్న సీఎం

పింఛన్ వస్తోందా..



తొత్తరమూడివారిపేటలో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాయంలో కొత్త ఒరవడి..

కొత్త విధానాన్ని కొనసాగిస్తూ గోదావరి లంకల్లో సీఎం పర్యటన

సాక్షి అమలాపురం : 'గతంలో చాలాసార్లు వరదలు వచ్చాయి. నాయకులు అప్పటికప్పుడు రావడం, అధికారులంతా వారి చుట్టూ తిరగటం జరిగేది. పేపర్లలో.. టీవీల్లో ఫొటోల కోసం పోజులిచ్చి వెళ్లిపోయేవారు. ప్రతి ఒక్కరికీ మంచి జరగాలి. కానీ వారు మంచి జరిగిందా లేదా అని చూడలేదు. మన ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితిని మార్చాం. ప్రతి బాధితునికి సాయం అందుతోంది. నాలుగేళ్లుగా ఈ మార్పు కనిపిస్తోంది. సాయం చేయడం, ఆదుకోవడం అంటే ఇదీ..' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గోదావరి వరదల బారిన పడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మంగళవారం ఆయన పర్యటించారు. ముమ్మిడివరం, పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని గురజాపులంక, లంకాఫ్ ఠాన్నేల్లంక, కొండుకుదురులంకల్లో బాధితులతో మమేకమయ్యారు. వారి కష్టనష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. ఇలాంటి ప్రతి సందర్భంలో కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రజలకు తక్షణ సహాయ కార్యక్రమాలు చేపట్టేందుకు కావాల్సిన డబ్బులు వారి చేతుల్లో పెట్టామని చెప్పారు. వరద నష్టం ఎక్కువా, తక్కువా అని చూడకుండా బాధితులను ఉదారంగా ఆదుకోండని చెప్పామని తెలిపారు. 'ఆయా జిల్లాల్లో కలెక్టర్లకు వారం రోజుల సమయం ఇచ్చాం. ప్రతి గ్రామంలోకి వెళ్లాలని, ప్రతి గ్రామంలో ఉన్న వ్యవస్థను చైతన్యం చేయాలని చెప్పాం. ఆ తర్వాత నేను స్వయంగా వచ్చి బాధితులకు సాయం అందిందీ లేనిదీ చూస్తానని చెప్పాను. నేను వచ్చినప్పుడు నాకు సహాయం అందలేదని ఏ ఒక్కరి నోటి నుంచి రాకూడదు' అని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానని చెప్పారు. వరదలు వచ్చినప్పుడే మిమ్మల్ని పలకరించేందుకు వస్తే సహాయక చర్యలకు ఆటంకం కలుగుతుందని భావించే ఇలా చేశానని వివరించారు. కష్టాలలో ఉన్నప్పుడు మీ బిడ్డ వేగంగా ఆదుకుంటాడని పునరుద్ఘాటించారు.

ఉదారంగా ఉండాలన్నాను..

పేదలకు సాయం అందించడంలో ఉదారంగా ఉండాలన్న తన సూచన మేరకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో యంత్రాంగం పనిచేసిందని సీఎం కొనియాడారు. ఈ రోజు ప్రతి వ్యక్తికి పరిహారం అందించామంటే అందుకు మీ బిడ్డ జగన్ గ్రామీణ స్థాయిలో గొప్ప వ్యవస్థను ఏర్పాటు చేయడమేనన్నారు. సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఆర్‌బీకేలు, వలంటీర్ల వ్యవస్థ వల్ల వరదల సమయంలో వేగంగా సాయం అందించడానికి మార్గం సుగమం అయిందన్నారు. ఈ వ్యవస్థ వల్లే ప్రతి పనిలోను పారదర్శకత చూపిస్తున్నామని తెలిపారు.



తొత్తరమూడివారిపేటలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



గురజాపులంకలో ఓ గుడిసె వద్ద ప్రజలతో మాట్లాడుతున్న సీఎం జగన్

నెలాఖరుకు పంట నష్ట పరిహారం

పంట నష్టపోయిన రైతులకు నెలాఖరుకు పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని సీఎం జగన్ రైతుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. 'రైతులకు ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే అదే సీజన్‌లో పరిహారం ఇస్తున్న ఏకైక ప్రభుత్వం మనదే' అని అన్నారు. మూడు నాలుగు రోజుల్లో జాబితా సిద్ధమవుతుందని, రైతుల పేరు, విస్తీర్ణం, పంట నష్టం వివరాలు ఆర్‌బీకేలలో ఉంటాయన్నారు. ఎవరి పేరు అయినా కనిపించకపోతే ఆర్‌బీకేలో ఫిర్యాదు చేస్తే, తిరిగి పరిశీలిస్తారని చెప్పారు. నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందిస్తామన్నారు. అనంతరం గురజాపులంక, కూనలంకల్లో నష్టపోయిన వంగ, మునగ, బెండ, ఇతర కూరగాయ పంటలను పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడారు. విలేజ్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణుల ముంగిటకే వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. పశువులకు కూడా మెరుగైన వైద్యం అందిస్తున్నామని, టీఎంఆర్ (టోటల్ మిక్స్‌డ్ రేషన్–సమగ్ర పశు దాణా) దాణా అందిస్తున్నామని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని సచివాలయం, వలంటీర్ వ్యవస్థలు, విలేజ్ క్లినిక్‌లు మన కళ్లెదుటే కనిపిస్తున్నాయని వివరించారు. 'ఓఎన్జీసీ పరిహారం గురించి మీ అందరికీ తెలుసు. మీ బిడ్డ ప్రభుత్వం వచ్చాక అది మీకు అందింది. అన్ని విధాలా మీకు మంచి చేసే విషయంలో దేవుడు మరింత అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నాను' అని సీఎం జగన్ అన్నారు. సీఎం జగన్‌ను చూసేందుకు మహిళలు, యువత ఆసక్తి చూపించారు. సీఎం.. సీఎం.. అంటూ నినాదాలు చేశారు. గురజాపులంకలో పలువురు యువకులు జగన్‌ను చూసి 'వైనాట్ 175 జగనన్నా..' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీఎం జగన్ చిరునవ్వుతో అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

సీఎంకు ఘన స్వాగతం

జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలు, నేతల నుంచి ఘన స్వాగతం లభించింది. సీఎం వెంట రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్, మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, తానేటి వనిత, ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, అమలాపురం ఎంపీ చింతా అనూరాధ, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, బొమ్మి ఇజ్రాయెల్, కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్యేలు పొన్నాడ వెంకట సతీష్ కుమార్, కొండేటి చిట్టిబాబు, రాపాక వరప్రసాద్, పెండెం దొరబాబు, కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ నపూర్ అజయ్‌లు పాల్గొన్నారు.

నేరుగా జనం మధ్యకే..

మంగళవారం ఉదయం సీఎం వైఎస్ జగన్ నేరుగా గురజాపులంకకు హెలికాప్టర్‌లో చేరుకున్నారు. సాధారణంగా వరదల సమయంలో బాధితులను పరామర్శించేందుకు గతంలో చాలా మంది ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు జిల్లాకు వచ్చారు. అప్పట్లో డివిజన్ కేంద్రమైన అమలాపురం, వరద ప్రభావిత ప్రాంతాల మండల కేంద్రాలలో వరద నష్టంపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించి, ఎంపిక చేసిన బాధితులను పరామర్శించి వెనుదిరిగేవారు. సీఎం జగన్ ఇందుకు భిన్నంగా నేరుగా లంక గ్రామాలలోకే రావడం బాధితులను, పంట నష్టపోయిన రైతులను పరామర్శించడంతోపాటు జరిగిన నష్టాన్ని స్వయంగా వీక్షించడం గమనార్హం. ఐదారు గంటలపాటు లంకవాసులతో సీఎం మమేకమయ్యారు. ఇదే విషయాన్ని లంకవాసులు, వరద బాధితులు గొప్పగా చెప్పుకున్నారు. తమ బాధలను తెలుసుకునేందుకు వచ్చిన తొలి ముఖ్యమంత్రి వైఎస్ జగనే అని వారు సంబరపడ్డారు. 1996లో పెను తుపానుకు తమ గ్రామాలు ధ్వంసమైనప్పుడు అప్పటి సీఎం చంద్రబాబు తమ గ్రామాలకు రానేలేదని వారు గుర్తు చేశారు. తమనే ఠానేలంకకు పిలిపించి మాట్లాడారని చెప్పారు. గత ఏడాది గోదావరికి రికార్డు స్థాయిలో వరద వచ్చిన సమయంలో కూడా సీఎం జగన్ జిల్లాలోని పి.గన్నవరం మండలంలోని జి.పెదపూడిలంక, ఉడుముడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల్లో పర్యటించారని గుర్తు చేశారు.



డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం రామాలయపేటలో ప్రజలకు నమస్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

జనంతో జననేత మమేకం

- సాయం అందిందా.. మీ వద్దకే వచ్చి ఇచ్చారా..
- సహాయక చర్యలపై సీఎం జగన్ నేరుగా మాటామంతీ
- సకాలంలో ఆదుకున్నారన్న బాధితులు
- ఏ లోటు లేకుండా చూసుకున్నారని ఆనందం

సాక్షి అమలాపురం/అమరావతి: వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలనలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండవ రోజు మంగళవారం డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరం, పి.గన్నవరం నియోజకవర్గాల్లో పర్యటించారు. వరద సహాయక చర్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. భద్రతా ఆంక్షలు పక్కన పెట్టి బాధితులతో మమేకమయ్యారు. అభిమానంతో చొచ్చుకువస్తున్న మహిళలు, యువత, చిన్నారులు, వృద్ధులను భద్రతా సిబ్బంది అడ్డుకోగా.. వారిని వారించి తన దగ్గరకు రప్పించుకుని మరీ మాట్లాడారు. వారితో సెల్ఫీలు దిగారు. జగనన్నా.. అని ఆప్యాయంగా పిలుస్తూ వచ్చిన వారిని అక్కున చేర్చుకున్నారు. 'జగన్ మావయ్యా' అని బిగ్గరగా అరిచిన చిన్నారులను పిలిపించుకుని సెల్ఫీలు తీయించుకున్నారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా, చెమటలు కక్కుతూన్నా బాధితుల బాధలు ఓపికగా విన్నారు. వరద బాధతులను స్థానిక వలంటీర్లు సీఎం జగన్‌కు పరిచయం చేశారు. వరద సహాయం సరిగ్గా అందిందా లేదా? అని వారి సమక్షంలోనే సీఎం తెలుసుకున్నారు. లంకాఫ్ ఠాన్నేలంకకు చెందిన జయలక్ష్మి అనే మహిళ తన పెన్షన్ వేరే ఊరిలో ఉందని, ఇబ్బంది పడుతున్నానని చెప్పగానే సీఎం స్పందించి.. స్థానిక వలంటీర్‌ను పిలిచి దరఖాస్తు చేయించాలని చెప్పారు. తనను కలిసిన విద్యార్థులను విద్యా కానుక వచ్చిందా? అని అడిగారు. వరద సాయం పంపిణీలో పొరపాటులుంటే చెబితే సరిదిద్దుకుంటామన్నారు. ప్రభుత్వం, అధికారులు, వలంటీర్లు ఇంటింటికీ వచ్చి వరద సాయాన్ని అందించారని, ప్రభుత్వం సకాలంలో స్పందించి ఆదుకుందని ముంపు గ్రామాల ప్రజలు సీఎంకు తెలిపారు.

మీరే మా ధైర్యం



వరదలతో చాలా కష్టపడుతున్నాం. నష్టపోతున్నాం. అయితే ఈ ప్రభుత్వం వచ్చాక వరద వచ్చిన ప్రతిసారీ ఎంతో సాయం చేస్తోంది. ఊరు చుట్టూ వరదనీరు చేరినా పడవల్లో వచ్చి మరీ అధికారులు మాకు భోజనాలు, తాగునీరు అందించారు. గ్రామస్తులకే కాదు పశువులకు సైతం దాణా అందజేశారు. పేద, ధనిక తేడా లేకుండా ఇంటింటికీ రెండు వేల సాయం చేసి, దెబ్బతిన్న పూరిగుడిసెలకు 10 వేలు అందించారు. మీరే మా ధైర్యం. మీ మేలు ఎప్పటికీ మరచిపోం.

– దుర్గాదేవి, కూనాలంక, ముమ్మిడివరం మండలం

మాట నిలబెట్టుకున్నారు



జగనన్న పాలనలో మాకెప్పుడూ అన్నివిధాలా సహాయ సహకారాలు అందుతున్నాయి. అమ్మ ఒడి, విద్యాదీవెన వస్తున్నాయి. ఎంత వరకూ కావాలన్నా చదువుకోండి చదివిస్తాను అని చెప్పిన మాట నిలబెట్టుకున్నారు. వరద సహాయక చర్యల్లో ఏ లోపం లేకుండా సమస్తం మాకు అందించి ఆదుకున్నందుకు ప్రభుత్వానికి, జగనన్నకు ధన్యవాదాలు.

– పట్టా రజనీ, పొట్టిలంక

మాకేం లోటు లేదు



ఈ నాలుగేళ్లలో జగనన్న వచ్చిన దగ్గర నుండి మా పేదలందరం ఎంతో సంతోషంగా ఉన్నాం. మాకేం లోటు లేదు. కలెక్టర్ నుండి వలంటీర్ వరకు ప్రతి ఒక్కరూ ఇంటింటికీ తిరిగి సాయం అందించారు. నిత్యావసరాలు మొదలు భోజనాలు, తాగునీళ్ల దాకా సమస్తం మాకు లోటు లేకుండా పంపించారు. డ్యామేజ్ అయిన ఇళ్లకు రూ.10 వేలు అందించారు. మా లంక గ్రామాల ప్రజలంతా ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

– పోతుల భారతి, కొండుకుదురులంక గ్రామం, తుత్తరమూడివారిపేట, అయినవిల్లి మండలం

మళ్లీ మీరే సీఎం కావాలి



మీ నాన్నగారు నాకు చాలా మేలు చేశారు. నిమ్స్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకుంటే అటెండర్లను పంపించారు. 16 ఏళ్లు అయ్యింది. బాగా ఉన్నాను. మీరు వచ్చాక పింఛన్ అందుతోంది. వరద వచ్చినప్పుడల్లా వెంటనే 25 కేజీల బియ్యం, పప్పు, ఆయిలు, ఉల్లిపాయలు, బంగాళదుంపలు ఇస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా మీరు గెలిచి మళ్లీ సీఎంగా రావాలి.

– నల్లా వెంకాయమ్మ, కూనాలంక, ముమ్మిడివరం మండలం

జగనన్న పాలన ఒక వరం



జగనన్న పంపిన అధికార యంత్రాంగం ఉరుకులు పరుగులు పెడుతూ వచ్చి వరదల సమయంలో మమ్మల్ని ఆదుకుంది. అందుకు మా కొండుకుదురు ప్రజలంతా ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం. మా ఎమ్మెల్యే, కలెక్టర్, రెవిన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అందరూ మాకు వెన్నంటి నిలిచారు. ఇలాంటి వ్యవస్థను ఏర్పాటు చేసిన జగనన్న పాలన మావంటి వారికి ఒక వరం.

– నక్కా శ్రీనివాస్, పొట్టిలంక

బతిమాలి అన్నం పెట్టారు



వరదల సమయంలో చాలా కష్టపడుతున్నాం. పశువులకు మేత అందక మా మగవాళ్లు ఇతర ప్రాంతాలకు వెళ్లి మేత తెస్తున్నారు. అప్పుడు మీరే మేత పంపి చాలా మంచి పని చేశారు. ఈసారి రెండు రోజులు అన్నం పెట్టారు. తినని వాళ్లకు బతిమాలి అన్నం పెట్టారు. మా జగన్ ఉండగా మాకు లోటు ఉండదు. గతంలో ఎంతోమంది వచ్చి రోడ్డు మీద నుంచే వెళ్లేవారు. మా బిడ్డ మా దగ్గరకు ఇలా వస్తారని అనుకోలేదు. ఎంతో సంతోషంగా ఉంది.

– బుద్దా నాగవేణి, కూనాలంక, ముమ్మిడివరం మండలం

మా గ్రామానికి వచ్చిన తొలి సీఎం మీరే

ఎన్నిసార్లు వరద వచ్చి మా ఊళ్లు మునిగినా ఒక్క ముఖ్యమంత్రి కూడా మా గ్రామానికి వచ్చిన పాపాన పోలేదు. మా దగ్గరకు వచ్చి మా బాగోగులు అడిగిన తొలి ముఖ్యమంత్రి మీరే. మాకు ఏం కావాలో అది ఇచ్చారు. నవరత్నాలన్నింటిని ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారు. చమురు సంస్థల నుంచి మత్స్యకార భరోసా ఇచ్చిన మీకు జీవితాంతం రుణపడి ఉంటాము.

– శేరు గంగ, లంకాఫ్ ఠానేల్లంక,ముమ్మిడివరం మండలం

రూ.200 కోట్లతో గ్రామాలకు రక్షణ గోడ

లంక కోతకు శాశ్వత పరిష్కారం

- వివిధ ప్రాంతాల్లో మూడున్నర కిలోమీటర్ల మేర నిర్మాణం
- 10 రోజుల్లో ప్రతిపాదనలు.. నెలాఖరులోగా టెండర్లు
- ఇరిగేషన్ చీఫ్ ఇంజనీరింగ్‌కు సీఎం వైఎస్ జగన్ ఆదేశం
- మరో నెల తర్వాత పనులు ప్రారంభించాలి
- కలెక్టర్, ఎమ్మెల్యేలు పనుల పనితీరును ఫొటోలు తీసి పంపించాలి
- గ్రోయెన్లు నిర్మించాలన్న లంకవాసుల వినతిపై తక్షణమే స్పందన

సాక్షి అమలాపురం: గోదావరి నది కోత వల్ల ఇళ్లు దెబ్బతినే ప్రాంతాల్లో గ్రోయిన్లు, రివిట్‌మెంట్ నిర్మాణాల కోసం రూ.200 కోట్లు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లంక గ్రామ వాసుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మంగళవారం వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు వచ్చిన ఆయన ముమ్మిడివరం మండలం గురజాపులంక, కూనలంక రామాలయంపేట, లంకాఫ్ ఠాన్నేల్లంక రామాలయంపేట, అయినవిల్లి మండలం కొండుకుదురులంకలోని తొత్తరమూడివారిపేటలో నదీ కోత తీవ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ముమ్మిడివరం, పి.గన్నవరం ఎమ్మెల్యేలు పొన్నాడ వెంకట సతీష్ కుమార్, కొండేటి చిట్టిబాబులు కోత తీవ్రత గురించి సీఎంకు వివరించారు. ఈ ప్రాంతంలో గ్రోయిన్లు, రివిట్‌మెంట్ల నిర్మాణాలు చేపట్టాలని కోరారు. బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లిన సమయంలో, బహిరంగంగా వారితో మాట్లాడినప్పుడు పలువురు ఇదే సమస్యను ప్రస్తావించారు. దీనిపై కూనలంకలో సీఎం జగన్.. అప్పటికప్పుడే స్పందిస్తూ ఆరు గ్రామాల్లో కోతకు పరిష్కారం చూపేందుకు రూ.200 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. జనం నివాసముండే ఆవాస ప్రాంతాల్లో సుమారు 3.5 కిలోమీటర్ల మేర బిట్లు బిట్లుగా గ్రోయిన్ల నిర్మాణాలు చేపడతామని తెలిపారు. పొట్టిలంకలో వెయ్యి మీటర్లు, కొండుకుదురులంక వద్ద 400 మీటర్లు, వివేకానంద వారధి వద్ద 300 మీటర్లు, లంకాఫ్ ఠాన్నేల్లంకలో 400 మీటర్లు, కూనలంక వద్ద 800 మీటర్లు, గురజాపులంక వద్ద 600 మీటర్లు చొప్పున నిర్మిస్తామని చెప్పారు. ప్రజల సమక్షంలోనే ఇరిగేషన్ చీఫ్ ఇంజనీరు సతీష్‌తో మాట్లాడారు. ఎప్పటికి పూర్తి స్థాయిలో అంచనాలు తయారు చేస్తారని ప్రశ్నించారు. అంచనాలు పూర్తి చేసి, నెలాఖరు నాటికి టెండర్లు పూర్తి చేయాలని, ఆ తర్వాత నెల రోజులకు పనులు ప్రారంభించాలని ఆదేశించారు. పనులు మొదలైన తర్వాత కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్‌లు తనకు ఫొటోలు పంపాలని ఆదేశించారు.

సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల భర్తీకి ఓకే!

- ఐదు కొత్త మెడికల్ కాలేజీలపై హైకోర్టు ఆదేశాలు
- బీ, సీ కేటగిరీల్లో భర్తీ చేసుకోవచ్చు.. తుది తీర్పునకు లోబడి ఉంటుంది
- ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులివ్వలేం
- తేల్చి చెప్పిన ధర్మాసనం.. కౌంటర్ల దాఖలుకు ఆదేశం
- తదుపరి విచారణ 22కి వాయిదా



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్సింగ్ (బీ కేటగిరీ 35 శాతం), ఎన్‌ఆర్‌ఐ (సీ కేటగిరీ 15%) కోటా సీట్లను భర్తీ చేయకుండా ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. సీట్ల భర్తీ ప్రక్రియను యథాతథంగా కొనసాగించుకోవచ్చని తెలిపింది. అయితే సీట్ల భర్తీ తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉంటుందని స్పష్టం చేసింది. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి, నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) కార్యదర్శి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, వైద్య విద్య కమిషనర్ తదితరులను ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 22కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని సదుపాయాలతో ధీటుగా నిర్వహించేలా విజయనగరం, మచిలీపట్నం, ఏలూరు, రాజమహేంద్రవరం, నంద్యాల జిల్లాల్లో నెలకొల్పిన ప్రభుత్వ నూతన వైద్య కళాశాలల్లో సీట్లను జనరల్, సెల్ఫ్ ఫైనాన్స్, ఎన్‌ఆర్‌ఐ కోటాగా విభజిస్తూ ప్రభుత్వం గత నెలలో జీవోలు 107, 108 జారీ చేసింది. వీటిని సవాలు చేస్తూ గుంటూరుకు చెందిన కోయ శిరీష, ఏలూరుకు చెందిన జతిన్ రాయ్, ఆత్మకూరుకు చెందిన వీణా జ్యోతిక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ప్రైవేట్‌కు ధీటుగా అభివృద్ధి చేసేందుకే..

రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు ధీటుగా నూతన వైద్య కళాశాలలను నిలబెట్టాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంస్థల నుంచి రూ.వేల కోట్లను సమీకరించి మరీ నూతన వైద్య కళాశాలలను నిర్మించిందన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్, ఎన్‌ఆర్‌ఐ కోటాల కింద అందిన ఫీజులను ఏపీ మెడికల్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ కార్పొరేషన్‌లో జమ చేసి ఆ మొత్తాలతో ప్రభుత్వ నూతన వైద్య కళాశాలలను అత్యుత్తమంగా నిర్వహిస్తామన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోటా సీట్లను తీసుకురావడం ఇదే తొలిసారి కాదని, 2017 నుంచి ఇది అమలవుతోందన్నారు. ఇప్పటికే రాజస్తాన్, హరియాణ, గుజరాత్‌లో విజయవంతంగా అమలు చేస్తున్నారని శ్రీరామ్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఐదు వైద్య కళాశాలల్లో 750 సీట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఇందులో 15 శాతం సీట్లు ఆల్ ఇండియా కోటా కింద కేంద్రానికి వెళతాయన్నారు. మిగిలిన 85 శాతం సీట్లలో 50 శాతం సీట్లను జనరల్ కేటగిరీలో ప్రతిభ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటిస్తూ భర్తీ చేస్తామని వివరించారు. ఇవి పోగా మిగిలిన 50 శాతం సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్, ఎన్‌ఆర్‌ఐ కోటా కింద భర్తీ చేస్తామన్నారు. వీటికి రూల్ ఆఫ్ రిజర్వేషన్ వర్తించదన్నారు. నిర్ణయించిన ఫీజుల కన్నా ఎక్కువ మొత్తాలు వసూలు చేస్తే అది క్యాపిటేషన్ ఫీజుల కిందకు వస్తుందన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేస్తామని, ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవద్దని అభ్యర్థించారు.

ఎన్‌ఎంసీ అనుమతి లేకుండానే వర్గీకరించారు..

పిటిషనర్ల తరఫు న్యాయవాది ఠాకూర్ యాదవ్ వాదనలు వినిపిస్తూ సీట్లను మూడు కేటగిరీలుగా విభజించడం అంటే బహిరంగంగా వేలం వేయడమేనన్నారు. ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం జనరల్, సెల్ఫ్ ఫైనాన్స్, ఎన్‌ఆర్‌ఐ కోటాలు తీసుకొచ్చిందన్నారు. దీని వల్ల రిజర్వేషన్ వర్గాలకు అన్యాయం జరుగుతుందన్నారు. జాతీయ వైద్య కమిషన్ అనుమతి లేకుండా ప్రభుత్వం 3 కేటగిరీలను తీసుకొచ్చిందన్నారు. జనరల్ విభాగంలో ఏడాదికి రూ.15 వేలు, సెల్ఫ్ ఫైనాన్స్‌లో రూ.12 లక్షలు, ఎన్‌ఆర్‌ఐ విభాగంలో రూ.20 లక్షలను ఫీజుగా నిర్ణయించారన్నారు. కొత్త విధానంలో సీట్లను భర్తీ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులివ్వాలని కోరగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు ధర్మాసనం నిరాకరిస్తూ తదుపరి విచారణను ఆగస్టు 22కి వాయిదా వేసింది.

క్లుప్తంగా...

ఏసీబీ వలలో సాలూరు మున్సిపల్ కమిషనర్

రూ.1.50లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం


లంచం తీసుకుంటూ దొరికిన శంకరరావు

సాలూరు: పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మున్సిపల్ కమిషనర్ శంకరరావు రూ.1.50 లక్షలు లంచం తీసుకుంటూ మంగళవారం ఏసీబీకి పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ రామచంద్రరావు తెలిపిన వివరాల ప్రకారం.. సాలూరు పట్టణానికి చెందిన భద్రినాథ్ అనే వ్యక్తికి చెందిన ఇంటి నిర్మాణ కాంట్రాక్టును బీవీకే రామకుమార్ తీసుకున్నారు. ఇంటి నిర్మాణానికి సంబంధించి మున్సిపల్ కమిషనర్ డీవియేషన్ నోటీస్ ఇచ్చారు. దానిపై తదుపరి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు, కొత్తగా ఇంటిపన్ను కట్టుకునే అవకాశం కల్పించేందుకు కమిషనర్ రూ.4 లక్షలు లంచం డిమాండ్ చేశారు. చివరకు రూ.2 లక్షలకు కాంట్రాక్టర్‌తో ఒప్పందం కుదిరింది. ముందుగా సోమవారం రూ.50వేలు ఇచ్చారు. మిగిలిన బ్యాలెన్స్ కోసం కమిషనర్ డిమాండ్ చేయడంతో రామకుమార్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. రూ.లక్షా 50 వేల లంచంను మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ తీసుకుంటుండగా మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కాగా కమిషనర్ శంకరరావుపై 2018లో విశాఖపట్నంలో పనిచేస్తున్న సమయంలో ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్న కేసు నమోదైనట్లు సమాచారం.

చేతుల్లేని ఉద్యోగులకు హాజరులో మినహాయింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 90 శాతానికి మించి వైకల్యం ఉన్న వారికి ముఖ గుర్తింపు ఆధారిత హాజరు విధానం (ఎఫ్ఆర్‌బీఏఎస్) నుంచి ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. ఎఫ్ఆర్‌బీఏఎస్‌కు ప్రత్యామ్నాయంగా హాజరు విధానం అందుబాటులోకి వచ్చే వరకు వీరికి మినహాయింపు వర్తించనున్నట్లు రాష్ట్ర మహిళా, శిశు, విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి ఉత్తర్వులిచ్చారు.

టీడీపీ నేతకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు

రూ.20 లక్షల ఎల్‌వోసీని అందజేసిన మంత్రి దాడిశెట్టి రాజా


కృష్ణ భార్య లక్ష్మికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న మంత్రి రాజా

తుని: కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏవీ నగరానికి చెందిన టీడీపీ నాయకుడు, జన్మభూమి కమిటీ మాజీ సభ్యుడు కె.కృష్ణకు లివర్ వ్యాధి చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.20 లక్షలు మంజూరు అయింది. ఇందుకు సంబంధించిన ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాన్ని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా మంగళవారం ఎస్.అన్నవరంలోని తన క్యాంపు కార్యాలయంలో కృష్ణ భార్య లక్ష్మికి అందజేశారు. కొంతకాలంగా కృష్ణ లివర్ వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని ఏఎంసీ మాజీ చైర్మన్ మురళి మంత్రి రాజా దృష్టికి తీసుకొచ్చారు. విశాఖపట్నం మణిపూర్ ఆస్పత్రిలో కృష్ణకు వైద్య సేవలు అందిస్తున్నారు. తమ ప్రభుత్వం పథకాలతో పాటు వైద్య సేవలను పార్టీలకు అతీతంగా అందిస్తున్నదని మంత్రి రాజా అన్నారు.

రైల్వేలో 2.50 లక్షల ఉద్యోగాలు ఖాళీ

గ్రూప్–సి పోస్టుల ఖాళీలే 2.48 లక్షలు

సాక్షి, అమరావతి: దేశంలో రైల్వేశాఖలో భారీగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఏకంగా 2.50 లక్షల ఉద్యోగాలు భర్తీచేయాల్సి ఉండటం గమనార్హం. ఈ మేరకు రైల్వేశాఖ పార్లమెంటుకు లిఖితపూర్వకంగా తెలిపిన సమాధానంలో పేర్కొంది. దేశంలో అత్యధిక ఉద్యోగులు కలిగిన ప్రభుత్వ విభాగంగా మొదటిస్థానంలో నిలిచిన రైల్వేశాఖ.. దేశంలో అత్యధికంగా పోస్టులు ఖాళీగా ఉన్న విభాగంగాను గుర్తింపు పొందింది. ఇక కీలకమైన ఆపరేషనల్ సేఫ్టీ విభాగంలో 53,178 పోస్టులు పెండింగులో ఉండటం గమనార్హం. దేశంలో అన్ని రైల్వేజోన్ల పరిధిలో కలిపి మొత్తం 2.50 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని రైల్వే శాఖ తెలిపింది. వాటిలో అత్యధికంగా గ్రూప్–సి ఉద్యోగాలే 2.48 లక్షలు ఖాళీగా ఉన్నాయి. గ్రూప్–ఏ ఉద్యోగాలు 1,965, గ్రూప్–బి ఉద్యోగాలు 105 ఖాళీగా ఉన్నాయి. అత్యధికంగా నార్తర్న్ రైల్వేలో 32,636 పోస్టులు ఖాళీగా ఉండగా, అత్యల్పంగా దక్షిణ పశ్చిమ రైల్వే జోన్‌లో 4,897 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి.

శ్రీశైలానికి కొనసాగుతున్న ప్రవాహం

శ్రీశైలంప్రాజెక్ట్/కొత్తపల్లి(నంద్యాల)/హొళగుంద(కర్నూలు): శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి ఇన్‌ఫ్లో పెరిగింది. ప్రస్తుతం జలాశయంలో 116.3528 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. డ్యాం నీటిమట్టం 863.30 అడుగులకు చేరుకుంది. దీంతో నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలోని ప్రాచీన సంగమేశ్వరాలయం పూర్తిగా జలాధివాసం అయింది. కాగా, తుంగభద్ర డ్యామ్‌కు కూడా ఇన్‌ఫ్లో పెరిగింది. ప్రస్తుతం 86.912 టీఎంసీల నిరు నిల్వ ఉంది.

పోలీసులే ఫస్ట్ టార్గెట్!

ముందస్తు పన్నాగంతోనే పుంగనూరులో మూకుమ్మడి దాడి


ఈ నెల 4వ తేదీన టీడీపీ కార్యకర్తలు రాళ్లతో దాడి చేస్తుండటంతో వాహనం వెనుకకు చేరిన పోలీసులు

సాక్షి, అమరావతి/ చిత్తూరు రూరల్/ నెట్‌వర్క్: 'చంద్రబాబు పర్యటన సజావుగా సాగేలా బందోబస్తు విధులు నిర్వహించడానికి మేం వచ్చాం. మా అధికారులు, సహోద్యోగులం అంతా బందోబస్తు విధుల్లో ఉన్నాం. ఇంతలో దూరం నుంచే టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో మావైపు దూసుకువచ్చారు. అసలు వాళ్లు ఎందుకు అంత ఆగ్రహంతో వస్తున్నారో.. ఏం చేయడానికి వస్తున్నారో కూడా మాకు ఎవరికీ అర్థం కాలేదు. ఏమిటి విషయం అని మేము ఆలోచించే లోగానే వాళ్లు రాళ్లతో మాపై దాడులు చేయడం మొదలు పెట్టారు. పెద్ద పెద్ద రాళ్లు, కర్రలు, పదునైన వస్తువులు పోలీసులపై విసరడం మొదలు పెట్టడంతో అంతా గందరగోళంగా తయారైంది. నా ముందు ఉన్న డీఎస్పీ తలకు ఓ రాయి వచ్చి తగలడంతో రక్తం బొటబొటా కారింది. మా ఎస్.ఐ మేడంపై రాళ్లు, కర్రలు విసరడంతో ఆమె గాయపడ్డారు. ఇంతలోనే నా తల వెనుక భాగాన ఓ రాయి గట్టిగా తగిలింది. కానీ నేను హెల్మెట్ ధరించి ఉండటంతో ఏమీ కాలేదు. తలతిప్పి వెనక్కు చూశాను. నా హెల్మెట్ గ్రిల్స్ మధ్య ఉన్న ఖాళీ నుంచి ఒక రాయి దూసుకొచ్చి బలంగా కంటిపై తగిలింది. దాంతో అమ్మా అని గట్టిగా అరచి నేను కుప్పకూలిపోయాను. రాళ్ల దెబ్బలతో నా ముఖం మొత్తం రక్తసిక్తం అయ్యింది. ఏం జరుగుతోందో అర్థం కాలేదు. మా వాళ్లు ఆస్పత్రికి తీసుకెళ్లారు. తర్వాత పరీక్షించిన వైద్యులు ఒక కంటికి చూపు పోయిందని చెప్పారు. మరో కంటి చూపు కూడా కోల్పోవచ్చని డాక్టర్లు అంటున్నారు' అని కానిస్టేబుల్ రణధీర్ ఆవేదనగా చెప్పుకొచ్చారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో చంద్రబాబు పర్యటన సందర్భంగా శుక్రవారం టీడీపీ కుట్ర పూరితంగా ముందస్తు పన్నాగంతో పోలీసులపై జరిపిన దాడికి ప్రత్యక్ష సాక్షి అయిన రణధీర్ ఆ సంఘటనను కళ్లకు కట్టినట్టుగా చిత్తూరులో మంగళవారం మీడియాకు వివరించారు. చంద్రబాబు పర్యటన సందర్భంగా శాంతిభద్రతల సమస్యను సృష్టించేందుకు టీడీపీ నేతలు ఎంత కుట్రపూరితంగా వ్యవహరించారన్నది ఆయన మాటలు స్పష్టం చేస్తున్నాయి.

ఇది ముందస్తు కుట్ర..

రాయలసీమ జిల్లాల్లో చంద్రబాబు పర్యటనలో ఆశించినంతగా విజయవంతం కాకపోవడంతో టీడీపీ ఆందోళనలో కూరుకుపోయింది. దాంతో ఆయన పర్యటనలకు లేని ఇమేజ్ తీసుకు వచ్చేందుకు అల్లర్ల కుట్రకు పథక రచన చేసింది. ఇందులో భాగంగా పుంగనూరు వద్ద భారీ సంఖ్యలో టీడీపీ నేతలు, కార్యకర్తలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా రౌడీ మూకలను ముందుగానే తెప్పించారు. పుంగనూరు బైపాస్ నుంచి వెళ్లేందుకు ముందుగా టీడీపీ నేతలు అనుమతి కోరితే పోలీసులు సమ్మతించారు. అందుకే బైపాస్ రోడ్డులో తగిన పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు. కానీ పోలీసుల అనుమతికి విరుద్ధంగా పుంగనూరు పట్టణంలోకి చంద్రబాబు ప్రవేశించేటట్టుగా చేయాలని టీడీపీ నేతలు భావించారు. అలా పుంగనూరు పట్టణంలో పర్యటన సందర్భంగా భారీ ఎత్తున అల్లర్లు సృష్టించాలన్నది వారి పన్నాగం. ముందస్తు అనుమతికి విరుద్ధంగా పుంగనూరు పట్టణంలోకి చంద్రబాబు పర్యటనను పోలీసులు అనుమతించకపోతే బైపాస్ రోడ్డు వద్దే విధ్వంసకాండ సృష్టించాలని కూడా ప్లాన్ బి రెడీ చేసుకున్నారు. అందుకోసమే భారీ సంఖ్యలో అల్లరి మూకలను బైపాస్ రోడ్డు వద్ద ముందుగానే మోహరించారు. కాగా చంద్రబాబు కాన్వాయ్ ఇక పుంగనూరు బైపాస్‌కు సమీపిస్తుందనగానే టీడీపీ రౌడీలు రంగంలోకి దిగారు. బందోబస్తు విధుల కోసం అక్కడ ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందిపై హఠాత్తుగా రాళ్లతో దాడి చేశారు. సాధారణంగా పోలీసులు అనుమతి లేకుండా మోహరించిన వారిని చెదరగొట్టేందుకు ప్రయత్నిస్తారు. ఆ సమయంలో కొంత వాగ్వాదం, తోపులాటల అనంతరం పరిస్థితి అదుపు తప్పితే కొందరు పోలీసులకు ఎదురుదిరిగే అవకాశం ఉంటుంది. కానీ పుంగనూరులో అందుకు విరుద్ధంగా టీడీపీ మూకలు కుట్రపూరితంగా పోలీసులపై మూకుమ్మడి దాడికి తెగించడం గమనార్హం. శాంతియుతంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులపై ఒక్కసారిగా రెండు వేల మందికి పైగా ఉన్న టీడీపీ అల్లరి మూకలు దాడికి తెగబడ్డాయి. పోలీసుల నుంచి ఎలాంటి హెచ్చరికలు లేకుండానే.. కవ్వింపు చర్యలు లేకుండానే.. టీడీపీ గూండాలు పోలీసులపై భారీ ఎత్తున రాళ్లదాడికి తెగబడి బీభత్సం సృష్టించారు. ఈ పచ్చ మూకల దాడిలో పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. కానిస్టేబుల్ రణధీర్ కంటి చూపు కోల్పోవడం బాధాకరం.

రణధీర్‌కు అండగా ప్రభుత్వం

టీడీపీ గూండాల దాడిలో గాయపడిన కానిస్టేబుల్ రణధీర్‌కు ప్రభుత్వం పూర్తి అండగా నిలిచింది. 'సాక్షి' దినపత్రికలో మంగళవారం 'ఈ దారుణానికి బాధ్యులెవరు?' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందిస్తూ బాధిత కానిస్టేబుల్ రణధీర్‌కు ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఆయనకు మినిస్టీరియల్ ఉద్యోగం ఇస్తామని ప్రకటించింది. రణధీర్‌కే కాదు యావత్ పోలీసు యంత్రాంగానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటామని స్పష్టం చేసింది. ఉప ముఖ్యమంత్రి కె.నారాయణ స్వామి, మంత్రులు బొత్స సత్యనారాయణ, అమర్‌నాథ్, శాసనసభలో ప్రభుత్వ విప్ జి. శ్రీకాంత్‌రెడ్డి తదితరులు వేర్వేరుగా మీడియాతో మాట్లాడుతూ పోలీసులపై టీడీపీ గూండాల దాడిని తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు ఆదేశాలతోనే టీడీపీ గూండాలు అంతగా బరితెగించి పోలీసులపై దాడులకు పాల్పడ్డారని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి కె.నారాయణ స్వామి చిత్తూరులో మంగళవారం పర్యటించారు. కానిస్టేబుల్ రణధీర్‌ను పరామర్శించారు. మెరుగైన వైద్యంతో పాటు అతని కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ప్రభుత్వ సాయం మరువలేను

ఆ రోజు జరిగిన ఘటన ఇంకా నా మదిలో తిరుగుతూనే ఉంది. ఆస్పత్రిలో చేర్చిన మరుసటి రోజు డాక్టర్ వచ్చి 'నల్లగుడ్డు, తెల్ల గుడ్డు చెదిరిపోయింది. నీకు ఒక కన్ను జీవితాంతం కనబడదు' అని చెప్పగానే కాళ్ల కింద భూకంపం వచ్చినట్టు అయ్యింది. మా అమ్మా నాన్నకు ఏం చెప్పాలో తెలియలేదు. కట్టుకున్న భార్యకి చెప్పే ధైర్యం ఉన్నా.. ఆరో తరగతి, రెండో తరగతి చదువే నా పిల్లలకు ఏం చెప్పాలని తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొన్నా. కన్ను పోయిన నాకు పోలీసు ఉద్యోగం ఉంటాదో ఊడతాదో తెలియలేదు. ఆ సమయంలో చాలా భయమేసింది. నా బాధను 'సాక్షి' పత్రిక తప్ప మరే పేపర్ రాయలేదు. నేను పోలీసుని. రాజకీయ కార్యకర్తను కాదు. నాకు జరిగిన అన్యాయం ఎందుకు రాయలేదో కూడా నాకు తెలియదు. కానీ ఈరోజు సీఎం జగన్ సార్ నా గురించి ఆరా తీసి ప్రభుత్వం తరఫున రూ.10 లక్షలు ప్రకటించారు. నా కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. పోలీస్ డిపార్ట్‌మెంట్లో ఆఫీసులో మినిస్టీరియల్ స్టాఫ్‌గా ఉద్యోగం ఇస్తామన్నారు. రాష్ట్ర మొత్తం నాకు అండగా నిలబడిందని సంతోషంగా ఉందాది. ఇది చాలు.

– రణధీర్, కంటి చూపు కోల్పోయిన కానిస్టేబుల్

రణధీర్ కుటుంబానికి అండగా ఉంటాం

పుంగనూరు రాళ్ల దాడిలో గాయపడ్డ రణధీర్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన చిత్తూరు పోలీసు అతిథి గృహంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, కలెక్టర్ సగిలి షణ్మోహన్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. అల్లరి మూకల దాడిలో ఎస్టీఎఫ్ కానిస్టేబుల్ రణధీర్ ఒక కంటి చూపు పోగొట్టుకున్నారని, మరో కన్ను కూడా చూపును కోల్పోవచ్చని వైద్యులు చెప్పారన్నారు. దాతల సాయంతో అతనికి మళ్లీ కంటి చూపు తెప్పించే ప్రయత్నం చేస్తామన్నారు. రణధీర్‌కు కంటి చూపు పోవడంపై కొందరు విష ప్రచారం చేస్తుండటం తగదన్నారు. అల్లరి మూకలను కట్టడి చేయడంలో పోలీసులు చక్కగా విధులు నిర్వర్తించారని కొనియాడారు. పోలీసు శాఖ నిత్యం నిష్పక్షపాతంగా పనిచేస్తూ శాంతి భద్రతల పర్యవేక్షణ కోసం పని చేస్తోందనే విషయాన్ని గుర్తించాలన్నారు.

దాడులు చేయించింది బాబే



పుంగనూరులో దాడులు చేయించింది టీడీపీ అధినేత చంద్రబాబే. బాబుకు కుట్ర రాజకీయాలు వెన్నతో పెట్టిన విద్య. పుంగనూరులో ఆయనలోని టెర్రరిజాన్ని చూపించాడు. రాష్ట్రంలో మరిన్ని అల్లర్లకు వ్యూహాలు రచిస్తున్నారు. పుంగనూరు దాడులపై చంద్రబాబుపై ఏ–1గా కేసు నమోదు చేయాలి.

– నారాయణస్వామి, ఉప ముఖ్యమంత్రి

చంద్రబాబుపై రౌడీషీట్ తెరవాలి



పుంగనూరులో హింసాత్మక ఘటనకు సూత్రధారి చంద్రబాబే. ఆయనపై రౌడీషీట్ తెరవాలి. పుంగనూరులో టీడీపీ వాళ్లు రెక్కీ నిర్వహించి, ఎవరెవరు ఏ విధంగా దాడులు జరపాలో స్కెచ్ వేసుకున్నారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఇంతకు ముందెన్నడూ జరగని దుర్మార్గమైన దాడి ఇది. ఈ దాడిలో పోలీసులను చంపాలనుకోవడం దుర్మార్గం. 40 మందికి పైగా పోలీసుల రక్తం కళ్ల చూశారు. సాక్ష్యాధారాలు పక్కాగా ఉన్నందున చంద్రబాబును ఉపేక్షించకూడదు.

– గుడివాడ అమర్‌నాథ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి

టీడీపీ నేతలూ.. బాబును నమ్మొద్దు



పుంగనూరులో హింసకు ప్రధాన కారకుడు ప్రతిపక్షనేత చంద్రబాబే. ఈ కేసులో ఆయన్ను ఏ–1గా చేర్చి రౌడీషీట్ తెరవాలి. ప్రాజెక్టుల యాత్ర పేరిట చంద్రబాబు.. టీడీపీ గూండాలు, రౌడీలతో ప్రజలపై దండయాత్ర చేస్తున్నారు. అల్లర్లు సృష్టిస్తే పోలీసులు కాల్పులు జరుపుతారని, ఆ కాల్పుల్లో టీడీపీ కార్యకర్తలు చనిపోతే రాజకీయంగా వాడుకోవాలన్నది చంద్రబాబు పన్నాగం. ఇలాంటి వ్యక్తి కోసం టీడీపీ కార్యకర్తలు బలికావద్దు. బాబును నమ్మకండి. కందుకూరులో ఇరుకు సందులో మీటింగ్ పెట్టి 8 మంది చనిపోవడానికి కారకుడైన బాబు గురించి ఎవరికి తెలియదు?

– గడికోట శ్రీకాంత్ రెడ్డి, ప్రభుత్వ విప్

72 మందికి రిమాండ్

పరారీలో కీలక సూత్రధారి చల్లా బాబు


రిమాండ్‌కు తరలించే ముందు పోలీస్ స్టేషన్ వద్ద నిందితులు

పుంగనూరు (చిత్తూరు జిల్లా): పోలీసులపై తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తల దాడి ఘటనలో 72 మంది నిందితులను సోమవారం రాత్రి కడప సెంట్రల్ జైలుకు తరలిస్తూ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి సింధు ఉత్తర్వులు జారీ చేశారు. పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, పుంగనూరు సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ అల్లరి మూకలపై ఐదు కేసులు నమోదు చేశారు. వీరిలో ప్రధాన సూత్రధారి అయిన నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబు పరారీలో ఉన్నారు. ఆయన పీఏ గోవర్ధన్‌రెడ్డి పోలీసులకు చిక్కాడు. పథకం ప్రకారమే పోలీసులపై దాడులు చేశామని అతడు తెలిపినట్లు పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. టీడీపీకి చెందిన చిత్తూరు, పలమనేరు, పుంగనూరుకు చెందిన న్యాయవాదులు రిమాండ్ రిపోర్టులో పోలీసులు తెలిపిన సెక్షన్లు నిందితులకు వర్తించవని కోర్టులో వాదనలు వినిపించారు. ఏపీపీ రామకృష్ణ సాక్ష్యాధారాలను కోర్టుముందు ఉంచి, సుదీర్ఘంగా వివరించారు. దీంతో న్యాయమూర్తి ప్రాసిక్యూషన్ వాదనలతో ఏకీభవిస్తూ 72 మంది నిందితులను రిమాండ్‌కు తరలించాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో వారిని సోమవారం అర్ధరాత్రి కడప సెంట్రల్ జైలుకు తరలించారు. కాగా, పుంగనూరులో పోలీసులపై టీడీపీ శ్రేణుల దాడికి నిరసనగా మంగళవారం విశాఖపట్నంలోని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, రాష్ట్ర అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావు, కార్పొరేటర్లు అక్కరమాని రోహిణి, కెల్లా సునీత, గేదెల లావణ్య, ముచ్చ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అధికార దాహంతో అరాచకాలు

- చంద్రబాబును కట్టడి చేయకుంటే రావణ కాష్టమే: పేర్ని నాని
- పోలీసులను పొట్టనబెట్టుకుని కాల్పులకు తెరతీసే ఎత్తుగడ
- చిరంజీవి కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ప్రత్యేక హోదాపై మాట్లాడలేదేం?



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అధికార దాహంతో అరాచకాలకు తెగబడుతున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పేర్ని నాని ధ్వజమెత్తారు. ఈ వయసులో ఎందుకీ అరాచకం? అని నిలదీశారు. 2024 ఎన్నికల్లోనూ ఓటమి తప్పదని గ్రహించి పుంగనూరులో పక్కా ప్లాన్‌తో విధ్వంసానికి ఒడిగట్టారని చెప్పారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

కానిస్టేబుల్ కుటుంబానికి జవాబు చెప్పు బాబు

చంద్రబాబు పర్యటన సందర్భంగా పక్క జిల్లాలు, నియోజకవర్గాల నుంచి కార్లు, జీపులు, ట్రక్కుల్లో రాళ్లు, కర్రలు, రాడ్లు, సీసాలతోపాటు రౌడీ మూకలను తరలించి పోలీసులపై దాడికి పురిగొల్పారు. పోలీసులను పొట్టనబెట్టుని ఆ తర్వాత కాల్పులకు తెరతీయడం, మరికొందరి ప్రాణాలను బలిగొనడం ద్వారా శవ రాజకీయాలకు చంద్రబాబు స్కెచ్ వేశారు. పుంగనూరు ఘటనకు చంద్రబాబుదే బాధ్యత. ఆయన్ను కట్టడి చేయకుంటే రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చేందుకు వెనుకాడరు. కళ్లు కోల్పోయిన పోలీసు కానిస్టేబుల్ కుటుంబానికి చంద్రబాబు కచ్చితంగా సమాధానం చెప్పాలి. టీడీపీ కార్యకర్తల దాడిలో పోలీసులకు తీవ్ర గాయాలైతే ఎల్లో మీడియా కనీసం చిన్న వార్త కూడా రాయకపోగా చంద్రబాబుపై దాడిగా చిత్రీకరిస్తోంది. వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు దెబ్బ తగిలితే టీడీపీ కార్యకర్తగా వార్తలు రాయడం సిగ్గు చేటు. లోకేశ్ ఏకంగా చిత్తూరు ఎస్పీనే బెదిరిస్తున్నారు.

సెటైర్లు వేస్తే ఊరుకుంటారా?

నేను వ్యక్తిగతంగా చిరంజీవికి అభిమానిని. పక్క రాష్ట్రంలో ఇంజనీరింగ్ చదువుతూ సినిమా హాళ్ల వద్ద చిరంజీవి పోస్టర్లకు దండలు వేశాం. సినిమాల్లో లేనిపోని సీన్లు సృష్టించి మంత్రులపై సెటైర్లు వేస్తే చూస్తూ ఊరుకోరు కదా? చిరంజీవి రెమ్యూనరేషన్ గురించి ఎవరైనా ఎప్పుడైనా అడిగారా? మరి ఒకరి రెమ్యూనరేషన్ గురించి ఇప్పుడెందుకు మాట్లాడాల్సి వచ్చిందన్నది ఆయన ఆలోచించుకోవాలి. ప్రత్యేకహోదా గురించి చిరంజీవి మాట్లాడారంటున్నారు. అప్పుడు ఆయనే కేంద్రమంత్రిగా ఉన్నారు కదా? మరి అప్పుడెందుకు మాట్లాడలేదు?.

శాంతిభద్రతలను దెబ్బతీయాలని బాబు కుట్ర

- చంద్రబాబు ముందస్తు ప్రణాళిక ప్రకారమే పుంగనూరు ఘటనలు
- పోలవరానికి వైఎస్సార్ శంకుస్థాపన చేశారు.. జగన్ పూర్తి చేస్తారు
- మంత్రి బొత్స సత్యనారాయణ



సాక్షి, అమరావతి: ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబు శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు కుట్ర పన్నారని, పుంగనూరు ఘటన దీనిని స్పష్టం చేస్తోందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. మంత్రి మంగళవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ బాబు ముందస్తు ప్రణాళిక కాకుంటే పుంగనూరుకు కత్తులు, తుపాకులు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. రాజకీయం కోసం బాబు ఎంతకైనా దిగజారతారని ధ్వజమెత్తారు. మరో ఆరు నెలల్లో చంద్రబాబుకి ప్రజలు రెస్ట్ ఇస్తారని, ఈలోగా ఆయన నోటి సరదా తీర్చుకుంటున్నారని విమర్శించారు.

పోలవరం రైతుల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని తాకట్టు పెట్టిన బాబు

పోలవరంపై చంద్రబాబు చేస్తున్న ప్రచారం పెద్ద జోక్ అని మంత్రి బొత్స అభివర్ణించారు. పోలవరం ప్రాజెక్టు వైఎస్సార్ కృషి ఫలితమేనని, ఆయనే ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని చెప్పారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేసేది సీఎం వైఎస్ జగన్ మాత్రమేనని స్పష్టం చేశారు. చంద్రబాబు అధికారంలో ఉండగా ప్రజలకు ఉపయోగపడే ఒక్క పనీ చేయకపోగా.. వారం వారం పోలవరం అంటూ డాన్సులు చేయించారని, కమీషన్ల కోసం రైతులకు రావాల్సిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని తాకట్టుపెట్టి పోలవరం కాలువలను పట్టిసీమగా మార్చారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ప్రధానమంత్రి, కేంద్ర జలవనరుల శాఖ మంత్రిని అనేక సార్లు కలిసి పోలవరం ప్రాజెక్టు సమస్యలన్నింటినీ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నారని తెలిపారు.

సినిమా పరిశ్రమ పిచ్చుకా?

చిరంజీవి వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఈ వ్యాఖ్యల ద్వారా సినిమా పరిశ్రమ ఒక పిచ్చుక అని ఆయన అనుకుంటున్నారా.. అని మంత్రి బొత్స ప్రశ్నించారు. సినిమా వాళ్ల జోలికి వెళ్లాల్సిన అవసరం ప్రభుత్వానికి ఏముందని అన్నారు. పవన్ వారాహి యాత్రపై స్పందిస్తూ.. ఎవరైనా ప్రజాస్వామ్యయుతంగా యాత్రలు చేసుకోవచ్చని, అయితే, చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో ఎలా విలీనం చేయాలి

ఏపీఎస్ ఆర్టీసీ అధికారులతో తెలంగాణ ఆర్టీసీ అధికారుల చర్చలు


ఏపీఎస్ ఆర్టీసి ఉన్నతాధికారులతో సమావేశమైన తెలంగాణ అర్టీసీ అధికారులు

సాక్షి, అమరావతి: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ గురించి తెలంగాణ ఆర్టీసీ అధికారులు మంగళవారం ఏపీఎస్ ఆర్టీసీ అధికారులతో చర్చించారు. తెలంగాణ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయించిన విషయం విదితమే. ఏపీలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన ప్రక్రియ గురించి తెలుసుకునేందుకు తెలంగాణ ఆర్టీసీ అధికారులు విజయవాడ వచ్చారు. ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు, ఈడీలు కేఎస్ బ్రహ్మానందరెడ్డి, కోటేశ్వరరావు, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. విలీన విధివిధానాలు, ఉద్యోగుల ప్రయోజనాలు, ఆర్థిక పరమైన అంశాలపై చర్చించారు. తెలంగాణ ఆర్టీసీ ఈడీలు కృష్ణకాంత్, మునిశేఖర్, చీఫ్ ఫైనాన్షియల్ మేనేజర్ విజయ పుష్పకుమారి పాల్గొన్నారు.

దీర్ఘకాలం విధులకు హాజరుకాని డాక్టర్లపై చర్యలు

సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తూ దీర్ఘకాలం విధులకు హాజరుకాని డాక్టర్లపై తగిన చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యక్రమాలపై మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తూ వైద్య, ఆరోగ్యశాఖలో ఖాళీలన్నీ భర్తీ చేయడంతోపాటు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తోందని చెప్పారు. వైద్య, ఆరోగ్యశాఖకు ప్రభుత్వం ఇంత ప్రాధాన్యత ఇస్తున్న తరుణంలో వైద్యులు దీర్ఘకాలం సెలవులో ఉండడం, అనధికారికంగా విధులకు గైర్హాజరు కావడం వంటివి సమర్థనీయం కాదని, అలాంటి వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని చెప్పారు. నూరుశాతం ప్రసవాలు ఆస్పత్రుల్లో జరిగేలా ఆస్పత్రుల వారీగా, సిబ్బంది వారీగా లక్ష్యాలను నిర్దేశించాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ఎంపానల్ ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న వైద్యసేవలపై క్వాలిటీ చెక్ చేయాలని చెప్పారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌కు సంబంధించి ఉద్యోగులు నెలనెలా చెల్లించే మొత్తానికి సమానంగా ప్రభుత్వ వాటా సొమ్మును కూడా ప్రతి నెల సకాలంలో ఆరోగ్యశ్రీ ట్రస్టుకు జమయ్యేవిధంగా చూడాలని ఆర్థికశాఖ కార్యదర్శి గుల్జార్‌ను సీఎస్ ఆదేశించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు మాట్లాడుతూ దీర్ఘకాలం విధులకు హాజరుకాని ప్రభుత్వ డాక్టర్లను గుర్తించి ఇప్పటికే నోటీసులు ఇచ్చామని, తదుపరి చర్యలకు కసరత్తు చేస్తున్నట్లు వివరించారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్, ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిర ప్రసాద్, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ అండ్ ఎండీ డి.మురళీధర్‌రెడ్డి, ఆర్థికశాఖ కార్యదర్శి గుల్జార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి మంజుల, ఏపీవీవీపీ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్, డీఎంఈ నర్సింహం, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రామిరెడ్డి పాల్గొన్నారు.

జీతాలందని టీచర్లకు వారంలో వేతనాలు

సాక్షి, అమరావతి: ఇటీవల బదిలీ అయ్యి వేతనాలు అందుకోలేని ఉపాధ్యాయులు వారం రోజుల్లో జీతాలు అందుకుంటారని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ హామీ ఇచ్చారు. మరో పాఠశాలకు బదిలీ అయ్యి రిలీవర్ లేకపోవడంతో ఆగిపోయిన 450 మంది ఉపాధ్యాయులను కూడా త్వరలోనే రిలీవ్ చేస్తామన్నారు. మంత్రి బొత్స మంగళవారం 14 ఉపాధ్యాయ సంఘాలతో విజయవాడలో భేటీ అయ్యారు. ఉపాధ్యాయుల సమస్యలతో పాటు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో కీలక మార్పులు చేయాల్సిన అంశాలను ఆ సంఘాల ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల సూచన మేరకు పదో తరగతి పరీక్షల్లో ఆరు పేపర్ల స్థానంలో ఏడు పేపర్లు ఉండేలా చూస్తామన్నారు. టీచర్ల అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

రత్నగిరిపై పెళ్లి సందడి

రెండు నెలల విరామం తర్వాత హడావిడి ఏర్పాట్లు చేసుకుంటున్న పెళ్లి బృందాలు

అన్నవరం: రెండు నెలల తర్వాత రత్నగిరి సత్యదేవుని సన్నిధిలో ఈ నెల 20 నుంచి మరలా పెళ్లి బాజా మోగనుంది. వైశాఖం, జ్యేష్ఠ మాసాల సందర్భంగా గత మే, జూన్ నెలల్లో ఏకబిగిన సాగిన వివాహాలు తదితర శుభకార్యాలకు జూన్ 11న తాత్కాలికంగా తెర పడింది. జూన్ 19 నుంచి జూలై 17 వరకు ఆషాఢ మాసం, జూలై 18 నుంచి ఈనెల 16 వరకు అధిక శ్రావణ మాసం కారణంగా పెళ్లి ముహూర్తాలు లేవు. ఈ నెల 17 నుంచి నిజశ్రావణ మాసం ప్రారంభవుతోంది. దీంతో 20 నుంచి మరలా వివాహాలు జరుగతాయని పండితులు తెలిపారు.

ముహూర్తాలు

- ఈనెల 20 నుంచి సెప్టెంబర్ ఏడో తేదీ వరకు ముహూర్తాలున్నాయి
- భాద్రపదమాసంలో సెప్టెంబర్ 14 నుంచి అక్టోబర్ 13 వరకు ముహూర్తాలు లేవు.
- ఆశ్వయుజ మాసంలో అక్టోబర్ 15 నుంచి నవంబర్ 13 వరకు పెళ్లిళ్లు జరుగుతాయి,
- కార్తీకమాసంలో నవంబర్ 14 నుంచి డిసెంబర్ 12 వరకు ముహూర్తాలున్నాయి.
- మార్గశిర మాసంలో డిసెంబర్ 13 నుంచి 2024 జనవరి 11 వరకు వివాహాలు జరుగనున్నాయి.
- పుష్యమాసంలో జనవరి 12 నుంచి ఫిబ్రవరి 9 వరకు పెళ్లిళ్ల ఊసు వినిపించదు.
- మాఘమాసంలో ఫిబ్రవరి 13 నుంచి మార్చి 10 వరకూ వివాహాలు జోరుగా జరుగుతాయి.

సందడిగా మారిన దేవస్థానం: ఈ నెల 20 నుంచి పెళ్లి సందడి మొదలవుతుండడంతో పెళ్లిమండపాలు,సత్రం గదులు, పురోహితులు, సన్నాయి మేళం, కేటరింగ్ ఏర్పాట్ల కోసం పెళ్లిబృందాలు రత్నగిరికి వస్తున్నారు. దేవస్థానంలో పెళ్లిమండపాలు, గదులు రిజర్వేషన్ నెల రోజులు ముందుగా చేస్తారు. దీంతో గత నెల 20 నుంచి ఈ రిజర్వేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ప్రధానంగా నిజశ్రావణ మాసంలో గదుల కోసం పెద్ద ఎత్తున డిమాండ్ ఉంది. ప్రకాష్ సదన్ సత్రం మినహా మిగిలిన సత్రాలలో గదులు ఆన్‌లైన్‌లో రిజర్వ్ చేసుకునే అవకాశం కల్పించారు. ప్రొటోకాల్‌తో వచ్చే వీఐపీ గదుల కోసం ప్రముఖుల సిఫార్స్ లేఖలు వస్తుండడంతో అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. కాగా, పెళ్లిళ్ల కోసం ఈఓ చంద్రశేఖర్ ఇటీవల ప్రతిపాదించిన సింగిల్ విండో పద్ధతి పూర్తిగా రూపు దిద్దుకోలేదు. ఈసారి పాత పద్ధతిలోనే పెళ్లిబృందాలు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. దేవస్థానంలో భక్తుల రద్దీ పెరగడంతో ఆదాయం కూడా దండిగా సమకూరనుంది. భాద్రపద మాసం మినహా యిస్తే వచ్చే నిజశ్రావణం, ఆశ్వయుజ, కార్తిక మాసాల్లో సుమారు రూ.40 కోట్లు పైబడి ఆదాయం వచ్చే అవకాశం ఉంది.



నీ అహాన్ని వదులుగా ఉండే దుస్తుల్లా ధరించు.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 9 ఆగస్టు 2023

భద్రత ఉన్నట్టేనా?

చిరకాలంగా చెబుతున్న, వింటున్న మాట ఇప్పుడు కార్యరూపంలోకి వస్తోంది. ఐరాసలోని 194 దేశాల్లో దాదాపు 137 దేశాల తర్వాత ఎట్టకేలకు భారత్ సైతం వ్యక్తిగత డిజిటల్ డేటా భద్రత (డీపీడీపీ) చట్టాన్ని తీసుకొచ్చే ఘట్టంలో చివరి మజిలీకి చేరుకుంది. అయిదేళ్ళలో అనేక ముసాయిదాలు, మార్పులు చేర్పుల తర్వాత తాజా డీపీడీపీ బిల్లు – 2023ను లోక్‌సభ సోమవారం ఆమోదించింది. ఇంతకాలంగా డేటా భద్రత విషయంలో సరైన చట్టం, వ్యవస్థ లేని భారత్ ఆ లోటును ఇక పూరిస్తోంది. అయితే కేంద్ర ప్రభుత్వానికి మినహాయింపులపై గత నవంబర్ నాటి ప్రతిపాదిత బిల్లులోనే నిపుణులు అభ్యంతరం వ్యక్తం చేసినా, అవే అంశాలు కొత్త బిల్లులోనూ చోటుచేసుకోవడం విడ్డూరం. ప్రైవేట్ సంస్థలు వ్యక్తుల డేటా నిర్వహణలో పాటించాల్సిన అంశాలపై కఠినమైన అంశాలు పొందుపరిచిన ఈ బిల్లులో అసలంటూ కొంత మంచి ఉన్నా, కేంద్రానికి తిరుగులేని సెన్సార్ అధికారాలు దఖలు చేయడం లాంటి చెడూ చోటుచేసుకోవడమే విషాదం.

పౌరులకు వ్యక్తిగత గోప్యత హక్కు ఉందంటూ తొమ్మిది మంది సుప్రీమ్ కోర్ట్ న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 2017లోనే నొక్కిచెప్పింది. అది అంతర్జాతీయ ప్రమాణంగా నిలిచి, డిజిటల్ యుగంలో గోప్యత హక్కుకు తలెత్తిన సవాళ్ళను ముందుకు తెచ్చింది. ఈ హక్కుపై జరిగిన విస్తృత చర్చ ప్రతిఫలమే తాజా డీపీడీపీ బిల్లు. 2017లోనే కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ ఓ నిపుణుల సంఘాన్ని నియమించింది. తర్వాత 2021 డిసెంబర్‌లో 'డేటా భద్రత బిల్లు' (డీపీబీ) విడుదలైంది. అనేక అభ్యంతరాలు రావడంతో 2022 ఆగస్టులో కేంద్ర ఐటీ మంత్రి పార్లమెంట్‌లో ఆ బిల్లును ఉపసంహరించుకొని, నవంబర్‌లో 'డీపీడీపీ' ముసాయిదాను పౌరసమాజ సంప్రతింపులకు ఉంచారు. గమ్మత్తేమిటంటే, జనాభిప్రాయాలను ప్రభుత్వం బహిర్గతం చేయలేదు సరికదా సమాచార హక్కు చట్టం కింద కోరినా తోసిపుచ్చింది. తీరా ఏడాది తర్వాత ఏ ప్రాతిపదికన కొత్తగా మార్పుచేర్పులు చేశామన్నది చెప్పకుండానే పాలకులు 2023 డీపీడీపీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. లోక్‌సభలో మెజారిటీ ఉంది గనక సులభంగా ఆమోదమూ పొందారు.

వ్యక్తిగత డేటాను ఇతరులు యథేచ్ఛగా వాడే వీలులేకుండా చూడడం ఈ బిల్లు ప్రధానోద్దేశం. తీరా బిల్లు చూస్తే, అసలు ఆ భద్రత విషయంలోనే రాజీ పడ్డారనిపిస్తుంది. కార్పొరేట్లు గనక సున్నితమైన డేటాపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, ఇప్పటి దాకా ఐటీ చట్టం కింద వారు బాధితులకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉండేది. తీరా ఇప్పుడీ బిల్లులోని ఓ క్లాజు వల్ల ఆ ఊరట కూడా బాధితుడికి లేకుండా పోతోంది. ఇంకా విచిత్రమేమంటే, డేటా భద్రతకు భంగం కలిగిందని వీధికెక్కినవారిపైనే జరిమానా వేయచ్చు. పస లేని ఆరోపణ చేస్తే రూ. 10 వేల దాకా జుల్మానా వేయవచ్చు. ఫిర్యాదు చేయదలచిన వారికి ఇదో అడ్డంకి. నిజానికి, డేటా ఉల్లంఘనలు ఇటీవల ఎక్కువయ్యాయి. ఈ ఏడాది జూన్‌లో కోవిన్ పోర్టల్ నుంచి టీకాలేసుకున్న వారి వ్యక్తిగత వివరాలు టెలిగ్రామ్ యాప్‌లో దర్శనమిచ్చాయి. అలాగే, జూలైలో 12 వేల మంది బ్యాంక్ ఉద్యోగుల గోప్యమైన రికార్డులూ టెలిగ్రామ్‌లో తిరిగాయి. ఇంత జరుగుతున్నా ప్రభుత్వానికీ, అధికారులకూ ఈ డేటా వినియోగం, ఉల్లంఘనల్లో అయిదు అంశాల ప్రాతిపదికన ఈ బిల్లులో మినహాయింపులు దక్కాయి. మునుపటి బిల్లులోనూ మినహాయింపులున్నా తాజా బిల్లులో వాటిని విస్తరించడం గమనార్హం.

కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయినట్టు... దాదాపు రెండు దశాబ్దాల క్రితం 2005లో వచ్చిన సమాచార హక్కు చట్టానికి ఈ కొత్త బిల్లులోని అంశాలు తూట్లు పొడిచే ప్రమాదం ఉందనేది ఒక విశ్లేషణ. పౌరుల గోప్యత హక్కును కాపాడడం మాట దేవుడెరుగు, సమాచార హక్కును ఇది నీరు గారుస్తోందని విమర్శకుల మాట. ఈ డీపీడీపీ బిల్లు దెబ్బతో ప్రభుత్వం నుంచి సమాచార సేకరణలో పారదర్శకత తగ్గిపోయి, ప్రభుత్వ – ప్రైవేట్ సంస్థల ప్రయోజనాలకు ప్రజల డేటా మరింత పారదర్శకమవుతుందనేది వారి అభిప్రాయం. అలాగే, వ్యక్తిగత డేటాకూ, సున్నితమైన వ్యక్తిగత డేటాకూ మధ్య తేడాను సైతం ఈ బిల్లు గుర్తించకపోవడంతో సున్నితమైన డేటాకు అదనపు భద్రత లేకుండా పోతోంది. ఇక, సమాచారాన్ని సృష్టించే జనరేటివ్ కృత్రిమ మేధ (ఏఐ) టెక్నాలజీకి సంబంధించిన నియంత్రణల ఊసు ఈ బిల్లులో లేదు. వ్యక్తిగత గోప్యతకు సంబంధించి చట్టం తేవడానికే సుదీర్ఘకాలం తీసుకున్న మన ప్రభుత్వాలు ఏఐ విషయంలోనూ అదే పద్ధతి అవలంబిస్తే కష్టమే. కాబట్టి, ఏఐ నియమ నిబంధనల రూపకల్పనకు తక్షణం నడుం బిగించాల్సి ఉంది.

డేటా భద్రత బిల్లు కింద ఏర్పాటుచేసే 'డేటా ప్రొటెక్షన్ బోర్డ్' సైతం వట్టి పర్యవేక్షక సంస్థ. అదీ పూర్తిగా ప్రభుత్వ అజమాయిషీ కిందే నడుస్తుంది. ఛైర్మన్ సహా సభ్యులందరినీ కేంద్రమే నియమిస్తుంది. వెరసి, పాలకుల చేతిలో కీలుబొమ్మగా బోర్డు స్వతంత్రత, అధికారాలు అన్నీ పరిమితమే. తద్విరుద్ధంగా యూరప్ వగైరాల్లో డేటా భద్రత చట్టాలు, దాని కావలి సంస్థలు బలంగా ఉన్నాయి. ఫ్రాన్స్‌లో అంగీకార విధానాల్ని ఉల్లంఘించినందుకు గూగుల్‌పై అక్కడి కావలి సంస్థ 5 కోట్ల యూరోల జరిమానా వేయగలగడమే నిదర్శనం. డేటా భద్రతకు మించిన అసలు సమస్య... విచ్చలవిడిగా సాగుతున్న డేటా సేకరణను అరికట్టడం! అంతర్జాతీయ నిపుణుల మాట సైతం అదే. మన దేశంలోని ఈ ప్రబల సమస్యపై ఇప్పటికీ చర్చే జరగకపోవడం విషాదం. అలాగే, అవగాహన, డిజిటల్ అక్షరాస్యత అంతంత మాత్రమైన దేశంలో, ఊపిరి సలపని పనిభారమున్న న్యాయవ్యవస్థ మధ్య నిజంగా గోప్యతకు హాని కలిగినా ఈ బిల్లుతో పౌరులు న్యాయం పొందగలరా?

మనుగడకు మరపు మంచిదే!

విశ్లేషణ



ఎం. రాజీవ్ లోచన్

దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితి ఏమిటంటే... మతం పేరుతో రెచ్చగొట్టేవారు, లేదా ఒక మతానికి చెందినవారికి అన్యాయం జరుగుతోందని వాదించేవారు మాత్రమే కనిపిస్తున్నారు. ఒక మతానికి సంబంధించిన చెడును కప్పిపెట్టేందుకు, లేదా ఇంకో మతంలోని చెడును ఎత్తిచూపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనివల్ల ఫలితం శూన్యం. కొన్ని తప్పులను కప్పిపుచ్చే ప్రయత్నంలో చరిత్ర పుస్తకాలను తిరగరాయడం, లేదంటే ఎక్కువ చేసి చూపడం వల్ల ఒరిగేది ఏమీ లేదు. ఊహించుకున్న తప్పులను మళ్లీ మళ్లీ తవ్వుకోవాలనుకునేవారు... మునుపటి తరాల తాలూకు కక్షలను కొనసాగించే అవకాశాలే ఎక్కువ. గతంలోని కొన్ని గుర్తుంచుకోవడం, కొన్నింటిని వదిలేయడం ద్వారా మాత్రమే దేశాల నిర్మాణం జరుగుతుంది.

హరియాణాలోని మేవాత్, నూహ్‌లో జరుగుతున్న ఘర్షణలు చూస్తుంటే... పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి ప్రతాప్ సింగ్ ఖైరాన్ గుర్తుకొస్తారు. 1950లలో ఖైరాన్ గట్టి హెచ్చరిక జారీ చేశారు. పాకిస్తాన్ నుంచి వస్తున్న ముస్లిం కుటుంబాలను మేవాత్‌లోకి రానివ్వమని సూచనప్రాయంగా చెప్పిన వారిని ఉద్దేశిస్తూ చేసిన హెచ్చరిక అది. దేశ విభజన నేపథ్యంలో ఈ కుటుంబాలు పాక్‌కు వెళ్లాయి. 1950ల మధ్య కాలానికి చాలామంది మళ్లీ తమ స్వస్థలాలకు వచ్చేశారు. వేలమంది మేవాతీ ముస్లిం కుటుంబాలకు తమ సొంత ఆస్తులు మళ్లీ దక్కేలా ఖైరాన్ చర్యలు తీసుకున్నారు. ''గతం తాలూకు శత్రుత్వాన్ని మరచిపోండి. మీ బాధలపై ఆధారపడి బతక్కండి'' అని విభజన కారణంగా చెలరేగిన విద్వేష బాధితులైన సిక్కులు, హిందువులకు ఖైరాన్ పదే పదే చెప్పేవారు.

కొన్ని గుర్తుంచుకోవడం, కొన్నింటిని వదిలేయడం ద్వారా మాత్రమే దేశాల నిర్మాణం జరుగుతుంది. గతాన్ని గుర్తుంచుకోలేని వారు ఆధారం లేనివారవుతారు. బానిస బతుకులు బతికినవారు కూడా ఉజ్వల భవిష్యత్తును కాంక్షించే సందర్భంలో తమ మూలాలను తరచిచూస్తారు. లేదంటే మూలాలను కల్పించుకుంటారు. అదే సమయంలో గతాన్ని ఏమాత్రం మరచిపోనివారు లేదా ఊహించుకున్న తప్పులను మళ్లీ మళ్లీ తవ్వుకోవాలనుకునేవారు... మునుపటి తరాల తాలూకూ కక్షలను కొనసాగించే అవకాశాలే ఎక్కువ.

మన పాత తరాలు నిర్దిష్ట సామాజిక కూర్పుల్లో బతికాయి. ఈ కూర్పులు సాధారణంగా చాలా చిన్నస్థాయిలో ఉండేవి. ముఖాముఖి పరిచయాలు, ఒకరంటే ఇంకొకరికి నమ్మకం వంటివి ఈ కూర్పు తాలూకూ లక్షణాలు. చాలా ప్రాథమిక గుర్తింపుల ఆధారంగా ఈ నిర్మాణం జరిగింది. ఈ కూర్పులో లేనివారితో వ్యవహారం ప్రమాదకరమన్నది వారి అవగాహన. రూపురేఖల్లేని ఆధునికత అస్తిత్వంలోకి రావడంతో ఈ అవగాహనలన్నీ మారిపోయాయి.

ఇద్దరు వ్యక్తుల మధ్య ఒక బంధం ఏర్పడేందుకు చాలా సులువైన మార్గం ముఖాముఖి మాటలు, వ్యవహారాలే. ఇలాంటి బంధాలు, తద్వారా ఏర్పడ్డ సామాజిక వర్గాలు సహజంగానే చిన్న సమూహాలుగానే ఉంటాయి. ఇతరులపై వీరి ప్రభావమూ పెద్దగా కనిపించదు. అయితే జాతి, రాష్ట్రమన్న భావనలు ఆవిర్భవించిన తరువాత, ఆధునిక సమాజం తన మునుపటి దానికంటే విస్తృత స్థాయికి చేరేందుకు అవకాశం కల్పించిన ప్రాథమిక బంధాల విలువ తగ్గిపోయింది.

ఆధునిక ప్రపంచ చరిత్ర మొత్తం గతకాలపు అస్తిత్వాలను అణచిపెట్టడం, రూపురేఖల్లేని వ్యవస్థల నిర్మాణమనే చెప్పాలి. ఈ వ్యవస్థలే వ్యక్తులు తమ ప్రాథమిక అస్తిత్వాల బంధాలను తెంచుకుని స్వేచ్ఛగా ఉండేందుకు వీలు కల్పించాయి. అలాగే పాతకాలపు సామాజిక కట్టుబాట్లు మనుషులను తమ బానిసలుగా చేసుకోకుండా నిలువరించాయి. ఈ వ్యవస్థలన్నింటికీ ఆధారం 'నేషన్ స్టేట్'. (క్లుప్తత కోసం ప్రభుత్వం అనుకుందాం.) పాతకాలపు సామాజిక ఏర్పాట్లకు కాకుండా ప్రభుత్వ వ్యవస్థకు లొంగిన వ్యక్తులు నేషన్ స్టేట్‌లో ప్రాథమిక భాగస్వాములు. బల ప్రయోగంతో నేషన్ స్టేట్‌ను ఏర్పాటు చేయడం అసాధ్యం.



ఇది మనదన్న భావన కల్పించడం బలం వల్ల సాధ్యం కాదు. సహజసిద్ధంగా మనుషుల అంతరాంతరాళాల నుంచి పుట్టుకు రావాల్సిన ఫీలింగ్ అది. ఆసక్తికరమైన ఇంకో విషయం ఏమిటంటే, నేషన్ స్టేట్‌కు, వ్యక్తికి మధ్య బంధం బలపడటంలో వ్యక్తులు కనుమరుగు అవుతారన్న భయముంటుంది. ఈ భయంతోనే చాలామంది ఉదారవాదులు కూడా అందరి మంచిని పణంగా పెట్టి మరీ పాత కాలపు సామాజిక కూర్పులవైపు మొగ్గు చూపుతూంటారు. పాతకాలపు సామాజిక ఏర్పాట్లలో శక్తిమంతమైనది మతం అన్నది మరచిపోరాదు.

ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకునేందుకు వ్యవస్థీకృతమైన మతం ఉపయోగపడుతుంది. ఒక పరమార్థం, ఒక నమ్మకాన్ని కూడా ప్రజలకు ఇచ్చే మతం ఎప్పుడూ ప్రభుత్వం తదితర వ్యవస్థలకు గట్టి పోటీదారు. భారత్‌లో ప్రభుత్వ వ్యవస్థలకు సవాళ్లు రాజకీయపరమైన ఇస్లాంతో ముడిపడి ఉన్నాయి. ఇరవయ్యవ శతాబ్దపు తొలినాళ్లలో దేశంలోని ఇస్లామిస్టులు స్వయం పాలన పొందాలంటే అమెరికా సంయుక్త రాష్ట్రాల మాదిరిగానే మతం ఆధారంగా దేశాల నిర్మాణం జరగాలని కాంక్షించారు. ఇస్లాం పవిత్ర గ్రంథం ఖురాన్‌ను అసలు చదవనే లేదని గర్వంగా చెప్పుకొనే మౌలానా మొహమ్మద్ అలీ 'ద కామ్రేడ్' వార్తా పత్రికలో ఒక కథనం రాస్తూ ఇదే అంశాన్ని ప్రతిపాదించారు. అయితే ఇది దేశ విభజనకు దారితీసే స్థాయిలో ముస్లింలలో వేర్పాటువాదాన్ని సృష్టిస్తుందని ఆయన ఊహించలేకపోయారు.

వాస్తవం ఏమిటంటే, భారత్‌లో ఇష్టమైన మతాన్ని ఆచరించే స్వేచ్ఛపై ఎప్పుడూ నియంత్రణ లేదు. విభజన ఘర్షణల తరువాత కూడా రాజ్యాంగ మండలి చర్చల్లో మత స్వేచ్ఛకు సంబంధించిన ప్రశ్న ఉత్పన్నమైనప్పుడు దేశం అందరిదీ కాబట్టి మత స్వేచ్ఛ కూడా దానంతట అదే వచ్చినట్లేనని అనుకున్నారు. మత ప్రచారమన్న విషయానికి వస్తే మండలి సభ్యులు కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. హిందూ మతంలో మతమార్పిడన్న భావన లేదనీ, మత ప్రచారానికి అనుమతిస్తే హిందూమతం అంతమైపోతుందనీ వాదించారు. దీనిపై ఇతర సభ్యులు పాకిస్తాన్ ఏర్పాటును ఉదాహరణగా చూపుతూ, ఇండియాలో ముస్లింలకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భారతీయ సంస్కృతి, వారసత్వంపై ఉన్న అపోహలను తొలగించాలంటే మత ప్రచార హక్కును కల్పించవచ్చునని అభిప్రాయపడ్డారు. చివరకు ఇదే కార్యాచరణకు వచ్చింది.

దేశంలో ప్రస్తుతం, మతం పేరుతో రెచ్చ గొట్టేవారు లేదా ఒక మతానికి చెందినవారికి అన్యాయం జరుగుతోందని వాదించేవారు మాత్రమే కనిపిస్తున్నారు. ఒక మతానికి సంబంధించిన చెడును కప్పిపెట్టేందుకు లేదా ఇంకో మతంలోని చెడును ఎత్తి చూపేందుకు ప్రయత్నాలు జరిగాయి. కొన్ని తప్పులను కప్పిపుచ్చే ప్రయత్నంలో చరిత్ర పుస్తకాలను తిరగరాయడం లేదా ఎక్కువ చేసి చూపడం వల్ల ఒరిగిందేమీ లేదు. ఒక్కసారి ప్రజలు నిర్ణయించుకుంటే... వాస్తవాలను మరుగున బెట్టి లేదా అబద్ధాలు చెప్పడం ద్వారా వారిని మార్చలేము.

ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం యూరప్ చరిత్రను అర్థం చేసుకుని భారతదేశం కొన్ని పాఠాలు నేర్చుకోవాలి. దేశంలోని వైవిధ్యతపై విపరీతమైన నిబద్ధత కలిగి ఉండటం గురించి ముందుగా అర్థం చేసుకోవడం మంచిది. వైవిధ్యత మనకు మాత్రమే సొంతమని అనుకుంటూ ఉంటాం. కానీ చరిత్ర మొత్తమ్మీద ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ ఈ వైవిధ్యత ఉందన్నది మరచిపోతూంటాం. మనకు ఇది నమ్మబుద్ధి కాకపోవచ్చు. కానీ యూరప్‌లో చాలా శతాబ్దాలపాటు తమ మతగ్రంథాలను సొంతంగా చదివే స్వేచ్ఛ ఉండాలా, వద్దా? అన్న విషయంపైనే గొడవలు జరిగేవి. మతగురువులు మత గ్రంథాలపై ఇచ్చే వివరణ సరిపోతుందన్నది ఒక వర్గం వాదన. ఆర్థిక వ్యవస్థ బలం పుంజుకోవడం, సమాజ స్థాయి విస్తరించడంతో యూరోపియన్లు ఇలాంటి గొడవల నుంచి దూరం జరిగేందుకు కొన్ని దారులు వెతుక్కున్నారు. మరి యుగాల కాలం కొనసాగిన పగలేమయ్యాయి? ఒక వర్గం మరోదానిపై చేసిన చారిత్రక తప్పిదాల మాటేమిటి? ఆధునిక దేశం ఒకటి ఏర్పడిన తరువాత వాటన్నింటిని పట్టించుకోలేదు లేదా మరచిపోయారు. ఇలా అన్ని తెలిసి కూడా వాటిని మరచిపోవడం లేకపోతే ఇరు వర్గాలకు అనువైన మార్గంలో ముందుకు పోయేందుకు మరో దారి లేనేలేదు!

వ్యాసకర్త చరిత్రకారులు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వెన్ను విరగనుంది!



భారత ప్రభుత్వం ఈశాన్యంలోని మణిపుర్‌లో జరుగుతున్న మాదక ద్రవ్యాల వ్యాపారపు వెన్ను విరుస్తుందని నేను ఏ సంకోచం లేకుండా చెప్పగలను. అఫ్గానిస్తాన్‌కు ప్రత్యామ్నాయం కోసం వెతుకుతున్న రాజకీయ నేతలు, తీవ్ర వాదులు, విదేశీ శక్తులు ఎవరైనా సరే దాని పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

– సేవియో రోడ్రిగ్స్, సంపాదకుడు

ఇదొక అపవాదు



నిజంగానే భారత ప్రభుత్వం మణిపుర్‌లో మాదక ద్రవ్యాల వ్యాపారాన్ని సాగనీయదలుచుకోకపోతే, ఆ వ్యాపారంలో ఉన్నవారికి పోషకుడిగా ఉన్న ముఖ్యమంత్రి ఇంకా ఎందుకు పదవిలో ఉన్నట్టు? డ్రగ్స్ పేరుతో ఒక మైనారిటీ తెగను పరిహాసం చేయడం తగదు.

– లాల్మిన్ కిప్‌జెన్, పోస్ట్ డాక్టోరల్ ఫెలో

బుల్‌డోజర్ న్యాయమా?



ఇంతకు ముందు ఏ ప్రభుత్వమైనా 'జాతులను నిర్మూలిస్తున్న దన్న' అపవాదును కోర్టుల ద్వారా ఎదుర్కొన్నదా? బుల్ డోజర్ల ద్వారా ఇళ్లను కూల్చడాన్ని రాజకీయ ఆయుధంగా వాడుకుంటున్న తమ అక్రమ విధానం గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించుకోవాలి.

– సుహాసినీ హైదర్, జర్నలిస్ట్

నిజాలు తేలాలి!



సుప్రీంకోర్టుకు తగిన ప్రశంసనీయ అనమ్మతిని చూపుతూ కశ్మీరీ హిందువుల మారణకాండ కేసులను తిరిగి తెరవాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. యాసీన్ మాలిక్ గ్రూపు క్రూరంగా చంపిన న్యాయమూర్తి నీల్‌కంఠ్ గంజ్ కేసు మొదటిది.

– ఆనంద్ రంగనాథన్, 'స్వరాజ్య' సంపాదకవర్గం

భయపెడుతున్నారు...



నేను 'మహమ్మారులను' ఎందుకు ప్రశ్నిస్తున్నానని కొందరు అడుగుతున్నారు. నిజంగా ప్రాణాంతకమైతే, అది వ్యాపించదు (చనిపోయినవాళ్లు వ్యాపింపజేయరు). వేగంగా వ్యాపిస్తున్నదంటే, అది ప్రాణాంతకం కాదు.

– అహ్మద్ మాలిక్, సర్జన్

స్వయంపాలన హక్కే మేలు!

'ప్రపంచ ఆదివాసీ దినోత్సవం' సందర్భంగా ఆదివాసీలందరూ సమైక్యంగా స్వయం పాలన సాధనకై నినదించాలి. ఆదివాసీ పోరాటాల ఫలితంగా ఐక్యరాజ్య సమితి 1994 ఆగస్టు 9న 'ప్రపంచ ఆదివాసీ దినోత్సవం' జరపాలని పిలుపునివ్వాల్సి వచ్చింది. దీనికి భారతదేశ ఆమోదం, అంగీకారం ఉంది. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. కానీ, ఆచరణలో భారత దేశం అధికారికంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జరపలేదు. ఆదివాసీలకు రాజ్యాంగంలో కల్పించిన హక్కులు, ఆదివాసీ చట్టాలైన 1/70, పీసా, అటవీ హక్కుల చట్టం సరిగా అమలు చేయటం లేదు. ప్రస్తుత బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్రం, తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు మరీ బరితెగించి గిరిజనులను అడవుల రక్షణ పేరిట, అడవుల పెంపకం, 'హరితహారం' పేరిట అడవుల నుండి గెంటి వేయాలని ప్రయత్నిస్తున్నాయి. పార్లమెంట్‌లో పాత అటవీచట్టానికి(1980) సవరణ చేస్తూ బిల్లును ఆమోదింపజేశారు. ఇది అటవీ నివాసులందరి ఉనికికే ప్రమాదం. వీరి స్థానాన్ని కార్పొరేటు కంపెనీలకు పాలకులు కట్టబెట్టనున్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో సాగులో ఉన్న పోడు భూములన్నిటికీ అటవీ నివాసులైన వారందరికీ అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాలివ్వలేదు. ఆదివాసీలందరికీ కూడా పూర్తి స్థాయిలో పట్టాలివ్వలేదు. దీనితో ఏ ఒక్క పోడు సాగుదారుడు సంతృప్తిగా లేడు. ఇకనైనా ఆదివాసీ చట్టాల అమలు చేస్తారనే గ్యారంటీ లేదు. ఇప్పటికే జీవో నెం. 3ని రద్దు చేసి ఆదివాసీ యువతీ యువకులకు తీరని అన్యాయం చేశారు.

ప్రభుత్వాలు ఆదివాసీ గిరిజన వ్యతిరేక విధానాలు విడనాడాలి. ఆదివాసీ గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు రక్షించాలి. పీసా చట్టం, 1/70 రెగ్యులేషన్, అటవీ హక్కుల చట్టం– 2006ను సమగ్రంగా అమలు చేయాలి. జీవో నం.3ని పునరుద్ధరించాలి. విద్యావంతులైన ఆదివాసీ గిరిజన యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పించాలి, అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడు సాగుదార్లందరికీ 10 ఎకరాల వరకు పట్టాలివ్వాలి. పోడు సాగుదార్లపై అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలి. సర్వే చేయని పోడు భూములన్నింటినీ సర్వే చేయాలి. ఆదివాసీ గిరిజనుల విద్య, వైద్యం, ఉపాధికై అవసరమైన నిధులు పెంచి ఖర్చు పెట్టాలి. సాగునీరు, రోడ్లు, విద్యుత్, రక్షిత మంచినీరు ఇవ్వాలనీ పోరాడుతూనే రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు అమలు చేయమనీ, ఆదివాసీ గిరిజనులకు 'స్వయం పాలన' కల్పించాలనీ డిమాండ్ చేస్తూ సమైక్యంగా చైతన్యంతో పోరాడాలి. ఈ సందర్భంగా డా॥ బి. జనార్దనరావు, గుంటి రవి వంటి మేధావులు చెప్పిన విషయం ఇక్కడ గమనార్హం:

''... క్రమేపి ఆదివాసులు తమ పాలనా పరిణితిని సాధించుకోగలిగిన సందర్భంలో ఆయా కేంద్ర ప్రకటిత స్వయంపాలిత ప్రాంతాలే పూర్తిస్థాయి రాష్ట్రములుగా ఏర్పడుటకు కూడా 6వ షెడ్యూల్ వీలు కల్పిస్తుంది. ఫలితంగా కనీసం కొంత మేరకైనా 'ఆదివాసీ అనుకూల పాలనా న్యాయం' జరిగేందుకు వీలుంది.'' ఈశాన్య రాష్ట్రాల్లో కొంతమేరకు ఈ వ్యవస్థ ఉండటం మూలాన ఆదివాసుల జీవన ప్రమాణం దిగజారలేదు.

– కెచ్చెల రంగారెడ్డి, సీపీఐ (ఎమ్ఎల్) ప్రజాపంథా తెలంగాణ కమిటీ సభ్యులు
(నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం)

సామాజిక మాధ్యమాలను వాడే తీరు ఇదేనా?

అభిప్రాయం



సి. రామచంద్రయ్య

'నిజం చెప్పులు వేసుకొనేలోపు, అబద్ధం లోకాన్ని చుట్టి వస్తుంద'నేది ఓ ప్రసిద్ధమైన ప్రాచీన నానుడి. ఇందులో ఏమాత్రం అతిశయోక్తి లేదని అందుబాటులో ఉన్న సామాజిక మాధ్యమాల ప్రసారాలను పరిశీలిస్తే అర్థమవుతుంది. దాదాపు ఓ పాతికేళ్ల క్రితం ప్రజాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవడానికి కొంతమంది రాజకీయ నాయకులు ప్రసార మాధ్యమాలను ప్రభావితం చేస్తున్నారని ప్రముఖ రచయిత 'నామ్ చోమ్‌స్కీ' చెప్పినపుడు, అమెరికాలో అదొక సంచలనం. దానినే 'మాన్యుఫాక్చర్డ్ కన్‌సెంట్' అని పిలిచారు. అంటే, ప్రజలను ఒప్పించడానికి ఒక అసత్యాన్ని సత్యంగా మార్చే ప్రయత్నం అని అర్థం. ఇప్పుడు అంత ప్రయాస పడాల్సిన అవసరం లేదు. స్మార్ట్ ఫోన్లు, ఇంటర్నెట్ సేవలు చౌకగా అందుబాటులోకి వచ్చాక అసత్యాలు, నకిలీ సమాచారంతోపాటు సమస్త విషయాలు జనబాహుళ్యానికి క్షణాల్లో అందుబాటులోకి వచ్చేస్తున్నాయి.

ఇటీవల మణిపుర్‌లో ఇరువురు మహిళల్ని నగ్నంగా చేసి వారిని ఊరేగించి ఆపై వారిపై అత్యాచారం చేసిన దుర్ఘటన సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగు చూసి యావత్ దేశాన్ని కుదిపేసింది. ప్రజలలో ఆగ్రహం, ఆవేశం, ఆవేదన, నిస్సహాయత వంటి భావోద్వేగాలు సర్వత్రా వ్యక్తమయ్యాయి. ఆ సంఘటనలకు చలించిపోయిన ప్రధాని నరేంద్ర మోదీ ఎట్టకేలకు మౌనం వీడి బాధితులకు అండగా ఉంటామన్న హామీ ఇచ్చారు. నిజానికి, మణిపుర్‌లో జరుగుతున్న దారుణాలు బాహ్య ప్రపంచానికి తెలిశాయంటే అందుకు కారణం సామాజిక మాధ్యమాలే! అలాగని, సామాజిక మాధ్యమాల ద్వారా అందుతున్న సమాచారం అంతా పూర్తిగా నమ్మలేం. ఓ రెండేళ్ల క్రితం మయన్మార్‌లో ఓ యువతిపై జరిగిన దాడిని ఇటీవల మణిపుర్‌లో జరిగినట్లుగా సామాజిక మాధ్యమాలు ప్రచారం చేశాయి. అదేవిధంగా, కొన్నేళ్ల క్రితం ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో ఒక నకిలీ వార్త కారణంగా ఆ రాష్ట్రంలో అల్లర్లు జరిగాయి. తమిళనాడులో బిహార్‌కు చెందిన వలస కార్మికులపై దాడులు జరిగాయని సామాజిక మాధ్యమాలలో వ్యాప్తిలోకి వచ్చిన వార్తా కథనాలు, దృశ్యాలు పూర్తిగా ఫేక్ (కల్పితం) అని తేలాయి. కానీ, ఆ లోపే జరగాల్సిన నష్టం జరిగింది.

మిగతా దేశాల మాటెలా ఉన్నా, 133 కోట్ల జనాభా గలిగిన భారత దేశంలో 75 కోట్ల స్మార్ట్ ఫోన్లు వినియోగంలో ఉన్నాయని, 80 కోట్ల మంది ఇంటర్నెట్ సేవలు పొందుతున్నారన్న సమాచారం దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. ఇందులో 6 నుంచి 12 ఏళ్ల లోపు పిల్లలు ఉండటం మరింత ఆందోళన కలిగించే అంశం. కోవిడ్ మహమ్మారి కారణంగా అనివార్యంగా ఆన్‌లైన్ విద్యాబోధన అవసరం అయింది. దాంతో, పిల్లలకు స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌లు, ల్యాప్‌ట్యాప్‌లను తల్లిదండ్రులే సరఫరా చేయాల్సి వచ్చింది. స్మార్ట్ ఫోన్ల ద్వారా అన్ని రకాల సామాజిక మాధ్యమాలకు పిల్లలు చేరువయ్యారు, బాగా అలవాటుపడ్డారు. వారిలో కొందరికి ఇదొక వ్యసనంగా మారింది. 'విద్యారంగంలో సాంకేతికత' అనే పేరుతో పిల్లలకు ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు అందించడం వల్ల చదువు, సంస్కారం, వ్యక్తిత్వం నాశనం అవుతున్నాయంటూ ఇటీవల 'యునెస్కో' (ఐక్యరాజ్యసమితి విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ) అందించిన 435 పేజీల నివేదిక యావత్ ప్రపంచాన్ని నివ్వెరపర్చింది. అంతేకాదు.. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ డాక్టర్ నాగేశ్వర రెడ్డి చిన్నారుల్లో మానసిక రుగ్మతలకు కారణం స్మార్ట్ ఫోన్లేనంటూ తమ అధ్యయన ఫలితాలను వెల్లడించారు. తక్షణమే స్మార్ట్ ఫోన్లను పిల్లల నుంచి దూరం చేయాలని, డిజిటల్ టెక్నాలజీ వల్ల చదువులు మెరుగుపడ్డాయని చెప్పడానికి బలమైన అధ్యయనమేదీ లేదని పేర్కొంటూనే, సామాజిక మాధ్యమాలలో వెల్లువలా వచ్చి పడుతున్న 'కంటెంట్' పసిబుర్రలను పాడు చేస్తున్నదని నిపుణులు పేర్కొంటున్నారు. ఆరంభంలో స్వేచ్ఛాయుత భావ ప్రకటనలకు ఈ సామాజిక మాధ్యమాలు వేదికలుగా ఉపయోగ పడినప్పటికీ, పోనుపోను అభ్యంతరకర దృశ్యాలు, అసత్యాలు, తప్పుడు సమాచారంతో ఇవి మానవ సంబంధాలను దెబ్బతీస్తున్నాయి. ఇదంతా నాణేనికి రెండో వైపు.



సామాజిక మాధ్యమాలను శక్తిమంతంగా తమ ఉన్నతికి ఉపయోగించుకొంటున్నవారూ గణనీయ సంఖ్యలో ఉన్నారు. భారతదేశ జనాభాలో దాదాపు 33 శాతం ప్రజలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటిల్లో ఏదో ఒకటి వాడుతున్నారని తేలింది. కరోనా సమయంలో అందుబాటులోకి వచ్చిన 'జూమ్' సమావేశాల వంటి అనుసంధాన వేదికల ద్వారా వివిధ అభిరుచులు కలిగిన వ్యక్తులు తరచుగా కలవడం, తమ అభిప్రాయాలను పంచుకోవడం, కొత్త విషయాలు తెలుసుకోవడం ఎక్కువైంది. సామాజిక మాధ్యమాల ద్వారా అభివృద్ధి చెందిన వ్యాపార లావాదేవీలను 'సోషల్ కామర్స్'గా వ్యవహరిస్తున్నారు. ఇది వేల కోట్ల రూపాయల టర్నోవర్‌కు చేరిందని అంటున్నారు. దీనిద్వారా నష్టపోతున్న వారూ ఉన్నారు. బిట్‌కాయిన్, ఆన్‌లైన్ గేమ్స్ వల్ల యువతకు ఎక్కువ నష్టం వాటిల్లిందని ఓ అంచనా.

రాజకీయ పార్టీలు తమ భావజాల వ్యాప్తికి సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకోవడం ఎక్కువైంది. ప్రతి రాజకీయ పార్టీకి తప్పనిసరిగా సోషల్ మీడియా వింగ్ పని చేస్తోంది. ఈ విషయంలో తొలుత భారతీయ జనతా పార్టీయే తక్కిన పార్టీల కంటే ముందువరుసలో ఉంది. ప్రారంభంలో అన్ని రాజకీయ పార్టీలు సోషల్ మీడియా ద్వారా తమ విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాయి. ఆ తర్వాత ప్రత్యర్థి పార్టీలపైన, ప్రత్యర్థులపైన నెగిటివ్ కాంపెయిన్ మొదలు పెట్టాయి. ఇటీవల అవి శృతి మించుతున్నాయి కూడా! ఇటీవల విదేశాంగ మంత్రి జైశంకర్ దేశ యువతకు కొందరు డబ్బులు ఎరవేసి ఉగ్రవాద ఉచ్చులోకి లాగుతున్నారనీ, అటువంటి నెట్‌వర్క్‌ను ఛేదించడం కేంద్రానికి కష్టంగా మారిందనీ చెప్పారు. అంటే, ఇది ఎంతగా వ్యవస్థీకృతం అయ్యిందో చెప్పకనే చెప్పినట్లయింది. ఇక, సైబర్ వేధింపులు, సైబర్ నేరాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది.

సామాజిక మాధ్యమాలు కట్టుతప్పుతున్నాయనీ, వాటిని నియంత్రించాలనీ కొందరు చేస్తున్న వాదనలో నిజం పాక్షికమే. నిజానికి కట్టుతప్పుతున్నది వ్యక్తులు, వ్యవస్థలే. 'సామాజిక మాధ్యమాలు' కేవలం సాధనాలు మాత్రమే. వీటిని నియంత్రించడం సాధ్యం కాకపోవచ్చునని డిజిటల్ రంగ నిపుణులు చెబుతున్నది ఆందోళన కలిగించే చేదు నిజం. సామాజిక మాధ్యమాలను నియంత్రించే చట్టాలు వచ్చినట్లయితే, అది అంతిమంగా ప్రజాస్వామ్యానికి కీలకమైన భావప్రకటనా స్వేచ్ఛను హరించివేస్తాయి. అది మరింత ప్రమాదకరం. ఈ రెండింటినీ దృష్టిలో పెట్టుకొని సమతుల్యత సాధించి నకిలీలు, విద్వేషాల్ని, రెచ్చగొట్టే పోస్టింగ్‌లను అరికట్టాలి. ఆ దిశగా కేంద్రం చర్యలు తీసుకోవాలి. సాంఘిక మాధ్యమాలను అసాంఘిక మాధ్యమాలుగా మార్చినట్లయితే జరిగే నష్టాన్ని పూడ్చటం ఎవరివల్లా సాధ్యం కాదు.

వ్యాసకర్త ఏపీ శాసన మండలి సభ్యులు

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** బ.అష్టమి ఉ.8.33 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** భరణి ఉ.6.55 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** సా.6.57 నుండి 8.34 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.41 నుండి 12.31 వరకు, **అమృతఘడియలు:** తె.4.32 నుండి 6.08 వరకు (తెల్లవారితే గురువారం); **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.44, **సూర్యాస్తమయం:** 6.27.

గిరిజనోత్సాహం

వైఎస్సార్‌సీపీ పాలనతో మారిన గిరిజన బతుకు చిత్రం
ఆదివాసీలకు అందిన సంక్షేమ ఫలాలు
అడవిలో అభివృద్ధి విప్లవం
నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 34 తెగలకు చెందిన 27.39 లక్షల గిరిజనులు ఉన్నారు. 26 జిల్లాలకు గాను 9 సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థల (ఐటీడీఏ) పరిధిలో 16,068 గిరిజన ఆవాసాలున్నాయి. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక కార్యక్రమాలు గిరిపుత్రుల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరిచాయి. 2019–20 నుంచి 2023–24 వరకు ఎస్టీల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం మొత్తం రూ.20,948.15 కోట్లు వెచ్చించింది. నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాల్లో ప్రతి గిరిజనులకు రెండుకు మించిన పథకాల ద్వారా లబ్ధి కలిగింది. ప్రత్యక్షంగా (డీబీటీ), పరోక్షంగా (నాన్ డీబీటీ) ఇప్పటివరకు గిరిజనులకు రూ.14,712.08 కోట్ల ప్రయోజనం చేకూరింది. ఆదివాసీలకు ఇంత భారీస్థాయిలో ఆర్థిక ప్రయోజనం చేకూరడం రాష్ట్ర చరిత్రలోనే రికార్డు.

వైద్య రంగానికి సంబంధించి..

గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక వైద్య కళాశాలల నిర్మాణంతోపాటు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.746.30 కోట్లను మంజూరు చేసింది. రక్తహీనత కారణంగా బాలింతలు, శిశువులు మరణిస్తున్న విషయం తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్ గిరిజన ప్రాంతాల్లో గిరి గోరుముద్ద, బాల సంజీవని, పోషకాహార బుట్ట వంటి ప్రత్యేక వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఏజెన్సీలో 2,652 మంది గిరిజన కమ్యూనిటీ హెల్త్ వర్కర్ (సీహెచ్‌డబ్ల్యూ)లకు 1995 నుంచి ఉన్న కేవలం రూ.400 జీతాన్ని రూ.4 వేలకు పెంచారు.

నేడు సాలూరులో ఆదివాసీ దినోత్సవం

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని బుధవారం సాలూరులో ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ముఖ్య అతిథిగా హాజరవుతారు. 20 రకాల గిరిజన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

విద్యారంగంలో ఇలా..

రాష్ట్రవ్యాప్తంగా 2,506 గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్ని నిర్వహిస్తూ.. 1,55,599 మంది విద్యార్థులకు వసతి, ఇతర సౌకర్యాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ.920.31 కోట్లు కేటాయించింది. నాడు–నేడు మొదటి దశలో రూ.140 కోట్లతో గిరిజన విద్యా సంస్థలను తీర్చిదిద్దింది. రూ.153.853 కోట్లతో కురుపాంలో ఇంజినీరింగ్ కళాశాలను మంజూరు చేసింది. సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీకి విజయనగరం జిల్లా మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో 561.88 ఎకరాల భూమిని కేటాయించింది.

ఉపాధి పరంగా..

అర్హులైన ప్రతి ఎస్టీ కుటుంబానికి కనీసం రెండు ఎకరాల భూమిని అందించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేసింది. 2019 ఆగస్టు నుంచి 2,15,309 ఎకరాల విస్తీర్ణంలో 1,26,997 ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాలను, 39,272 ఎకరాల విస్తీర్ణంలో 26,287 డీకేటీ పట్టాలను పంపిణీ చేసింది. ఈ భూముల అభివృద్ధి కోసం ఉపాధి హామీ పథకం ద్వారా రూ.రూ.3,796.39 కోట్లు కేటాయించారు. 3 వేలకు పైగా బోర్లు వేయడంతోపాటు 2.27 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు, కాఫీ, మిరియాల సాగును అభివృద్ధి చేశారు.

ఆన్‌లైన్‌లో ఏపీపీఎస్సీ పరీక్షల హాల్ టికెట్లు

20వ తేదీలోగా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచన

సాక్షి, అమరావతి: ఏపీ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగంలో టౌన్‌ప్లానింగ్ అండ్ బిల్డింగ్ ఓవర్‌సీర్ పోస్టుల పరీక్ష హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ఏపీపీఎస్సీ తెలిపింది. ఈ నెల 18న ఉదయం, మధ్యాహ్నం పరీక్ష ఉంటుందని, అభ్యర్థులు www. psc. ap. gov. in వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

19న శాంపిల్ టేకర్ పరీక్ష

ఏపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్, పబ్లిక్ హెల్త్ ల్యాబ్స్ అండ్ ఫుడ్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో శాంపిల్ టేకర్ పోస్టుల భర్తీకి చేపట్టిన పరీక్ష ఈ నెల 19 నుంచి 21 వరకు నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ ప్రకటించింది. హాల్‌టికెట్లు కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచామని, అభ్యర్థులు 18వ తేదీ లోగా డౌన్‌లోడ్ చేసుకోవాలని కార్యదర్శి విజ్ఞప్తి చేశారు. సాంకేతిక కారణాల రీత్యా ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్ సేవలు నిలిచిపోతాయని, ఆలోగా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

21, 22 తేదీల్లో ఏఈఈ పరీక్ష

వివిధ ఇంజినీరింగ్ సర్వీసుల్లో ఖాళీల భర్తీకి ఉద్దేశించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ రాత పరీక్షను ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ ప్రకటించింది. హాల్ టికెట్లను కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు కమిషన్ కార్యదర్శి తెలిపారు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో 21న మధ్యాహ్నం, 22న ఉదయం, మధ్యాహ్నం ఈ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

15 నుంచి అన్ని పంచాయతీల్లో డిజిటల్ చెల్లింపులు



పెనమలూరులో డిజిటల్ చెల్లింపును ప్రారంభిస్తున్న స్పెషల్ సీఎస్ రాజశేఖర్

పెనమలూరు: గ్రామ పంచాయతీల్లో ఆగస్టు 15 నుంచి డిజిటల్ చెల్లింపులు ప్రారంభిస్తామని, గ్రామ పంచాయతీల పాలనలో సమూల మార్పులు తీసుకు వస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ బి.రాజశేఖర్ చెప్పారు. కృష్ణా జిల్లా పెనమలూరు గ్రామ పంచాయతీలో డిజిటల్ చెల్లింపులను మంగళవారం ఆయన ప్రారంభించారు. కేంద్రం డిజిటల్ ఇండియా తీసుకురావాలని ఆదేశించటంతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతీ గ్రామ పంచాయతీకి జనాభా ప్రాతిపదికన డిజిటల్ చెల్లింపులకు మిషన్లు, క్యూ ఆర్ కోడ్‌లు ఉచితంగా అందజేస్తామన్నారు. రాష్ట్రంలో 4 బ్యాంకులు డిజిటల్ చెల్లింపులకు ముందుకు వచ్చాయని చెప్పారు. కృష్ణా జిల్లాలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సేవలు అందిస్తోందన్నారు. త్వరలో గ్రామ పంచాయతీలను ఈ–గ్రామ పంచాయతీలుగా మార్చుతామన్నారు. అనంతరం పెనమలూరు గ్రామ పంచాయతీలో మొదటి డిజిటల్ చెల్లింపును రాజశేఖర్ చేశారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి, సర్పంచ్ లింగాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఏపీ జూపార్కుల్లోకి అసోం ఖడ్గ మృగాలు!

సాక్షి, అమరావతి: విశాఖ, తిరుపతి జూ పార్కులకు అసోం నుంచి ఖడ్గ మృగాలను తీసుకురావడానికి ఆ రాష్ట్ర అటవీ శాఖతో ఏపీ అటవీ శాఖ అధికారులు సంప్రదింపులు జరిపారు. యానిమల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం కింద దేశంలోని జూ పార్కులు జంతువులను పరస్పరం మార్చుకునే విధానం ఎప్పటి నుంచో ఉంది. ఇందులో భాగంగా తమ జూ పార్కులో లేని జంతువులను ఇతర జూల నుంచి తేవడం, అందుకు బదులుగా తమ జూల్లోని జంతువులను ఆ పార్కులకివ్వడం సాధారణం. ఇదే విధానంలో ఖడ్గ మృగాలను అసోం జూ పార్కు నుంచి విశాఖ లేదా తిరుపతి జూ పార్కులకు తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ రెండు జూ పార్కుల్లో ఖడ్గ మృగాలుండగా..వాటి సంఖ్యను మరింత పెంచడం ద్వారా ఆ జాతులను సంరక్షించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే, దేశంలోని ఇతర జూ పార్కుల నుంచి కూడా కొత్త జంతువులను ఏపీకి తీసుకురావడానికి అటవీ శాఖ ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది.

నేటి నుంచి ట్రిపుల్ ఐటీలకు రెండో విడత కౌన్సెలింగ్

నూజివీడు: ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2023 ఏడాదికి గాను సమీకృత ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్‌ను ఆగస్టు 9, 10 తేదీల్లో నిర్వహించనున్నారు. తొలి విడత కౌన్సెలింగ్ గత నెల 20 నుంచి 25 వరకు నిర్వహించగా, మిగిలిన సీట్లకు రెండో విడతతో భర్తీ చేస్తారు. ఈ కౌన్సెలింగ్‌లో నూజివీడు ట్రిపుల్ ఐటీలో 125, ఒంగోలులో 262, శ్రీకాకుళంలో 181, ఇడుపులపాయలో 183 సీట్లతో పాటు స్పెషల్ కేటగిరీ సీట్లు 54 భర్తీ చేయనున్నారు. ఎంపిక జాబితాలోని అభ్యర్థులకు ఇప్పటికే ఉదయం 8 గంటల కల్లా ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో రిపోర్ట్ చేయాలని అధికారులు సమాచారమిచ్చారు. పదో తరగతికి సంబంధించి అన్ని రకాల ధృవపత్రాలు, కుల, ఆదాయ సర్టిఫికెట్లు తెచ్చుకోవాలని, సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం సీట్ల కేటాయింపు ఉంటుందని ఆర్జీయూకేటీ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రక్రియను అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజు పర్యవేక్షిస్తున్నారు.

'బాబు ఓ పెద్ద మోసకారి'



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ

మండవల్లి: చంద్రబాబు తనను అన్ని రకాలుగా మోసం చేశారని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ వ్యాఖ్యానించారు. ఏలూరు జిల్లా మండవల్లిలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావుతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ తనకు ఉన్నదంతా ఖర్చు పెట్టించి మాయ మాటలు చెప్పిన ఘనుడు చంద్రబాబు అని విమర్శించారు. సీఎం జగన్ తనకు దేవుడితో సమానమని, ఆయన కోసం ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.

విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేయకండి

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్‌పరం చేయవద్దని, 100% పెట్టుబడుల ఉపసంహరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఉక్కు పరిరక్షణ పోరాట సమితి నాయకులు కేంద్ర ఉక్కు శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను కోరారు. గత 910 రోజులుగా పోరాటం చేస్తున్నా.. కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం తమ బాధను పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతోమంది కార్మికులు ఆధారపడ్డ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్‌పరం చేయడం అనేది తెలుగు ప్రజలపై జరుగుతున్న దాడి అని, బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. కంపెనీకి అవసరమైన ఇనుప గనులను కేటాయించాలని, పూర్తిస్థాయి సామర్థ్యంతో కంపెనీని నిర్వహించేందుకు కేంద్రం సహకరించాలని కేంద్ర ఉక్కుశాఖ మంత్రిని కోరారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు నారాయణ, రాజశేఖర్, అయోధ్యారామ్, శ్రీనివాసరావు, జెర్రిపోతుల ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ బస్సు యాత్ర

తిరుపతి కల్చరల్: ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేపడుతున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 17వ తేదీన వైజాగ్‌లో బస్సు యాత్ర ప్రారంభమై సెప్టెంబర్ 8వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. బస్సు యాత్ర ముగింపు సందర్భంగా 8వ తేదీన తిరుపతి నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలవరం ఎత్తు తగ్గించడంపై కేంద్రం కుట్రపూరిత నిర్ణయంపై సీఎం జగన్ ప్రశ్నించాలన్నారు. రాష్ట్రంలో వస్తున్న ఐదు మెడికల్ కాలేజీలలో ఉన్న 150 సీట్లలో 22 సీట్లు సెంట్రల్ కోటా కింద పోతే మిగతా 128 సీట్లకు రిజర్వేషన్ పాటించకపోవడంతో వెనుకబడిన తరగతుల వారికి అన్యాయం జరుగుతుందని తెలిపారు. దీనిపై అన్ని పార్టీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘాలు ప్రశ్నించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

మూలధన వ్యయంలో ఏపీ టాప్

ఆస్తుల కల్పన వ్యయంలో అగ్రపథంలో ఆంధ్రప్రదేశ్.. 3 నెలల్లో 40 శాతం వ్యయం

సాక్షి, అమరావతి: ఆస్తుల కల్పనకు ఉద్దేశించిన మూలధనం వ్యయంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూలధన వ్యయంపై కాగ్ గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. బడ్జెట్‌లో మూలధన వ్యయం కేటాయింపుల్లో తొలి త్రైమాసికంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 40.79 శాతం వ్యయం చేసినట్లు కాగ్ గణాంకాలు తెలిపాయి. దేశంలో మరే రాష్ట్రంలోనూ తొలి త్రైమాసికంలో ఇంత మేర వ్యయం చేయలేదని కాగ్ గణాంకాలు పేర్కొన్నాయి. పలు రాష్ట్రాలు బడ్జెట్‌లో మూలధన వ్యయం కేటాయింపుల్లో ఎంత మేర ఖర్చు చేశాయనే అంశాన్ని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక కూడా వెల్లడించింది. మూలధన కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్ చేసినంత వ్యయం దేశంలో మరే రాష్ట్రంలోనూ చేయలేదని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక పేర్కొంది. బడ్జెట్‌లో మూలధన వ్యయానికి చేసిన కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏప్రిల్, మే నెలల్లోనే ఏకంగా 29.70 శాతం వ్యయం చేసిందని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక ఏడాది తొలి త్రైమాసికానికి సంబంధించి కాగ్ గణాంకాలు కూడా మూలధన వ్యయంలో ఆంధ్రప్రదేశ్ మిగతా రాష్ట్రాల కన్నా ముందంజలో ఉన్నట్లు వెల్లడించాయి. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మూలధన వ్యయం కింద రూ.31,061 కోట్లు కేటాయింపులు చేయగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు రూ.12,669 కోట్లు వ్యయం చేసిందని, ఇది కేటాయింపుల్లో 40.79 శాతమని కాగ్ గణాంకాలు స్పష్టం చేశాయి. ఆంధ్రప్రదేశ్ తరువాత మూలధన కేటాయింపుల్లో ఎక్కువ వ్యయం చేసిన రాష్ట్రాల్లో తెలంగాణ, తమిళనాడు, కేరళ, రాజస్థాన్, మహారాష్ట్ర ఉన్నాయి. మూలధన వ్యయం అంటే నేరుగా ఆస్తుల కల్పన వ్యయంగా పరిగణిస్తారు.

కాగ్ గణాంకాల మేరకు 2023-24 తొలి త్రైమాసికంలో మూలధన వ్యయం ఇలా

రాష్ట్రం	మూల ధన వ్యయం రూ.కోట్లలో	కేటాయింపుల్లో శాతం
ఆంధ్రప్రదేశ్	12,669	40.79
తెలంగాణ	9,984	26.61
కేరళ	3,055	20.92
రాజస్థాన్	7,547	19.38
తమిళనాడు	5,196	11.71
మహారాష్ట్ర	3,562	4.82

సూర్యనారాయణకు హైకోర్టులో ఎదురుదెబ్బ

- ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత
- ఆయనపై ఉన్నవి తీవ్రమైన ఆరోపణలు
- వ్యాపారులు, సహ నిందితులు, సాక్షుల వాంగ్మూలాలు ఉన్నాయి
- సూర్యనారాయణ పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది
- న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి

సాక్షి, అమరావతి: వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగి, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. వ్యాపారులతో కుమ్మక్కై ప్రభుత్వ ఖజానాకు రూ.వందల కోట్ల మేర నష్టం కలిగించారంటూ విజయవాడ పటమట పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేసుకున్న పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. సూర్యనారాయణపై ఉన్నవి మామూలు ఆరోపణలు కాదని, అవి చాలా తీవ్రమైనవని హైకోర్టు స్పష్టం చేసింది. సూర్యనారాయణ వ్యాపారులతో కుమ్మక్కై ప్రభుత్వ ఖజానాకు నష్టం చేకూర్చారనేందుకు ప్రాథమిక ఆధారాలున్నాయని తేల్చి చెప్పింది. సూర్యనారాయణ పాత్రపై వ్యాపారులు స్పష్టమైన వాంగ్మూలాలు ఇచ్చారన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ యర్రంరెడ్డి నాగిరెడ్డి వాదనను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసిన తరువాత వ్యాపారులు ముందుకొచ్చి వాంగ్మూలాలు ఇచ్చారని, సహ నిందితులు సైతం వాంగ్మూలాలు ఇచ్చారని, పలువురు సాక్షులు కూడా వాంగ్మూలం ఇచ్చారని, వీటన్నింటినీ పరిశీలిస్తే నేరంలో సూర్యనారాయణ పాత్ర ఉందనేందుకు ప్రాథమిక ఆధారాలు లభిస్తున్నాయంది. దర్యాప్తులో పోలీసులు సేకరించిన సాక్ష్యాలు సూర్యనారాయణ పాత్రను ప్రాథమికంగా నిర్ధారిస్తున్నాయని తెలిపింది. ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం కలిగించినటువంటి తీవ్రమైన ఆరోపణలున్న నేపథ్యంలో సూర్యనారాయణకు ముందస్తు బెయిల్ మంజూరు చేయడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. అలాగే ఈ కేసులో సూర్యనారాయణ పాత్రపై పోలీసుల దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, అది ఇంకా పూర్తి కాలేదంది. అందువల్ల ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి మంగళవారం తీర్పు వెలువరించారు.

9 అడుగుల జెర్రిపోతు పాము హల్‌చల్



భారీ జెర్రిపోతు పామును పట్టుకున్న భాస్కర్ నాయుడు

తిరుమల : తిరుమలలోని బాలాజీ నగర్‌లో తొమ్మిది అడుగుల జెర్రిపోతు పాము మంగళవారం హల్‌చల్ చేసింది. సమాచారం అందుకున్న టీటీడీ అటవీశాఖ ఉద్యోగి భాస్కర నాయుడు వెంటనే అక్కడకు చేరుకున్నారు. చాకచక్యంగా జెర్రిపోతును పట్టుకుని అవ్వాచ్చారి కోనలో విడిచిపెట్టారు.

రాజకీయ లబ్ధి పొందేందుకే బాబు అల్లర్లు

1,045వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: రాష్ట్రంలో అల్లర్లు సృష్టించి రాజకీయంగా లబ్ధి పొందడమే లక్ష్యంగా బాబు అండ్ కో కుట్రలు సాగుతున్నాయని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,045వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. బహుజనులు తనవైపు లేరని, అభివృద్ధి సంక్షేమం అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైపు ఉన్నారని గ్రహించిన చంద్రబాబు కులమతాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతూ అల్లర్లు సృష్టిస్తున్నాడని మండిపడ్డారు. అమరావతి ఉద్యమంలో ఓ సామాజిక వర్గం, టీడీపీ నాయకులు, బినామీలే తప్ప సాధారణ ప్రజలెవరూ పాల్గొనడం లేదన్నారు. బాబు బినామీలు, ఆర్థిక ఉగ్రవాదులే రాష్ట్రాభివృద్ధికి అడ్డంకిగా మారారనేది బహిరంగ సత్యమని చెప్పారు. రాష్ట్రంలో కులవాదమే అజెండా, అధికారమే పరమావధిగా రాజకీయాలు నడుపుతున్న వారికి తగిన బుద్ధి చెప్పేందుకు బహుజనులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. నాయకులు బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

జీవితాంతం మీకు జీతాల్లేకుండా చేస్తాం

పోలీసులకు టీడీపీ నేత కోటంరెడ్డి బెదిరింపులు



పోలీసులను బెదిరిస్తున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (క్రైమ్): 'పనికిమాలిన పోలీస్..6 నెలల్లో అధికారం మాదే..తర్వాత మీ బతుకేంది..జీవితాంతం జీతాల్లేకుండా చేస్తాం ..మా వాళ్ల జోలికొస్తే పోలీస్ మొత్తాన్ని ఇరికిస్తాం..కోర్టుల చుట్టూ తిప్పిస్తాం' అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పోలీసులను మంగళవారం నెల్లూరులో బెదిరించారు. ఇండియన్ నేషనల్ లీగ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సమీ ఈ నెల 6న రాత్రి అంబేడ్కర్‌నగర్ వద్ద వారధి సెంటర్‌కు చెందిన నదీముద్దీన్‌పై హత్యాయత్నం చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్గామిట్ట పోలీసులు సమీపై హత్యాయత్నం కేసు నమోదు చేసి సమీని మంగళవారం అదుపులోకి తీసుకుని విచారించగా.. కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మరికొందరు పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. శ్రీనివాసులురెడ్డి స్టేషన్‌లోకి వెళ్తుండగా లోపల విచారణ జరుగుతోందని తర్వాత రావాలని విధుల్లో ఉన్న పోలీసులు ఆయనకు సూచించారు. దీంతో సహనం కోల్పోయిన కోటంరెడ్డి అక్కడున్న పోలీసులను పై విధంగా బెదిరించారు. ఓవైపు పోలీసులను బెదిరిస్తూనే మరోవైపు పోలీసులంటే తమకు గౌరవం ఉందని కోటంరెడ్డి పేర్కొనడం విశేషం.

శ్రీశైలంలో ఇంజినీరింగ్ పనులపై మరోసారి ఏసీబీ తనిఖీలు



ఔటర్‌రింగ్ రోడ్డును పరిశీలిస్తున్న ఏసీబీ ఇంజనీరింగ్ అధికారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం దేవస్థానంలో గతంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా జరిగిన ఇంజినీరింగ్ పనులను అవినీతి నిరోధక శాఖ అధికారులు మరోసారి తనిఖీ చేశారు. మంగళవారం ఏసీబీ సీఐ వంశీనాథ్ నేతృత్వంలో ఆ శాఖ ఇంజినీరింగ్ అధికారులు డీఈ రామకృష్ణ, ఏఈలు పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఔటర్ రింగ్‌రోడ్డు, మాడ వీధులు, పలు అభివృద్ధి కార్యక్రమాలను తనిఖీ చేయడంతో పాటు కొలతలు తీసుకున్నారు. అలాగే పనుల్లో నాణ్యతను పరిశీలించేందుకు రోడ్డు శాంపిల్స్ సేకరించారు. ఈ తనిఖీలు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. 2017 సంవత్సరం, అంతకు ముందు శ్రీశైలం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా పలు ఇంజినీరింగ్ పనులు చేపట్టారు. ఆ పనుల్లో అవకతవకలు జరిగినట్లు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు రావడంతో తనిఖీలు నిర్వహిస్తున్నారు. గత నెల 6న మొదటిసారి ఏసీబీ అధికారులు శ్రీశైలం చేరుకుని పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అలాగే టెండర్లు, ఎం–బుక్ రికార్డులను పరిశీలించారు. తాజాగా మరోసారి ఏసీబీ అధికారులు పనులను పరిశీలిస్తున్నారు. నివేదికలను ప్రభుత్వానికి సమర్పిస్తామని ఏసీబీ సీఐ వంశీనాథ్ తెలిపారు.

నేడు వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా

- ఏప్రిల్ – జూన్ త్రైమాసికంలో వివాహం చేసుకున్న వారికి వర్తింపు
- 18,883 జంటలకు రూ.141.60 కోట్ల సాయం
- నేడు సీఎం క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి వధువుల తల్లుల ఖాతాల్లో జమ చేయనున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: ఈ ఏడాది ఏప్రిల్ – జూన్ త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన జంటలకు వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా అమలుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం శ్రీకారం చుడుతున్నారు. ఇందుకు అర్హులైన 18,883 జంటలకు రూ. 141.60 కోట్ల ఆర్థిక సాయాన్ని తన క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి వధువుల తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నారు. పేద తల్లిదండ్రులు పిల్లలను చదివించి, వారి వివాహాన్ని గౌరవప్రదంగా జరిపించే సామాజిక బాధ్యతకు అండగా నిలుస్తూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లలకు 'వైఎస్సార్ కళ్యాణమస్తు' ద్వారా, ముస్లిం మైనార్టీ వర్గాల ఆడపిల్లలకు 'వైఎస్సార్ షాదీ తోఫా' ద్వారా ఆర్థిక సాయాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పుడు అందిస్తున్న సాయంతో కలిపి గడిచిన 9 నెలల్లోనే వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద 35,551 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ. 267.20 కోట్లు ప్రభుత్వం జమ చేసింది. దూదేకుల, నూర్ బాషాల విజ్ఞప్తిని మన్నించి వారికి కూడా వైఎస్సార్ షాదీ తోఫాతో సమానంగా లబ్ధిని రూ.1,00,000కు పెంచి అందిస్తోంది. ఈ వర్గాలకు చెందిన అర్హులైన గత లబ్ధిదారులకు కూడా పెరిగిన సాయాన్ని పథకం ప్రారంభం నుంచి బ్యాక్ డేట్‌తో వర్తింపజేస్తారు.

దూరదృష్టితో..

వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫాకు అర్హత సాధించాలంటే వధూవరులిద్దరూ పదో తరగతి తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాలి. తల్లిదండ్రులు పిల్లలను చదివించడానికి ఈ నిబంధన దోహదం చేస్తుంది. పెళ్లి నాటికి అమ్మాయి వయస్సు 18 ఏళ్లు, అబ్బాయి వయస్సు 21 సంవత్సరాలు దాటి ఉండాలన్న నిబంధన బాల్య వివాహాల నివారణకు ఉపకరిస్తుంది. ఈ కాలంలో పిల్లలు ఇంటర్మీడియట్, డిగ్రీ కూడా చదువుతారు. ఇంటర్ వరకు చదివేందుకు అమ్మ ఒడి సాయం అందుతుంది.

50 వేల మంది ఆర్థిక శ్రేయస్సు దెబ్బతింటుంది

- హైకోర్టు ఆదేశాలపై స్టే ఇవ్వండి
- ఆర్–5జోన్ అంశంపై సుప్రీం కోర్టును ఆశ్రయించిన ఏపీ ప్రభుత్వం

సాక్షి, న్యూఢిల్లీ: పేదలకు ఇళ్ల నిర్మాణాలపై హైకోర్టు ఇచ్చిన స్టే 50 వేల మందికి పైగా పట్టాదారుల ప్రయోజనాలను ప్రభావితం చేస్తుందని ఏపీ ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోను అనుమతించకపోతే ఈడబ్ల్యూఎస్ పరిధిలోని వారి ఆర్థిక శ్రేయస్సు దెబ్బతింటుందని తెలిపింది. ఈ నెల 3న ఏపీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలపై స్టే ఇవ్వాలని కోరింది. ఈ ఏడాది మే 17 నాటి హైకోర్టు ఉత్తర్వులను పరిశీలిస్తే తాజా ఉత్తర్వులు పూర్తిగా అనుచితమని పేర్కొంది. రాజధానికి సంబంధించిన తీర్పు ఈ ఆదేశాలపై ప్రభావం చూపుతుందని పేర్కొంది. ఇది సమాజంలో వెనుకబడిన వర్గాలకు ఇళ్ల స్థలాల కేటాయింపు, ఇళ్ల నిర్మాణానికి సంబంధించినదని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకం ప్రకారం భూ కేటాయింపులపై వాస్తవిక పరిశీలన చేయాలని కోరింది. కేటాయింపులన్నీ రాజధాని ప్రాంతానికి చెందిన వ్యక్తులకే జరిగినట్లు వివరించింది. లాండ్ పూలింగ్ స్కీం నిబంధనలు అతిక్రమించిందనడానికి ఎలాంటి కారణాలు లేవని పేర్కొంది. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఈడబ్ల్యూఎస్ వర్గాల ప్రయోజనం కోసం భూకేటాయింపు పరిశీలన కమిటీ దరఖాస్తులకు అనుగుణంగా కేటాయింపులు ఆమోదించినట్లు తెలిపింది. గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు భూమిని కేటాయించాలని ఏపీసీఆర్‌డీఏ, ప్రభుత్వానికి ప్రతిపాదన పంపినట్లు తెలిపింది. తదనంతరం గుంటూరు ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లకు భూమి అప్పగించడం జరిగిందని, ఆ జిల్లాల్లోని ప్రజలకు 529.04 ఎకరాలు, 569.46 ఎకరాల భూమిని ఈడబ్ల్యూఎస్ వర్గాలకు కేటాయిస్తూ మేజిస్ట్రేట్లు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపింది. కేటాయింపుదారులకు మంజూరు చేసిన పట్టాల్లో షరతు ప్రకారం పెండింగ్‌లో ఉన్న వ్యాజ్యాల పరిష్కారంపై నిర్మాణం/తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొనడాన్ని హైకోర్టు తప్పుపట్టిందని తెలిపింది. అయితే, పట్టాలో ఉపయోగించిన భాషను హైకోర్టు తప్పుగా అర్థం చేసుకోరాదని తెలిపింది. ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన ఉచిత హౌసింగ్‌కు బయట వ్యక్తి లేదా అంతర్గత వ్యక్తి ప్రాతిపదిక తీసుకొని వివక్ష చూపరాదని, ఇది రాజ్యాంగానికి విరుద్ధమని తెలిపింది.

పారుమంచాల ఇసుక వాగుపై వంతెన

భూమి పూజ చేసిన ఆర్థిక మంత్రి బుగ్గన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, చిత్రంలో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి తదితరులు

జూపాడుబంగ్లా(నంద్యాల): నంద్యాల జిల్లా పారుమంచాల గ్రామస్తులతో పాటు ప్రయాణికుల ఆరు దశాబ్దాల కష్టాలను తీరుస్తూ సీఎం వైఎస్ జగన్ ఇసుకవాగుపై వంతెన నిర్మాణానికి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేశారని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చెప్పారు. మంగళవారం ఆయన టీటీడీ ఈవో ధర్మారెడ్డితో కలిసి వంతెన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వంతెన ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తన దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. ఈ విషయాన్ని సీఎం జగన్‌కు తెలియజేయగా ఆయన రూ.5 కోట్ల నిధులు మంజూరు చేశారని వివరించారు. మార్చి నెలాఖరులోగా వంతెన నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ మనజీర్ జిలానీ, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, సర్పంచ్ మాధవరం, ఎంపీపీ సువర్ణమ్మ, జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, అధికారులు నాగరాజు, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

పురుగులున్న జైలు గదిలో ఇమ్రాన్ ఖాన్

ఇస్లామాబాద్: తోషఖానా కేసులో అరెస్టయిన ఇమ్రాన్‌ఖాన్‌ను అటోక్ జైల్లో పురుగులు పుట్రలతో చిమ్మ చీకట్లో ఉన్న ఒక చిన్న గదిలో ఉంచారు. మాజీ ప్రధానమంత్రి అయినప్పటికీ ఆయనకు ఎలాంటి ప్రత్యేక సదుపాయాలు కల్పించలేదు. ఎలాంటి సదుపాయాలు లేని ఒక చిన్న గదిలో పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ (పీటీఐ) చైర్మన్ ఇమ్రాన్‌ఖాన్‌ను ఉంచారని ఆయన తరఫున లాయర్ నయీమ్ హైదర్ పంజోతా చెప్పారు. ఆ గదిలో ఈగలు, చీమలు, నల్లులు వంటి పురుగులు ఉన్నాయని చెప్పారు. అదే గదిలో ఒక మూల వాష్ రూమ్ ఉందని చెప్పారు. తన జీవితాంతం ఈ చిన్న గదిలో ఉండడానికి సిద్ధమేనని ఇమ్రాన్‌ఖాన్ చెప్పినట్టుగా ఆ లాయర్ వెల్లడించారు. లాహోర్‌లో ఇమ్రాన్‌ను అరెస్ట్ చేసినప్పుడు ఆయనకు అరెస్ట్ వారెంట్ కూడా చూపించకుండా తలుపులు బద్దలు కొట్టి లోపలికి వచ్చారని ఇమ్రాన్ చెప్పారన్నారు. హైకోర్టులో సవాల్ పిటిషన్ వెయ్యడం కోసం ఇమ్రాన్ ఖాన్ సంతకం తీసుకోవడానికి అటోక్ జైలుకు వెళ్లిన లాయర్ దాదాపుగా గంట 45 నిమిషాలసేపు ఇమ్రాన్‌తో ఉన్నారు. అప్పుడే ఇమ్రాన్ తనని ఉగ్రవాదిని చూసినట్టుగా జైల్లో చూస్తున్నారని గదిలో ఓపెన్ టాయిలెట్ , చిమ్మచీకటి ఉదయం పూట ఈగలు, రాత్రయితే చీమలు వస్తున్నాయని, తనని కలవడానికి కూడా ఎవరికీ అనుమతించడం లేదని తన ఆవేదనంతా చెప్పుకున్నారు. ఇమ్రాన్ ఖాన్‌కు మరో షాక్ తగిలింది. అవినీతి కేసులో దోషిగా తేలడంతో ఐదేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆయనపై అనర్హత వేటు పడింది.

ఆగస్ట్ 15ను జాతీయ పండుగగా జరుపుకుందాం

వాషింగ్టన్: భారత స్వాతంత్ర్య దినం ఆగస్ట్ 15వ తేదీని ప్రపంచంలోని రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల జాతీయ దినోత్సవం (నేషనల్ డే ఆఫ్ సెలబ్రేషన్ ఆఫ్ ది వరల్డ్స్ టు లార్జెస్ట్ డెమోక్రసీస్)గా జరుపుకునేందుకు ఉద్దేశించిన బిల్లును భారతీయ అమెరికన్ కాంగ్రెస్ సభ్యుడు శ్రీ థానేదార్ ఆధ్వర్యంలో సోమవారం ప్రవేశపెట్టారు. ఆయనకు సహ కాంగ్రెస్ సభ్యులు బడ్డీ కార్టర్, బ్రాడ్ షర్మన్ సహకరించారు. 'అమెరికా, భారత్‌ల మధ్య బంధం బలమైన భాగస్వామ్యం, ప్రజాస్వామ్య విలువలతో పెనవేసుకుపోయింది. ప్రపంచదేశాల్లో ప్రజాస్వామ్యాన్ని పెంపొందించడంతోపాటు, అభివృద్ధికి తోడ్పడుతున్నాయి'అని తీర్మానం పేర్కొంది. మోదీ జూన్ 22వ తేదీన అమెరికా పర్యటన తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత విస్తృతమయ్యాయని తెలిపింది.

ఇదీ మణిపూర్ కథ..!

మణిపూర్ చరిత్ర అంటే రాజులు, సంస్థానాలు, ఆక్రమణలు, చొరబాట్లు మాత్రమే కాదు. భిన్న సంప్రదాయాలు, సంస్కృతులు కలిగిన జాతుల కలబోత. విభిన్న తెగల వారు ఒకే చోట సహజీవనం చేసే మణిహారం. మెయిటీలు, కుకీల మధ్య మూడు నెలలుగా జరుగుతున్న ఘర్షణలు రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మార్చాయి. ఈ నేపథ్యంలో మణిపూర్ చరిత్ర అందరిలోనూ ఆసక్తిని పెంచింది.



మణిపూర్ లోయ ప్రాంతంలో మెయిటీలు, నాగా, జోమి ఇలా 124 తెగలు నివసిస్తూ ఉంటే మణిపూర్ కొండల్లో 38 గిరిజన తెగలకు చెందిన వారు ఉన్నారు. వీరిలో కుకీల ప్రాబల్యం ఎక్కువ. ఈ వర్గాల మధ్య ఘర్షణలు ఇప్పుడు కొత్తేం కాదు. గత రెండు దశాబ్దాలుగా రాష్ట్రంలో మెయిటీలు, కుకీల మధ్య ఉద్రిక్తతలు చెలరేగుతూనే ఉన్నాయి.

చరిత్రలోకి తొంగి చూస్తే

మణిపూర్‌కు సంబంధించిన చారిత్రక ఆధారాలు క్రీ.శ. 33వ సంవత్సరం నుంచి ఉన్నాయి. అయితే, అంతకు ముందు సైతం ఇంఫాల్ లోయలో మానవ నాగరికత వెల్లివిరిసినప్పటికీ అక్కడ ఉన్న వారంతా మెయిటీ వర్గీయులు అని చెప్పడానికి వీల్లేదు. టిబెట్, బర్మా నుంచి మెయిటీలు వలస వచ్చినట్టుగా చారిత్రక ఆధారాలు ఉన్నాయి. భారత్‌ను సుదీర్ఘకాలం పరిపాలించిన రాజవంశాలలో ఒకటైన నింగ్‌డా వంశీకులు మణిపూర్ లోయను పాలించారు. మణిపూర్ రాజులు, ప్రజలు 18 వ శతాబ్దం వరకు సనామహిజం అనే దేశీయ మత విశ్వాసాల్ని ఆచరించారు. 15వ శతాబ్దంలో లోయను పాలించిన క్యంబ అనే రాజు విష్ణుమూర్తి దేవాలయాన్ని నిర్మించాడు. అప్పట్నుంచి లోయలోకి బ్రాహ్మణుల రాక ప్రారంభమైంది. అప్పట్లోనే మణిపూర్ లోయను పాలించిన రాజులు హిందువులుగా మారారా అన్న చర్చ ఉంది. అయితే 1704వ సంవత్సరంలో రాజు చరియారోంగ్బా తన కుటుంబంతో సహా హిందూమతంలోకి మారారు. అప్పట్నుంచి ఇంఫాల్ లోయలో హిందువుల ప్రాబల్యం పెరిగింది. నింగ్‌డా వంశీకులే 1724లో ఈ ప్రాంతానికి మణిపూర్ (మణిమాణిక్యాలకు నిలయం) అని పేరు పెట్టారు.

కుకీలకు తెల్లదొరల అండ

బ్రిటిష్ పాలకుల అండదండలతో కుకీలు మణిపూర్ కొండప్రాంతాల్లో స్థిరపడ్డారు. నాగా తెగల దాడుల నుంచి లోయ ప్రాంతాలను రక్షించే పనిలో ఉండేవారు. ఓ రకంగా బ్రిటీష్ పాలకుల కిరాయి సైన్యంగా పని చేసేవారు. తెల్లదొరలు తమ వ్యూహంలో భాగంగా ఒక తెగకి వ్యతిరేకంగా మరో తెగని, వారికి వ్యతిరేకంగా ఇంకో తెగవారిని ప్రోత్సహించారు. కొండ ప్రాంతాల్లో కుకీల ప్రాబల్యం పెరిగిపోవడానికి బ్రిటీష్ వారి వ్యూహాలే కారణమని మలేమ్ నింగ్‌తౌజ అభిప్రాయపడ్డారు.

నేటి ఘర్షణలకు మూలం

మణిపూర్ ఘర్షణలపై కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. లోయ ప్రాంతాల్లో నివసించే మెయిటీలు ఎస్టీ హోదా కోసం డిమాండ్ చేస్తూ ఉంటే కొండప్రాంతంలో ఎస్టీ హోదా ఉన్న కుకీలు తమకు ప్రత్యేక పరిపాలనా యంత్రాంగం కావాలని పట్టుబడుతూ ఉండడంతో మూడు నెలలుగా హింస చెలరేగుతోంది. 1949 తర్వాత మయన్మార్ నుంచి అక్రమ వలసదారులు భారీగా వచ్చి కుకీ సమాజంలో కలిసిపోయారని అదే నేటి ఘర్షణలకు మూలమని రచయిత, చరిత్రకారుడు నింగ్‌తౌజ తెలిపారు. మణిపూర్ చరిత్రతో నేటి ఘర్షణలకు సంబంధం లేదని ఆయన చెబుతున్నారు. రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో ఏళ్ల తరబడి నివాసం ఏర్పాటు చేసుకున్న అక్రమ వలసదారుల్ని ఏరివేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు కుకీలలో ఆందోళనకు దారి తీస్తున్నాయి. ఈ ఏడాది మార్చిలో మణిపూర్‌కు చెందిన కొన్ని సంస్థలు ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో ప్రదర్శన నిర్వహిస్తూ 1951 తర్వాత అక్రమంగా వచ్చిన వలసదారుల్ని రాష్ట్రం నుంచి తరిమివేయాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘకాలంగా ఉన్న ఈ సమస్యలు, సవాళ్లతోనే మణిపూర్ జాతుల సంఘర్షణ సంక్లిష్టంగా మారింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

కుకీల ప్రస్తావన తొలిసారి ఎప్పుడంటే

కొన్ని వందల శతాబ్దాల కిందటే మణిపూర్ లోయ ప్రాంతంలో మెయిటీల ఉనికి ఉంది. కానీ కుకీల ప్రస్తావన 17వ శతాబ్దంలో తొలిసారిగా తెలిసింది. 1777లో బెంగాల్ గవర్నర్ జనరల్‌గా వారెన్ హేస్టింగ్స్ ఉన్నప్పుడు చిట్టగాంగ్‌లో బ్రిటీషర్లపై ఒక తెగ దాడి సందర్భంగా తొలిసారిగా కుకీల ప్రస్తావన వినిపించింది. బ్రిటీష్ రచనల్లో కుకీలను పాత కుకీలు, కొత్త కుకీలుగా విభజించారు. ఆంగ్లో, బర్మా యుద్ధం (1824–1826) జరిగినప్పుడు బర్మా నుంచి వచ్చినవారే కొత్త కుకీలు అని బ్రిటీష్ రచనల ద్వారా తెలుస్తోందని రచయిత, చరిత్రకారుడు మలేమ్ నింగ్‌తౌజ వెల్లడించారు.

అప్పట్నుంచే మెయిటీల డిమాండ్

1819లో మణిపూర్‌పై బర్మా దురాక్రమణకు దిగింది. దీంతో మణిపూర్ రాజులు బ్రిటీష్ సాయం కోరారు. అప్పట్నుంచి 1891 వరకు మణిపూర్ తెల్లదొరల సంరక్షణలో ఉంది. తర్వాత సంస్థానాధీశుల చేతికొచ్చింది. సంస్థాలన్నీ భారత్‌లో విలీనమయ్యాయి. స్వాతంత్ర్యం తర్వాత 1949 సంవత్సరం అక్టోబర్ 15 నుంచి మణిపూర్ అధికారికంగా భారత్‌లో అంతర్భాగమైంది. ఆ సమయంలో మెయిటీలకు ఎస్టీ హోదా ఇవ్వాలన్న చర్చ వచ్చింది. కానీ అది కార్యరూపం దాల్చలేదు.



సమావేశానికి విచ్చేస్తున్న మోదీకి స్వాగతం పలుకుతున్న దృశ్యం

ఐక్యత పరీక్షకే అవిశ్వాసం

- విపక్ష కూటమిపై ప్రధాని విసుర్లు
- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ మాదే విజయం
- అవినీతి, బుజ్జగింపు రాజకీయాలను తరిమికొట్టడానికి ఈ నెల 9న 'క్విట్ ఇండియా'

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వంపై లోక్‌సభలో ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. విపక్ష కూటమిలో ఐక్యతను, ఒకరిపై ఒకరికి నమ్మకం ఉందో లేదో పరీక్షించుకోవడానికే ఈ అవిశ్వాసం పెట్టారని ఎద్దేవా చేశారు. విపక్ష 'ఇండియా' కూటమిలో లుకలుకలు ఉన్నాయని చెప్పారు. మంగళవారం బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో తమ ఎంపీలను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. ఢిల్లీ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇది సెమీ–ఫైనల్ విజయమని అన్నారు. బీజేపీ రాజ్యసభ సభ్యులకు అభినందనలు తెలిపారు. వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లోనూ గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేశారు. లోక్‌సభలో తమకు సంపూర్ణ మెజార్టీ ఉందనే విషయం తెలిసీ కలిసి ఉన్నామో లేదో పరీక్షించుకోవడానికే విపక్ష కూటమి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిందన్నారు. ఢిల్లీ బిల్లుపై రాజ్యసభలో జరిగిన ఓటింగ్‌లో ఆశించిన దానికంటే తమకు ఎక్కువ ఓట్లు వచ్చాయని మోదీ చెప్పారు.

'సిక్సర్లు' కొట్టాలి

వరుసగా మూడో పర్యాయం తాను ప్రధాని కావడం తథ్యమని మోదీ పరోక్షంగా తేల్చిచెప్పారు. రైల్వే శాఖ సంబంధిత పనుల కోసం ఎంపీలు ఇక ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉండదని, వారి డిమాండ్లను పరిష్కరించేలా రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చక్కటి ప్రణాళిక తయారు చేశారని వివరించారు. లోక్‌సభ ఎన్నికల ముందు జరగబోతున్న అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ 'సిక్సర్లు' కొట్టాలని బీజేపీ ఎంపీలకు మోదీ పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్న ప్రతిపక్ష నాయకులు మరోవైపు వారసత్వ రాజకీయాలు, బుజ్జగింపు రాజకీయాలు, అవినీతి రాజకీయాలు చేస్తున్నారని ప్రధాని మండిపడ్డారు. బంధుప్రీతి, అవినీతి, బుజ్జగింపు రాజకీయాలను దేశం నుంచి తరిమికొట్టడానికి ఈ నెల 9న జరిగే 'క్విట్ ఇండియా' కార్యక్రమంలో ఎంపీలంతా పాల్గొనాలని కోరారు. అలాగే 'విభజన అకృత్యాల సంస్మరణ దినం' సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ మన లక్ష్యమని, ఇందు కోసం ప్రజలంతా కృషి చేయాలని, ఈ దిశగా ప్రజలతో ప్రతిజ్ఞలు చేయించాలని మోదీ కోరారు.

రాహుల్‌కు మళ్లీ అదే బంగ్లా



న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి లోక్‌సభ సభ్యత్వం తిరిగి పునరుద్ధరించడంతో ప్రభుత్వం ఆయనకు తుగ్లక్ లేన్‌లోని మునుపటి 12వ నంబర్ బంగ్లాను తిరిగి కేటాయించింది. మోదీ ఇంటిపేరు వ్యాఖ్యల పరువు నష్టం కేసులో సూరత్ కోర్టు జైలు శిక్ష విధించడంతో రాహుల్ లోక్‌సభ సభ్యత్వం కోల్పోయారు. దీంతో, అప్పటి వరకు, దాదాపు రెండు దశాబ్దాలపాటు నివాసం ఉన్న తుగ్లక్ లేన్‌లోని ప్రభుత్వ బంగళాను ఖాళీ చేయాల్సి వచ్చింది. సూరత్ కోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించడంతో తిరిగి లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరించారు. అదేవిధంగా, ఆయనకు తిరిగి తుగ్లక్ లేన్‌లోని అదే బంగ్లాను మంగళవారం కేటాయించింది. దీనిపై రాహుల్ స్పందిస్తూ..ఈ దేశమే తనకు ఇల్లు అంటూ ట్వీట్ చేశారు.



వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయాన్ని అనుకుని ఉన్న జ్ఞానవాపి మసీదులో సర్వే చేస్తున్న పురావస్తుశాఖ అధికారులు. మసీదు ఉత్తరం గోడ, గుమ్మటం, పునాది పరిశీలించారు. మసీదు కమిటీ, హిందూ పక్షం సభ్యులు సర్వే సమయంలో అక్కడే ఉన్నారు.

లోక్‌సభలో గరంగరం

అవిశ్వాస తీర్మానంపై పార్లమెంట్ దిగువ సభలో ప్రారంభమైన చర్చ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ సహా విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం లోక్‌సభలో చర్చ ప్రారంభమైంది. ఈ సందర్భంగా అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. మణిపూర్ హింసపై ప్రధాని మోదీ మౌనవ్రతాన్ని విచ్ఛిన్నం చేయడానికే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టామని ప్రతిపక్షాలు వెల్లడించాయి. మణిపూర్ హింసాకాండకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్ రాజీనామా చేయాలని ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే సహా పలువురు విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. శివసేన ఎంపీ, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే సభలో కాసేపు హనుమాన్ చాలీసా పఠించారు. అవిశ్వాస తీర్మానంపై సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్, సీపీఎం నేత ఎ.ఎం.అరీఫ్, బీజేపీ సభ్యుడు నారాయణ్ రాణే, కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ తదితరులు మాట్లాడారు.

మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించండి

మణిపూర్‌లో హింస, సరిహద్దుల్లో చైనా సైనికుల చొరబాట్లపై మోదీ ఎందుకు నోరువిప్పడం లేదని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ఆ పార్టీ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్ నిలదీశారు. ప్రధాని మౌనం వీడేలా చేయడానికే కేంద్ర ప్రభుత్వంపై లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టామని చెప్పారు. మంగళవారం సభలో అవిశ్వాస తీర్మానంపై చర్చను గౌరవ్ గొగోయ్ ప్రారంభించారు. ''ప్రధాని మోదీ మణిపూర్‌ను ఇప్పటిదాకా ఎందుకు సందర్శించలేదు? రాష్ట్రంలో హింసాకాండపై కేవలం 30 సెకండ్లపాటు స్పందించడానికి 80 రోజుల దాకా ఎందుకు వేచిచూశారు? మణిపూర్ ముఖ్యమంత్రిని పదవి నుంచి ఎందుకు తొలగించలేదు?'' అని ప్రశ్నలు సంధించారు.

రాజధర్మం పాటించడం లేదు



దివంగత ప్రధాని వాజ్‌పేయి 'రాజధర్మానికి' మద్దతుగా నిలిచారు. కానీ, ఇప్పుడు మహిళలను నగ్నంగా ఊరేగించినా మనం రాజధర్మం పాటించడం లేదు. మణిపూర్‌లో జరిగిన అకృత్యాలను ప్రపంచమంతా ఖండించింది. దీనిపై యూరోపియన్ యూనియన్ పార్లమెంట్‌లోనూ చర్చ జరిగింది. ప్రధాని మోదీ వైఖరిని బ్రిటీష్ పార్లమెంట్ సైతం తప్పుపట్టింది. చెడును సంహరించాలన్నదే మా లక్ష్యం. అందుకే అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇస్తున్నాం - టి.ఆర్.బాలు, డీఎంకే సభ్యుడు

అవిశ్వాసానికి సమయం కాదు

ప్రభుత్వంపై విపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి ఇది సరైన సమయం కాదు. ప్రధాని మోదీ ప్రపంచ నేతగా ఎదిగారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారబోతోంది. ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం అవసరమే లేదు. ప్రతిపక్షాలు ఇలాంటివి మానాలి. - కిరణ్ రిజిజు, కేంద్ర మంత్రి

విపక్షాలు ఇక ఇంటికే..

''ఇండియా అని పేరుపెట్టుకున్న విపక్ష కూటమిలో జగడాలు ముదురుతున్నాయి. పేదలకు మంచి చేసిన నాయకుడికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానమిది. వచ్చే లోక్‌సభ ఎన్నికల తర్వాత విపక్షాలు మళ్లీ సభలో అడుగుపెట్టవు. ఎన్డీయే 400కు పైగా సీట్లు లభించడం ఖాయం'' - నిషికాంత్ దూబే, బీజేపీ ఎంపీ

గొగోయ్ ఇంకా ఏం మాట్లాడారంటే...

తప్పులను అంగీకరించడం మోదీకి ఇష్టం లేదు

''మణిపూర్‌లో తెగల మధ్య ఘర్షణను, హింసను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్ర హోంశాఖ, జాతీయ భద్రతా సలహాదారు ఘోరంగా విఫలమయ్యారు. చేసిన పొరపాట్లను అంగీకరించడానికి ప్రధాని మోదీ ఇష్టపడడం లేదు. మణిపూర్‌లో విభజన జరిగితే దేశంలో విభజన జరిగినట్లే. అందుకే ఈ అంశంపై మోదీ పార్లమెంట్‌లో మాట్లాడాలని డిమాండ్ చేస్తున్నాం. మణిపూర్‌లో శాంతి కోసం మోదీ కనీసం పిలుపు కూడా ఇవ్వకపోడం విచారకరం. ప్రజలు సమస్యల్లో ఉన్నప్పుడు మోదీ అధికారం కోసం ఓట్ల వేట సాగించారు. దేశం కంటే అధికారమే ముఖ్యమనుకున్నారు. ఇదేనా జాతీయవాదం? ఒకే దేశం(వన్ ఇండియా) అని చెబుతున్న మోదీ ప్రభుత్వం రెండు మణిపూర్‌లను సృష్టిస్తోంది. 2002లో గుజరాత్‌లో మత కలహాలు చెలరేగినప్పుడు అప్పటి ప్రధాని వాజ్‌పేయి అక్కడ పర్యటించారు. ఇప్పటి ప్రధాని మణిపూర్‌కు దూరంగా ఉంటున్నారు. సమాధానం చెప్పాల్సిన పరిస్థితి వచ్చినప్పుడల్లా మోదీ మౌనాన్ని ఆశ్రయిస్తున్నారు. మణిపూర్‌లో శాంతి కోసం చొరవ తీసుకోవాల్సిన ప్రధానమంత్రి విపక్ష కూటమిపై విమర్శలు చేయడంలో బిజీగా ఉన్నారు. ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకోవడానికి విద్వేషం ఒక ఆయుధంగా మారడం దురదృష్టకరం. మీ 'విద్వేష దుకాణం' ముందు మా 'ప్రేమ దుకాణాన్ని' తెరుస్తాం. దేశం అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని మీరు పెద్ద పెద్ద మాటలు చెబుతున్నారు, అదే మాట ఒక నిరుపేద కూరగాయల విక్రేత ఎదుట చెప్పగలరా?'' అని గౌరవ్ గొగోయ్ ప్రశ్నించారు.

రాజ్యసభలో హైడ్రామా

డెరెక్ ఒబ్రియాన్ సస్పెన్షన్.. ఆపై ఉపసంహరణ



మాట్లాడుతున్న ఎంపీ డెరెక్

న్యూఢిల్లీ: టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రియాన్ సస్పెన్షన్ అంశంపై మంగళవారం రాజ్యసభలో హైడ్రామా నడిచింది. మంగళవారం సభ ఆరంభం కాగానే తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఒబ్రియాన్ మణిపూర్ అంశంపై చర్చించాలంటూ పట్టుబట్టారు. దీంతో చైర్మన్ ధన్‌ఖడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సభా కార్యకలాపాలకు పదేపదే అడ్డుతగులుతున్న ఒబ్రియాన్‌ను సభ నుంచి వెళ్లిపోవాల్సిందిగా కోరారు. సభా మర్యాదకు భంగం కలిగిస్తున్నందుకు ఆయనను వర్షాకాల సమావేశాల నుంచి సస్పెండ్ చేస్తూ రాజ్యసభలో నేత గోయల్ తీర్మానం ప్రవేశపెట్టారు. కాంగ్రెస్‌కు చెందిన ప్రమోద్ తివారీ సహా పలువురు సభ్యులు ఒబ్రియాన్ పట్ల సౌమ్యంగా వ్యవహరించాలని చైర్మన్‌ను కోరారు. స్పందించిన ధన్‌ఖడ్.. ఒబ్రియాన్ తిరిగి సమావేశాలకు హాజరయ్యేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. కాగా, ప్రతిపక్ష నేతలపై అభ్యంతర వ్యాఖ్యలు చేసిన పీయూష్ గోయెల్‌పై 'ఇండియా' కూటమి నేతలు సభా హక్కుల నోటీసు ఇచ్చారు. న్యూస్‌క్లిక్ వెబ్‌పోర్టల్‌కు నిధులందాయంటూ గోయెల్ చేసిన ఆరోపణలపై విపక్ష పార్టీల నేతలు మంగళవారం రాజ్యసభ చైర్మన్‌కు ఈ మేరకు నోటీసు అందజేశారు.

తీవ్ర తుపానుతో అమెరికా అతలాకుతలం

వాషింగ్టన్: అమెరికాలోని తూర్పు తీర రాష్ట్రాలను భీకర తుపాను వణికిస్తోంది. బలమైన గాలులు, భారీ వర్షాలకు సంబంధించిన వేర్వేరు ఘటనల్లో ఇద్దరు చనిపోయారు. విద్యుత్ వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. టెన్నెసీ నుంచి న్యూయార్క్ వరకు 10 రాష్ట్రాల్లోని 11 లక్షల నివాసాల్లో అంధకారం అలుముకుంది. సుమారు 3 కోట్ల మందిపై తుపాను ప్రభావం పడింది. తమ ప్రాంతంలోని విద్యుత్ లైన్లను మరమ్మతు చేసేందుకు కొన్ని రోజులు పట్టవచ్చని నాక్స్‌విల్లె యుటిలిటీ బోర్డ్ తెలిపింది. అలబామాలోని ఫ్లోరెన్స్‌లో సోమవారం పిడుగుపాటుకు ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. సౌత్ కరోలినాలోని అండెర్సన్ కౌంటీలో చెట్టు కూలి పడటంతో ఓ బాలుడు(15) చనిపోయాడు. భారీ వర్షాలు, గంటకు 70 మైళ్ల వేగంతో బలమైన గాలులు వీస్తుండటంతో విమాన, రోడ్డు రవాణా వ్యవస్థ స్తంభించింది. ఎనిమిది వేల విమాన సర్వీసులు ఆలస్యంగా నడిచాయి. మరో 2,600 విమాన సర్వీసులు రద్దయ్యాయి. తూర్పు తీర ప్రాంతం వైపు రావాల్సిన విమానాలను దారి మళ్లించినట్లు ఫెడరల్ ఏవియేషన్ తెలిపింది. వందలాదిగా ఇళ్ల పైకప్పులు ధ్వంసమయ్యాయి. చెట్లు కూలి రహదారులు, నివాసాలపై పడిపోయాయి. విధులకు హాజరైన ఉద్యోగులను తుపాను కారణంగా ముందుగానే ఇళ్లకు చేరుకోవాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఇటీవలి కాలంలో ఇంతటి తీవ్ర తుపాను ఇదేనని జాతీయ వాతావరణ విభాగం పేర్కొంది.



కారు... పై ఫ్లోరు



రోడ్డుపై వేగంగా వెళ్తున్న కారు కల్వర్టు అంచును ఢీకొట్టి అదే వేగంతో పక్కనే ఉన్న ఓ నివాస భవనం అంతస్తులోకి దూసుకెళ్లింది. అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రం డెకటూర్ టౌన్‌షిప్‌లో ఈ నెల ఆరోతేదీన ఈ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. అగ్నిమాపక దళ సిబ్బంది దాదాపు మూడు గంటలపాటు కష్టపడి కారును కిందికి దించారు. గాయపడిన కారు డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు.

ఈశాన్యంలో పర్యటిస్తున్నాం: రిజిజు

న్యూఢిల్లీ: ప్రతి 15 రోజులకోసారి ఈశాన్య రాష్ట్రాలను సందర్శించాలంటూ ప్రధాని మోదీ తమను ఆదేశించారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా ఆయన లోక్‌సభలో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి కేబినెట్ సమావేశంలో కేంద్ర మంత్రులతో మోదీ ఒక బృందాన్ని ఏర్పాటు చేశారని, ఇందులో ఐదుగురు కేబినెట్ మంత్రులు, ఏడుగురు సహాయ మంత్రులు ఉన్నారని తెలిపారు. ప్రతి 15 రోజులకోసారి ఈశాన్యంలో పర్యటించాలంటూ ఈ బృందాన్ని ఆదేశించారని పేర్కొన్నారు. ప్రధాని ఆదేశాల ప్రకారం ఈశాన్యంలో పర్యటిస్తున్నట్లు వివరించారు. ఢిల్లీ నుంచి పాలించడం కాదు, నేరుగా ప్రజలకు వద్దకు వెళ్లాలని అధికారులను సైతం మోదీ ఆదేశించారని పేర్కొన్నారు. కిరణ్ రిజిజు వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్‌లో గత 97 రోజుల్లో కేంద్ర మంత్రులు ఎవరెవరు ఎప్పుడు పర్యటించారో చెప్పాలని, దమ్ముంటే వివరాలు బయటపెట్టాలని రిజిజుకు సవాలు విసిరారు. ఈ మేరకు ట్వీట్ చేశారు.

రిటైరయ్యాక .. అభిప్రాయమే

సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్

న్యూఢిల్లీ: న్యాయమూర్తులు పదవీ విరమణ చేసిన తర్వాత ఏం మాట్లాడినా అది వారి అభిప్రాయమే అవుతుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ చెప్పారు. వారి వ్యాఖ్యలతో న్యాయ వ్యవస్థకు ఎలాంటి సంబంధం ఉండదన్నారు. ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ నేషనల్ కాన్ఫరెన్స్ నేత మొహమ్మద్ అబ్దుల్ లోన్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ డీవై చంద్రచూడ్ మంగళవారం విచారణ చేపట్టారు. రాజ్యాంగ నిర్మాణంపై న్యాయశాస్త్ర కోణంలో చర్చ జరగాలని సోమవారం రాజ్యసభలో రిటైర్డ్ న్యాయమూర్తి రంజన్ గొగోయ్ చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చాయి. దీనిపై జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పందిస్తూ.. పదవీ విరమణ చేసిన జడ్జిల వ్యాఖ్యలు వారి అభిప్రాయాలే అవుతాయని స్పష్టం చేశారు.

వాట్సాప్‌లో ఇక స్క్రీన్ షేరింగ్

న్యూఢిల్లీ: మెసేజింగ్ యాప్ వాట్సాప్‌లో మరో రెండు కొత్త సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. అవి స్క్రీన్ షేరింగ్, వీడియో కాల్స్‌కు ల్యాండ్‌స్కేప్ మోడ్. వాట్సాప్ మాతృసంస్థ మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ మంగళవారం ఈ విషయం ఫేస్‌బుక్ ద్వారా ప్రకటించారు. వాట్సాప్ కాల్ మాట్లాడుతూ లైవ్‌లోనే స్క్రీన్ షేర్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. అదేవిధంగా, వీడియో కాల్ సమయంలో కావాలనుకుంటే ల్యాండ్ స్కేప్ మోడ్‌లోకి కూడా మార్చుకోవచ్చు.

'భారత్ దగ్గు మందు సురక్షితం కాదు'

జెనీవా: ఇరాక్‌లో విక్రయిస్తున్న భారత్ తయారీ దగ్గు మందు సురక్షితం కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. దగ్గు మందు తయారీలో వాడే పదార్థాలు పరిమితికి మించి ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. చెన్నైకు చెందిన ఫోర్ట్స్ ల్యాబొరేటరీస్ కంపెనీ తయారు చేసిన కోల్డ్ అవుట్ అనే దగ్గు మందును ఇరాక్‌కు చెందిన దాబిలైఫ్ ఫార్మాకు విక్రయించింది. ఈ మందులో డైథిలీన్ ఇథలీన్ మోతాదుకు మించి ఉన్నట్టుగా డబ్ల్యూహెచ్ఓ గుర్తించింది. చిన్నారులు ఈ మందు తాగితే అత్యంత ప్రమాదకరమని హెచ్చరించింది.

అస్సాం రైఫిల్స్‌పై ఎఫ్ఐఆర్

విధులకు ఆటంకం కలిగిస్తున్నారంటున్న పోలీసులు

ఇంఫాల్: అస్సాం రైఫిల్స్ జవాన్లపై మణిపూర్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని, సాయుధ దుండగుల్ని వెంబడించకుండా అస్సాం రైఫిల్స్ సిబ్బంది తమను అడ్డుకున్నారని ఆ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఆగస్టు 5నే ఈ ఎఫ్ఐఆర్ నమోదైంది. బిష్ణుపూర్‌లో గత శనివారం ముగ్గురిని చంపిన వారిని అరెస్ట్ చేయకుండా అస్సాం రైఫిల్స్ సిబ్బంది అడ్డుకున్నారని పోలీసులు ఆరోపించారు. అస్సాం రైఫిల్స్ సిబ్బందికి వ్యతిరేకంగా మహిళలు ఆందోళనలకు దిగడంతో ప్రభుత్వం వారి స్థానంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని రంగంలోకి దింపింది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
బుధవారం । 9 । ఆగస్టు । 2023

తమ ఉద్యోగాలను కొనసాగించాలని బెంగళూరు ఫ్రీడంపార్కులో అటల్‌జీ జనస్నేహి సెంట్రల్ ఉద్యోగుల ధర్నా. అర్ధాంతరంగా ఉద్యోగాలను రద్దు చేయడం సబబు కాదని, న్యాయం చేయాలని కోరారు



న్యూస్‌రీల్

కుమార కాంబోడియా టూర్

దొడ్డబళ్లాపురం: ఇటీవలే కుటుంబ సభ్యులతో కలిసి యూరోప్ వెళ్లి వచ్చిన మాజీ సీఎం కుమారస్వామి మరోసారి స్నేహితులతో కలిసి కాంబోడియా టూర్ వెళ్లారు. మాజీ మంత్రి సారా.మహేశ్, ఎమ్మెల్సీ బోజేగౌడ తదితర స్నేహితులతో కలిసి కుమారస్వామి సోమవారం అర్ధరాత్రి కాంబోడియా వెళ్లారు. నాలుగు రోజుల తరువాత ఆయన తిరిగి బెంగళూరు వస్తారని సమాచారం. గతనెల 23న కుమారస్వామి భార్య అనిత , కొడుకు కోడలితో కలిసి యూరోప్ వెళ్లి వచ్చారు.

డిపో మేనేజర్ గది ముందు బీఎంటీసీ డ్రైవర్ ఆత్మహత్య


నాగేశ్

దొడ్డబళ్లాపురం: బీఎంటీసీలో డ్రైవర్ కమ్ కండక్టర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన దేవనహళ్లి పట్టణంలో చోటుచేసుకుంది. దేవనహళ్లి తాలూకా అవతి గ్రామానికి చెందిన నాగేశ్ (45) మృతుడు. సోమవారం అర్ధరాత్రి దేవనహళ్లి పట్టణంలోని సంతవీధిలో పక్కన ఉన్న బీఎంటీసీ బస్ డిపోకు వచ్చిన నాగేశ్ మేనేజర్ గది ముందే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం విధులకు వచ్చిన ఉద్యోగులు ఈ దృశ్యాన్ని చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. పలు సమస్యలతో బాధపడుతున్న నాగేశ్ గత కొన్ని రోజులుగా కుంగిపోయాడని తెలిసింది. ఆయనకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. డిపో మేనేజర్ గది ముందే ఉరివేసుకోవడానికి అధికారుల వేధింపులే కారణమని పలువురు అనుమానిస్తున్నారు. దేవనహళ్లి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కమిషనర్ నిర్లక్ష్యం.. యువతి దుర్మరణం


రామనగర నగరసభ కమిషనర్ నాగేశ్, ఆయన కారు

దొడ్డబళ్లాపురం: రామనగర నగరసభ కమిషనర్ నిర్లక్ష్యంగా కారు నడిపి ఢీకొనడంతో బైక్ బోల్తా పడి ఒక యువతి మృత్యువాత పడింది. సంఘటన మంగళవారం ఉదయం రామనగర కలెక్టరేట్ ముందు చోటుచేసుకుంది. బెంగళూరు అవలహళ్లి నివాసి సిద్దిక్ అంజుమ్ (22) మృతురాలు. సయ్యద్ ఇదాయత్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రామనగర కమిషనర్ నాగేశ్ సొంతంగా డ్రైవ్ చేస్తున్న కారు కలెక్టరేట్ ముందు సిద్దిక్ అంజుమ్, సయ్యద్ ఇదాయత్‌ల బైక్‌ను ఢీకొట్టింది. బైక్ కిందపడిపోగా ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. యువతి అక్కడికక్కడే మృతిచెందగా సయ్యద్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అంజుమ్, సయ్యద్ ఇద్దరూ స్నేహితులు, బెంగళూరు నుండి మైసూరుకు బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీలు చేస్తోందని.. భార్య హత్య


భార్యభర్తలు (ఫైల్)

కృష్ణరాజపురం: తనకు చెడ్డపేరు తెస్తోందని కట్టుకున్న భార్యను భర్త హత్య చేసిన సంఘటన నగరంలోని మహాదేవపుర పరిధిలోని వైట్‌ఫీల్డ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సరిత (35)ను భర్త తారానాథ్ హత్య చేశాడు. మంగళూరుకు చెందిన ఈ దంపతులు వైట్‌ఫీల్డ్ పానీపూరి షాపు నిర్వహించేవారు. భార్య స్థానికంగా చిన్న చిన్న చోరీలకు పాల్పడేది. దాంతో అందరూ ఆమెను దొంగ అని ప్రచారం చేయసాగారు. ఈ బాధను తట్టుకోలేక తారానాథ్ భార్యను హత్య చేయడానికి అనేకసార్లు ప్రయత్నం చేశాడు. ఈసారి గొంతుకు తాడు బిగించి చంపేశాడు, తరువాత తాను కూడా ఆత్మహత్యాయత్నం చేయడానికి యత్నించి చివరకు పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. వైట్‌ఫీల్డ్ పోలీసలు పరిశీలించి కేసు నమోదు చేసి అతన్ని అరెస్టు చేశారు.

బస్సును ఢీకొన్న లారీ

దొడ్డబళ్లాపురం: మంగళవారం తెల్లవారుజామున బెంగళూరు–హైదరాబాద్ జాతీయ రహదారిపై టైర్ పేలి అదుపుతప్పిన టిప్పర్ లారీ బీఎంటీసీ బస్సును వెనుకనుంచి ఢీకొంది. ప్రమాదంలో టిప్పర్ ముందు భాగం, బస్సు వెనుకభాగం ధ్వంసమైంది. టిప్పర్, బస్సు డ్రైవర్లకు గాయాలవడంతో ఆస్పత్రికి తరలించారు. తెల్లవారుజాము కావడంతో వాహనాల సంచారం తక్కువగా ఉంది, ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

మంత్రిపై లేఖ.. నిజ నిర్ధారణకు విచారణ

- ఉడుపి వీడియోలపై సీఐడీ దర్యాప్తు
- సీఎం సిద్దరామయ్య వెల్లడి

శివాజీనగర: వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయస్వామిపై వ్యాప్తి చెందిన లేఖ మీద పోలీసులతో దర్యాప్తు చేయిస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. మంగళవారం మాజీ సీఎం దివంగత ఎస్. నిజలింగప్ప వర్ధంతి సందర్భంగా విధానసౌధ ఆవరణలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఆ తరువాత మీడియాతో మాట్లాడిన సీఎం, లేఖ నిజమని మాజీ ముఖ్యమంత్రి హెచ్.డీ.కుమారస్వామి ట్వీట్ చేశారన్నారు. ఆ లేఖను తమ అధికారులు రాయలేదని రామనగర వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అశోక్‌కుమార్ చెప్పారు, దీనిపై పోలీసులచే తనిఖీ చేయిస్తే వాస్తవాలు బయటపడతాయని సూచించానన్నారు. కాగా ప్రతి నెలా ముడుపులు ఇవ్వాలని మంత్రి వ్యవసాయ అధికారులను ఒత్తిడి చేశారని, దీంతో వారు గవర్నర్‌కు లేఖ ద్వారా ఫిర్యాదు చేయగా, గవర్నర్ విచారణకు సీఐడీకు ఆదేశించారని ప్రచారం సాగడం తెలిసిందే. ఈ లేఖతో మంత్రి చెలువరాయ సంకటంలో పడ్డారు.

ఉడుపి కేసు సీఐడీకి

ఉడుపిలో ప్రైవేటు నర్సింగ్ కాలేజీలో విద్యార్థినులను మరో వర్గం అమ్మాయిలు న్యూడ్ వీడియోలు తీశారనే ఆరోపణలపై ఎట్టకేలకు సీఐడీ విచారణకు ఆదేశించారు. డీఎస్పీ స్థాయి అధికారితో దర్యాప్తుకు ఆదేశించినట్లు, కానీ మరింత ఉన్నత స్థాయిలో తనిఖీ చేయాలని సీఐడీకి అప్పగించినట్లు సీఎం చెప్పారు.


KARNATAKA GOVERNOR'S SECRETARIAT

వ్యవసాయ అధికారులు గవర్నర్‌కు రాసినట్లుగా ప్రచారంలో ఉన్న లేఖ ఇదే



కాంట్రాక్టు పనులపై తనిఖీ

నిధులు విడుదల చేయడం లేదని బీబీఎంపీ కాంట్రాక్టర్లు పనులు నిలిపివేసి గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తున్నారని ప్రశ్నకు సమాధానమిస్తూ, పనులు నిలుపలేదు. తనిఖీ కావాలని గవర్నర్‌ను భేటీ చేస్తున్నారు. బీబీఎంపీ, బీడీఏలో జరిగిన పనుల్లో వాస్తవాలు తెలియడానికి విచారణ జరిపిస్తాం, దీనిపై కమిటీ నియమించడమైనదని, పరిశీలన జరుగుతోందన్నారు.

ఆత్మహత్యలే శరణ్యమన్న కాంట్రాక్టర్లు

పూర్తయిన పనుల బిల్లుల సొమ్ము తక్షణమే విడుదల చేయాలని బీబీఎంపీ కాంట్రాక్టర్ల సంఘం నాయకులు సీఎంను కృష్ణాలో కలిసి వన్నివించారు. ఎన్నికలు, కొత్త ప్రభుత్వ ఏర్పాటు ఇలా 8 నెలల నుంచి పెండింగ్ బిల్లులను విడుదల కాలేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఆత్మహత్యలే శరణ్యమని చెప్పారు. నిధులు విడుదలయ్యేలా చూస్తానని సీఎం హామీ ఇచ్చారన్నారు.

తప్పుడు లేఖ అది: మంత్రి



మండ్య: మండ్య జిల్లాలో వ్యవసాయ అధికారుల పేరుతో నకిలీ లేఖను సృష్టించి ఆరోపణలు చేస్తున్నారు, దీనిపై చట్టపరంగా పోరాటం చేస్తానని వ్యవసాయ మంత్రి ఎన్.చలువరాయ స్వామి అన్నారు. లేఖ గురించి ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ఫిర్యాదు చేశానన్నారు. మంగళవారం మండ్యలో ఆయన మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వం రావడం తట్టుకోలేని కొన్ని రాజకీయ శక్తులు పని కట్టుకొని మాపైన ఇలా కుట్రలు చేస్తున్నారు. అందుకే ఇలా తప్పుడు ఆరోపణలతో గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్లు నకిలీ లేఖను సృష్టించారని ఆరోపించారు. తప్పు చేసినవారికి శిక్షపడేలా చేస్తానని అన్నారు.

బెదిరింపులకు లొంగను

- కాంట్రాక్టర్లపై డీసీఎం ధ్వజం

శివాజీనగర: కాంట్రాక్టర్లు తన వద్దకు కూడా వచ్చారని, ఎవరు పనులు చేశారో వారికి బిల్లు చెల్లింపులు జరుగుతాయని, బ్లాక్ మెయిలర్లకు భయపడనని డిప్యూటీ సీఎం డీ.కే.శివకుమార్ అన్నారు. మంగళవారం కుమారకృప అతిథిగృహంలో మాట్లాడిన ఆయన, ఎవరి వెనుక ఎవరు ఉన్నారనేది తెలుసు. వారు ఏమైనా చేయనీ అన్నారు. వారు గవర్నర్‌కి, ప్రధానికి ఫిర్యాదు చేయడం, కుమారస్వామిని కలవడం మామూలే. తాను ఎవరిపై ప్రమాణం చేయాల్సిన పని లేదన్నారు.పనులు చేసింటే బిల్లులు విడుదల చేస్తాం. చేయనివారికి విడుదల కావన్నారు. ఒకే నెలలో ఒక వెయ్యి కోట్ల రూపాయల పనులు అవుతాయా? దానిపై తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. గత ప్రభుత్వంపై వచ్చిన కమీషన్ ఆరోపణల మీద దర్యాప్తు చేపడుతున్నామన్నారు.

వలసదారులపై ఎన్‌ఐఏ దాడులు

శివాజీనగర: బెంగళూరులో అక్రమంగా బంగ్లాదేశీ వలసదారులు మకాం వేశారని తెలిసి మంగళవారం ఎన్‌ఐఏ అధికారులు వివిధ చోట్ల దాడులు నిర్వహించారు. ముగ్గురు బంగ్లా వాసుల్ని అరెస్ట్ చేశారు. బెళ్ళందూరు పరిధిలో ఎక్కువ మంది అక్రమంగా నివసిస్తున్నట్లు తెలిసి సోదాలు నిర్వహించారు. ఖలీల్, అబ్దుల్, మహమ్మద్ జాహిద్ అనేవారిని అరెస్ట్ చేశారు. తరువాత వారిని బెళ్ళందూరు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ విషయమై తనిఖీ జరుగుతోంది. కాగా బెంగళూరులో వేలాదిమంది బంగ్లాదేశీయులు అక్రమంగా ఉన్నట్లు అంచనా.

మరణంలోనూ మానవీయత

- బ్రెయిన్‌డెడ్ అయిన మహిళ అవయవదానం


అవయవాలను తరలిస్తున్న వైద్య సిబ్బంది

యశవంతపుర: ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయిన మహిళ అవయవాదానంతో మానవీయతను చాటుకొంది. చిక్కమగళూరుకు చెందిన కాంగ్రెస్ నాయకుడు రూబెన్ మోసెస్ భార్య సహన (48) శనివారం ఇంటిలో జారిపడడంతో తలకు దెబ్బ తగిలింది. తక్షణం కుటుంబసభ్యులు శివమొగ్గలోని స్పందన ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పగా, బ్రెయిన్ డెడ్ కావటంతో కోలుకోవడం కష్టమని వైద్యులు చెప్పారు. అక్కడి నుంచి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి రెండు రోజుల నుంచి ఐసీయూలో చికిత్స అందించినా మెదడు మినహా ఇతర అవయవాలు మామూలుగానే పని చేస్తున్నాయి. ఆమె బ్రెయిన్‌డెడ్ అయ్యారని, అవయవ దానం చేయడం మంచిదని కుటుంబ సభ్యులకు వైద్యులు సలహానిచ్చారు. వారు సమ్మతించటంతో జీవ సార్థకత సంస్థతో చర్చించి ఆది, సోమవారం అవయవాలను సేకరించారు. కళ్లు, కిడ్నీ, లివర్‌తో పాటు ఐదు అవయవాలను వైద్యులు స్వీకరించారు. జీరో ట్రాఫిక్ ద్వారా బెంగళూరు, మంగళూరులోని ఆస్పత్రులకు తరలించి అవసరమైన రోగులకు అమర్చినట్లు వైద్యులు తెలిపారు.

ఆది నుంచి సేవానిరతి

సహన సేవా కార్యక్రమాలకు ముందుండేవారు, కరోనా సమయంలో రోజూ 70 మందికి ఆమె ఉచిత భోజనం పెట్టారు. ఆమె సేవలను గుర్తించి మంగళూరు సేవాసంస్థలు సన్మానించాయి. స్వస్థలంలో ఆమె భౌతికకాయానికి అంత్యక్రియలు జరిపారు.

ఎమ్మెల్యేలతో సీఎం వరుస భేటీలు

శివాజీనగర: పార్టీ ఎమ్మెల్యేలతో రెండో రోజూ మంగళవారం కూడా సీఎం సిద్దరామయ్య భేటీ అయ్యారు. ఉదయం సీఎం నివాసం కృష్ణాలో రాయచూరు, విజయపుర, కొప్పళ జిల్లాల ఇన్‌చార్జి మంత్రుల, ఎమ్మెల్యేలతో సమావేశం జరిపారు. సోమవారం తుమకూరు, యాదగిరి, చిత్రదుర్గ, బాగలకోట, ధారవాడ జిల్లాల ఎమ్మెల్యేలతో చర్చించారు. మంగళవారం సమావేశంలో పార్టీ, ప్రభుత్వ వ్యతిరేకంగా మీడియా ముందు అధికారిక వ్యాఖ్యలు చేయరాదని, నియోజకవర్గ నిధులతో పాటు ఇతర డిమాండ్లను పరిష్కరిస్తామని ఎమ్మెల్యేలకు భరోసా ఇచ్చారు. ఇంతకు ముందు బదిలీల విషయానికి సంబంధించి ఎమ్మెల్యేలు బహిరంగంగానే అసంతృప్తిని వ్యక్తం చేసిన విషయం తెల్సిందే. ఈ విషయంపై సీఎల్పీ సమావేశంలో కూడా ముఖ్యమంత్రి చర్చ జరిపి, అసంతృప్తిని పక్కకుపెట్టి లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలుపొందేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కల్యాణ కర్ణాటక ఎమ్మెల్యేలు చేసిన విన్నపానికి స్పందించిన ముఖ్యమంత్రి అధిక నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

పంటకు తెగుళ్లు.. రైతన్న ఆత్మహత్య

మైసూరు: సాగు చేసిన పంట తెగుళ్ల బారిన పడటంతో తీవ్రంగా నష్టపోయిన రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మైసూరు జిల్లా పిరియా పట్టణ తాలూకా హుణసెకొప్పల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మంజెగౌడ ఆత్మహత్య చేసుకున్న రైతు. మంజేగౌడ పొలంలో పొగాకు, రాగి పంటను సాగు చేశాడు. బ్యాంకులో రూ. 6 లక్షల వరకు అప్పు తీసుకున్నాడు. ఇదిలా ఉంటే సాగు చేసిన పంట రోగాల బారిన పడటంతో అప్పు ఎలా తీర్చాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

గ్యారంటీ పథకాలు పేదలకు వరాలు


మాట్లాడుతున్న ప్రకాశ్ రాజ్

శివమొగ్గ: అధికార కాంగ్రెస్ అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలు పేదల పాలిట వరాలని బహుభాషా నటుడు ప్రకాశ్ రాజ్ అన్నారు. మంగళవారం శివమొగ్గ నగరానికి వచ్చిన ఆయన ఓ హోటల్లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాలు పేదల సంక్షేమం కోసం పని చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కృషి చేస్తోందని అన్నారు. ప్రధానంగా ఈ పథకాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అర్హులకు చేరినప్పుడు వాటికి సార్థకత అన్నారు.

అసెంబ్లీలో సజావుగా చర్చలు సాగాలి

- స్పీకర్ యూటీ ఖాదర్



మీట్ ది ప్రెస్‌లో మాట్లాడుతున్న సభాపతి ఖాదర్

శివాజీనగర: తాను ఎంత మిత్రుడైనప్పటికీ ప్రతిపక్షాలు నన్ను అనుమానిస్తున్నాయని విధానసభ స్పీకర్ యూటీ ఖాదర్ అన్నారు. మంగళవారం నగరంలో బెంగళూరు ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్‌లో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతం కావాలంటే శాసనసభా కార్యకలాపాలు సక్రమంగా జరగాలి. అలా జరిగినపుడే ఉత్తమ చట్టాలు అమల్లోకి తీసుకురావచ్చు. అసెంబ్లీ సజావుగా నడిచేందుకు ప్రతిపక్ష పార్టీల సహకారం ముఖ్యం. ఈ దిశలో స్పీకర్ పాత్ర కూడా అతి ప్రాముఖ్యమైనదని అన్నారు.

ఎమ్మెల్యేల సస్పెన్షన్ గురించి స్పందిస్తూ రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రవర్తించినపుడు స్పీకర్‌గా కఠినంగా ఉండాలన్నారు. ఎంత స్నేహంగా ఉన్నప్పటికీ ప్రతిపక్షాలు నన్ను సందేహిస్తున్నాయని వాపోయారు. తాను మాట్లాడే కన్నడంపై కొందరు కొందరు సామాజిక మాధ్యమాల్లో విమర్శించడాన్ని ప్రస్తావిస్తూ, ఉన్నత స్థానానికి వెళ్లే కొద్దీ విమర్శలు పెరుగుతాయి, తాను బయట తుళు భాషలోనే మాట్లాడుతుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్, ప్రధానకార్యదర్శి బీ.పీ.మల్లప్పతో పాటు ప్రముఖులు పాల్గొన్నారు.

తనిఖీ చేస్తుండగా

టపాసుల పేలుళ్లు

- ఆర్డీఓ, తహసీల్దార్‌కు గాయాలు
- క్రిష్ణగిరి జిల్లాలో మరో దుర్ఘటన


సంఘటనాస్థలిలో ఫైరింజన్, సిబ్బంది


ఆస్పత్రిలో ఆర్‌డీఓ బాలాజీని పరామర్శిస్తున్న కలెక్టర్ తదితరులు

కెలమంగలం: గతవారం రోజుల క్రితం జిల్లా కేంద్రం క్రిష్ణగిరి పట్టణంలోని టపాకాయల గోదాము పేలి 9 మంది మరణించగా, 20 మంది గాయపడిన దుర్ఘటన మరువకముందే అటువంటిదే మరో ప్రమాదం జరిగింది. మంగళవారం హోసూరు పరిధిలో డెంకణీకోట తాలూకా జే.కారుపల్లి పంచాయతీ వెంకటాపురం – అడవిస్వామీపురం మార్గంలో పురుషోత్తమన్ టపాసుల కర్మాగారంలో పేలుడు జరిగి ఇద్దరు ఉన్నతాధికారులు గాయపడ్డారు.


తీవ్రంగా గాయపడిన టపాసుల కర్మాగారం మేనేజర్ సీమాన్

టపాసుల పెట్టెలు కిందపడదంతో

వివరాలు.. ప్రభుత్వ ఆదేశాలతో టపాసుల గోదాములు, దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలను నిర్వహిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో ఆర్డీవో బాలాజీ, తహసీల్దార్ ముత్తుపాండ్యన్, డెంకణీకోట తహసీల్దార్ శరవణమూర్తి తదితర ప్రత్యేక బృందం అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఆర్డీఓ ఒక గదిలో పరిశీలిస్తుండగా టపాసుల పెట్టెలు కింద పడడంతో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో కర్మాగారం మేనేజర్ సీమాన్ (22), ఆర్డీఓ బాలాజీ (51) కి తీవ్ర గాయాలేర్పడగా తహసీల్దార్ ముత్తుపాండ్యన్ స్వల్పంగా గాయపడ్డారు.

వెంటనే డెంకణీకోట, కెలమంగలం పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఆర్‌డీఓ బాలాజీని మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. జిల్లా ఎస్పీ సరోజ్‌కుమార్ ఠాగూర్, కలెక్టర్ శరయు, హోసూరు సబ్‌కలెక్టర్ శరణ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అధికారులను పరామర్శించారు. తళి ఎమ్మెల్యే రామచంద్రన్, యూనియన్ చైర్మన్ కేశవమూర్తి తదితరులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. జిల్లాలో వరుసగా టపాసుల విస్ఫోటాలు జరగడంపై ప్రజల్లో ఆందోళన నెలకొంది.

నేడు స్పందన భౌతికకాయం తరలింపు?



యశవంతపుర: బ్యాంకాక్‌లో గుండెపోటుతో మృతి చెందిన నటుడు విజయ్ రాఘవేంద్ర భార్య స్పందన అంత్యక్రియలు బుధవారం సాయంత్రం జరిగే అవకాశాలున్నాయి. స్పందన తండ్రి బీకే శివరామ్‌కు ఫాంహౌస్‌లో నిర్వహించాలని కుటుంబసభ్యులు భావిస్తున్నారు. బెంగళూరు మల్లేశ్వరంలోని బీకే శివరామ్ నివాసంలో ప్రజల సందర్శనార్థం ఆమె భౌతికకాయాన్ని ఉంచి అంత్యక్రియలకు తరలిస్తారు. స్పందన మృతదేహానికి బ్యాంకాక్‌లో పోస్టుమార్టం ఆలస్యం, ఇతర న్యాయ ప్రక్రియల వల్ల ఇంకా బెంగళూరుకు తీసుకురాలేదని కుటుంబసభ్యులు తెలిపారు. బ్యాంకాక్‌లో బుధవారం ఒంటిగంటకు మృతదేహాన్ని అప్పగించే అవకాశముంది. అక్కడి నుంచి కుటుంబసభ్యులు బెంగళూరుకు ప్రత్యేక విమానంలో తీసుకురానున్నారు. స్పందన, విజయ్‌రాఘవేంద్ర కుటుంబాలు బ్యాంకాక్‌లో ఉన్నాయి. స్పందన మృతిపై సినీ ప్రముఖులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.


కాలిపోతున్న ఎలెక్ట్రిక్ స్కూటర్

బ్యాటరీ స్కూటర్ ఆహుతి


కడ్డీలు మాత్రం మిగిలిన దృశ్యం

కోలారు: పెట్రోల్, ఇంజినాయిల్ ఖర్చు ఉండదు కదా.. అని ఎంతో ఆశగా తెచ్చుకున్న ఎలెక్ట్రిక్ స్కూటర్ మూణ్ణాళ్ల ముచ్చటగా మిగిలిపోయింది. అది మంటల్లో కాలిపోయింది. కోలారు నగరంలోని ధర్మరాయ నగరలో మంగళవారం చోటు చేసుకుంది. చిరువ్యాపారి హరీష్ ఇటీవలే బ్యాటరీ స్కూటర్‌ను కొనుగోలు చేశాడు. పని మీద వెళ్తుండగా అది మొరాయించింది. రోడ్డుపై నిలిపి స్కూటర్‌ను పరిశీలిస్తుండగా పొగలు వచ్చాయి. హరీష్ బ్యాటరీని బయటకు తీస్తుండగా దాంట్లో నుంచి భారీగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే స్కూటర్ మొత్తం నిమిషాల్లో బుగ్గి అయిపోయింది. కొన్ని కడ్డీలు మాత్రం మిగిలాయి. ఈ సంఘటనతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు.

క్లుప్తంగా

ఆ నిధులను మళ్లించొద్దు


వినతిపత్రం సమర్పిస్తున్న నేతలు

రాయచూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన గ్యారంటీ పథకాలకు బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రూ.11 వేల కోట్లను మళ్లించరాదని అంబేడ్కర్ దళిత సేనా సమితి అధ్యక్షుడు భరత్ నాయక్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో మాట్లాడారు. దీన దళితులు, దేవదాసిల సంక్షేమం కోసం ప్రభుత్వం 2023–24 బడ్జెట్‌లో ఎస్సీలకు రూ.7,750 కోట్లు, ఎస్టీలకు రూ.3,430 కోట్లను కేటాయించిందన్నారు. వాటిని గృహలక్ష్మి, గృహజ్యోతి, శక్తి, అన్నభాగ్య, యువనిధి పథకాలకు వాడుకోరాదన్నారు. ఎస్సీ, ఎస్టీ పథకాలకు కేటాయించిన నిధులను వారికే వినియోగించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

రిజర్వేషన్ల కోసం ధర్నా


ఆందోళన చేస్తున్న దళిత నేతలు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో ఎస్సీలకు రిజర్వేషన్లు కేటాయించాలని సాంఘీక న్యాయ పోరాట సమితి అధ్యక్షుడు మారెప్ప డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఎస్సీలకు 15 నుంచి 17కు, ఎస్టీలకు 3 నుంచి 7 శాతానికి పెంచడాన్ని ఖండించారు. గతంలో ఉన్న పద్ధతిని అమలు చేసి రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

వేతన బకాయిలు చెల్లించరూ


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరసభలో కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న పౌర కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని జిల్లా కాంగ్రెస్ కార్మిక విభాగం డిమాండ్ చేసింది. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి అధ్యక్షుడు ఉరుకుందప్ప మాట్లాడారు. నగరంలో చాలా ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం వేతనాలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసినా అధికారులు ఇంకా ఇవ్వలేదన్నారు. కార్మికులకు వారం రోజుల్లో కనీస వేతనాలు అందచేసి వారిని పర్మినెంట్ చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం అందించారు.

ఎంసీహెచ్ ఆస్పత్రి ప్రారంభించండి


మంత్రితో మాట్లాడుతున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలో తల్లీబిడ్డల ఆస్పత్రి(ఎంసీహెచ్)ని ప్రారంభించాలని కరవే అధ్యక్షుడు వినోద్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వీవీపీ భవనంలో ఆరోగ్య శాఖ మంత్రి దినేష్ గుండూరావుకు ఆయన వినతి పత్రం సమర్పించి మాట్లాడారు. ఆరు నెలల క్రితం ప్రారంభించిన 60 పడకల ఆస్పత్రిలో రూ.15 కోట్లతో విధుల నిర్వహణకు వైద్యులు, సిబ్బంది, అధికారులు, ఉద్యోగుల నియమకం చేపట్టాలని కోరారు.

ఘనంగా గురూజీ జన్మదిన వేడుకలు


జన్మదిన వేడుకల్లో పాల్గొన్న భక్తులు

గంగావతి రూరల్: తాలూకాలోని ఆనెగుంది మేగోటె ఆదిశక్తి దుర్గామాత ఆలయంలో ఉదయం నుంచి పలు పూజలతో పాటు నవచండీ హోమం, అనంతరం దాసోహ రత్న బ్రహ్మానంద గురూజీ 51వ జన్మదినాన్ని పురస్కరించుకొని గోశాల గోపాల సేవకుల నేతృత్వంలో గురూజీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వేలాది మంది భక్తులు పాల్గొని గురూజీ ఆశీర్వాదం పొందారు. ఆనెగుంది రాజమాత లలితారాణి శ్రీరంగదేవరాయలు, ఆలయ మేనేజర్ రాజణ్ణ స్వామి, జైన్ సమాజ ప్రముఖులు, శ్రీరామనగర్ కాంట్రాక్టర్ హరిబాబు, బసాపట్న జీపీ సభ్యులు శంకర్ నాయక్‌లతో పాటు భక్తులు పాల్గొన్నారు.

చౌకడిపోల్లో బియ్యం, జొన్నలతోనే సరి

- నిలిచిన సబ్సిడీ వంటనూనె, కందిబేడలు, చక్కెర, గోధుమల పంపిణీ
- సక్రమంగా అందించాలని ప్రజల వేడుకోలు


రేషన్ షాపుల్లో పంపిణీ చేస్తున్న బియ్యం


చౌకడిపోల్లో అందజేస్తున్న జొన్నలు

సాక్షి,బళ్లారి: బహిరంగ మార్కెట్‌లో రోజు రోజుకు ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలు ఒకవైపు, కూరగాయాల ధరలతో మరో వైపు సామాన్య, మధ్యతరగతి ప్రజలు జీవనం సాగించడం కష్టతరం అవుతున్న నేటి రోజుల్లో రేషన్ షాపుల్లోనైనా సబ్సిడీతో అందిస్తారని ఆశిస్తే అక్కడ కూడా గత మూడేళ్లుగా కేవలం బియ్యం, జొన్నలను మాత్రమే పంపిణీ చేస్తూ ప్రభుత్వం చేతులు దులుపుకుంటోంది. జిల్లాలో దాదాపు 3.50 లక్షల రేషన్ కార్డులున్నాయి. ప్రతి నెల చౌకధాన్యం డిపోల్లో బియ్యం, జొన్నలతోనే సరిపెడుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రేషన్ షాపుల్లో బియ్యంతో పాటు సబ్సిడీ వంటనూనె ప్యాకెట్, చక్కెర, కందిబేడలు తదితర గృహావసరమైన సరుకులను పంపిణీ చేసేవారు.

తీవ్ర ఇబ్బందుల్లో పేదలు

ప్రస్తుతం కేవలం బియ్యం, జొన్నలను మాత్రమే పంపిణీ చేస్తూ మిగిలిన వాటిని నిలిపివేయడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్క బళ్లారి జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ షాపుల్లో ఇదే విధంగా పంపిణీ చేస్తున్నారని సంబంధిత అధికారి తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదు గ్యారంటీల్లో ఒకటైన 10 కేజీల బియ్యం పంపిణీలో భాగంగా ఇప్పటికే ఐదు కేజీల చొప్పున సంబంధిత రేషన్ కార్డు దారులకు వారి వారి ఖాతాల్లో నగదు జమ చేస్తోంది. ఎన్నికల ప్రణాళికలో చెప్పిన వాటిని అమలు చేయడంపై ప్రధానంగా దృష్టి పెట్టిన కాంగ్రెస్ సర్కార్ రేషన్ షాపుల్లో పేదలకు సబ్సిడీతో అందజేసే వాటిపైన పునరాలోచన చేసి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు మహిళలు పేర్కొంటున్నారు.

కందిబేడల పంపిణీకి డిమాండ్

కంది బేడల ధర బహిరంగ మార్కెట్‌లో రూ.160లకు పైగా పలుకుతుండటంతో జొన్నలకు బదులకు ఒక్కో నెల కంది బేడలు పంపిణీ చేస్తే మేలు అని రేషన్‌కార్డు లబ్ధిదారులు పేర్కొంటున్నారు. గ్యారంటీల్లో ఒకటైన 10 కేజీల బియ్యం పంపిణీ చేసేందుకు వీలు కాకపోవడంతో ఐదు కేజీలకు సంబంధించి నగదు వారి ఖాతాల్లో వేసే బదులుగా సబ్సిడీతో కంది బేడలు, వంటనూనె, చక్కెర, గోధుమలు తదితరాలను పంపిణీ చేస్తే పేదలకు కడుపు నింపుకునేందుకు వీలవుతుందన్నారు. ఈనేపథ్యంలో మూడేళ్లకు పైగా అటకెక్కిన సబ్సిడీతో అందజేసే నిత్యావసర సరుకులను రేషన్ షాపుల్లో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు.

జిల్లా అభివృద్ధిపై సీఎంతో చర్చ


మాట్లాడుతున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

రాయచూరు రూరల్: జిల్లా అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో జిల్లా ప్రజాప్రతినిధులు చర్చించారు. మంగళవారం విధానసౌధలో రాయచూరు, విజయపుర, బీదర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో మాట్లాడారు. జిల్లా అభివృద్ధిపై వైద్య విద్యా శాఖా మంత్రి శరణు ప్రకాష్ పాటిల్, చిన్న నీటిపారుదల, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖా మంత్రి బోసురాజు, ఎమ్మెల్యేలు బసనగౌడ దద్దల్, టి.బసనగౌడ, హంపనగౌడ బాదర్లి, హంపయ్య నాయక్, ఎమ్మెల్సీ శరణేగౌడ బయ్యాపూర్‌లతో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం రాయచూరుకు ఎయిమ్స్‌ను కేటాయించాలని కోరుతూ కేంద్రానికి సిఫార్సు లేఖ రాశామని, ఎయిమ్స్‌ను మంజూరు చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. నగరంలో జిల్లా ఆస్పత్రి, ఒపెక్ ఆస్పత్రుల ప్రారంభం, వంతెనలు, రహదార్లు, తాగు, సాగునీటి అంశాలపై చర్చించారు.

క్విజ్ పోటీలతో విద్యార్థులకు జ్ఞాన వృద్ధి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

బళ్లారి రూరల్: క్విజ్ పోటీలతో వైద్య విద్యార్థులకు పరిజ్ఞానం పెంపొందుతుందని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ గంగాధరగౌడ తెలిపారు. సోమవారం విమ్స్ వైద్యభవన్‌లో వైద్యవిద్యార్థులకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. విమ్స్ పీడియాట్రిక్స్ విభాగం అనేక ప్రాయోజిత కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ దుర్గప్ప మాట్లాడుతూ 60 శాతం మంది పిల్లలు అపోష్టికతతో బాధపడుతున్నారన్నారు. విమ్స్‌లోని ఎన్ఐసీయూ 50 రోజుల పాటు పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించి ఆరోగ్యవంతమైన పిల్లలుగా మారుస్తూ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. విమ్స్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ కృష్ణస్వామి, సూపరింటెండెంట్ డాక్టర్ ఖాసాసోమశేఖర్ క్విజ్ పోటీల లబ్ధిని వివరించారు. ఐఏపీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీకాంత్, ఆర్ఎంఓ డాక్టర్ రవిభీమప్ప, డాక్టర్ వాణి, వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.

ఇలకల్ చేనేత కళాకారిణికి అవార్డు ప్రదానం


జాతీయ అవార్డు అందుకుంటున్న పద్మా విఠల్

రాయచూరు రూరల్: అంతర్జాతీయ స్థాయిలో చేనేత చీరలకు ఇలకల్ పేరు పొందిన నగరమని రాష్ట్ర జవుళి, చక్కెర శాఖా మంత్రి శివానంద పాటిల్ పేర్కొన్నారు. సోమవారం బెంగళూరులో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి చేనేతకారుల 9వ అంతర్జాతీయ చేనేత మగ్గాల దినోత్సవంలో ఆయన ప్రసంగించారు. చేనేతకారులకు రూ.5 వేల మేరకు గౌరవధనాన్ని పెంచామన్నారు. చేనేత మగ్గాలకు 10 హెచ్‌పీ వరకు విద్యుత్ సబ్సిడీ ఇవ్వడంపై సీఎంతో చర్చిస్తామన్నారు. పట్టు చీరల విభాగంలో పావగడ జయకీర్తి, చింతామణి మంజునాథ, పత్తి నూలు విభాగంలో ఇలకల్ పద్మా విఠల్, కిన్నిగోల్ సంజీవ్ శెటగార్, ఉన్ని విభాగంలో మొళకాల్మూర్ తిప్పేస్వామి, ఇతర దుస్తులు నేయడంలో సాతనూరు బాలాజీ అవార్డులు అందుకున్నారు. ఈసందర్భంగా చిత్రదుర్గ బసవమఠం హన్మంతరాయ స్వామీజీ, చేనేత కారుల మహా మండలి అధ్యక్షుడు డి.జె.గణేష్, ఎండీ లింగరాజ్, కార్యదర్శి రిచర్డ్ విన్సెంట్ డిసౌజా, కమిషనర్ కుమార్, డి.డి.సాచిముత్తు, కాసియా అధ్యక్షుడు శశిధర్ శెట్టిలున్నారు.

మండ్యలో కాంగ్రెస్ ధర్నా



మండ్య: వ్యవసాయ అధికారుల పేరుతో మంత్రి చెలువరాయ స్వామిపై రాష్ట్ర గవర్నర్‌కు చేసిన ఫిర్యాదు వెనుక జేడీఎస్, బీజేపీ హస్తం ఉందని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం మండ్య నగరంలో ధర్నా నిర్వహించారు. ఉదయం నగరంలోని జయచామరాజేంద్ర ఒడెయార్ సర్కిల్‌కు చేరుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మంత్రి అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ధర్నా చేశారు. అనంతరం ఎస్పీ కార్యాలయం చేరుకుని ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. మండ్య ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ...గతంలో మండ్య నియోజకవర్గంలో జేడీఎస్ ఏడు స్థానాల్లో గెలిచిందని, తాజాగా వాటిని కాంగ్రెస్ పార్టీ గెలుచుకోవడంతో జేడీఎస్ జీర్ణించుకోలేకపోతోందన్నారు. దీంతో తప్పుడు లేఖలు రాసి ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావడానికి యత్నిస్తున్నారని మండిపడ్డారు.

బ్యాంకు మేనేజర్ రూ.కోటి స్వాహా

- బినామీ ఖాతాలకు నగదు మళ్లింపు
- జీఎం ఫిర్యాదుతో కేసు నమోదు

రాయదుర్గం: అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బ్రాంచులో రూ.కోటి నగదు మాయమైంది. ఈ విషయం రెండు నెలల తర్వాత ఆలస్యంగా బయటకు పొక్కింది. మంగళవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. రాయదుర్గం అర్బన్ సీఐ లక్ష్మన్న తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గతంలో ఇక్కడ మేనేజర్‌గా ఎస్ఎల్ఎన్ ఫణికుమార్ పనిచేశారు. ఆయన తన తల్లితో పాటు ఇతరుల ఖాతాలకు రూ.1,00,07,323 నగదును మళ్లించి స్వాహాకు యత్నించారు. దీన్ని ఉన్నతాధికారులు గుర్తించి తనిఖీలు నిర్వహించారు. నగదు ఇతరుల ఖాతాలకు అక్రమంగా మళ్లించినట్లు నిర్ధారించుకున్నారు. ఈ ఏడాది జూన్ 21న ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకటేశ్వరరావు స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మేనేజర్‌పై 409, 420, 468, 471, 477–ఏ ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా.. ఈ విషయం బయటకు పొక్కకుండా ఎస్‌బీఐ సిబ్బంది, పోలీసులు ఇన్నాళ్లూ జాగ్రత్తపడ్డారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఎట్టకేలకు బహిర్గతమైంది. బ్యాంకు అధికారులు నగదు రికవరీ చేయడంతో పాటు మేనేజరును విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు తెలిసింది.

భర్త పెడదారి.. భార్య ఆత్మహత్య

మైసూరు: భర్త పరాయి మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్న విషయం తెలుసుకున్న యువతి ఆవేదనతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లాలోని టి. నరిసిపుర తాలూకాలోని హనుమనహాళు గ్రామంలో జరిగింది. మృతురాలు మనురాణి (24). మనురాణి భర్త మంజు అదే గ్రామానికి చెందిన వివాహితతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడు. దీనిపై మనురాణి అనేకసార్లు భర్తను మందలించి గొడవ పెట్టుకుంది. పెద్దలు కూడా అతనికి నచ్చజెప్పినా బుద్ధి మారలేదు. దీంతో విరక్తి చెందిన మనురాణి మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆమె తల్లిదండ్రులు బన్నూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అల్లుడే విషం తాగించి తమ బిడ్డను హత్య చేశారని ఆరోపించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌డీ.దేవెగౌడకు వెన్నునొప్పి

శివాజీనగర: మాజీ ప్రధాని హెచ్.డీ.దేవెగౌడకు వెన్నునొప్పితో బాధపడుతున్నారు. దీంతో ఆయన రాజ్యసభ కార్యకలాపాలకు గైర్హాజరయ్యారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదలైంది. ప్రస్తుతం ఆయన ఇంటిలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు.

ఘనంగా దసరా వేడుకలు: మేయర్

మైసూరు: ఈ యేడాది మైసూరు దసరా మహోత్సవాల నిర్వహణ కోసం రూ. 26 కోట్లు అవసరమని సర్కారుకు నివేదిక ఇచ్చినట్లు, ఈసారి ప్రత్యేకంగా మహా నగర పాలికెకు నిధులు ఇచ్చే అవకాశముందని నగర మేయర్ శివకుమార్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సిద్దరామయ్య జరిపిన భేటీలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారన్నారు.

కంప్లిలో జిల్లాధికారి పర్యటన


వంద పడకల ఆస్పత్రిని పరిశీలిస్తున్న దృశ్యం

కంప్లి: బళ్లారి జిల్లాధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రశాంత్ కుమార్ మిశ్రా మంగళవారం తొలిసారిగా పట్టణంలో పర్యటించారు. నిర్మాణంలో ఉన్న మినీ విధానసౌధ, వంద పడకల ఆస్పత్రి, సోమప్ప చెరువు పనులను పరిశీలించారు. వారి వెంట ఉపతహసీల్దార్, పీడబ్ల్యూడీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఈ ఏడాది నుంచి కిష్కింధ వర్సిటీ ప్రారంభం


మాట్లాడుతున్న డాక్టర్ యశ్వంత్ భూపాల్, పక్కన డాక్టర్ వెంకట మహిపాల్ తదితరులు

బళ్లారిటౌన్: తుంగభద్ర ఎడ్యుకేషనల్ హెల్త్ అండ్ రూరల్ డెవలమెంట్ ట్రస్ట్(టీఈహెచ్ఆర్‌డీటీ) ఆధ్వర్యంలో నగరంలో బసవరాజేశ్వరి గ్రూప్ విద్యా సంస్థల పరిధిలో ఈ ఏడాది (2023–24వ విద్యా సంవత్సరం) నుంచి కిష్కింధ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌జే.వెంకట మహిపాల్ తెలిపారు. మంగళవారం బీబీసీ కళాశాల కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమకు ప్రభుత్వం నుంచి ఈమేరకు అనుమతి లభించిందన్నారు. ఈ విశ్వవిద్యాలయానికి డాక్టర్ యశ్వంత్ భూపాల్ వైస్ చాన్సలర్(వీసీ)గా నియమితులయ్యారన్నారు. కళ్యాణ కర్ణాటకలో తమ విద్యా సంస్థలు బళ్లారి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(బీఐటీఎం), సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్, ఐటీఐ, బీపీఎస్‌సీ స్కూల్, బీపీఎస్‌సీ పీయూ కాలేజ్, బళ్లారి బిజినెస్ కాలేజ్(బీబీసీ)లను నడుపుతున్న తమ అనుభవాన్ని పరిగణలోకి తీసుకుని కిష్కింధ విశ్వవిద్యాలయ స్థాపనకు ప్రభుత్వం అనుమతించిందన్నారు.

సింధిగేరి వద్ద యూనివర్సిటీ క్యాంపస్

విశ్వవిద్యాలయం కోసం సిరుగుప్ప రోడ్డులోని సింధిగేరి గ్రామం వద్ద 50 ఎకరాల్లో యూనివర్సిటీ క్యాంపస్‌ను స్థాపిస్తున్నట్లు తెలిపారు. కోట్లాది రూపాయల వ్యయంతో రెండేళ్లలో భవన నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. అంతవరకు తమకు ఉన్న కళాశాలలోనే కిష్కింధ యూనివర్సిటీ క్లాసులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నుంచి బీటెక్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, బీసీఏ డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ కోర్సులకు ఆమోదం లభించిందన్నారు. కర్ణాటక సీఈటీ ద్వారా సీట్లు పొందేందుకు సీఈటీ కౌన్సిలింగ్ కోడ్ ఈ 301 కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో పెసెట్ దయానంద సాగర్, గీతం, ఆర్‌వీ, రేవా, కేఎల్ఈ, జేఎస్ఎస్ లాంటి 25 ప్రైవేట్ యూనివర్సిటీలు పని చేస్తున్నాయన్నారు. ఇందులో తమ యూనివర్సిటీకి అనుమతి లభించడం వల్ల కళ్యాణ కర్ణాటకలో పేద, సామాన్య విద్యార్థులకు ఎంతో ఉపయోగపడనుందన్నారు. ఈసందర్భంగా యశ్వంతభూపాల్, పృథ్వీరాజ్, వీజీ భరత్, అమరరాజ్ భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లాలో మంత్రి పర్యటన

హొసపేటె: విజయనగర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అమీర్ అహ్మద్ ఖాన్ బుధవారం నగరంలో వివిధ అభివృద్ధి పనులను పరిశీలించనున్నారు. జిల్లా కేంద్రం హొసపేటెలో ఉదయం తాలూకా కార్యాలయం ఆవరణలో నిర్మించిన నూతన కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఆయన పాపినాయకనహళ్లిలో సాగునీటి పనులను పరిశీలిస్తారు. ఒంటిగంటకు నగరంలో నిర్మాణంలో ఉన్న జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి పనులను పరిశీలించనున్నారు. మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు జిల్లాధికారి కార్యాలయంలో ప్రగతిపై సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. ఈ నెల 15 వరకు జిల్లాలో ఆయన పర్యటించనున్నారు.

అప్పు చెల్లించమన్నందుకు హత్య

యశవంతపుర: ఇచ్చిన డబ్బులు అడిగినందుకు ద్వేషం పెంచుకొని హత్య చేసిన ఘటన దావణగెరె పట్టణంలో ఆదివారం రాత్రి జరిగింది. శివయోగేశ్‌ను నరసింహ అనే వ్యక్తి హత్య చేశాడు. శివయోగేశ్ తాపీ మేస్త్రిగా పని చేస్తున్నాడు. దావణగెరె తాలూకా మల్లశెట్టిహళ్లికి చెందిన నరసింహ ఇతనికి మిత్రుడు, ఒకసారి డబ్బులు చాలా అవసరమని కొంత మొత్తం అప్పు తీసుకున్నాడు. డబ్బులు తిరిగి ఇవ్వాలని శివయోగేశ్ అడుగుతున్నాడు. మల్లశెట్టిహళ్లి క్రాస్ వద్ద ఇదే విషయమై నరసింహ గొడవకు దిగి శివయోగేశ్‌ను కొడవలితో నరికి చంపాడు. దావణగెరె గ్రామాంతర పోలీసులు నిందితున్ని అరెస్టు చేశారు.

పచ్చదనమే ఊపిరి


మొక్కలను అందిస్తున్న ఉమేష్

కంప్లి: పచ్చదనమే ఊపిరి అనే నానుడికి తగినట్లుగా శాఖ తరపున నిరంతరం శ్రమించి అడవులను రక్షించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వలయ అటవీ అధికారి ఉమేష్ తెలిపారు. సబ్సిడీ ధరతో మొక్కలు అమ్మి అటవీ సంపద రక్షణకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి వార్డు, వీధి, ఇళ్ల ముందు మొక్కలు నాటడం వల్ల తమ ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందన్నారు. తక్కువ ధరకు మొక్కలు విక్రయిస్తున్నందున పర్యావరణ ప్రేమికులు ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహించాలన్నారు. అటవీ శాఖ అధికారి గిరీష్, సిబ్బంది పాల్గొన్నారు.


కోలారు వార్తలు...

క్రీడా పోటీల్లో విద్యార్థుల సత్తా


తాలూకా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కోలారు: తాలూకాలోని వక్కలేరి ఫిర్కా స్థాయి క్రీడా పోటీల్లో అరాభికొత్తనూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రదర్శననిచ్చారు. కబడ్డీలో ప్రథమ స్థానంతో పాటు అథ్లెటిక్స్ 10 విభాగాల్లో ఉత్తమ ప్రదర్శనతో విద్యార్థులు తాలూకా స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. విజేత విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీఎస్ ప్రదీప్‌కుమార్, సిబ్బంది అభినందించి మాట్లాడుతూ విద్యార్థులు తాలూకా స్థాయి పోటీల్లో కూడా మెరుగైన ప్రదర్శనతో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక వ్వాలని ఆకాంక్షించారు.

సీఎన్‌జీ గ్యాస్ బంక్ ప్రారంభం


సీఎన్‌జీ గ్యాస్ బంక్‌ను ప్రారంభించిన దృశ్యం

శ్రీనివాసపురం: పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరిగినందున వినియోగదారులు సీఎన్‌జీ గ్యాస్‌ను వాడి డబ్బును ఆదా చేసుకోవాలని ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి తెలిపారు. మంగళవారం సీఎన్‌జీ గ్యాస్ బంక్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. భవిష్యత్‌లో ఇంధనం ధరలు మరింత పెరగపేన్నందున వాహనదారులు ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ఉపయోగించాలన్నారు. బంక్ మేనేజర్ వెంకటేష్ మాట్లాడుతూ కోలారు జిల్లాలో 6 సీఎన్‌జీ బంక్‌లకు గాను పట్టణంలో మొట్టమొదటి సీఎన్‌జీ బంక్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఒక కిలో గ్యాస్ ధర రూ.80 ఉందని, దీనితో 50 కిమీల వరకు ప్రయాణించవచ్చన్నారు. పురసభ ఉపాధ్యక్షురాలు అయేషా నయాజ్, సభ్యుడు ఎజాజ్ బాషా, జెడ్పీ మాజీ సభ్యుడు తూపల్లి నారాయణస్వామి పాల్గొన్నారు.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనకు వినతి


వినతిపత్రం సమర్పిస్తున్న క్రిస్టియన్ సమాఖ్య కార్యకర్తలు

కేజీఎఫ్: మణిపూర్‌లో అల్లర్లను ఖండిస్తూ క్రిస్టియన్ సమాఖ్య కార్యకర్తలు మంగళవారం నగరసభ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షుడు వేలంగణిపాల్ మాట్లాడుతూ ఆ రాష్ట్రంలో హింసను అరికట్టడంలో అక్కడి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అక్కడ హింస ఇంకా చల్లారకపోవడం ఆ ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తిచూపుతోందన్నారు. ఈనేపథ్యంలో రాష్ట్రపతి జోక్యం చేసుకుని మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి అక్కడ రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో వివిధ చర్చిలకు చెందిన ఫాదర్లు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితునికి 20 ఏళ్ల జైలు

కోలారు: పోక్సో చట్టం కింద నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.70 వేల జరిమానా విధిస్తూ జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి బి.పి.దేవమానె తీర్పును వెలువరించారు. తాలూకాలోని గొల్లగురుపేనహళ్లికి చెందిన ఎస్.ప్రవీణ్ అనే వ్యక్తి మైనర్ బాలికను అపహరించుకుని వెళ్లి అత్యాచారం చేసినట్లు బేతమంగల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ సమర్పించారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా శిక్షను విధిస్తూ తీర్పునిచ్చారు. బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం అందించాలని తీర్పులో సూచించారు. అలాగే ప్రవీణ్‌కు సహకరించిన మంజునాథ్ అనే మరో నిందితుడికి కూడా 4 ఏళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధించారు.

అధ్వాన స్థితిలో రహదారి

- వాహనదారులకు దుమ్ము, ధూళి స్వాగతం
- మూడు నెలలుగా నరకం అనుభవిస్తున్న ప్రజలు


దుమ్ము, ధూళి మధ్య వెళుతున్న వాహనాలు

కేజీఎఫ్: నగరంలోని ఉరిగాం పేట నివాసులు గత మూడు నెలల కాలంగా దుమ్ము, ధూళి మధ్యనే జీవించాల్సి వస్తోంది. ఈ ప్రాంతంలో రహదారి అధ్వాన స్థితిలో ఉండి పాదచారులు, ద్విచక్రవాహనాల్లో వెళ్లే వారికి దుమ్ము, ధూళి అభిషేకం అవుతోంది. నగరంలోని 35 వార్డుల్లోను దాదాపుగా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. మూడు నెలల క్రితం గుంతలమయంగా మారిన రహదారికి తారు వేయాలని సంకల్పించింది. నగరసభ అధికారులు నగరోత్థాన పథకంలో భాగంగా కిలో మీటర్ రహదారిని తవ్వి వెట్ మిక్స్ అలవర్చి వదిలేశారు. నాటి నుంచి నేటి వరకు దాదాపు మూడు నెలలు గడిచినా తారు వేయకపోవడం వల్ల వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ము, ధూళి రేగి పాదచారులకు, ద్విచక్రవాహనాల్లో వెళ్లే వారికి తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. అనేకమంది ఈ రహదారిలో సంచరించే సమయంలో ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దుమ్ము, ధూళి వల్ల అనేక మందికి శ్వాసకోశ సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయి. వృద్ధులు, పిల్లలు అనేక అనారోగ్య సమస్యలతో బాధపడాల్సి వస్తోంది. అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరచి రహదారికి త్వరగా మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఘనంగా జానపద జాతర



మంత్రి రామలింగారెడ్డికి సన్మానం

బొమ్మనహళ్లి: నగరంలోని బీటీఎం లేఔట్ పరిధి కోరమంగళలోని సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలలో మంగళవారం అనుశ్రుత ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో జానపద జాతర -2023 వేడుకలను రాష్ట్ర మంత్రి రామలింగా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కన్నడనాడులో ఉన్న జానపద కళలు, సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. అనంతరం ఫౌండేషన్ సభ్యులు మంత్రిని సన్మానించారు. వేడుకల్లో యక్షగానం, కంసాలే, వీరగాసె, డొల్లుకుణిత, పూజాకుణీత తదితర నృత్యాలు ప్రదర్శించారు. మాజీ ఎమ్మెల్యే నేల నరేంద్రబాబు, కళాశాల అధ్యక్షుడు రే బ్రదర్ క్లేవియర్ అలెగ్జాండర్, మాజీ కార్పొరేటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై కూడా దృష్టి పెట్టాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బొమ్మనహళ్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి పెట్టాలని బొమ్మనహళ్ళి ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని బొమ్మనహళ్లి పరిధి రూపెన అగ్రహారలో ఉన్న ఆర్‌జేఎస్ క్రీడా మైదానంలో బెంగళూరు నగర జిల్లా పంచాయతీ, విద్యాశాఖ, సారక్షరత శాఖ బెంగళూరు దక్షిణ విభాగం ఆధ్వర్యంలో హోంగసంద్ర క్లస్టర్ క్రీడా పోటీలను ప్రారంభించిన అనంతరం సతీశ్ రెడ్డి మాట్లాడుతూ...చిన్నవయసు నుంచే క్రీడల్లో పాల్గొని మంచి క్రీడాకారులుగా గుర్తింపు పొందాలన్నారు. కార్యక్రమంలో బీబీఎంపీ మాజీ ఆరోగ్య స్థాయీ సమితి అధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి, బీజేపీ నాయకుడు నరేంద్ర బాబు, అనిల్, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

తుమకూరు: మహిళ ఒకరు తమ ఇంటిలో ఉరి వేసుకొని అనుమానస్పదంగా మృతి చెందిన సంఘటన తుమకూరు నగరంలోని నజరాబాద్‌లో చోటుచేసుకుంది. వివరాలు.. అఫిజాబాను(32) అనే మహిళకు 12 సంవత్సరాల క్రితం అబ్దుల్ సత్తార్ అనే వ్యక్తితో పెళ్లి జరిగింది. వీరి కాపురం సజావుగానే సాగుతోంది, అయితే పుట్టింటి నుంచి డబ్బు తేవాలని కొంతకాలంగా భర్త ఆమెను వేధిస్తున్నాడు. దీనిపై తరచూ గొడవలు జరిగేవి. దాంతో ఇరు కుటుంబాలవారు వచ్చి రాజీ పంచాయతీలు చేసినా ప్రయోజనం లేదు. మంగళవారం ఉదయం ఇంటిలో ఆమె ఉరివేసుకున్న స్థితిలో శవమై తేలింది. భర్తే కారణమని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు. తిలక్ పార్క్ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

కాంగ్రెస్‌లో చేరిక



కృష్ణరాజపురం: నగరంలోని కృష్ణరాజపురం నియోజకవర్గంలో బీజేపీకి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. మాజీ కార్పొరేటర్ వీరణ్ణ, బండె రాజన్న, కల్కెరె శ్రీనివాస్‌లు మంగళవారం ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మంత్రి బైరతి సురేష్, ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ, కేఆర్‌పుర కాంగ్రెస్ నాయకుడు డి.కే. మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంగళ్లలో మత్తు చాక్లెట్లు, ఇద్దరి అరెస్ట్



అరెస్టయిన నిందితులు

యశవంతపుర: చాక్లెట్‌లో మత్తు పదార్థాలు పెట్టి అమ్ముతున్న ఇద్దరు దుకాణం యజమానులను మంగళూరు పోలీసులు అరెస్ట్ చేశారు. కార్ స్ట్రీట్ పూజా ప్యాలెస్ భవనంలో వైభవ్ పూజా సేల్స్ యజమాని మనోహర్ శెట్ (49), ఉత్తరప్రదేశ్‌కు చెందిన బెచన్ సోన్కర్ (45)లను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ. 40 వేల విలువైన మత్తు చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.

బైకిస్టు దుర్మరణం

యశవంతపుర: బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన బెంగళూరు యశవంతపుర పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. త్రిపురకు చెందిన బిజ్జు సేల్పు మృతి చెందారు. కాంగ్రెస్ నాయకుడు అనూప్ అయ్యర్ ఇంటిలో పని మనిషిగా చేస్తున్న ఇతను మరో స్నేహితుడిని డ్రాప్‌చేయడానికి బైక్‌పై వెళ్తుండగా వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో బిజ్జుసేల్పు మృతి చెందాడు.

ప్రకృతి పుట్టినిల్లు కుందాద్రి బెట్ట

- అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి
- ట్రెక్కింగ్ అనువైన ప్రదేశం

బనశంకరి: కర్ణాటకలోని కుందాద్రిహిల్స్ ప్రకృతి భూలోకానికి అందించిన బహుమతి. అద్భుతమైన పర్యాటక ప్రాంతం. ఇది పశ్చిమ కనుమల్లో దాగిన రత్నం. సముద్ర మట్టానికి 826 మీటర్లు ఎత్తులో ఉండే కుందాద్రిహిల్స్ కర్ణాటకలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఇది ఒకటి. శివమొగ్గ జిల్లా అగుంబే సమీపంలో ఉండే కుందాద్రి హిల్స్ ప్రకృతి సోయగాలను, మనోహరమైన దృశ్యాలతో కూడుకుని ఉంది. కుందాద్రి హిల్స్ రెండు విషయాలకు ప్రసిద్ధి చెందింది. 17వ శతాబ్దానికి చెందిన జైన దేవాలయం ఒకటి కాగా రెండోది ఇది సాహస ప్రియులు ట్రెక్కింగ్ చేసేందుకు అనువైన ప్రదేశం. ఈ రెండు కారణాలతో పర్యాటకులు ఇక్కడికి పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. జైన దేవాలయం 23వ తీర్థంకరుడైన పార్శ్వనాథ్‌కు అంకితం చేసింది. దీంతో ఈ ఆలయాన్ని సందర్శించడానికి జైన భక్తులు ఎక్కువగా విచ్చేస్తారు. ఇక్కడ అనేక రాతి విగ్రహాలు రెండు అందమైన నీటిగుంటలు కూడా పర్యాటకులను ఆకట్టుకుంటాయి. కుందాద్రి హిల్స్ సాహస ప్రియులకు ట్రెక్కింగ్ పాయింట్. అక్కడ వీకెండ్స్‌లో ట్రెక్కింగ్ చేయడానికి చాలామంది ఔత్సాహికులు వస్తుంటారు. ఈ కొండల శిఖరాన్ని చేరుకోవడానికి దాదాపు మూడు గంటల సమయం పడుతుంది. 7 కిలోమీటర్ల మేర అటవీమార్గంలో కఠినమైన భూభాగాల్లో సుదీర్ఘప్రయాణం చేయాలి. ఈ క్రమంలో అడుగడుగునా ఆకర్షణీయమైన ప్రకృతి అందాలను ఆస్వాదిస్తారు. కొన్ని చోట్ల కఠినమైన ఇరుకైన మార్గాలు ఉండటంతో కాస్త జాగ్రత్తగా వెళ్లాల్సిన అవసరం ఉంది. ఇక్కడ ట్రెక్కింగ్ చేయడం సాహసంతో కూడుకున్నది. ఒకవేళ మీరు నడవలేకపోతే కొండపైకి బైక్‌లో కూడా వెళ్లవచ్చు. కాకపోతే రోడ్లు నిటారుగా, ఇరుకుగా ఉండటంతో పాటు మధ్యలో హెయిర్‌పిన్ బెండ్లు ఉంటాయి. జాగ్రత్తగా వెళ్లాల్సి ఉంటుంది.



బెట్టపై సూర్యోదయ అందాలు



కుందాద్రి హిల్‌పై కొలను



బెట్టపై ప్రకృతి సౌందర్యం



పురాతన జైన ఆలయం



కొండపై కమ్ముకున్న పొగమంచు

ఎలా వెళ్లాలంటే..

బెంగళూరు నుంచి తీర్థహళ్లికి నేరుగా బస్సులు అందుబాటులో ఉన్నాయి. అక్కడ నుంచి కుందాద్రి హిల్స్‌కు చేరుకోవచ్చు.

అద్భుతమైన ప్రదేశం

సాహసం, ఆధ్యాత్మికత, ప్రకృతి అందాల కలబోతతో కూడిన కుందాద్రి హిల్స్ ఎలాంటి పర్యాటకులకైనా తప్పక నచ్చుతాయి. అందులో ఎలాంటి సందేహం లేదు.

మనవడిపై దాడి.. అడ్డుకోబోయి వృద్ధురాలి హత్య

దొడ్డబళ్లాపురం: మనవడిపై దాడి చేస్తుండగా అడ్డుకోబోయిన వృద్ధురాలిని దారుణంగా హత్య చేసిన సంఘటన నెలమంగల తాలూకా మైలనాయకనహళ్లి గ్రామంలో చోటుచేసుకుంది. శివలింగమ్మ (70) హత్యకు గురైన వృద్ధురాలు. ఇదే గ్రామానికి చెందిన మంజు (30) దారుణానికి ఒడిగట్టిన వ్యక్తి. నిందితుడు మంజు కుటుంబానికి, మృతురాలు శివలింగమ్మ కుటుంబానికి చాలా ఏళ్లుగా గొడవలు ఉన్నాయి. పలుమార్లు పోలీస్‌స్టేషన్‌లో రాజీ పంచాయితీ జరిగింది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం మళ్లీ గొడవ జరిగింది. శివలింగమ్మ మనవడు దర్శన్‌పై మంజు దాడి చేస్తుండగా అడ్డుకోబోయిన ఆమెపై మంజు దద్దుకర్రతో దాడి చేసాడు. తీవ్రంగా గాయపడ్డ శివలింగమ్మను ఆస్పత్రికి తరలించినప్పటికీ ఆమె అప్పటికే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

29 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి

మైసూరు: మైసూరు జిల్లా పిరియా పట్టణ తాలూకా బైళకుప్పెలోని ఒకటవ టిబెటిన్ క్యాంప్ ఆవరణంలో పోలీసులు దాడి చేసి 29 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్ట్ చేసి ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన బిక్రం నాయక, కుశాలనగరకు చెందిన నయన్ దీపు, మడికేరి తాలూకా కడకదాలు గ్రామానికి చెందిన జంశీర్, పిరియా పట్టణ తాలూకా ఆళనహళి గ్రామానికి చెందిన అనిల్ కుమార్, కొప్ప గుడ్డనహళ్ళి గ్రామానికి చెందిన భరత్ కుమార్‌లను అరెస్ట్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో పాదచారి దుర్మరణం

మండ్య: కారు ఢీకొని పాదచారి మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన మండ్య జిల్లా మద్దూరు తాలూకా హెమ్మనహళ్లి సమీపంలో ఉన్న లక్ష్మీ ఆలయం వద్ద చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో హెమ్మనహళ్లి గ్రామానికి చెందిన శంకర్(54) మృతి చెందగా కరియప్ప అనే వ్యక్తి గాయపడ్డాడు. వీరిద్దరు కెస్తూరు క్రాస్ వద్ద వెళ్లి అక్కడి నుంచి గ్రామానికి నడుచుకుంటూ వస్తుండగా నిర్లక్ష్యంగా కారు నడుపుకుంటూ వచ్చిన ఓ వ్యక్తి వారిని ఢీకొన్నాడు. దీంతో శంకర్ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన కరియప్పను మద్దూరు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మద్యం మత్తులో కారు నడిపి...

మండ్య: మద్యం మత్తులో కారు నడుపుతూ ఓ వ్యక్తి వాహనంతో పాటు రోడ్డు పక్కన గుంతలో పడిన ఘటన మండ్య జిల్లా మద్దూరు తాలూకా హగరలింగనదొడ్డిలో ఉన్న బెంగళూరు - మైసూరు జాతీయ రహదారిలో ఉన్న సర్వీసు రోడ్డులో మంగళవారం చోటు చేసుకుంది. తుమకూరు జిల్లాకు చెందిన కారు డ్రైవర్ దేవరాజు ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డారు. కారు మొత్తం ధ్వంసమైంది. ఇతను మద్యం తాగి మైసూరు నుంచి బెంగళూరుకు వస్తుండగా జాతీయ రహదారిలో పోలీసులు ఉండటంతో వారిని తప్పించుకోవడానికి బైపాస్ రోడ్డులో వేగంగా వస్తూ వాహనం అదుపుతప్పి గుంతలో పడిపోయింది. చిన్నపాటి గాయాలతో దేవరాజు బయట పడ్డాడు.



ధ్వంసమైన కారు

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- యువతి మృతి
- గార్మెంట్స్ ఉద్యోగినులకు గాయాలు

తుమకూరు: గార్మెంట్స్ కార్మికులతో వెళ్తున్న ఆటోను కేఎస్ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒక మహిళ మృతి చెందగా పది మంది మహిళలు గాయపడ్డారు. ఈ ఘటన తుమకూరు జిల్లా మధుగిరి తాలూకా కోడిగేనహళ్ళి-గుట్టె వద్ద ఉన్న జయమంగళ వంతెన వద్ద మంగళవారం చోటు చేసుకుంది. మృతురాలిని జోగనహళ్లి గ్రామానికి చెందిన లక్ష్మీ (20)గా గుర్తించారు. ఉదయం సింగనహళ్లి, సుద్దకుంటె, అడవినాగెనహళ్లి, జోగెనహళ్లి, గుట్టె ప్రాంతం నుంచి పలువురు మహిళలు గార్మెంట్స్‌లో పనుల కోసం ఆటోలో బయలుదేరారు. వీరి ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒక మహిళ మృతి చెందగా పది మందికి పైగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



క్షతగాత్రురాలిని పరామర్శిస్తున్న మంత్రి రాజణ్ణ

ఆటో-కారు ఢీ, దంపతుల దుర్మరణం

తుమకూరు: లగేజీ ఆటోను కారు ఢీకొనడంతో చిరు వ్యాపారులైన దంపతులు మృతి చెందగా ఒకరు తీవ్రంగా గాయపడిన ఘటన తుమకూరు జిల్లా గుబ్బి తాలూకాలోని హరివేసంద్ర వద్ద చోటు చేసుకుంది.



హరివేసంద్ర వద్ద జరిగిన ప్రమాద దృశ్యం

ఈ ప్రమాదంలో నాగరాజు (60), అతని భార్య పుట్టమ్మ (55)ప్రాణాలు కోల్పోయారు. కేజీ టెంపుల్ సంతకు ఆటోలో సరుకు తీసుకుని దంపతులు బయలుదేరారు. వీరి ఆటోను వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన అతని భార్యను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. వీరికి ముగ్గురు సంతానం సీఎస్ పుర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

జిల్లా సమగ్రాభివృద్ధే ధ్యేయం

చిక్కబళ్లాపురం: జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తమ కర్తవ్యమని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ సుధాకర్ అన్నారు. మంగళవారం నగరంలోని జిల్లా పంచాయత్ సమావేశం హాల్లో ప్రగతి పరిశీలన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరాలని, రైతులకు అనుకూలమైన పంటల సాగుపై వారికి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. శిడ్లఘట్టలో అత్యాధునిక హైటెక్ రేషమ్ మార్కెట్‌కు బడ్జెట్‌లో రూ. 75 కోట్లు రిజర్వు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సుబ్బారెడ్డి, ప్రదీప్ ఈశ్వర్, పుట్టస్వామి గౌడ, కలెక్టర్ రవీంద్ర, సీఈఓ నిట్టాలి, ఎస్పీ నాగేశ్. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఐటీ ఇంజినీర్ ఆత్మహత్య



నరేష్‌కుమార్ రెడ్డి (ఫైల్)

కదిరి అర్బన్: పుట్టపర్తి జిల్లా కదిరి నియోజకవర్గంలోని పట్నం గ్రామ సమీపంలో మంగళవారం రైలు కింద పడి ఐటీ ఇంజనీర్ కొండేటి నరేష్‌కుమార్ రెడ్డి (34) ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు నరేష్‌కుమార్‌రెడ్డి స్వగ్రామం నల్లమాడ మండలం ఎర్రచెరువు పల్లి. రాజారెడ్డి, మల్లీశ్వరీ దంపతుల ఏకైక కుమారుడు నరేష్‌కుమార్‌రెడ్డి. బెంగళూర్‌లో ఐటీ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. ప్రస్తుతం తల్లిదండ్రులతో కలిసి కదిరి పట్టణంలో నివసిస్తున్నాడు. మృతునికి ఇంకా వివాహం కాలేదు. రెండు రోజుల క్రితం బెంగళూరుకు వెళ్తున్నానని ఇంటినుంచి వెళ్లాడని తల్లిదండ్రులు చెపుతున్నారు. ఇంతలో రైలు కింద పడి శవమై తేలాడు. ఆత్మహత్యకు గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సిఉంది. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఢిల్లీలో హోం మంత్రిని కలిసిన బొమ్మై

యశవంతపుర: వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ 22 ఎంపీ సీట్లు గెలుచుకోవటం కల మాత్రమేనని మాజీ సీఎం బసవరాజు బొమ్మై తెలిపారు. ఆయన ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ... 1996 నుంచి కాంగ్రెస్ ఎక్కువ సీట్లు గెలిచింది. 2018లో బీజేపీ అధికారంలోకి రాగానే అధికసీట్లు తమ పార్టీ గెలిచిందన్నారు. లోకసభ ఎన్నికలే వేరేరూపంగా ఉంటాయన్నారు. బీజేపీ 25 స్థానాలలో గెలుపు కోసం శ్రమిస్తున్నట్లు బొమ్మై తెలిపారు. ఎంపీ ఎన్నికలకు సంబంధించి హైకమాండ్‌తో మాట్లాడాలని ఎంపీలు సూచించిన మేరకే ఢిల్లీ వచ్చినట్లు తెలిపారు.

పంద్రాగస్టుకు ఏర్పాట్లు



స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహణ కోసం బెంగళూరు మానెక్ షా మైదానంలో ఏర్పాట్లు జరుగుతున్న దృశ్యం. నేలను రోలర్‌తో చదును చేయడం, వేదికల నిర్మాణం మొదలైంది. ఎన్‌సీసీ క్యాడెట్లు కవాతు సాధన చేశారు.



హోసూరు వార్తలు..

రెండు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

హోసూరు: హోసూరు, సూళగిరి ప్రాంతంలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. వివరాల మేరకు బిహార్ రాష్ట్రానికి చెందిన గౌతమ్ (26) హోసూరు పారిశ్రామికవాడ మూకొండపల్లి ప్రాంతంలో అక్కడే ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం హోసూరు ఈఎస్‌ఐ రింగ్‌రోడ్డుపై ద్విచక్రవాహనంలో వెళుతుండగా మరో బైకిస్టు అతన్ని ఢీకొన్నాడు. గౌతమ్ అదుపుతప్పి కిందపడగా లారీ అతనిపై నుంచి దూసుకెళ్లడంతో అక్కడే మరణించాడు.

ఊత్తంగేరి తాలూకా సామలపట్టి ప్రాంతానికి చెందిన వరాజమ్మ (60) కూలి పనుల కోసం సోమవారం సూళగిరి ప్రాంతానికెళ్లిన ఈమె సాయంత్రం కామనదొడ్డి వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా ఏదో వాహనం ఢీకొట్టి వెళ్లింది. తీవ్ర గాయాలేర్పడిన వరాజమ్మ ఘటనా స్థలంలోనే మృతి చెందింది. సూళగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని స్వాధీనపరుచుకొని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.

కార్మికుడు ఆత్మహత్య, ముగ్గురు అరెస్టు

హోసూరు: బైకును తాకట్టు పెట్టి తీసుకొన్న డబ్బులు చెల్లించలేదని దూషించి దాడి చేయడంతో విరక్తి చెందిన తాపీ కార్మికుడు ఆత్మహత్య చేసుకొన్న ఘటన కావేరిపట్టణం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. క్రిష్ణగిరి జిల్లా కావేరి పట్టణం సమీపంలోని సౌకూరు గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు కార్తీక్ (27) ఏడాది కిందట ఓ ద్విచక్రవాహనాన్ని అదే ప్రాంతానికి చెందిన విజయ్‌కుమార్ వద్ద రూ. 15 వేలుకు తాకట్టు పెట్టాడు. డబ్బులు కట్టి బైకును విడిపించుకోవాలని విజయ్‌కుమార్ డిమాండ్ చేస్తూ వచ్చాడు. కార్తీక్ కుటుంబీకులు రూ. 10 వేలు చెల్లించి, మరో రూ. 5 వేలుకు కాలావకాశం కోరారు. గడువు ఇవ్వకుండా కార్తీక్‌ను దూషించి దాడి చేశారు. దీంతో అతడు ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. ఈ ఘటనపై కావేరిపట్టణం పోలీసులు కేసు నమోదు చేసుకొని విజయ్‌కుమార్, అతనికి సహకరించిన రామస్వామి, శివకుమార్‌లను అరెస్ట్ చేశారు.

ఆడపిల్లలకు ఆర్థిక సాయం

హోసూరు: ఓ కుటుంబంలో ఇద్దరు ఆడపిల్లలు మాత్రమే ఉంటే ఆ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుంది. మంగళవారం జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో సమావేశంలో కలెక్టర్ శరయు మాట్లాడుతూ ఓ కుటుంబంలో ఇద్దరు ఆడపిల్లలు మాత్రమే జన్మిస్తే వారికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా తలా రూ. 25 వేలు ఆర్థిక సాయాన్ని బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేస్తుందని, పిల్లలకు 18 ఏళ్లు నిండాక ఆ డబ్బులు వడ్డీతో సహా అందుతాయని తెలిపారు. వృద్ధాప్య పెన్షన్లు, బాలికలకు ఆర్థిక సాయం అందజేసేందుకు మాత్రమే ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

కొబ్బరి మొక్కల పంపిణీ

కెలమంగలం: వ్యవసాయ శాఖ ద్వారా కెలమంగలం సమితి జే. కారుపల్లి పంచాయతీ వెంకటాపురం గ్రామంలో రైతులకు ఉచిత కొబ్బరి మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి యూనియన్ కౌన్సిలర్ రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు కొబ్బరి మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ... వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని, రాయితీతో విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తుందని, వ్యవసాయ పనుల కోసం ఆధునిక ఉపకరణాలు, బిందు సేద్య ఉపకరణాలు, పంటల బీమా తదితర పథకాలు రైతులకు అందుబాటులో ఉందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



కొబ్బరి మొక్కలను అందజేస్తున్న కౌన్సిలర్

ఉచిత వైద్య శిబిరం



జ్యోతి వెలిగించి శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

హోసూరు: హోసూరు తాలూకా పూనపల్లి పంచాయతీలో మహాతపస్వి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పూనపల్లిలోని నేషనల్ మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండ్రీ స్కూల్లో జరిగిన ఈ శిబిరాన్ని తళి యూనియన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. కర్ణాటక రాష్ట్రం చందాపుర సూర్య మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు పవిత్ర, నిసర్గ దుష్టి ధర్మ తదితరులు పాల్గొని రోగులకు వైద్య సేవలందించారు. పూనపల్లి, చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున రోగులు వైద్య పరీక్షలు నిర్వహించుకొన్నారు. కార్యక్రమ ఏర్పాట్లను మహాతపస్వి సేవా సంస్థ గురురాజ్, రాజేశ్వరి, సుధ, నందిని, చంద్రశేఖర్, శ్రీనివాస్, వీరేష్ హెంచినాళ విజయ్‌కుమార్, శాంతకుమారి, జ్యోతి, రంజిని, గిరిజ, గాయత్రి తదితరులు పర్యవేక్షించారు.

గాయపడిన ఉద్యోగి మృతి



అప్పాజి (ఫైల్)

మైసూరు: జిల్లాలోని నంజనగూడు తాలూకాలోని ఆళగంచియ ల్లిలో ఉన్న బన్నారి అమ్మన్ చక్కెర కర్మాగారంలో స్టీమర్ పైప్ పేలి తీవ్రంగా గాయపడిన ఉద్యోగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. ఉద్యోగి అప్పాజి జూలై 28వ తేదీన విధుల్లో ఉండగా ఆవిరి పైప్ పేలిపోయి తీవ్రంగా కాలిన గాయాలయ్యాయి. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. తమను కర్మాగారం యాజమాన్యం ఆదుకోవాలని మృతుని కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

క్రిష్ణగిరి: పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకొన్న ఘటన నాగరసంబట్టి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... క్రిష్ణగిరి జిల్లా నాగరసంబట్టి సమీపంలోని బాలేగుళి గ్రామానికి చెందిన రైతు కుమార్ (40) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నాడు. ఫలితం లేకపోవడంతో సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

ప్రిన్సిపాల్‌కు బెయిల్ నిరాకరణ

శివమొగ్గ: మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడి అరెస్టయిన కోటి సెక్రెడ్ కళాశాల ప్రిన్సిపాల్ ఫ్రాన్సిస్ ఫెర్నాండిస్‌కు కోర్టు బెయిల్ నిరాకరించింది. పోక్సో కేసులో అరెస్టయిన అతడు బెయిల్‌కు దరఖాస్తు చేశాడు. విచారణ చేసిన న్యాయమూర్తి బెయిల్ కొట్టివేశాడు. అనంతరం నిందితుడిని జైలుకు తరలించారు. ఇతనిపై కోటి పోలీసులు పోక్సో కేసు నమోదు చేసిన విషయం తెల్సిందే.

ఏకగ్రీవ ఎన్నిక



అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సన్మానం

మండ్య: మండ్య తాలూకా దుద్ద హోబ్లీలో ఉన్న హెచ్.మల్లిగెరె గ్రామ పంచాయతీకి జరిగిన అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల్లో జేడీఎస్ మద్దతుదారుడు ఎం రమేశ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 14 మంది సభ్యులు ఉన్న గ్రామ పంచాయతీ ఉపాధ్యక్ష స్థానం కోసం అనిత, మరిస్వామి నామినేషన్లు వేశారు. అనితకు పది ఓట్లు రాగా, మరిస్వామికి ఆరు ఓట్లు రావడంతో అనిత గెలిచినట్లు ప్రకటించారు.

బురద రాతలే పునరావృతం

పోలవరం కట్టక ముందు ముంపునకు గురైన గ్రామాలే ఇప్పుడూ మునక

- ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయనప్పుడు కొత్తగా ముంపు సమస్య ఎక్కడిది?
- గత నాలుగేళ్లలో రూ.1,677 కోట్లు వెచ్చించి ఇప్పటికే 8,446 కుటుంబాలకు పునరావాసం
- చంద్రబాబు నిర్వాకాలను వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వానికి ఆపాదించేలా రామోజీ దుర్బుద్ధి

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టును ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసేందుకు నిర్వాసితులకు దశలవారీగా పునరావాస కల్పనపై చిత్తశుద్ధితో అడుగులు వేస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డిపై పదేపదే దుష్ప్రచారం చేయడంతోపాటు చంద్రబాబు తప్పిదాలను సైతం ఈ ప్రభుత్వానికి అంటగట్టే దుస్సాహసానికి ఈనాడు రామోజీ ఒడిగడుతున్నారు. 'జగనన్నా.. ఇంకెన్నేళ్లు ముంచుతారు?' శీర్షికన ప్రచురించిన కథనంలో ప్రతి అక్షరం పచ్చి అబద్ధమే.

ఆరోపణ: వరదొచ్చిన ప్రతిసారీ పోలవరం పరిధిలోని గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. సీఎం జగన్‌ హామీకి అనుగుణంగా ఇప్పటికీ పునరావాసం పూర్తి కాలేదు.

వాస్తవం: పోలవరం ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయడం లేదు. స్పిల్‌ వే 48 గేట్లను పూర్తిగా ఎత్తివేసి వచ్చిన వరదను వచ్చినట్టు దిగువకు వదిలేస్తున్నారు. అలాంటప్పుడు కొత్తగా ముంపు సమస్య ఎలా వస్తుంది రామోజీ? గోదావరి వరద ఉధృతి సమయంలో భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినప్పుడు.. పోలవరం కట్టక ముందు విలీన మండలాల్లో ముంపునకు గురయ్యే గ్రామాలే ఇప్పుడూ ముంపునకు గురయ్యాయి. గతంలో మాదిరి గానే ఆయా గ్రామాల్లో వరద బాధితులను పునరావాస శిబిరాలకు తరలించి బియ్యం, కందిపప్పు, వంటనూనెతోపాటు తక్షణం నగదు సాయం అందించి వరద తగ్గాక బాధితులను ఆయా గ్రామాలకు చేర్చారు. వరద సహాయ కార్యక్రమాల అమలును సీఎం జగన్‌ సోమ, మంగళవారాల్లో స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. ప్రభుత్వ తక్షణ స్పందనపై బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు. సీజన్‌ ముగిసేలోగా పంట నష్టానికి ప్రభుత్వం రైతులకు పరిహారం అందించనుంది.

ఆరోపణ: పోలవరంలో 45.72 మీటర్ల వరకూ నిర్వాసితులందరికీ పునరావాసం కల్పించడానికి రూ.20 వేల కోట్లకుపైగా అవసరం. నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారాన్ని బటన్‌ నొక్కి నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేయాలని ప్రధాని మోదీని కోరుతానని 2022 జూలై 27న ఇచ్చిన హామీని సీఎం జగన్‌ నెరవేర్చలేదు.

వాస్తవం: నిర్వాసితులకు ఇచ్చిన హామీ మేరకు 2022 ఆగస్టు 22న ఢిల్లీ వెళ్లిన సీఎం జగన్‌ ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను దక్కించుకునే సమయంలో నాటి సీఎం చంద్రబాబు 2013–14 ధరల ప్రకారం రూ.20,398 కోట్లతో పూర్తి చేస్తానని అంగీకరించిన అంశాన్ని గుర్తు చేశారు. అందులో నిర్వాసితుల పునరావాస వ్యయం రూ.7,279 కోట్లేనని ప్రస్తావించారు. కానీ భూసేకరణ చట్టం 2013 ప్రకారం వాస్తవంగా నిర్వాసితుల పునరావాస వ్యయం రూ.23,875 కోట్లు ఉంటుందని వివరించారు. ఈ నేపథ్యంలో 2013–14 ధరలతో ప్రాజెక్టును పూర్తి చేయడం అసాధ్యమని సీఎం జగన్‌ తేల్చి చెప్పారు. నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారాన్ని నేరుగా వారి ఖాతాల్లోకి బటన్‌ నొక్కి జమ చేయాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు తొలి దశ పూర్తికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని అభ్యర్థించారు. 2017–18 ధరల ప్రకారం సీడబ్ల్యూసీ టీఏసీ ఖరారు చేసిన సవరించిన అంచనా వ్యయం రూ.55,656.87 కోట్లను ఆమోదించి ఆ మేరకు నిధులిచ్చి ప్రాజెక్టు పూర్తి చేయడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ప్రధాని మోదీ పోలవరానికి నిధుల విడుదలపై చర్యలు తీసుకోవాలని కేంద్ర జల్‌ శక్తి శాఖకు దిశానిర్దేశం చేశారు. వరదలకు దెబ్బతిన్న డయాఫ్రమ్‌వాల్‌ను సరిదిద్దడం, ఈసీఆర్‌ఎఫ్‌ డ్యామ్‌ నిర్మాణ ప్రాంతాన్ని యథాస్థితికి తెచ్చే పనులతోపాటు తొలి దశ (41.15 మీటర్ల కాంటూర్‌) పూర్తికి రూ.12,911.15 కోట్లను అదనంగా ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక శాఖ జూన్‌ 5న అంగీకరించింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన లైడార్‌ సర్వేలో 41.15 కాంటూర్‌ పరిధిలోకి మరో 32 గ్రామాలు వస్తాయని తేలింది. ఆయా గ్రామాల్లో నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికి రూ.5,217 కోట్లు మంజూరు చేయా లని రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై కేంద్రం సానుకూలంగా స్పందించింది.

ఫ్యాక్ట్‌ చెక్‌

ఆరోపణ: 41.15 మీటర్ల కాంటూర్‌ పరిధిలోని నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా ప్రభుత్వం వారిని ముంచేస్తోంది.

వాస్తవం: టీడీపీ హయాంలో కమీషన్లు రావనే ఉద్దేశంతో నిర్వాసితులకు చంద్రబాబు పునరావాసం కల్పించలేదు. నాడు నవయుగకు నామినేషన్‌పై పనులను కట్టబెట్టడంతో డీపీటీ (దోచుకో పంచుకో తినుకో) పద్ధతిలో ప్రజాధనాన్ని దోచుకున్న రామోజీ గత సర్కారు నిర్వాకాలను ఎండగట్టలేదు. ఇప్పుడు వాటిని వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వానికి ఆపాదించే దుస్సాహసానికి ఒడిగట్టారు. టీడీపీ సర్కార్‌ ఐదేళ్లలో రూ.484 కోట్లను ఖర్చు చేసి కాంటూర్‌ లెవల్‌తో నిమిత్తం లేకుండా అక్కడ కొందరికి ఇక్కడ కొందరికి తరహాలో 3,110 కుటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పించింది. సీఎం జగన్‌ అధికారంలోకి వచ్చాక నిర్వాసితుల జీవన ప్రమాణాలు పెంచేలా మెరుగైన ప్యాకేజీని అమలు చేస్తున్నారు. నాలుగేళ్లలో రూ.16,777 కోట్లు ఖర్చు చేసి ఇప్పటికే 8,446 కుటుంబాలకు పునరావాసం కల్పించారు. మిగతా కుటుంబాలకు కూడా పునరావాసం కల్పన పనులు శరవేగంగా సాగుతున్నా రామోజీ కనపడనట్లు నటిస్తున్నారు.

70 శాతం ముడుపులొస్తే 70 శాతం పూర్తయినట్టా?

- ముడుపుల కోసమే పోలవరం ప్రాజెక్టును బాబు తీసుకున్నారు
- ముడుపులొచ్చే మట్టి పనులకే మొదటి ప్రాధాన్యత ఇచ్చారు
- వందల కోట్ల విలువైన పనులు అనుయాయులకు ఇచ్చారు
- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



సాక్షి, అమరావతి: చంద్రబాబు పోలవరం ప్రాజెక్టులో ఆశించిన ముడుపుల్లో 70 శాతం ఆ ఐదేళ్లలో అంది ఉంటాయని, దానినే ప్రాజెక్టు నిర్మాణ పురోగతిగా అంటున్నారేమో అని ఉప ముఖ్యమంత్రి (దేవదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ ఎద్దేవా చేశారు. 70 శాతం ముడుపులొస్తే 70 శాతం ప్రాజెక్టు పూర్తయినట్టా అని ప్రశ్నించారు. ఆయన మంగళవారం రాష్ట్ర సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. కేవలం ముడుపుల కోసమే కేంద్రం కట్టాల్సిన ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వమే కడుతుందని బాబు తీసుకున్నారని ఆరోపించారు. ప్రాజెక్టులో ఏది ముందు నిర్మించాలి, ఏది తర్వాత చేయాలన్న ప్రణాళిక ప్రకారం కాకుండా బాగా ముడుపులొచ్చే మట్టి పనులకే ప్రాధాన్యత ఇచ్చారన్నారు. వందల కోట్ల రూపాయిల పనులు అనుకూలురకే పూర్తిగా నామినేషన్లపై అప్పగించారని ఆరోపించారు. ముడుపుల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టి చంద్రబాబు కేంద్రంతో లాలూచీ పడిన విషయాన్ని ప్రజలెవరూ మరిచిపోలేదన్నారు. పోలవరం, అమరావతి రెండు కళ్లంటున్న చంద్రబాబులో వాటి ద్వారా ఆశించిన వేల కోట్ల ముడుపులు పోయాయన్న బాధే కనిపిస్తోందన్నారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే నారాసురుడు లేని పాలన రావాలని, అందుకు అనుగుణంగా 2024 ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇవ్వబోతున్నారని చెప్పారు. ప్రజల పక్షాన నిలబడుతున్న సీఎం వైఎస్‌ జగన్‌ వచ్చే ఎన్నికల్లోనూ గెలవడం ఖాయమన్నారు.

అసంపూర్తిగా వదిలేసి అబద్ధాలా?

- పోలవరం జాప్యానికి చంద్రబాబు నిర్వాకాలే కారణం: మంత్రి అంబటి
- మేం పూర్తి చేసిన స్పిల్‌వేపై నడుస్తూ బుకాయింపులా?
- మన జీవనాడిని జాతికి అంకితం చేసేది సీఎం జగనే



స్పిల్‌ వే వద్ద విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

పోలవరం రూరల్‌: దివంగత వైఎస్సార్‌ చేపట్టిన పోలవరం ప్రాజెక్టును ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు కళ్లార్పకుండా అసత్యాలు వల్లిస్తున్నారని మండిపడ్డారు. ఎగువ, దిగువ కాఫర్‌ డ్యామ్‌లు, అప్రోచ్‌ ఛానల్, పైలెట్‌ ఛానల్, స్పిల్‌ ఛానల్, స్పిల్‌వేని పూర్తి చేయకుండా, నీళ్లు మళ్లించకుండా డయాఫ్రమ్‌ వాల్‌ను నిర్మించడం చంద్రబాబు చేసిన చారిత్రక తప్పిదమన్నారు. నిర్మాణంలో జాప్యానికి చంద్రబాబు నిర్వాకాలే కారణమన్నారు. ఈ కారణంగానే 2019, 2020 వరదలకు డయాఫ్రమ్‌వాల్‌ దెబ్బతిందన్నారు. ప్రాజెక్టులు, వ్యవసాయంపై చిత్తశుద్ధి లేని చంద్రబాబు ఎన్నికల భయంతో పర్యటనలు తలపెట్టారని విమర్శించారు. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఈఎన్‌సీ నారాయణరెడ్డి, సీఈ సుధాకర్‌బాబులతో కలిసి పనుల పురోగతిని పరిశీలించారు. స్పిల్‌వే, ఎగువ, దిగువ కాఫర్‌ డ్యామ్‌ ప్రాంతాల్లో పర్యటించారు. ఎవరి హయాంలో ఎప్పుడెలా పనులు జరిగాయో నాడు–నేడు ఫొటో ఎగ్జిబిషన్‌ ద్వారా వివరించారు. పోలవరం పనులు ఎక్కడా ఆగలేదని మంత్రి అంబటి స్పష్టం చేశారు. దెబ్బతిన్న డయాఫ్రమ్‌వాల్‌ ప్రాంతంలో ఇసుక నింపి జెట్‌ గ్రౌటింగ్‌ పనులు చేపట్టామన్నారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన స్పిల్‌వే, స్పిల్‌ ఛానల్, అప్రోచ్‌ ఛానల్, గేట్లు, ఎగువ, దిగువ కాఫర్‌ డ్యామ్‌లను తాము పూర్తి చేశామన్నారు. తాము పూర్తి చేసిన స్పిల్‌వేపై నడుస్తూ చంద్రబాబు నిస్సిగ్గుగా అబద్ధాలాడుతున్నారని దుయ్యబట్టారు. టీడీపీ సర్కారు ప్రాజెక్టు నిర్మాణంపై దృష్టి పెట్టకుండా బస్సు యాత్రలు, భజనలకే ప్రాధాన్యం ఇచ్చిందని వ్యాఖ్యానించారు.

ఈ ప్రశ్నలకు జవాబివ్వు బాబూ..

తాను అడిగే మూడు ప్రశ్నలకు జవాబు చెప్పాలని చంద్రబాబుకు అంబటి సవాల్‌ విసిరారు. 'జాతీయ ప్రాజెక్టు పోలవరానికి పూర్తి నిధులు కేంద్రమే కేటాయించి పూర్తి చేయాలని విభజన చట్టంలో ఉన్నా నాడు ప్రధాని మోదీ, గడ్కరీ కాళ్లు పట్టుకుని పనులు ఎందుకు దక్కించుకున్నారు? 2013–14 ధరల ప్రకారం పూర్తి చేస్తానంటూ ఎందుకు ఒప్పుకున్నారు? 2018కి ప్రాజెక్టును పూర్తిచేసి అప్పగిస్తానని శాసనసభలో చెప్పిన మాటను ఎందుకు నిలబెట్టుకోలేదు?' అని అంబటి ప్రశ్నించారు. చంద్రబాబు చేసిన తప్పిదాలన్నీ ఒక్కొక్కటిగా సరిదిద్దుతూ సీఎం జగన్‌ ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 50 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిన సందర్భాలు లేవన్నారు. 1986లో 36 లక్షల క్యూసెక్కుల వరద మాత్రమే వచ్చిందన్నారు. ఎత్తు తగ్గిస్తున్నారంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టారు. డ్యామ్‌ సేఫ్టీ నిబంధనల ప్రకారం దశలవారీగా మూడు దశల్లో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేస్తారన్నారు. ఎస్‌ఈ నరసింహమూర్తి, అడ్వైజర్‌ గిరిధర్‌రెడ్డి, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్య క్షుడు బుగ్గా మురళీకృష్ణ, తహసీల్దార్‌ బి.సుమతి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏపీ ఇన్‌ పార్లమెంట్‌

త్రివిధ దళాల్లో ఖాళీలను భర్తీ చేయండి

రాజ్యసభ

కేంద్రానికి వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: త్రివిధ దళాల్లో 1.55 లక్షల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని కేంద్రానికి వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి విజ్ఞప్తి చేశారు. రాజ్యసభలో మంగళవారం ఇంటర్‌ సర్వీసెస్‌ ఆర్గనైజేషన్స్‌ (కమాండ్, కంట్రోల్, డిసిప్లిన్‌) బిల్లు–2023పై ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారం ప్రకారం ఆర్మీలో 1.36 లక్షలు, నౌకాదళంలో 12,500, వైమానికదళంలో ఏడువేల ఖాళీలున్నాయని చెప్పారు. రక్షణ రంగంపై అమెరికా, చైనా ఏటా తమ జీడీపీలో 3.38 శాతం (801 బిలియన్‌ డాలర్లు), 1.74 శాతం (293 బిలియన్‌ డాలర్లు) ఖర్చుచేస్తుంటే భారత్‌ కేవలం 77 బిలియన్‌ డాలర్లు మాత్రమే ఖర్చుచేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రక్షణ రంగంపై చేస్తున్న వ్యయం క్రమంగా తగ్గిపోతోందని చెప్పారు. ఈ బిల్లుపై వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి కూడా మాట్లాడారు.



ఏపీలో ఇంటి ముంగిటే ఫ్యామిలీ డాక్టర్‌ సేవలు

ఆంధ్రప్రదేశ్‌లో ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమం ద్వారా ఇంటి ముంగిటే వైద్యసేవలు అందిస్తున్నట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయమంత్రి డాక్టర్‌ భారతీప్రవీణ్‌ పవార్‌ చెప్పారు. వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి బదులిస్తూ.. వైఎస్సార్‌ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్‌ భారత్‌ పథకం కింద నెలకొల్పిన వెల్‌నెస్‌ సెంటర్లకు ఇద్దరేసి వైద్యాధికారులు అందుబాటులో ఉంటారని, నెలలో రెండుసార్లు వెల్‌నెస్‌ సెంటర్లను సందర్శించి గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం డాక్టర్‌ వైఎస్సార్‌ హెల్త్‌ స్కీంను కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్‌ భారత్, ప్రధానమంత్రి జన్‌ ఆరోగ్యశ్రీ యోజన పథకంతో జోడించి అమలు చేస్తోందని తెలిపారు. ఈ ఇంటిగ్రేటెడ్‌ స్కీం కింద అర్హులైన మొత్తం 1.41 కోట్ల కుటుంబాల్లో 61.47 లక్షల కుటుంబాలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంయుక్త సహకారంతో హెల్త్‌ కవరేజ్‌ అందుతుండగా మిగిలిన 80.23 లక్షల కుటుంబాలకు కవరేజ్‌ను రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే భరిస్తోందని చెప్పారు.

హైవేలతో మేజర్‌ పోర్టుల అనుసంధానం



ఏపీ సహా దేశంలోని మేజర్‌ పోర్టులన్నింటికీ జాతీయ రహదారులు, రైలు కనెక్టివిటీ ఉందని కేంద్ర నౌకాయానశాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్‌ నత్వానీ ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. 2022–23లో ఏపీలోని పోర్టులు 133.32 మిలియన్‌ టన్నుల సరకు రవాణా చేసినట్లు చెప్పారు. ఏపీలోని నాలుగు పోర్టులు బొగ్గు, నాలుగు పోర్టులు ఎరువులు, ఒక పోర్టు సిమెంటు, రెండు పోర్టులు పెట్రోలియం, పెట్రోకెమికల్స్‌ ఉత్పత్తులను రవాణా చేస్తున్నట్లు తెలిపారు.

ఏపీలో పవన విద్యుత్తు సామర్థ్యం



ఆంధ్రప్రదేశ్‌లో భూతలానికి 120 మీటర్ల ఎత్తులో 74.90 గిగావాట్లు, 150 మీటర్ల ఎత్తులో 123.33 గిగావాట్ల పవన విద్యుత్తు సామర్థ్యం ఉందని కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి ఆర్‌.కె.సింగ్‌.. వైఎస్సార్‌సీపీ ఎంపీ బీద మస్తాన్‌ రావు ప్రశ్నకు జవాబిచ్చారు.

4,552.12 మెగావాట్ల సౌర విద్యుత్తు సామర్థ్యం

ఆంధ్రప్రదేశ్‌లో 4,552.12 మెగావాట్ల సౌరవిద్యుత్తు సామర్థ్యం ఉన్నట్లు కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి ఆర్‌.కె.సింగ్‌.. వైఎస్సార్‌సీపీ సభ్యుడు పరిమళ్‌నత్వానీ ప్రశ్నకు సమాధానమిచ్చారు. 2022–23లో ఏపీలో 8,140.72 మిలియన్‌ యూనిట్లు సౌరవిద్యుత్తు ఉత్పత్తి అయినట్లు తెలిపారు.

ఏపీలో నాలుగు సోలార్‌పార్కులు



ఆంధ్రప్రదేశ్‌లో డెవలప్‌మెంట్‌ ఆఫ్‌ సోలార్, అల్ట్రా మెగా సోలార్‌ పవర్‌ ప్రాజెక్టు పథకంలో భాగంగా నాలుగుచోట్ల సోలార్‌ పార్కులు ఏర్పాటు చేసినట్లు విద్యుత్‌శాఖ మంత్రి ఆర్‌.కె.సింగ్‌ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ నిరంజన్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. 1,400 మెగావాట్ల సామర్థ్యం ఉన్న అనంతపురం సోలార్‌ పార్కుకు రూ.244.80 కోట్లు, 1,000 మెగావాట్ల సామర్థ్యం ఉన్న కర్నూలు సోలార్‌ పార్కుకు రూ.200.25 కోట్లు, 500 మెగావాట్ల సామర్థ్యం ఉన్న అనంతపురం–2 సోలార్‌ పార్కుకు రూ.91.24 కోట్లు, 1,000 మెగావాట్ల సామర్థ్యం ఉన్న కడప సోలార్‌ పార్కుకు రూ.54.25 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. అనంతపురం, కర్నూలు సోలార్‌ పార్కులు పూర్తిస్థాయిలోను, అనంతపురం–2 పార్కులో 400 మెగావాట్లు, కడప సోలార్‌ పార్కులో 250 మెగావాట్ల సామర్థ్యం అమల్లో ఉన్నట్లు చెప్పారు. 300 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రామగిరి సోలార్‌ పార్కు టెండరింగ్‌ దశలో ఉందని తెలిపారు.

ఏపీలో 6,68,833 సికిల్‌సెల్‌ వ్యాధి స్క్రీనింగ్‌ టెస్ట్‌ల లక్ష్యం



ఆంధ్రప్రదేశ్‌లో 2023–24లో 6,68,833 సికిల్‌సెల్‌ వ్యాధి స్క్రీనింగ్‌ టెస్ట్‌లు లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయమంత్రి ఎస్‌.పి.సింగ్‌ భఘేల్‌ తెలిపారు. ఈ వ్యాధి ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాలు, కళ్లు, ఎముకలు, మెదడు అవయవాలను ప్రభావితం చేస్తుందని వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు.

విశాఖ ఉక్కు భూమిపై ఆర్‌ఐఎన్‌ఎల్‌కు పవర్‌ ఆఫ్‌ అటార్నీ



విశాఖ ఉక్కు డిజిన్వెస్ట్‌మెంట్‌ లావాదేవీకి రూపురేఖలు ఇంకా ఖరారు కాలేదని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి భగవత్‌ కిషన్‌రావ్‌ కారడ్‌ తెలిపారు. బీజేపీ సభ్యుడు జి.వి.ఎల్‌.నరసింహారావు ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. విశాఖ ఉక్కు పరిశ్రమకు సంబంధించిన 19,703.10 ఎకరాల భూమిని కేంద్ర ఉక్కుశాఖ పేరిట సేకరించారని చెప్పారు. ఈ భూమిని వినియోగించుకోవడానికి ఆర్‌ఐఎన్‌ఎల్‌కు పవర్‌ ఆఫ్‌ అటార్నీ ఉందని తెలిపారు.

లోక్‌సభ

ఏపీలో వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కేంద్రం



ఆంధ్రప్రదేశ్‌ సహా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జాతీయ వెదురు మిషన్‌ (ఎన్‌బీఎం) ఆధ్వర్యంలో వెదురు ఉత్పత్తుల ఉత్పత్తి, అభివృద్ధి నిమిత్తం కామన్‌ ఫెసిలిటీ కేంద్రాల ఏర్పాటుకు సదుపాయం ఉందని కేంద్ర వ్యవసాయ, రైతుసంక్షేమ శాఖ మంత్రి నరేంద్రసింగ్‌ తోమర్‌ తెలిపారు. లోక్‌సభలో మంగళవారం వైఎస్సార్‌ సీపీ ఎంపీ గొడ్డేటి మాధవి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా వెదురు కళాకారులు సహా 16,656 మంది శిక్షణ పొందారని చెప్పారు. ఎన్‌బీఎం కింద 33 సాధారణ సౌకర్య కేంద్రాలు స్థాపించినట్లు తెలిపారు. రాష్ట్రంలో వెదురు క్లస్టర్‌ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదన రాలేదన్నారు.

వాటర్‌స్పోర్ట్స్‌ శిక్షణ



విశాఖపట్నంలో నేవల్‌ వాటర్‌మ్యాన్‌షిప్‌ ట్రైనింగ్‌ సెంటర్‌ ద్వారా నిరంతర శిక్షణ కోర్సులు ఏర్పాటు చేస్తున్నట్లు యాచింగ్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ ఇండియా తెలిపిందని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలశాఖ మంత్రి అనురాగ్‌ ఠాకూర్‌.. వైఎస్సార్‌సీపీ ఎంపీ కోటగిరి శ్రీధర్‌ ప్రశ్నకు సమాధానమిచ్చారు.


నక్సల్‌ ప్రభావిత ప్రాంతాలకు నిధులు



దేశవ్యాప్తంగా నక్సల్‌ ప్రభావిత ప్రాంతాలకు వేర్వేరు కార్యక్రమాల నిమిత్తం నిధులు సమకూరుస్తున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్‌ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ బి.వి.సత్యవతి ప్రశ్నకు మంత్రి బదులిస్తూ.. భద్రతాదళాల వ్యయం, లొంగిపోయిన నక్సల్స్‌కు పునరావాసం, కమ్యూనిటీ పోలీసింగ్, ఎక్స్‌గ్రేషియా, ప్రత్యేక బలగాలను బలోపేతం చేయడం తదితర కార్యక్రమాలకు నిధులు సమకూరుస్తున్నట్లు వివరించారు.

ఏపీకి నిధులు విడుదల చేయలేదు





పంచాయతీరాజ్‌ సంస్థల్లో ప్రజాప్రతినిధుల కెపాసిటీ బిల్డింగ్‌ నిమిత్తం 2022–23లో రాష్ట్రీయ గ్రామస్వరాజ్‌ అభియాన్‌ కింద ఏపీకి నిధులివ్వలేదని కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ సహాయమంత్రి కపిల్‌ మోరేశ్వర్‌ పాటిల్‌.. వైఎస్సార్‌సీపీ ఎంపీలు చింతా అనూరాధ, ఎన్‌.రెడ్డెప్ప ప్రశ్నకు జవాబిచ్చారు.

పిచ్చుకపై బ్రహ్మాస్త్రం!

- చిరు వ్యాఖ్యలు సోషల్‌ మీడియాలో వైరల్‌
- అగ్ర నటుల రెమ్యూనరేషన్‌ గురించేనా?

సాక్షి, హైదరాబాద్‌: 'వాల్తేరు వీరయ్య' సినిమా 200 రోజుల విజయోత్సవ వేడుకల సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సినీనటుడు చిరంజీవి చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అగ్ర సినీనటుల పారితోషికం గురించి తాజాగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న తరుణంలో ఆయన స్పందించినట్లు భావిస్తున్నారు. "మీలాంటి వాళ్లు పెద్ద పెద్ద విషయాల్లో ఇన్‌వాల్వ్‌ కావాలి. అవన్నీ వచ్చేలా చూడాలి. అది ప్రత్యేక హోదా గురించి కానివ్వండి.. లేదంటే మనకున్న ప్రాజెక్ట్‌ గురించి కానివ్వండి... లేదంటే రోడ్ల నిర్మాణం గురించి కానివ్వండి.. పేదవాళ్ల కడుపు నింపే పథకాలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు... ఇలాంటివాటి కోసం పాటు పడితే, వీటి కోసం ప్రయత్నం చేస్తే ప్రతి ఒక్కరూ మీకు తలవంచి నమస్కరిస్తారు. అంతేకానీ పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంలా సినిమా ఇండస్ట్రీపై ఏంటి సార్‌...? దయచేసి ఇదేదో పెద్ద ఇష్యూ అయినట్లు దేశవ్యాప్తంగా చర్చించేలా చేయకండి.." అని చిరంజీవి పేర్కొన్నారు.

గోదావరిపై లిఫ్ట్‌ ఇరిగేషన్‌ ఘనత నాదే

టీడీపీ అధినేత చంద్రబాబు



సాగునీటి ప్రాజెక్టులపై పవర్‌పాయింట్‌ ప్రెజెంటేషన్‌ ఇస్తున్న చంద్రబాబు

సాక్షి, రాజమహేంద్రవరం/రాజమహేంద్రవరం రూరల్‌/మధురపూడి/సీతానగరం: గోదావరిపై ఉన్న ప్రతి లిఫ్ట్‌ ఇరిగేషన్‌ తెచ్చిన ఘనత తనకే దక్కుతుందని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా పర్య టనలో భాగంగా మంగళవారం సీతానగరం మండలం పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకా న్ని పరిశీలించిన ఆయన అనంతరం కోరుకొండ బహిరంగ సభలో ప్రసంగించారు. ఆవ భూ ముల్లో రూ.500 కోట్ల అవినీతి జరిగిందన్నా రు. రాష్ట్రంలో జే–ట్యాక్స్‌ నడుస్తుంటే రాజానగ రంలో జక్కంపూడి ట్యాక్స్‌ నడుస్తోందని ఆరోపించారు. బ్లేడ్‌ బ్యాచ్‌ పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. దళితుడిని చంపి డోర్‌ డెలివరీ చేసిన అనంతబాబును పక్కన పెట్టు కుంటావా జగన్‌ అని ప్రశ్నించారు. ముని కూడలిలో గతంలో శిరోముండనానికి గురైన యువకుడితో మాట్లాడించారు. పురుషోత్త పట్నం ప్రాజెక్టు వద్ద ప్రభుత్వంపై విమర్శలు చేశారు. పురుషోత్తపట్నం ఒక చరిత్రని, రెండులక్షల రైతుల జీవితాన్ని మార్చే ప్రాజెక్టుకు నీళ్లు అందించాలన్న ప్రాజెక్టును నాశనం చేశారన్నారు. తాను కట్టడం వల్లే దానిని వాడకూడదని జగన్‌ ఆలోచిస్తున్నాడన్నారు. ప్రజావేదికను కూల్చినట్టు ప్రాజెక్టు కూలిస్తే ఇక్కడి ప్రజలు తాటతీస్తారని హెచ్చరించారు.

పోలవరంపై చేతులెత్తేశారు

రాజమహేంద్రవరంలో సాగునీటి ప్రాజెక్టులపై చంద్రబాబు పవర్‌పాయింట్‌ ప్రెజెంటేషన్‌ ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు 41.15 మీటర్ల ఎత్తులోనే నిర్మాణమంటున్న సీఎం జగన్‌ దీనిని నిర్మించలేనని చేతులెత్తేసి, కేంద్ర ప్రభుత్వమే నిర్మించాలంటున్నారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్ట్‌ నిర్మాణానికి కేంద్రమే నిధులిస్తుందని, మనం చేయాల్సిందల్లా ఎలాంటి ఆరోపణలు తప్పులు చేయకుండా, వారి సూచనల ప్రకారం ప్రాజెక్ట్‌ నిర్మించడమేనని చెప్పారు. వైఎస్‌ జగన్‌ చేసిన పనుల వల్లే కాఫర్‌ డ్యామ్, డయాఫ్రమ్‌ వాల్‌ మొత్తం పోయాయన్నారు. చేయాల్సిన నాశనం చేసి, ఇప్పుడు కేంద్రమే నిర్మించాలంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రాజెక్ట్‌ నిర్మాణాలు ఎందుకు దెబ్బతిన్నాయనే దానిపై హైదరాబాద్‌ ఐఐటీ ఒక నివేదిక ఇచ్చిందని తెలిపారు. అందులో 14 కారణాలు చెబితే.. 13 కారణాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం, చేతగానితనమేనని తేల్చాయని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలను ఎత్తేశారు

టీడీపీ నేత నారా లోకేశ్‌ ఆరోపణ



సాక్షి, నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 100 సంక్షేమ పథకాలను రద్దు చేసి పేదలకు అన్యాయం చేసిందని టీడీపీ నేత నారా లోకేశ్‌ ఆరోపించారు. యువగళం పాదయాత్రలో భాగంగా మంగళవారం పిడుగురాళ్లలో నిర్వహించిన సభలో లోకేశ్‌ మాట్లాడారు. జగన్‌ ప్రభుత్వం మద్యం, మట్టి, ఇసుక వంటి సహజ వనరులను దోచేస్తోందని ఆరోపించారు. ఉద్యోగులను దగా చేసిందని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి రాగానే పేదలకు సంక్షేమఫలాలు అందేలా చూస్తామన్నారు. బీసీలకు రక్షణ చట్టం, ఇస్లామిక్‌ బ్యాంక్‌ ఏర్పాటు, అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు సాయం చేస్తామని చెప్పారు. సభలో టీడీపీ నేతలు యరపతినేని శ్రీనివాస్, కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనందబాబు, ఆలపాటి రాజా, ప్రత్తిపాటి పుల్లారావు, జీవీ ఆంజనేయులు, బొండా ఉమా, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


10 నుంచి నిరవధిక సమ్మె

- విద్యుత్‌ ఉద్యోగుల జేఏసీ ప్రకటన
- సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి పెద్దిరెడ్డి హామీ

సాక్షి, అమరావతి: ఈనెల 10 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు రాష్ట్ర విద్యుత్‌ ఉద్యోగుల జేఏసీ నాయకులు ప్రకటించారు. మంగళవారం వారు విజయవాడలో మీడియాతో మాట్లాడారు. 12 ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జూలై 27 నుంచి దశలవారీగా ఆందోళనలు చేస్తున్నామని జేఏసీ చైర్మన్‌ చంద్రశేఖర్, జనరల్‌ సెక్రటరీ ప్రతాపరెడ్డి, కన్వీనర్‌ సాయికృష్ణ చెప్పారు. విద్యుత్‌ సంస్థల యాజమాన్యాలు తమ డిమాండ్లలో చాలావాటికి అంగీకారం తెలపలేదని.. అందుకే సమ్మెకు దిగబోతున్నట్లు తెలిపారు. మరోవైపు వైఎస్సార్‌ విద్యుత్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు జి.మహేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ బాలాజీతో కూడిన ఉద్యోగుల బృందం విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డిని కలిసి యాజమాన్యాలు, యూనియన్లను ఒకచోటకు చేర్చి పీఆర్సీ సమస్యను పరిష్కరించాలని కోరింది. యాజమాన్యాలు, ఉద్యోగసంఘాలతో చర్చిస్తామని, అవసరమైతే సీఎం జగన్‌ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని మంత్రి స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి జరిగిన చర్చల్లో వారం సమయం ఇవ్వాలని యాజమాన్యాల తరఫున ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ కోరినా జేఏసీ నాయకులు అంగీకరించలేదు.

వచ్చే ఎన్నికల్లో కుప్పంలో వైఎస్సార్‌సీపీదే గెలుపు


- పవన్‌ కళ్యాణ్‌కు ప్రజలే బుద్ధి చెప్పారు
- గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



చిలకలపూడి (మచిలీపట్నం): వచ్చే ఎన్నికల్లో కుప్పంలో చంద్రబాబు ఓటమి పాలవుతారని, అక్కడ వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవేంకటేశ్వరరావు (నాని)స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మచిలీపట్నంలో మీడియాతో మాట్లాడారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్, పంచాయతీలు, మునిసిపాలిటీలతో సహా అన్నీ వైఎస్సార్‌ సీపీ కైవసం చేసుకోవటంతో ఆయన అంటే చంద్రబాబుకు భయమని, అందుకే చంద్రబాబు అక్కడ విధ్వంసానికి పాల్పడ్డాడని అన్నారు. తాట తీస్తా.. తోలు తీస్తా.. బోడిగుండు కొట్టిస్తా అని వ్యాఖ్యలు చేసే పవన్‌కళ్యాణ్‌కు రాష్ట్ర ప్రజలు గత ఎన్నికల్లో బోడిగుండు కొట్టించారన్నారు. ఎక్కడ పోటీచేస్తే అక్కడ ఓడిపోయే జనసేన పార్టీ నేతలు గుడివాడ బస్టాండ్‌ గురించి మాట్లాడటం హాస్యాస్పదం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై చిరంజీవి వ్యాఖ్యలను కొడాలి నాని తప్పుబట్టారు. ప్రభుత్వంపై మాట్లాడే సినీ రంగం వారికి చిరంజీవి సూచనలు చేస్తే బాగుంటుందని హితవు పలికారు.

'పోలవరం' ద్రోహి చంద్రబాబు

వైఎస్సార్‌సీపీ ఎంపీ భరత్‌ రామ్‌



రాజమహేంద్రవరం సిటీ: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు వల్లే ఆలస్యమైందని, ఆయన పోలవరం ద్రోహి అని ఎంపీ మార్గాని భరత్‌ రామ్‌ ధ్వజమెత్తారు. రాజమండ్రిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం పోలవరం అని చెప్పి ప్రతి వారం కమీషన్లు గుంజుకోవడం తప్ప, ఆయనకేమీ ప్రాజెక్టుపై అవగాహన లేదన్నారు. ఆయన కమీషన్ల కక్కుర్తి, అజ్ఞానం వల్లే డయాఫ్రమ్‌ వాల్‌ దెబ్బతిందని చెప్పారు. ఇప్పుడు ఇంకో డయాఫ్రమ్‌ వాల్‌ కడితేగానీ పనులు ముందుకు జరగని పరిస్థితి నెలకొందన్నారు. దీనికి కారణమైన చంద్రబాబు ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఎంపీ డిమాండ్‌ చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి బాధితుల కన్నీళ్లు తుడిచారని చెప్పారు. గొమ్ముగూడెం గ్రామానికి ఈనాటి వరకూ ఏ సీఎం రాలేదని, ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ వెళ్లడంతో ఆ గ్రామస్తులందరూ ఎంతో ఆనందించారన్నారు. వచ్చే ఎన్నికల్లో రాజమండ్రి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌ సీపీ విజయం ఖాయమన్నారు.



● హ్యాండ్‌లూమ్ డే సందర్భంగా చేనేత వస్త్రాల ప్రదర్శన...

తరం మారింది. ఈ తరంలో మగ్గంతో పని చేసే వాళ్లలో మహిళలే ఎక్కువ. గిట్టుబాటు లెక్క చూసుకుని ఈ వృత్తిని వదిలేస్తున్నారు మగవాళ్లు. ఇంతకాలం మగవాళ్లకు సహాయంగా పని చేసిన మహిళలు ఇప్పుడు మగ్గం ముందు కూర్చున్నారు. కండె చేతిలోకి తీసుకున్నారు. తదేకంగా పని చేస్తున్నారు. వాళ్ల దీక్ష చూస్తుంటే మాటలతో పని లేనట్లు మౌనంగా ధ్యానంలో ఉన్నట్లే ఉంటారు. వాళ్ల చేతులు మాట్లాడతాయి. మగ్గం మీద దారంతో అద్భుతాలు సృష్టిస్తాయి. కశ్మీర్ నుంచి కేరళ వరకు ఈ మంత్రజాలం అంతా కొత్త చేనేతరానిదే. వారికి వందనం.

వందే నేతరం



జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా (ఆగస్టు 7వ తేదీ) సోమవారంనాడు దేశంలోని చేనేతల గొప్పదనాన్ని తెలియజేసే కార్యక్రమం జరిగింది. హైదరాబాద్, జూబ్లీహిల్స్‌లోని గౌరంగ్స్ కిచెన్‌లో 'విష్పర్స్ ఆఫ్ ద లూమ్' పేరుతో మాస్టర్ టెక్స్‌టైల్ డిజైనర్ గౌరంగ్ షా నిర్వహించిన ఈ కార్యక్రమంలో జామ్‌దానీ నేత ప్రత్యేకతను వివరించారు. ఈ నేత విధానాన్ని మనదేశంలో ఎన్ని ఇతర చేనేతలతో సమ్మిళితం చేయవచ్చనేది ప్రయోగపూర్వకంగా వివరిస్తూ వీడియో ప్రజెంటేషన్ ఇచ్చారు గౌరంగ్.

ఈ తరం మనసు పడుతోంది!

మహిళలు మనదేశ సంప్రదాయ చేనేత వైవిధ్యాన్ని చెరిగిపోని జ్ఞాపకంగా నిలుపుతున్నారు. కశ్మీర్ నుంచి ఢాకా వరకు, కోట, పైఠానీ, వెంకటగిరి, ఉప్పాడ, బనారస్, కంజీవరం, పటోలా, మహేశ్వరి, చందేరి, జాకార్డ్, బంధాని, ఇకత్... ఇలా ఎన్నో రకాల చేనేతలున్నాయి మనదేశంలో. కొత్తదనం ఎప్పుడూ మనిషిని ఆశ్చర్యానికి గురి చేస్తూనే ఉంటుంది. ఆశ్చర్యం ఆకర్షణగా మారుతుంది. అలా వెస్టర్న్ టెక్స్‌టైల్ ప్రవాహంలో కొంతకాలం మన సంప్రదాయ చేనేతలు తెరమరుగయ్యాయి. కానీ కనుమరుగు మాత్రం కాలేదు. భారతీయత లాగానే మన చేనేత కూడా తన ఉనికిని చాటుతూనే ఉంది. పడి లేచిన కెరటంలాగ ఇప్పుడు మన సంప్రదాయ చేనేత ఫ్యాషన్ ప్రపంచాన్ని శాసిస్తోంది. చేనేతలో ఈ తరం చేసిన ప్రయోగాలు మహిళల మనసును దోచుకుంటున్నాయి. రోజూ చీర కట్టడానికి ఇష్టపడని మహిళలు కూడా మన చేనేత చీరల కోసం వార్డ్‌రోబ్‌లో కొంత స్థలాన్ని కేటాయిస్తున్నారు. పండుగలు, వేడుకల వంటి ప్రత్యేకమైన రోజులను చేనేత చీరలతో పరిపూర్ణం చేసుకుంటున్నారు. ఈ రంగంలో చేనేత కళాకారుల కృషి కనువిందు చేస్తోంది.

వైవిధ్యాల సమ్మేళనం!


ఒకప్పుడు ఒక చేనేత చీరను చూడగానే అది ఇకత్ అనీ, చందేరి, ఉప్పాడ, వెంకటగిరి, ధర్మవరం, పైఠానీ... ఇలా వెంటనే పేరు చెప్పగలిగేటట్లు ఉండేవి. తరాలు మారుతున్నా నేత విధానంలో ఏ మార్పూ లేకపోవడం వల్ల ఆదరణ తగ్గుతూ వచ్చింది. అలవాటు పడిన తరాలు తప్ప కొత్తతరం చేనేత వైపు చూడని రోజులు కూడా వచ్చేశాయి. అప్పుడు వచ్చింది కెరటంలాంటి ఓ ట్రెండ్. కంజీవరంలో జామ్‌దాని, బనారస్‌లో జాకార్డ్, ఉప్పాడలో జామ్‌దాని...

ఇలాంటి ప్రయోగాలతో ఈ తరం చేనేత చీర ఒక పజిల్‌లా ఉంది. దేశంలో ఉన్న నాలుగైదు రకాల వైవిధ్యతలకు ప్రతీకగా మారింది.

మనం పరిరక్షించుకోవాల్సింది చేనేతను, చేనేతకారులను కూడా. సంప్రదాయ చేనేతకారుల కుటుంబాల నుంచి మహిళలు ఆ బాధ్యతను తలకెత్తుకున్నారు. వారికి సహకారం ఉంటే అద్భుతాలు సృష్టించగలరని నిరూపిస్తున్నారు. ఈ రంగం మీద సంప్రదాయ చేనేత కుటుంబాల నుంచి మాత్రమే కాకుండా ఆసక్తి కొద్దీ ఇతరులు కూడా ఆసక్తి చూపిస్తున్నారు. తన ప్రయోగాలకు సంప్రదాయ కుటుంబాలు శ్రద్ధ చూపించనప్పుడు వ్యవసాయరంగంలో పనులు చేసుకునే మహిళలకు శిక్షణ ఇచ్చి కొత్త చేనేతకారులను తయారు చేశానని చెప్పారు గౌరంగ్. మన వస్త్రాలు దేహాన్ని కప్పుకోవడానికి మాత్రమే కాదు... అంతకంటే ఎక్కువగా భారతీయతను చాటి చెప్తాయి. మన కళాకారుల సృజనను, మేధను ప్రతిబింబిస్తాయి.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

కళాత్మకతను కాపాడుకోవాలి!



చేనేతలో వైవిధ్యభరితంగా ఒక చీర తయారు కావాలంటే నెలలు పడుతుంది, ఏళ్లు కూడా పడుతుంది. ఒక అంగుళంలో ఎనభై దారాలతో నేస్తే పట్టే సమయం ఒకలా ఉంటుంది. అంగుళంలో నాలుగు వందల దారాలతో నేస్తే పట్టే సమయం వేరు. నాలుగు వందల కౌంట్ దారం కంటికి కనిపించనంత సన్నగా ఉంటుంది. డిజైన్‌ను బట్టి చీర తయారయ్యే సమయం కూడా పెరుగుతూ ఉంటుంది. రెండు దారాలు తప్పుగా పడినా సరే పువ్వు ఆకారం మారిపోతుంది. ఒక వరుస నేయడానికి పదిహేను నుంచి ఇరవై నిమిషాల సమయం పడుతుంది. అలా ఎన్ని వందల వరుసలు నేస్తే ఆరు మీటర్ల వస్త్రం తయారవుతుందో ఊహించుకోవాల్సిందే. మహిళలు ఉదయం ఇంటి పనులు చక్కబెట్టుకుని పన్నెండు– పన్నెండున్నర సమయంలో మగ్గం మీదకు వస్తే సాయంత్రం ఆరు గంటల వరకు తదేకంగా దీక్షతో పని చేస్తారు. ఇంత అద్భుతమైన కళను ముందు తరాలకు అందేలా కొనసాగించాలి. ఒక హెరిటేజ్ కన్‌స్ట్రక్షన్‌ను పరిరక్షించుకున్నట్లే ఈ సంప్రదాయ కళలను కూడా కాపాడుకోవాలి. ఈ ఏడాది హ్యాండ్‌లూమ్ డే కోసం... చేనేత ప్రయోగాలతోపాటు కలంకారీ, పటచిత్ర, చేర్యాల పెయింటింగ్‌లు, ఎంబ్రాయిడరీల్లో చికన్‌కారీ, కచ్‌వర్క్, ఆరే వర్క్, కసౌటీ, కశ్మీరీవర్క్‌లను కూడా చేనేతకు జోడించి ఓ ప్రయోగం చేశాను.

- గౌరంగ్ షా,
మాస్టర్ టెక్స్‌టైల్ డిజైనర్



● డాక్టర్ శివరంజని

ప్రాణ రక్షణ

ఫస్ట్ ఎయిడ్ గురించి కొద్దిపాటి అవగాహన ఉన్నా వేలకొద్దీ ప్రాణాలను కాపాడవచ్చు అంటున్నారు డాక్టర్ శివరంజని. హైదరాబాద్‌కు చెందిన ఈ పిడియాట్రీషియన్ పసిపిల్లల్లో, పెద్దల్లో వచ్చే హఠాత్ అపస్మారకం, ఉక్కిరిబిక్కిరి, ఫిట్స్ సమయాల్లో ఎలా వ్యవహరిస్తే ప్రాణాలు నిలుస్తాయో గత దశాబ్దకాలంగా ఉచిత వర్క్‌షాపుల ద్వారా చైతన్యపరుస్తున్నారు. తన జీవితంలోని ఒక సంఘటన వల్లే లైఫ్ సేవింగ్ స్కిల్స్ అవసరాన్ని తెలుసుకున్నానని అంటున్నారామె.

శివరంజని సంజీవని

రాధిక (పేరు మార్చాం) హాల్లో టీవీ చూస్తోంటే బాత్‌రూమ్ లోనుంచి ధబ్‌మని శబ్దం వచ్చింది. పరిగెత్తుకెళ్లి చూస్తే భర్త అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అతనికి హార్ట్‌ఎటాక్ వచ్చినట్టు ఆమెకు అర్థమైంది. అదృష్టవశాత్తు నెల క్రితం ఆమె డాక్టర్ శివరంజని నిర్వహించిన ఒక వర్క్‌షాప్‌లో సి.పి.ఆర్. ఎలా చేయాలో తెలుసుకుంది. వెంటనే ఛాతీ మీద నియమానుసారం నొక్కుతూ భర్తకు నోటితో ఊపిరి అందించింది. భర్తలో చలనం వచ్చింది. వెంటనే ఆస్పత్రికి తరలిస్తే అతనికి వచ్చిన హార్ట్‌ఎటాక్ ప్రాణాంతకం కాకుండా కాపాడటంలో ఆమె చేసిన సి.పి.ఆర్ చాలా ముఖ్యపాత్ర పోషించిందని డాక్టర్లు తెలిపారు. 'ఫస్ట్ ఎయిడ్ తెలిస్తే ఇలాగే ఎన్నోప్రాణాలు నిలుస్తాయి. ఆమె సాధారణ గృహిణి. సి.పి.ఆర్. ఎలా చేయాలో ఎవరో ఒకరు చెప్పాలి కదా. ఆమెకే కాదు.. ఆమె లాంటి గృహిణులకు స్త్రీలకు అందరికీ ఎవరో ఒకరు తెలపాలి. నా వంతుగా నేను వర్క్‌షాప్స్ ద్వారా తెలుపుతున్నాను' అంటారు శివరంజని.



● వర్క్‌షాప్ నిర్వహిస్తూ...

పిల్లల డాక్టర్

డాక్టర్ శివరంజని పిల్లల డాక్టర్. 'మా నాన్నగారు, తాతగారు కూడా డాక్టర్లే. నేను డాక్టర్ కావాలనుకున్నప్పుడు పిల్లలంటే ఇష్టం కనుక వారికి వైద్యం చేయడంలో ఆనందం ఉందనిపించింది. జిప్‌మర్ (పాండిచ్చేరి)లో పిల్లల వైద్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాను' అన్నారు శివరంజని. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లో పిల్లల డాక్టర్‌గా పని చేస్తున్నారు. అయితే కేవలం తన వృత్తిని పనిగా మాత్రమే చూడదలుచుకోలేదు. తనకు తెలిసిన జ్ఞానాన్ని సామాన్యులకు కొద్దిగానైనా అందుబాటులో తేవాలని అనుకున్నారు. 'మన దగ్గర ప్రతి ఆరు మరణాల్లో ఒకటి ఫస్ట్ ఎయిడ్ ఎలా చేయాలో తెలియపోవడం వల్ల జరుగుతోంది. గుండెపోటు, మూర్ఛ, అపస్మారకం, ఊపిరాడకపోవడం ఇలాంటి సందర్భాల్లో ఏం చేయాలో ఎలా చేయాలో అందరికీ శాస్త్రీయమైన శిక్షణ ఉంటే చాలా ప్రాణాలు కాపావచ్చు. అందుకే గత పదేళ్లుగా నేను ఉచితంగా వర్క్‌షాప్‌లు నిర్వహిస్తూ చైతన్యం తెస్తున్నారు' అన్నారామె.

మలుపు తిప్పిన ఘటన

'నేను పాండిచ్చేరిలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తున్నప్పుడు ఒకరోజు ఉసిరి కాయలు తింటుంటే హఠాత్తుగా ఉక్కిరిబిక్కిరి అయ్యింది. నా పక్కనే సహ విద్యార్థిని ఉంది. ఆమెకు ఇలాంటి స్థితిలో చేయాల్సిన హైమ్‌లక్ మనూవా (ఉక్కిరిబిక్కిరి సమయంలో పొత్తికడుపు మీద నొక్కుతూ చేయాల్సిన ఫస్ట్ ఎయిడ్) తెలుసు. వెంటనే చేసింది. ఆమె లేకున్నా, ఆ ఫస్ట్ ఎయిడ్ చేయకున్నా ఇవాళ మిగిలేదాన్ని కాదు. అప్పుడే నాకు ఫస్ట్ ఎయిడ్ విలువ ఏంటో తెలిసింది. కాని దురదృష్టం మన దేశంలో ఇందుకై సాధారణ ప్రజలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వరు. అవగాహన కల్పించరు. కొద్దిమందికే ఈ అవగాహన ఉంటుంది. నా వంతుగా నేను వర్క్‌షాప్స్ ద్వారా అవగాహన కలిగిస్తున్నాను' అన్నారు శివరంజని.

పసిపిల్లలకు

'చంటిపిల్లలు ఒక్కోసారి ఊపిరిపీల్చని స్థితికి వెళతారు. సి.పి.ఆర్ చేయడం తెలిసుంటే పిల్లల్ని కాపాడుకోగలుగుతారు తల్లులు. అలాగే వారు గొంతుకు అడ్డం పడేలా ఏదైనా మింగినప్పుడు కూడా ఏం చేయాలో తల్లులకు తెలియాలి. ఇవన్నీ నా వర్క్‌షాప్స్‌లో చూపిస్తాను. ఇందుకు బొమ్మలను ఉపయోగిస్తాను' అన్నారు శివరంజని. ఇందు కోసం ఆమె నేరుగా ఆన్‌లైన్‌లో సెషన్స్ నిర్వహిస్తారు. 'కాని చాలామంది తల్లులు సెషన్స్‌కు రారు. ఆ ఏముందిలే అనుకుంటారు. వారిని ఒప్పించి తేవడం కష్టం. అయినా నేను పట్టువిడవక ప్రయత్నిస్తాను. ఫోన్లు చేసి పిలుస్తాను. వాట్సప్ గ్రూప్ పెట్టి వెంటపడతాను' అంటారు శివరంజని.

డాక్టర్ శివరంజని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బెంగుళూరులలో గత పదేళ్లలో 12 వేల మంది తల్లులకు, సాధారణ వ్యక్తులకు ఫస్ట్ ఎయిడ్ స్కిల్స్ నేర్పించారు. అంతేకాదు... సీజనల్‌గా అవసరమైన హెల్త్ అవేర్‌నెస్ కోసం వీడియోలు చేస్తుంటారు. ఇలాంటి కృషి విలువైనది. ఇతర డాక్టర్లు అనుసరించాల్సినది.

ఫస్ట్ టైమ్



పద్దెనిమిది సంవత్సరాల రిన్ష పట్టిక డీజీసీఏ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) లైసెన్స్ పొందిన కేరళ తొలి మహిళా డ్రోన్ పైలట్‌గా చరిత్ర సృష్టించింది....

కలల రెక్కలతో...

కేరళలోని మలప్పురానికి చెందిన రిన్ష పట్టికకు గాలిలో ఎగురుతున్న డ్రోన్‌లను చూడడం అంటే సరదా. ఆ సరదా కాస్తా ఆసక్తిగా మారింది. డ్రోన్‌లకు సంబంధించిన ఎన్నో విషయాలను సివిల్ ఇంజనీర్ అయిన తండ్రి అబ్దుల్ రజాక్‌ను అడిగి తెలుసుకునేది.

ప్లస్ టు పూర్తయిన తరువాత బీటెక్ అడ్మిషన్ కోసం ఎదురుచూస్తున్న టైమ్‌లో విరామ కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలా అని ఆలోచిస్తున్నప్పుడు రిన్షకు తట్టిన ఐడియా డ్రోన్ ఫ్లయింగ్ ట్రైనింగ్ కోర్సు. తండ్రితో చెబితే ఆయన 'బాగుంటుంది' అని ఓకే చెప్పి ప్రోత్సహించాడు.

శిక్షణ కోసం కాసర్‌గోడ్‌లోని ఏఎస్‌ఏపీ కేరళ కమ్యూనిటీ స్కిల్ పార్క్‌లో చేరింది. క్లాసులో తాను ఒక్కతే అమ్మాయి!

ఈ స్కిల్‌పార్క్‌లో యువతరం కోసం ఆటోమోటివ్ టెక్నాలజీ, కంప్యూటర్ హార్డ్‌వేర్, హాస్పిటాలిటీ, రిటైల్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ఎన్నో వొకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. డ్రోన్ ఫ్లయింగ్ కోర్సుకు మంచి డిమాండ్ ఉంది.

కోర్సులో భాగంగా బేసిక్ ఫ్లైట్ ప్రిన్సిపల్స్ నుంచి డ్రోన్ ఫ్లయింగ్ రూల్స్ వరకు ఎన్నో నేర్చుకుంది రిన్ష.

ఏరియల్ సర్వైలెన్స్, రెస్క్యూ ఆపరేషన్స్, అగ్రికల్చర్, ట్రాఫిక్, వెదర్ మానిటరింగ్, ఫైర్ ఫైటింగ్‌లతోపాటు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, డెలివరీ సర్వీస్... మొదలైన వాటిలో డ్రోన్‌లకు ప్రాధాన్యత పెరుగుతోంది.

మన దేశంలో డ్రోన్స్ ఆపరేట్ చేయడానికి డీజీసీఏ డ్రోన్ రిమోట్ పైలట్ సర్టిఫికెట్ తప్పనిసరి.

డీజీసీఏ లైసెన్స్ పొందిన కేరళ తొలి మహిళా డ్రోన్ పైలట్‌గా చరిత్ర సృష్టించిన రిన్ష ఇలా అంటోంది...

'రెస్క్యూ ఆపరేషన్స్ నుంచి ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ వరకు ఎన్నో రంగాలలో డ్రోన్‌లు విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చాయి. డీజీసీఏ డ్రోన్ రిమోట్ పైలట్ సర్టిఫికెట్ అందుకున్నందుకు గర్వంగా ఉంది'

'రిన్ష విజయం ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తి ఇస్తుంది' అంటున్నారు స్కిల్‌పార్క్ ఉన్నతాధికారులు.



అయ్ బాబోయ్... ఏఐ!

యూత్ పల్స్

'వేవ్ ఆఫ్ ది ఫ్యూచర్'గా చెబుతున్న ఏఐ సాంకేతికత యువతలోని ఒక వర్గంలో వేల భయాలను రేకెత్తిస్తోంది. భూతంలా భయపెడుతోంది. ఏఐ టెక్నాలజీ వల్ల ఉన్న ఉద్యోగాలు పోతాయనీ, ఉద్యోగావకాశాలు ఉండవనే ఆందోళనకు 'ఏఐ యాంగ్జైటీ' అని పేరు పెట్టారు....

ఈ భయం ఈనాటిది కాదు. 'ఈ యంత్రాలు మన ఉపాధిని మింగేస్తాయి' అనే భయం పారిశ్రామిక విప్లవం రోజుల నుంచి ఉన్నదే. చాట్ జీపీటీ విజయవంతం అయిన తరువాత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అనేది ఇప్పుడు యువతను భూతమై భయపెడుతోంది. ఒక సర్వే ప్రకారం పద్దెనిమిది నుంచి ఇరవైనాలుగు సంవత్సరాల మధ్య వయసు వాళ్లు తమ కెరీర్‌కు సంబంధించిన భయాలతో ఉన్నారు.

వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ అంచనా ప్రకారం 2025 కల్లా 85 మిలియన్‌ల ఉద్యోగాలు ఏఐ సాంకేతికతతో భర్తీ అవుతాయి. ఈ నేపథ్యంలో కంపెనీలలో ఉద్యోగుల భవిష్యత్ పనితీరు ఎలా ఉండబోతున్నది అనేది హాట్ టాపిక్‌గా మారింది. ఇది ఎంత పాపులర్ టాపిక్ అయిందంటే మూడు సంవత్సరాల వ్యవధిలో దీనిపై పదుల సంఖ్యలో పుస్తకాలు వచ్చాయి. ఆర్థికవేత్త రిచర్డ్‌బాల్డ్ విన్ తన పుస్తకం 'ది గ్లోబటిక్స్ అప్‌హీవల్'లో ఏఐ ద్వారా ఏయే రంగాలు ఎలాంటి ప్రభావానికి గురవుతాయో విశ్లేషించారు.

కొన్ని పుస్తకాలు మాత్రం 'భయం అక్కర్లేదు' అంటూ యువతను ఆశావహ మార్గం వైపు నడిపిస్తున్నాయి. యంత్రాలతో చెలిమి తప్పదు, తప్పు కాదు అంటున్నాయి.

సాంకేతిక శక్తి ప్రభావితం చేయని, అంటే ఉద్యోగాలకు ప్రమాదం లేని కొన్ని రంగాలు ఉండేవి. ఉదా: ఎకౌంటింగ్, న్యాయశాస్త్రం...మొదలైనవి. అయితే తాజాగా వెల్-ఎడ్యుకేటెడ్ ప్రొఫెషన్స్‌కు సంబంధించిన వారిలో కూడా ఆందోళన మొదలైంది. లా ప్రాక్టీస్‌లో ఏఐ చాట్‌బాట్ కూడా భాగం కానుంది

కెరీర్ అభద్రతకు సంబంధించిన ఆలోచనల నేపథ్యంలో ఒక మార్కెటింగ్ ఏజెన్సీ ద్వారా 'ఏఐ యాంగ్జైటీ' అనే మాట ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇలాంటి పదాలు పుట్టడం కొత్త కాదు. సాంకేతిక పురోగతికి సంబంధించిన ప్రతి సందర్భంలో ఇలాంటి పదాలు ఎన్నో పుట్టాయి. 1980లలో 'కంప్యూటర్ ఫోబియా' 'కంప్యూటర్ యాంగ్జైటీ' 'టెక్నో స్ట్రెస్'లాంటివి పుట్టాయి.

ఏఐకి సంబంధించి రెండు వర్గాలు కనిపిస్తాయి. మొదటి వర్గానికి చెందిన వారిలో 'ఆటోమేషన్ ఆందోళన' కనిపిస్తుంది. రెండో వర్గం వారిలో ఆశాభావం కనిపిస్తుంది. మనుషులు, యంత్రాలతో చేయికలిపితే మెరుగైన ఫలితాలు వస్తాయనేది రెండో వర్గం నమ్మకం. టామ్ క్రూజ్ 'మైనార్టీ రిపోర్ట్'లాంటి సినిమాలలో, పర్సనల్ ఇంట్రెస్ట్‌లాంటి టీవీ షోలలో మనిషి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో జత కడితే జరిగే అద్భుతాలు కనిపిస్తాయి.

వివిధ రంగాలపై ఏఐ ఎలాంటి మార్పును తీసుకురానుంది? ఆ మార్పు మనపై ప్రతికూల ప్రభావం చూపకుండా ఎలా జాగ్రత్త పడాలి? ఏం నేర్చుకోవాలి?... ఈ విషయాలు చెప్పడానికి ఆన్‌లైన్ కోర్సులు వచ్చాయి. ఏఐ సాంకేతికత రీప్లేస్ చేయలేని ఇంటర్‌పర్సనల్ స్కిల్స్ లేదా ఎమోషనల్ ఇంటెలిజెన్స్ గురించి అవి నొక్కి చెబుతున్నాయి. డిజిటల్‌తో పాటు సాఫ్ట్‌స్కిల్స్‌ను కలగలిపి పాఠాలుగా చెబుతున్నాయి. ఈ కోర్సులపై యువత ఆసక్తి ప్రదర్శిస్తోంది.

'ఉద్యోగాలపై ఏఐ టెక్నాలజీ ప్రభావం గురించి ఫ్రెండ్‌కు నాకు మధ్య చర్చ జరిగింది. ఏటీఎం మెషీన్‌లు వచ్చిన కొత్తలో బ్యాంకింగ్ రంగంలో ఎంతోమంది ఉద్యోగాలు కోల్పోతారు, కొత్త ఉద్యోగాలు ఉండవు...ఇలా ఎన్నో మాటలు వినిపించేవి. కాని అది నిజం కాలేదు. ఉద్యోగుల పనితీరు మాత్రం మారింది. ఏఐ టెక్నాలజీ విషయంలోనూ జరిగేది ఇదే' అంటుంది ముంబైకి చెందిన అక్షర.

ఏఐ... అయితే ఏంటీ!

యువతలో ఏఐ ఫోబియాను తొలగించడానికి ఫోర్బ్స్ కోచెస్ కౌన్సిల్ సభ్యులు కొన్ని సూచనలు చేశారు. వాటిలో కొన్ని...

● ఏఐ అంటే భయం కాదు, ఇష్టం పెంచుకోండి. ఏఐకు సంబంధించి ప్రతిదీ నేర్చుకోండి. నిపుణులతో మాట్లాడండి. ఉద్యోగ నైపుణ్యానికి ఏఐ ఎలా ఉపయోగపడగలదు అనే కోణంలో ఆలోచించండి.

● మనిషికి ఉండే సహజ నైపుణ్యాలను ఏఐ ఎప్పుడూ రీప్లేస్ చేయలేదు. మనిషికి ఉండే కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రేరణశక్తి, ఎత్తుగడలు, సమయస్ఫూర్తి...యంత్రం అనుకరించలేనివి.

● 'ఈ ఉద్యోగం మాత్రమే చేస్తాను. ఇది మాత్రమే చేయగలను' అని ఫిక్స్ కావద్దు. బీ ఫ్లెక్సిబుల్. ఏ ఉద్యోగమైనా చేసే నైపుణ్యాన్ని సొంతం చేసుకోండి. ఒకే దారిలో నడిచే వారికి ఆ దారి మాత్రమే తెలుస్తుంది. కొత్త దారుల్లో నడవడం నేర్చుకుంటే అది ఎప్పటికైనా ఉపయోగపడుతుంది.

● ఒత్తిడి దరి చేరని, సమస్యలను పరిష్కరించే, సానుకూలతను శక్తిగా మార్చుకునే, ఇతరులతో మంచి స్నేహసంబంధాలతో ఉండగలిగే ఎమోషనల్ ఇంటెలిజెన్స్‌ను మెరుగుపరుచుకోండి.

● ఏఐ ఎలాంటి పాత్ర అయినా పోషించగలదు...అని విశ్వసించే సందర్భంలో ఉన్నాం. ఇలాంటి సమయంలోనే ఏఐ కంటే భిన్నంగా, మెరుగ్గా పనిచేసే నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలి.





సింధు ర్యాంక్‌లో పురోగతి

ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య ర్యాంకింగ్స్ మహిళల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ పీవీ సింధు రెండు స్థానాలు పురోగతి సాధించింది. తాజా ర్యాంకింగ్స్‌లో సింధు 17 నుంచి 15వ స్థానానికి చేరుకుంది. పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్ 9వ ర్యాంక్‌లో, లక్ష్య సేన్ 11వ ర్యాంకుల్లో కొనసాగుతుండగా... శ్రీకాంత్ ఒక స్థానం పడిపోయి 20వ ర్యాంక్‌లో నిలిచాడు. గతవారం ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెమీఫైనల్ చేరిన ప్రియాన్షు రజావత్ మూడు స్థానాలు ఎగబాకి 28వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.



బ్యాగు, కిట్ విమానంలో... మనిక బత్రా భారత్‌కు!

పెరూ టోర్నమెంట్‌లో ఆడిన భారత టేబుల్ టెన్నిస్ స్టార్ ప్లేయర్ మనిక బత్రా డచ్ విమానయాన సంస్థకు చెందిన కేఎల్ఎమ్ ఎయిర్‌లైన్స్‌లో భారత్‌కు చేరుకుంది. అయితే ఈ విమానంలో తన విలువైన బ్యాగేజ్‌ను మరిచిపోయిన మనిక ఇక్కడికి వచ్చాక సంబంధిత ఎయిర్‌లైన్స్ సంస్థను సంప్రదించినప్పటికీ ఆశించిన స్పందన కరువైంది. దీంతో ఆమె సాయం చేయాలని కోరుతూ పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు ట్వీట్ చేసింది.



భారత్‌ను నిలువరిస్తేనే...

పాకిస్తాన్‌కు సెమీఫైనల్ బెర్త్
- చిరకాల ప్రత్యర్థుల మధ్య నేడు చివరి లీగ్ మ్యాచ్
- రాత్రి గం. 8:30 నుంచి స్టార్ స్పోర్ట్స్ ఫస్ట్‌లో ప్రత్యక్ష ప్రసారం

చెన్నై: సాధారణంగా దాయాదుల మధ్య హాకీ మ్యాచ్ జరిగినా... క్రికెట్ పోరు జరిగినా... అది ఆ టోర్నీకే ఆసక్తికరమైన సమరమవుతుంది. కానీ ఈసారి ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్‌లో చిరకాల ప్రత్యర్థులు భారత్, పాక్‌లు బుధవారం తలపడుతున్నప్పటికీ మునుపటిలా ఇది మాత్రం భారత్ పక్షం నుంచి అవసరం, అంతటి ఆసక్తికరమని అనలేం! ఎందుకంటే ఇదివరకే భారత జట్టు అజేయంగా సెమీఫైనల్ చేరింది. పాక్‌తో మ్యాచ్ పూర్తిగా నామమాత్రమైంది. కానీ దాయాదికి మాత్రం ఇది చావోరేవోలాంటి పోరు. ఓడితే మాత్రం సెమీస్ దారులు మూసుకుపోతాయి. కనీసం 'డ్రా'తో గట్టెక్కితేనే అవకాశాలుంటాయి. ఈ నేపథ్యంలో భారత ఆటగాళ్లు స్వేచ్ఛగా ఆడుతూ పాడుతూ ప్రత్యర్థిపై ఆధిపత్యం కనబరిచే అవకాశముంది. మరోవైపు ముందుకెళ్లడమో, ఇక్కడే ముగించుకోవడమో తేల్చుకోవాల్సిన మ్యాచ్ కాబట్టి పాకిస్తాన్‌పై తీవ్రమైన ఒత్తిడి ఉంది. భారత్ ఫామ్, ఈ టోర్నీలో కనబరిచిన దూకుడు, ఆధిపత్యం దృష్ట్యా పాక్ గెలవాలంటే సర్వశక్తులు ఒడ్డినా సరిపోదేమో! అసాధారణ ఆటతో పాటు అదృష్టం కూడా కలిసొస్తేనే పాక్ గెలిచేందుకు సాధ్యమవుతుంది. లేదంటే ఎదురేలేని భారత్‌ను ఎదురించడం అంత సులభం కానేకాదు. 2016 దక్షిణాసియా క్రీడల ఫైనల్లో చివరిసారి భారత్‌పై పాకిస్తాన్ గెలిచింది. భారత్-పాక్ మ్యాచ్ కంటే ముందు చైనాతో జపాన్; దక్షిణ కొరియాతో మలేసియా తలపడతాయి. మలేసియా కూడా సెమీఫైనల్ చేరడంతో మిగతా రెండు బెర్త్‌ల కోసం కొరియా, పాకిస్తాన్, జపాన్ రేసులో ఉన్నాయి.

ఆసియా క్రీడల్లో ఒకే గ్రూప్‌లో...

హాంగ్జౌలో జరగనున్న ప్రతిష్టాత్మక ఆసియా క్రీడల్లో హాకీ ఈవెంట్‌లో భారత్, పాకిస్తాన్‌లు ఒకే గ్రూపులో తలపడనున్నాయి. గ్రూప్ 'ఎ'లో దాయాదులతో పాటు జపాన్, బంగ్లాదేశ్, సింగపూర్, ఉజ్బెకిస్తాన్‌లు ఉన్నాయి. సెప్టెంబర్ 24న జరిగే తొలి మ్యాచ్‌లో ఉజ్బెకిస్తాన్‌తో భారత్ తలపడుతుంది. ఆసియా క్రీడల ఈవెంట్‌కే హైలైట్ కాబోయే ఇండో-పాక్ పోరు సెప్టెంబర్ 30న జరుగుతుంది. టైటిల్ పోరు అక్టోబర్ 6న నిర్వహిస్తారు. మహిళల విభాగంలోనూ భారత్ 'ఎ' గ్రూపులో ఉంది. ఇందులో హాంకాంగ్, సింగపూర్, కొరియా, మలేసియా ఇతర జట్లు కాగా... అమ్మాయిల బృందం 27న తమ తొలి పోరులో సింగపూర్‌తో ఆడుతుంది.

భారత్ అత్యుత్తమ ప్రదర్శన

చెంగ్డూ (చైనా): ప్రపంచ విశ్వ విద్యాలయాల క్రీడల్లో భారత బృందం తమ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. మంగళవారం ముగిసిన ఈ క్రీడల్లో భారత్ 11 స్వర్ణాలు, 5 రజతాలు, 10 కాంస్యాలతో కలిపి మొత్తం 26 పతకాలు సాధించి ఏడో స్థానంలో నిలిచింది. ఈ ఏడాదికంటే ముందు జరిగిన విశ్వ విద్యాలయాల క్రీడల్లో భారత బృందం ఓవరాల్‌గా 21 పతకాలు (6 స్వర్ణాలు, 6 రజతాలు, 9 కాంస్యాలు) సాధించింది. ఈసారి మాత్రం భారత్ విశేషంగా రాణించింది.

సూర్య అదరగొట్టగా...

భారత టి20 బృందం ఎట్టకేలకు తమ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చింది. ముందుగా చక్కటి బౌలింగ్‌తో వెస్టిండీస్‌ను కట్టడి చేసిన టీమ్ ఆ తర్వాత సునాయాసంగా లక్ష్యాన్ని అందుకుంది. హిట్టర్ సూర్యకుమార్ యాదవ్ తనదైన శైలిలో మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగి విజయానికి బాటలు వేయగా, తిలక్ వర్మ మరో చక్కటి ఇన్నింగ్స్‌తో అండగా నిలిచాడు. సిరీస్‌లో ప్రత్యర్థి ఆధిక్యాన్ని టీమిండియా 2-1కి తగ్గించగా, ఇప్పుడు తర్వాతి రెండు మ్యాచ్‌లలో ఆధిపత్యం కోసం ఇరు జట్లు అమెరికా వేదికగా తలపడతాయి.

- మూడో టి20లో భారత్ ఘనవిజయం
- 7 వికెట్లతో విండీస్ చిత్తు
- రాణించిన తిలక్ వర్మ
- శనివారం నాలుగో టి20


సూర్యకుమార్

100
అంతర్జాతీయ టి20ల్లో సూర్యకుమార్ 100 సిక్స్‌లు పూర్తి చేసుకున్నాడు. 1007 బంతుల్లోనే అతను 100 సిక్స్‌లు కొట్టడం విశేషం. అత్యధిక సిక్సర్ల జాబితాలో భారత్ తరఫున రోహిత్ (182), కోహ్లి (117) మాత్రమే అతనికంటే ముందున్నారు.


తిలక్‌వర్మ

ప్రావిడెన్స్ (గయానా): వరుసగా రెండు పరాజయాల తర్వాత భారత్ కోలుకొని కీలక విజయాన్ని నమోదు చేసింది. మంగళవారం విండీస్‌తో జరిగిన మూడో టి20లో భారత్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వెస్టిండీస్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. బ్రెండన్ కింగ్ (42 బంతుల్లో 42; 5 ఫోర్లు, 1 సిక్స్), రావ్‌మన్ పావెల్ (19 బంతుల్లో 40 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడగా, కుల్దీప్ యాదవ్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం భారత్ 17.5 ఓవర్లలో 3 వికెట్లకు 164 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూర్యకుమార్ యాదవ్ (44 బంతుల్లో 83; 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) సత్తా చాటగా, హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ (37 బంతుల్లో 49 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఆకట్టుకున్నాడు. సూర్య, తిలక్ మూడో వికెట్‌కు 51 బంతుల్లోనే 87 పరుగులు జోడించారు. ఇరు జట్ల మధ్య నాలుగో టి20 శనివారం అమెరికాలోని లాడర్‌హిల్‌లో జరుగుతుంది.


కుల్దీప్ యాదవ్

పావెల్ మెరుపులు...
విండీస్‌కు ఓపెనర్లు కింగ్, కైల్ మేయర్స్ (20 బంతుల్లో 25; 3 ఫోర్లు, 1 సిక్స్) శుభారంభం అందించారు. వీరిద్దరు 42 బంతుల్లో 50 పరుగులు జత చేశారు. అయితే అక్షర్ ఈ జోడీని విడదీయగా, చార్లెస్ (12) ఎక్కువసేపు నిలవలేదు. పూరన్ (12 బంతుల్లో 20; 2 ఫోర్లు, 1 సిక్స్) క్రీజ్‌లో ఉన్నంత సేపు ధాటిగా ఆడినా కుల్దీప్ చక్కటి బంతికి అతను స్టంపౌట్ అయ్యాడు. అదే ఓవర్లో కింగ్‌ను కూడా కుల్దీప్ పెవిలియన్ పంపడంతో విండీస్ పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. హెట్‌మైర్ (9) కూడా విఫలమైనా... పావెల్ దూకుడుతో చివరి 4 ఓవర్లలో ఆ జట్టు 46 పరుగులు జోడించగలిగింది. అర్ష్‌దీప్ ఓవర్లో 2 సిక్స్‌లు బాదిన పావెల్ ముకేశ్ వేసిన చివరి ఓవర్లోనూ మరో సిక్స్ కొట్టాడు.


సూర్య ధనాధన్...
తొలి అంతర్జాతీయ టి20లో యశస్వి జైస్వాల్ (1) ప్రభావం చూపలేకపోగా గిల్ (6) పేలవ ఫామ్ కొనసాగింది. అయితే తొలి రెండు బంతులను 4, 6గా మలచి సూర్య ధాటిగా మొదలు పెట్టగా, తిలక్ కూడా తొలి 5 బంతుల్లోనే 3 ఫోర్లు కొట్టడంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 60 పరుగులకు చేరింది. షెఫర్డ్ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లతో 23 బంతుల్లోనే సూర్య అర్ధ సెంచరీ పూర్తయింది. ఆ తర్వాతా సూర్య దూకుడు కొనసాగగా... తిలక్ అండగా నిలిచాడు. సెంచరీ దిశగా దూసుకుపోతున్న దశలో మరో భారీ షాట్‌కు ప్రయత్నించి సూర్య వెనుదిరిగాడు. అయితే తిలక్, హార్దిక్ పాండ్యా (15 బంతుల్లో 20 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) అభేద్యంగా 31 బంతుల్లో 43 పరుగులు జత చేసి మ్యాచ్‌ను ముగించారు. ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ టి20ల్లో అరంగేట్రం చేసిన యశస్వి జైస్వాల్ భారత్ తరఫున ఈ అవకాశం దక్కించుకున్న 105వ ఆటగాడిగా నిలిచాడు.

స్కోరు వివరాలు

వెస్టిండీస్ ఇన్నింగ్స్: కింగ్ (సి అండ్ బి) కుల్దీప్ 42; మేయర్స్ (సి) అర్ష్‌దీప్ (బి) అక్షర్ 25; చార్లెస్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 12; పూరన్ (స్టంప్డ్) సామ్సన్ (బి) కుల్దీప్ 20; పావెల్ (నాటౌట్) 40; హెట్‌మైర్ (సి) తిలక్ (బి) ముకేశ్ 9; షెఫర్డ్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 159. వికెట్ల పతనం:** 1-55, 2-75, 3-105, 4-106, 5-123. **బౌలింగ్:** పాండ్యా 3-0-18-0, అర్ష్‌దీప్ 3-0-33-0, అక్షర్ 4-0-24-1, చహల్ 4-0-33-0, కుల్దీప్ 4-0-28-3, ముకేశ్ 2-0-19-1.

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (సి) జోసెఫ్ (బి) మెకాయ్ 1; గిల్ (సి) చార్లెస్ (బి) జోసెఫ్ 6; సూర్యకుమార్ (సి) కింగ్ (బి) జోసెఫ్ 83; తిలక్ వర్మ (నాటౌట్) 49; పాండ్యా (నాటౌట్) 20; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (17.5 ఓవర్లలో 3 వికెట్లకు) 164. వికెట్ల పతనం:** 1-6, 2-34, 3-121. **బౌలింగ్:** మెకాయ్ 2-0-32-1, హోసీన్ 4-0-31-0, జోసెఫ్ 4-0-25-2, ఛేజ్ 4-0-28-0, షెఫర్డ్ 3-0-36-0, పావెల్ 0.5-0-10-0.

సినిమా


అమితాబ్ బచ్చన్


షారుక్ ఖాన్


షారుక్, ప్రియాంకా చోప్రా

'మా డాన్ షారుక్ ఖాన్... వేరే ఎవర్నీ ఊహించలేం' అంటూ మంగళవారం పలువురు షారుక్ ఖాన్ అభిమానులు సోషల్ మీడియా వేదికగా పంచుకున్న అభిప్రాయాలు వైరల్ అవుతున్నాయి. 'డాన్, డాన్ 2' తర్వాత రానున్న 'డాన్ 3'లో షారుక్ నటించరన్న వార్త గుప్పుమనడంతో "షారుక్ ప్లేస్‌లో వేరే డాన్‌ని చూడలేం" అంటున్నారు ఫ్యాన్స్. మంగళవారం ఫర్హాన్ అక్తర్ చెప్పీ చెప్పనట్లు సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన పోస్ట్‌తో 'డాన్ 3' అంశం పై చర్చ ఊపందుకుంది. ఆ వివరాల్లోకి వెళదాం..

నో షారుక్ ఖాన్.. నో డాన్!

- దర్శకుడు ఫర్హాన్‌పై షారుక్ ఫ్యాన్స్ ఆగ్రహం


ఫర్హాన్ అక్తర్

హిందీ తెరపై డాన్ అంటే అమితాబ్ బచ్చన్ గుర్తొస్తారు. ఆయన టైటిల్ రోల్‌లో రూపొందిన 'డాన్' (1978) సూపర్ డూపర్ హిట్టయింది. చంద్ర బారోత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి అయిన బడ్జెట్ దాదాపు రూ 70 లక్షలు. కానీ వసూళ్లు రూ. 7 కోట్లు. అంటే.. పదింతల లాభం. డాన్‌గా అమితాబ్ యాక్షన్‌కి ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఇదే సినిమా తెలుగు రీమేక్ 'యుగంధర్' (1979)లో ఎన్టీఆర్, తమిళ రీమేక్ 'బిల్లా'లో రజనీకాంత్ నటించారు. దక్షిణాదిన కూడా ఈ డాన్ సూపర్ హిట్.

ది చేజ్ బిగిన్స్ ఎగైన్

అమితాబ్ బచ్చన్ డాన్ క్యారెక్టర్ అద్భుతంగా చేయడంతో ఇక డాన్ క్యారెక్టర్ అంటే ఆయనే అని ఫిక్స్ అయ్యారు బాలీవుడ్ ప్రేక్షకులు. అలాంటి తరుణంలో 'నేను ఉన్నాను' అంటూ దాదాపు మూడు దశాబ్దాల తర్వాత షారుక్ ఖాన్ డాన్‌గా తెరపైకి వచ్చారు. షారుక్ డాన్ రోల్‌లో ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో 'డాన్: ది చేజ్ బిగిన్స్ ఎగైన్' (2006) రూపొందింది. అమితాబ్ 'డాన్'కి రీ బూట్ వెర్షన్‌లా ఫర్హాన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. 30 ఏళ్ల తర్వాత వస్తున్న సినిమా కాబట్టి ట్రెండ్‌ని దృష్టిలో పెట్టుకుని కథ తయారు చేయించారు. ఇక అమితాబ్ తర్వాతి తరంలో డాన్ అంటే షారుక్ అనేలా కింగ్ ఖాన్ అద్భుతంగా నటించారు. షారుక్ సరసన ప్రియాంకా చోప్రా నటించారు. సుమారు రూ. 40 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన 'డాన్' దాదాపు రూ. 105 కోట్ల వసూళ్లు రాబట్టి, సంచలన విజయం సాధించింది.

ది కింగ్ ఈజ్ బ్యాక్

సిల్వర్ స్క్రీన్‌పై ఒక పాత్ర హిట్టయితే ఆ క్యారెక్టర్‌ని మళ్లీ మళ్లీ చూడాలనుకుంటారు ప్రేక్షకులు. అమితాబ్ 'డాన్' తర్వాత మళ్లీ డాన్ క్యారెక్టర్‌ని చూడాలనుకున్నారు. షారుక్ 'డాన్'గా వచ్చి, అలరించారు. ఈ హిట్ డాన్‌ని అలా వదిలేస్తే ఎలా? మళ్లీ ఈ పాత్ర చేయాలని షారుక్ అనుకున్నారు. డాన్ కోసం కథలు తయారు చేయించాలని ఫర్హాన్ కూడా ఫిక్స్ అయ్యారు. అలా 'డాన్: ది కింగ్ ఈజ్ బ్యాక్' అంటూ సెకండ్ వెర్షన్ ఆరంభించారు. 'డాన్: ది చేజ్ బిగిన్స్ ఎగైన్' విడుదలైన ఐదేళ్లకు 'డాన్ 2' (2011)ని వెండితెరపైకి వదిలారు. ఇందులోనూ షారుక్ సరసన ప్రియాంకా చోప్రా నటించారు. 'డాన్: ది చేజ్ బిగిన్స్ ఎగైన్'కి రెండింతల బడ్జెట్.. అంటే దాదాపు రూ. 80 కోట్లతో రూపొందించారు. సుమారు రూ. 200 కోట్ల వసూళ్లతో రీబూట్ వెర్షన్‌లో వచ్చిన ఈ రెండో 'డాన్' కూడా ఘనవిజయం సాధించింది. ఫస్ట్ వెర్షన్‌కి ఫర్హాన్ దర్శకత్వం వహించి, ఓ నిర్మాతగా వ్యవహరించారు. రెండో వెర్షన్‌కి కూడా ఫర్హాన్ ఈ రెండు బాధ్యతలు చేపట్టగా, షారుక్ నటించడంతో పాటు ఓ నిర్మాతగా వ్యవహరించారు.


'డాన్ 3'లో రణ్‌వీర్ సింగ్?

ప్రేక్షకులు, షారుక్ అభిమానులు డాన్ క్యారెక్టర్‌ని మరచిపోలేదు. షారుక్ కూడా డాన్ పాత్రతో అనుబంధం పెంచుకున్నారు. ఫర్హాన్‌కి కూడా ఆ పాత్ర అంటే మక్కువ. అందుకే 2011లో 'డాన్ 2'ని రిలీజ్ చేసినప్పట్నుంచి ఇప్పటి వరకూ 'డాన్ 3' గురించి ఏదో సందర్భంలో ఇద్దరూ మాట్లాడుతూ వచ్చారు. 'డాన్ 3' కచ్చితంగా ఉంటుందని ఫర్హాన్ చెప్పుకుంటూ వచ్చారు. త్వరలో మూడో వెర్షన్‌కి శ్రీకారం జరిగే అవకాశం ఉందని మంగళవారం ఫర్హాన్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన వీడియో స్పష్టం చేస్తోంది. ఆ వీడియోలో '3' అంకె కనిపించడంతో పాటు బ్యాక్‌గ్రౌండ్‌లో 'డాన్' థీమ్ మ్యూజిక్ వినబడుతోంది. అలాగే కొత్త శకం ఆరంభం కాబోతోంది అని ఉంది. సో... 'డాన్ 3' రానుందని చాలామంది ఫిక్స్ అయ్యారు. అయితే ఫర్హాన్ నటీనటులను ప్రకటించలేదు. దాంతో ఒకవేళ షారుక్ ఖాన్ అని ఫిక్స్ అయ్యుంటే.. ప్రకటించి ఉండేవారు కదా అనే చర్చ మొదలైంది. అలాగే కొత్త డాన్‌గా రణ్‌వీర్ సింగ్ నటిస్తారనే వార్త ఎప్పట్నుంచో ప్రచారంలో ఉంది. సో.. థర్డ్ వెర్షన్‌లో నటించబోయేది రణ్‌వీరే అని షారుక్ ఫ్యాన్స్ ఫిక్స్ అయ్యారు. పైగా 'కొత్త శకం ఆరంభం కాబోతోంది' అన్నారు కాబట్టి హీరోని మార్చే ఆలోచనలో ఫర్హాన్ ఉన్నారని ఫ్యాన్స్ ఊహిస్తున్నారు. కొందరు ఫ్యాన్స్ ఫర్హాన్ మీద ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేస్తే షారుక్ చేయాలి.. లేదా ఈ సిరీస్‌కి ఫుల్‌స్టాప్ పడాలన్నట్లుగా స్పందిస్తున్నారు. మరోవైపు రణ్‌వీర్ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మరి.. షారుక్ మళ్లీ డాన్‌గా కనిపిస్తారా లేక రణ్‌వీర్ తెర మీదకు వస్తారా? ఒకవేళ రణ్‌వీర్ వస్తే.. అప్పట్లో అమితాబ్‌కి దీటుగా నటించి, డాన్‌గా భేష్ అని షారుక్ అనిపించుకున్నట్లే రణ్‌వీర్ కూడా ప్రేక్షకుల మెప్పు పొందగలుగుతారా? వేచి చూడాల్సిందే.


రణ్‌వీర్ సింగ్

ప్రతీకారంతో...


ఫాహద్ ఫాజిల్

పుష్పరాజ్‌పై ప్రతీకారం తీర్చుకోవడానికి రెడీ అవుతున్నాడు బన్వర్‌సింగ్ షెకావత్. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'పుష్ప'. ఈ సినిమాలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్'లో పుష్పరాజ్‌గా అల్లు అర్జున్, పోలీసాఫీసర్ భన్వర్‌సింగ్ షెకావత్ పాత్రలో ఫాహద్ ఫాజిల్ నటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం 'పుష్ప' చిత్రంలోని మలి భాగం 'పుష్ప: ది రూల్' సెట్స్‌పై ఉంది. ఇందులో కూడా అల్లు అర్జున్, ఫాహద్ ఫాజిల్ నటిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నారు ఫాహద్ ఫాజిల్. కాగా ఆగస్టు 8 (మంగళవారం) ఫాహద్ ఫాజిల్ బర్త్ డే. ఈ సందర్భంగా 'పుష్ప: ది రూల్' సినిమాలోని ఫాహద్ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. 'ప్రతీకారంతో భన్వర్‌సింగ్ షెకావత్ సార్ బిగ్ స్క్రీన్స్‌పై వచ్చేందుకు రెడీ అవుతున్నారు' అనే క్యాప్షన్‌తో చిత్ర యూనిట్ ఫాహద్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఇక ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెల 10న హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని, హీరో అల్లు అర్జున్, హీరోయిన్ రష్మికా మందన్నా షూటింగ్‌లో పాల్గొంటారని తెలిసింది. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ పతాకాలపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2024లో విడుదల కానుంది.

ఇక అంతా బోనస్!

- దర్శకుడు మెహర్ రమేష్



"'షాడో' సినిమా తర్వాత దర్శకుడిగా నాకు కొంత గ్యాప్ వచ్చింది. ఆ గ్యాప్‌లో నేను కొన్ని కథలు రెడీ చేసుకున్నాను. ఇక అన్నయ్య (చిరంజీవి) సినిమాల్లోకి కమ్ బ్యాక్ ఇచ్చాక నా కమ్‌బ్యాక్ సినిమా ఆయనతో చేయాలనుకున్నాను. అందుకే షాడోలో వున్న నాపై మెగా లైట్ పడిందని 'భోళా శంకర్' ప్రీ రిలీజ్‌లో చెప్పాను" అన్నారు దర్శకుడు మెహర్ రమేష్. చిరంజీవి టైటిల్ రోల్ చేసిన తాజా చిత్రం 'భోళా శంకర్'. చిరంజీవి సరసన తమన్నా నటించగా, ఆయన చెల్లెలి పాత్రలో కీర్తి సురేష్ నటించారు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో దర్శకుడు మెహర్ రమేష్ చెప్పిన విశేషాలు.

- 'భోళా శంకర్' సినిమాకు దర్శకుడిగా చేసి, అన్నయ్య ప్రశంసలు అందుకోవడాన్ని పెద్ద అచీవ్‌మెంట్‌లా భావిస్తున్నాను. ఇక దర్శకుడిగా నాకు లభించేది అంతా బోనస్‌గా ఫీలవుతాను. అన్నయ్య, నేను కజిన్స్. సో.. సెట్స్‌లో ఆయన నన్ను ఏరా అని చనువుగా పిలిచేవారు.
- తరాలు మారినా అనుబంధాలు మారలేదు. 'వేదాళం' సినిమాలో అన్నాచెల్లెళ్ల అనుబంధం నాకు బాగా నచ్చింది. ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఎమోషనల్ సీన్స్ ఉన్న ఈ తరహా సబ్జెక్ట్‌ని నేనిప్పటివరకూ డీల్ చేయలేదు. తమిళ 'వేదాళం' సినిమా తెలుగు రీమేక్‌గా 'భోళా శంకర్' చేశాం. గతంలో నా దర్శకత్వంలో కొన్ని రీమేక్స్ వచ్చాయి. సాధారణంగా నేను రీమేక్ రిస్క్ అనుకోను. ఓ టాస్క్‌గా తీసుకుంటాను. వాటికి నా ట్రీట్‌మెంట్ వేరుగా ఉంటుంది. 'భోళా శంకర్'లో 60 నుంచి 70 శాతం మార్పులు చేశాం. పెద్ద సక్సెస్ అయిన సినిమాను కరెక్ట్‌గా తీయడంతో పాటు జనాలకు నచ్చేలా తీయాలి. 'భోళా శంకర్'ని ప్రేక్షకులకు నచ్చేలా ప్రజెంట్ చేశాం.
- ఈ చిత్రంలో చెల్లెలి పాత్రకు కీర్తి సురేష్‌గారు ఒప్పుకుంటారని అనుకోలేదు. స్వప్నా దత్ ద్వారా కీర్తిని అప్రోచ్ అయ్యాను. కథ విని ఆమె ఈ సినిమా ఒప్పుకున్నారు. 'వాల్తేరు వీరయ్య' సినిమాలో రవితేజ పాత్ర ఆ సినిమాకు బిగ్ ఎస్సెట్. అలా 'భోళా శంకర్'లో కీర్తి సురేష్ రోల్ సినిమాకు పెద్ద ఎస్సెట్. మణిశర్మగారి కుమారుడు మహతి స్వరసాగర్ ఈ సినిమాకు మంచి సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఇచ్చాడు. ఇక అనిల్ సుంకరగారు ప్యాషనేట్ అండ్ పాజిటివ్ ప్రొడ్యూసర్. నా తర్వాతి చిత్రాన్ని త్వరలో ప్రకటిస్తాను.

పల్లెటూరి జంక్షన్


ఈశ్వర్, సి. కల్యాణ్

ఈశ్వర్, నైనా సర్వర్ జంటగా నటించిన విలేజ్ డ్రామా 'సూర్యాపేట జంక్షన్'. నాదెండ్ల రాజేష్ దర్శకత్వంలో అనిల్ కుమార్ కత్ర గోడ, ఎన్. శ్రీనివాసరావు నిర్మించారు. ఈ చిత్రంలోని 'చెంగు చెంగుమంటూ జింక పిల్లలాగా..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను నిర్మాత సి. కల్యాణ్ రిలీజ్ చేశారు. రోషన్ సాలూరి స్వరకల్పనలో ఎస్. సాయి చరణ్, సోరస్ పాడిన ఈ పాటకు రెహమాన్ లిరిక్స్ అందించారు. ''వ్యవస్థను సరిదిద్దే బాధ్యత యువతపై ఉంటుంది. కొత్త తరం ఓటర్లు చూడాల్సిన చిత్రమిది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు హరి గౌర మరో స్వరకర్త.

డిఫరెంట్ థ్రిల్లర్


సాహస్, నిఖితా

సాహస్ పగడాల హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ధీమహి'. నవీన్ కంటె మరో దర్శకుడిగా, విరాట్ కపూర్ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రంలో నిఖితా చోప్రా హీరోయిన్. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలో సినిమా రిలీజ్ కానున్న సందర్భంగా ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ''ధీమహి డిఫరెంట్ థ్రిల్లర్ మూవీ. త్వరలో ట్రైలర్ రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

సాక్షి బిజినెస్
బుధవారం
9-8-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	107	65,846
నిఫ్టీ ▽	26	19,571

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,836	▽	159
డోజోన్స్	35,226	▽	246
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,527	▽	27
డాక్స్	15,775	▽	176
షాంఘై	3,261	▽	8
నికాయ్	32,377	△	123

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,338	△	11
బంగారం (99.5 స్వచ్ఛత)	59,100	△	11
వెండి (కిలో)	71,051	▽	797

ఆర్‌బీఐ కీలక పాలసీ భేటీ ప్రారంభం

యథాతథ అంచనాలకే మెజారిటీ ఓటు



ముంబై: గవర్నర్ శక్తికాంత దాస్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల అత్యున్నత స్థాయి ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఆర్‌బీఐ–ఎంపీసీ) సమావేశం మంగళవారం ప్రారంభమైంది. 3 రోజుల ఈ సమావేశ నిర్ణయాలు గురువారం (ఆగస్టు 10వ తేదీ) వెలువడతాయి. ద్రవ్యోల్బణంపై అనిశ్చితి పరిస్థితి నేపథ్యంలో యథాతథ రెపో రేటు (ప్రస్తుతం 6.5 శాతం) నిర్ణయానికి కమిటీ మెజారిటీ మొగ్గు చూపవచ్చన్నది నిపుణుల అభిప్రాయం. ఇదే జరిగితే రేటు యథాతథ స్థితి కొనసాగింపు ఇది వరుసగా మూడవసారి (ఏప్రిల్, జూన్ తర్వాత) అవుతుంది. ద్రవ్యోల్బణం తీవ్రత నేపథ్యంలో గత ఏడాది మే నుంచి రెపో రేటు 2.5 శాతం పెరిగిన సంగతి తెలిసిందే. దీనితో ఈ రేటు 6.5 శాతానికి (ఫిబ్రవరికి) చేరింది. అటు తర్వాత రేటు మార్పు నిర్ణయం తీసుకోలేదు.



ముంబైలో జరిగిన 18వ రిటైల్ జ్యువెలర్ ఇండియా అవార్డ్స్ కార్యక్రమంలో ప్రముఖ నటి సాన్యా మల్హోత్రా చేతుల మీదుగా 'టీవీ క్యాంపెయిన్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్ 2023' అవార్డును స్వీకరిస్తున్న జోయాలుక్కాస్ ఎండీ జాన్ పాల్ అలూక్కాస్.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

9-8-2023	
విశాఖ	450-00
చిత్తూరు	483-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	440-00
విజయవాడ	440-00
రిటైల్ ధర (డజను)	72.00
8-8-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	400-00
వరంగల్	402-00
రిటైల్ ధర	4.60

మారుతీలో ప్రమోటర్ల వాటా ప్లస్!

- సుజుకీ కార్పొరేషన్‌కు షేర్ల జారీకి బోర్డు ఓకే
- 56.4% నుంచి 58.28 శాతానికి అప్
- సుజుకీ గుజరాత్ ప్లాంటు మారుతీ చేతికి



న్యూఢిల్లీ: ప్రిఫరెన్షియల్ పద్ధతిలో షేర్ల జారీకి బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా(ఎంఎస్‌ఐ) తాజాగా వెల్లడించింది. మాతృ సంస్థ సుజుకీ మోటార్ కార్పొరేషన్(ఎస్‌ఎంసీ)కు ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన మారుతీ షేర్లను జారీ చేయనుంది. సుజుకీ మోటార్ గుజరాత్(ఎస్‌ఎంజీ) తయారీ ప్లాంటులో 100 శాతం వాటా కొనుగోలుకిగాను ఎస్‌ఎంసీకి షేర్లను కేటాయించనుంది. తద్వారా మారుతీ సుజుకీ ఇండియాలో ఎస్‌ఎంసీ వాటా 56.4 శాతం నుంచి 58.28 శాతానికి బలపడనుంది. మరోవైపు మారుతీకి పూర్తి అనుబంధ సంస్థగా ఎస్‌ఎంజీ ఆవిర్భవించనుంది. అయితే ఇందుకు విలువ నిర్ధారణ ఆధారంగా జారీ చేయనున్న షేర్ల సంఖ్యను తదుపరి బోర్డు సమావేశంలో నిర్ణయించనున్నట్లు మారుతీ తెలియజేసింది. మంగళవారం సమావేశమైన కంపెనీ బోర్డు ఎస్‌ఎంజీలో సుజుకీ కార్పొరేషన్ ఈక్విటీ కొనుగోలుకి రెండు ఆప్షన్ల(నగదు చెల్లింపు, షేర్ల జారీ)ను పరిశీలించింది. చివరికి అటు కంపెనీ, ఇటు మైనారిటీ వాటాదారులకు లబ్ధి చేకూర్చగల షేర్ల జారీకి ఓటు వేసినట్లు మారుతీ వివరించింది.

ఒకే గొడుగుకిందకు

కంపెనీ భవిష్యత్ వృద్ధి అవకాశాలరీత్యా ఒకే గొడుగుకిందకు తయారీ కార్యకలాపాలను తీసుకువచ్చే ప్రధాన లక్ష్యంతోనే బోర్డు తాజా నిర్ణయాన్ని తీసుకున్నట్లు విలేకరుల వర్చువల్ సమావేశంలో మారుతీ చైర్మన్ ఆర్‌సీ భార్గవ పేర్కొన్నారు. 2030–31కల్లా కంపెనీ మొత్తం ఉత్పత్తి సామర్థ్యం 40 లక్షల యూనిట్లకు చేరనున్న నేపథ్యంలో దీనికి ప్రాధాన్యత ఏర్పడినట్లు తెలియజేశారు. ఎస్‌ఎంజీలో 2014 నుంచి ఎస్‌ఎంసీ రూ. 18,000 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు ప్రస్తావించారు.

పెప్పర్‌ఫ్రై సీఈవో మూర్తి ఆకస్మిక మరణం



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ఫర్నిచర్ సంస్థ పెప్పర్‌ఫ్రై సహ వ్యవస్థాపకుడు, సీఈవో అంబరీష్ మూర్తి (51) ఆకస్మికంగా కన్నుమూశారు. లేహ్ పర్యటనలో ఉన్న ఆయన గుండెపోటుతో మరణించినట్లు మరో సహ వ్యవస్థాపకుడు ఆశీష్ షా సోషల్ మీడియా సైట్ ఎక్స్‌లో (గతంలో ట్విట్టర్) పోస్ట్ చేశారు. బైక్ రైడ్ అంటే ఎంతగానో ఇష్టపడే మూర్తి.. తరచుగా మోటార్‌సైకిల్‌పై ముంబై నుంచి లేహ్‌కు వెళ్లేవారు. తాజాగా కూడా లడఖ్ ట్రిప్‌కి సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. మూర్తి మృతిపై స్విగ్గీపై ఇండియా ఎండీ అమర్‌జీత్ బాత్రా, డ్రూమ్ వ్యవస్థాపకుడు సందీప్ అగర్వాల్, క్యాష్‌కరో కో–ఫౌండర్ స్వాతి భార్గవ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. 1994లో ఢిల్లీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఇంజినీరింగ్ చదివిన మూర్తి ఐఐఎం కోల్‌కతాలో ఎంబీఏ చేశారు. ఆ తర్వాత క్యాడ్‌బరీస్, ఐసీఐసీఐ ఏఎంసీ (ప్రస్తుతం ఐసీఐసీఐ ప్రుడెన్షియల్), లివైస్, ఈబే ఇండియా తదితర సంస్థల్లో పని చేశారు. 2011లో ఆశీష్ షాతో కలిసి పెప్పర్‌ఫ్రైని ప్రారంభించారు.

బిర్లా స్వతంత్ర చేతికి చైతన్య మైక్రోఫైనాన్స్

డీల్ విలువ రూ. 1,479 కోట్లు

ముంబై: పారిశ్రామిక దిగ్గజం కుమారమంగళం బిర్లా కుమార్తె అనన్య బిర్లాకు చెందిన సూక్ష్మ రుణాల సంస్థ 'స్వతంత్ర' తాజాగా చైతన్య ఇండియా ఫిన్ క్రెడిట్‌ను కొనుగోలు చేయనుంది. ఇందుకోసం రూ. 1,479 కోట్లు వెచ్చించనుంది. ఫ్లిప్‌కార్ట్ సహ–వ్యవస్థాపకుడు సచిన్ బన్సల్‌కి చెందిన నవీ గ్రూప్‌లో చైతన్య ఇండియా భాగంగా ఉంది. చైతన్య కొనుగోలు ద్వారా 36 లక్షల మంది యాక్టివ్ కస్టమర్లు, 20 రాష్ట్రాల్లో 1,517 శాఖలు, రూ. 12,409 కోట్ల అసెట్స్ (ఏయూఎం)తో స్వతంత్ర దేశీయంగా రెండో అతి పెద్ద మైక్రోఫైనాన్స్ సంస్థగా ఆవిర్భవించనుంది. 2013లో అనన్య బిర్లా ప్రారంభించిన స్వతంత్రలో రూ. 7,499 కోట్ల ఏయూఎం, 7,000 మంది పైచిలుకు ఉద్యోగులు, 22 లక్షల గ్రామీణ కస్టమర్లు ఉన్నారు. చైతన్య ఇండియా ఫిన్ క్రెడిట్‌కు రూ. 4,900 కోట్ల ఏయూఎం, 6,000 మంది ఉద్యోగులు, 14 లక్షల మంది కస్టమర్లు ఉన్నారు. చైతన్య ఇండియా, దాని మాతృ సంస్థ నవీ ఫిన్‌సర్వ్‌ను 2019లో బన్సల్ కేవలం రూ. 150 కోట్లకు కొనుగోలు చేశారు. గత నాలుగేళ్లలో చైతన్య ఆరు రెట్లు వృద్ధి చెందినట్లు బన్సల్ తెలిపారు. ఈ కొనుగోలుతో తమ సంస్థ విస్తృతి మరింత పెరగగలదని అనన్య బిర్లా తెలిపారు.

ఇన్వెస్టర్ల అప్రమత్తత

- స్వల్ప నష్టాల ముగింపు
- ఎఫ్‌ఎంసీజీ, మెటల్ షేర్లలో అమ్మకాలు



ముంబై: ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన వైఖరి, అమెరికా ద్రవ్యోల్బణ డేటా వెల్లడి(గురువారం)కి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఆసియా, యూరప్ మార్కెట్లలోని బలహీన సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస అమ్మక పరిణామాలు ఒత్తిడి పెంచాయి. ఫలితంగా రోజంతా పరిమిత శ్రేణిలో బలహీనంగా లాభ, నష్టాల మధ్య ట్రేడైన సూచీలు మంగళవారం స్వల్ప నష్టంతో ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 96 పాయింట్ల లాభంతో 66,049 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 201 పాయింట్లు నష్టపోయి 65,753 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 107 పాయింట్లు నష్టపోయి 65,846 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 30 పాయింట్లు పెరిగి 19,627 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. రోజంతా 19,533 –19,634 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 26 పాయింట్లు పతనమై 19,571 వద్ద నిలిచింది. ఆటో, ఎఫ్‌ఎంసీజీ, మెటల్, ఇంధన, రియల్టీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే బ్యాంకులు, ఫార్మా, ఐటీ, మీడియా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ మిడ్ స్మాల్ సూచీలు వరుసగా 0.25%, 0.15 శాతం చొప్పున స్వల్పంగా పెరిగాయి. చైనా ఎగుమతులు భారీగా క్షీణించడంతో పాటు ఫెడ్ వడ్డీరేట్లను ప్రభావితం చేసే అమెరికా ద్రవ్యోల్బణ డేటా వెల్లడి ముందు అప్రమత్తత నేపథ్యంలో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- క్యూ1లో ప్రభుత్వ రంగ బ్యాంకులు ఆకర్షణీయ పనితీరు చూపడంతో ఈ రంగ షేర్లకు డిమాండ్ పెరిగింది. ఇండియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, యూనియన్ బ్యాంక్, పీఎస్‌బీ షేర్లు వరుసగా 14%, 7%, 5%, 4% ర్యాలీ చేశాయి. సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, పీఎస్‌బీ షేర్లు 3% లాభపడ్డాయి.
- హార్లే డేవిడ్సన్ భాగస్వామ్యంలో తీసుకొచ్చిన ఎక్స్440 బైక్ బుకింగ్‌కు అనూహ్య స్పందన లభించడంతో హీరో మోటోకార్ప్ షేరు 4% లాభపడి రూ.3068 వద్ద ముగిసింది.
- జూన్ క్వార్టర్ లాభం 40% క్షీణించడంతో హిందాల్కో ఇండస్ట్రీస్ షేరు ఎన్‌ఎస్‌ఈలో రెండుశాతానికి పైగా నష్టపోయి రూ.455 వద్ద ముగిసింది.
- తొలి త్రైమాసికంలో నికర లాభం 41% వృద్ధి చెందడంతో గ్లాండ్ ఫార్మా షేరు 20% లాభపడి రూ.1613 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకింది.

ఫార్మా రంగ కంపెనీ కంకార్డ్ బయోటెక్ పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. చివరి రోజు మంగళవారానికల్లా 25 రెట్లు అధిక స్పందనను సాధించింది. కంపెనీ 1,46,50,957 షేర్లు ఆఫర్ చేయగా.. 36,42,83,240 షేర్లకు దరఖాస్తులు వచ్చాయి.

హైదరాబాద్ కేంద్రంగా 'హ్యుందాయ్'

- భవిష్యత్ మోడళ్ల పరిశోధన ఇక్కడే
- రెండేళ్లలో కియా నుంచి చిన్న ఈవీ
- 2032 నాటికి అయిదు కొత్త ఈవీలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీలో ఉన్న దక్షిణ కొరియా గ్రూప్ హ్యుందాయ్ మోటార్ భారత్‌లో ఎలక్ట్రిక్ వెహికిల్స్ విభాగంలో నాయకత్వ స్థానం కోసం సిద్ధమవుతోంది. భవిష్యత్తులో పోటీతత్వ ఈవీ మార్కెట్‌గా భారత్ అవతరిస్తుందని కంపెనీ మంగళవారం తెలిపింది. 2032 నాటికి దేశీయంగా అయిదు కొత్త ఈవీలను ప్రవేశపెట్టాలని హ్యుందాయ్ నిర్ణయించింది. కొత్త ఈవీల పరిచయం, తయారీ సామర్థ్యాన్ని పెంచేందుకు వచ్చే 10 ఏళ్లలో రూ.20,000 కోట్లకుపైగా పెట్టుబడి చేయనున్నట్టు 2023 మే నెలలో సంస్థ ప్రకటించింది. ఈవీలు, అటానమస్ సహా భవిష్యత్ మోడళ్ల పరిశోధన కోసం హైదరాబాద్‌లోని రిసర్చ్, డెవలప్‌మెంట్ (ఆర్‌అండ్‌డీ) సెంటర్‌ను కేంద్ర బిందువుగా మార్చాలని గ్రూప్ యోచిస్తోంది. ఈ కేంద్రంలో భారతీయ భాషల్లో వాయిస్ రికగ్నిషన్ టెక్నాలజీని సైతం అభివృద్ధి చేస్తారు. భారత ప్యాసింజర్ కార్ల పరిశ్రమ 2030 నాటికి 50 లక్షల యూనిట్లను దాటుతుంది. వీటిలో ఎస్‌యూవీల వాటా 48 శాతం. ఆ సమయానికి ఎలక్ట్రిక్ వెహికిల్స్ 10 లక్షల యూనిట్ల మార్కును చేరుకుంటాయని హ్యుందాయ్ తెలిపింది. 2022–23లో భారత్‌లో అన్ని కంపెనీలవి కలిపి 48,104 యూనిట్ల ఎలక్ట్రిక్ కార్లు అమ్ముడయ్యాయి.

భవిష్యత్ వ్యూహంపై..

'భారత విపణిలో కంపెనీ కార్ల విక్రయాలు పెరిగేందుకు హైదరాబాద్ కేంద్రం కీలక పాత్ర పోషించనుంది. అలాగే కొరియాలోని హుందాయ్–కియా నమ్యాంగ్ ఆర్‌అండ్‌డీ సెంటర్‌తో కలిసి భారత మార్కెట్ కోసం వాహనాలను అభివృద్ధి చేస్తుంది. ఇందులో భాగంగా టెస్టింగ్ కోసం కొత్త సదుపాయం నిర్మాణం గత సంవత్సరం ప్రారంభమైంది' అని కంపెనీ తెలిపింది. హ్యుందాయ్ మోటార్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ చైర్ యూసన్ ఛంగ్ భారత పర్యటనలో భాగంగా హైదరాబాద్‌లోని హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజనీరింగ్‌తోపాటు చెన్నైలోని తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భవిష్యత్ వ్యూహంపై కంపెనీకి చెందిన కీలక అధికారులతో చర్చించారు.

భారీ లక్ష్యంతో..

ఎస్‌యూవీలలో నాయకత్వ స్థానాన్ని బలోపేతం చేయడం, ఈవీ మోడళ్లను విస్తరించడం ద్వారా పరిమాణాత్మకంగా వృద్ధి చెందాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు హ్యుందాయ్ వెల్లడించింది. 'నాలుగేళ్లలో ఈవీ చార్జింగ్ సెంటర్ల సంఖ్యను 439కి చేర్చనున్నాం. గ్రూప్ కంపెనీ అయిన కియా 2025 నుండి భారత కోసం చిన్న ఈవీలను ఉత్పత్తి చేస్తుంది. ఇతర ఈవీ మోడళ్లతోపాటు వినియోగదార్లు కోరినట్టు కస్టమైజ్డ్ (పర్పస్ బిల్ట్ వెహికల్స్) అందిస్తుంది. కొత్త మోడళ్ల పరిచయం, ప్రస్తుతం ఉన్న 300 షోరూమ్‌లను రెండింతలు చేయాలన్నది కియా ప్రణాళిక. ప్రస్తుతం కియా మార్కెట్ వాటా 6.7% ఉంది. సమీప కాలంలో దీన్ని 10%కి చేర్చాలన్నది కియా 2.0 వ్యూహం' అని హ్యుందాయ్ తెలిపింది.

జాబ్ పాయింట్

ఈసీఐఎల్, హైదరాబాద్‌లో 100 టెక్నికల్ ఆఫీసర్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్).. టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 100
» **విభాగాలు:** మెకానికల్/ఎలక్ట్రానిక్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
» **పని అనుభవం:** కనీసం ఒక ఏడాది పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.25,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **ఇంటర్వ్యూ వేదిక:** కార్పొరేట్ లెర్నింగ్–డెవలప్‌మెంట్ సెంటర్, నలందా కాంప్లెక్స్, టీఐఎఫ్ఆర్ రోడ్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, ఈసీఐఎల్ పోస్ట్, హైదరాబాద్–500062.
» **ఇంటర్వ్యూ తేది:** 10.08.2023, 11.08.2023.
» **ఇంటర్వ్యూ సమయం:** ఉదయం 10 గంటలు.
» **వెబ్‌సైట్:** www.ecil.co.in

షార్ శ్రీహరికోటలో 56 పారా మెడికల్ పోస్టులు

తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్.. వివిధ కేటగిరీ/విభాగాల్లో పారా మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 56
» **పోస్టుల వివరాలు:** క్యాటరింగ్ సూపర్‌వైజర్–01, నర్స్–బి–07, ఫార్మసిస్ట్ ఎ–02, రేడియోగ్రాఫర్ ఎ–04, ల్యాబ్ టెక్నీషియన్ ఎ–01, ల్యాబ్ టెక్నీషియన్ ఎ(డెంటల్ హైజీనిస్ట్)–01, అసిస్టెంట్(రాజ్‌భాష)–01, కుక్–04, లైట్ వెహికల్ డ్రైవర్ ఎ–13, హెవీ వెహికల డ్రైవర్ ఎ–14, ఫైర్‌మ్యాన్ ఎ–08.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. డిగ్రీ, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
» **వయసు:** 24.08.2023 నాటికి అసిస్టెంట్ పోస్టులకు 28 నుంచి 28 ఏళ్లు, ఫైర్‌మ్యాన్ పోస్టులకు 18 నుంచి 25 ఏళ్లు, ఇతర పోస్టులకు 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, హైదరాబాద్.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 24.08.2023.
» **ఫీజు చెల్లింపునకు చివరితేది:** 25.08.2023.
» **వెబ్‌సైట్:** https://www.shar.gov.in

ఇండియన్ నేవీలో 35 ఎస్ఎస్‌సీ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఇండియన్ నేవీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్)లో షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. ఎగ్జిక్యూటివ్(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. కేరళ రాష్ట్రం ఎజిమలలోని ఇండియన్ నావల్ అకాడమీ(ఐఎన్ఏ)లో జనవరి 2024 నుంచి స్పెషల్ నేవల్ ఓరియంటేషన్ కోర్సు ప్రారంభం కానుంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 35
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్,ఎంఎస్సీ,ఎంసీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 02.01.1999 నుంచి 01.07.2004 మధ్య జన్మించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలో సాధించిన మార్కులు, పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.08.2023.
» **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

ఎన్ఐఆర్‌డీపీఆర్, హైదరాబాద్‌లో 172 సీబీసీ అండ్ ఎస్‌క్యూ మానిటర్ పోస్టులు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్(ఎన్ఐఆర్‌డీపీఆర్).. కాంట్రాక్టు ప్రాతిపదికన సీబీసీ అండ్ ఎస్‌క్యూ మానిటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 172
» **పోస్టుల వివరాలు:** సీనియర్ కెపాసిటీ బిల్డింగ్ కన్సల్టెంట్ అండ్ స్టేట్ క్వాలిటీ మానిటర్–24, కెపాసిటీ బిల్డింగ్ కన్సల్టెంట్ అండ్ స్టేట్ క్వాలిటీ మానిటర్–148.
» **అర్హత:** ఏదైనా విభాగంలో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 17.08.2023 నాటికి 62 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు సీనియర్ కెపాసిటీ బిల్డింగ్ కన్సల్టెంట్ అండ్ స్టేట్ క్వాలిటీ మానిటర్‌కు రూ.75,000, కెపాసిటీ బిల్డింగ్ కన్సల్టెంట్ అండ్ స్టేట్ క్వాలిటీ మానిటర్‌కు రూ.60,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.08.2023.
» **వెబ్‌సైట్:** http://career.nirdpr.in

నాణ్యమైన విద్యకు.. నవోదయం

» 2024 ప్రవేశ ప్రక్రియ ప్రారంభించిన జేఎన్‌వీలు
» రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఆరో తరగతిలో ప్రవేశం
» జాతీయ స్థాయిలో.. మొత్తం 649 జేఎన్‌వీలు
» లెర్నింగ్ బై డూయింగ్ విధానంలో బోధన

జవహర్ నవోదయ విద్యాలయాలు.. సంక్షిప్తంగా జేఎన్‌వీలు. సృజనాత్మక పద్ధతుల్లో బోధన, ఆహ్లాదకర వాతావరణంలో లెర్నింగ్ బై డూయింగ్ విధానంలో నాణ్యమైన విద్యను అందిస్తున్న పాఠశాలలు. స్కూల్ స్థాయిలోనే విద్యార్థుల్లో వాస్తవ దృక్పథం పెంపొందిస్తూ.. ఉన్నతంగా రాణించేలా దోహదపడుతున్నాయి ఈ విద్యాలయాలు!! ఇలా ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్న జేఎన్‌వీల్లో.. 2024 విద్యా సంవత్సరంలో.. ఆరో తరగతిలో ప్రవేశాలకు ప్రకటన విడుదలైంది. ఈ నేపథ్యంలో.. జేఎన్‌వీల ప్రత్యేకత, ప్రవేశ ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..



విద్యార్థి జీవితంలో పాఠశాల విద్య ఎంతో కీలకమైంది. ఈ దశలో వినూత్న బోధన విధానాన్ని అమలు చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటైనవే.. జవహర్ నవోదయ విద్యాలయాలు. ఇందుకోసం కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా జవహర్ నవోదయ విద్యాలయ సమితి పేరిట ప్రత్యేక సంస్థను కూడా ఏర్పాటు చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం ప్రధాన లక్ష్యంగా జేఎన్‌వీలు కృషి చేస్తున్నాయి.

జాతీయ స్థాయిలో.. 649 జేఎన్‌వీలు

- జవహర్ నవోదయ విద్యాలయ సమితి పర్యవేక్షణలో దేశ వ్యాప్తంగా 649 నవోదయ పాఠశాలలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో 15, తెలంగాణలో 9 ఉన్నాయి. ఏపీలోని 15 పాఠశాలల్లో 2 పాఠశాలలను ఎస్సీ/ఎస్టీ జనాభా అధికంగా ఉన్న జిల్లాల్లో అదనంగా ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు.
- ప్రతి నవోదయలో ఆరో తరగతిలో గరిష్ఠంగా 80 సీట్లు, కనిష్ఠంగా 40 సీట్లు ఉంటాయి. 2022 వరకు వరకు గరిష్ఠ సీట్ల సంఖ్య ప్రతి పాఠశాలలో 60గా మాత్రమే ఉండేది. 2023 నుంచి 80కి పెరగడంతో మరింతమంది విద్యార్థులకు నవోదయ విద్య అవకాశం లభించనుంది.

ఉచిత విద్య.. ఉన్నత బోధన

జేఎన్‌వీల మరో ప్రత్యేకత.. ఉచితంగా విద్యను అందించడం. రెసిడెన్షియల్ విధానంలో ఉండే ఈ జేఎన్‌వీల్లో వసతి, భోజన సదుపాయం, యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు అన్నింటినీ ఉచితంగా అందిస్తారు. విద్యా వికాస్ నిధి పేరిట ఏర్పాటు చేసిన నిధికి నెలకు రూ.600 చెల్లించాల్సి ఉంటుంది. ఈ చెల్లింపు నుంచి ఎస్సీ, ఎస్టీ వర్గాలు, మహిళా విద్యార్థులు, బీపీఎల్ వర్గాల(దారిద్య్ర రేఖ దిగువ ఉన్న) పిల్లలకు మినహాయింపునిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు మాత్రం నెలకు రూ. 1500 చెల్లించాల్సి ఉంటుంది.

ఆరో తరగతి ప్రవేశాలు–అర్హతలు

- విద్యార్థులు 2023–24లో అయిదో తరగతి చదువుతుండాలి.
- గ్రామీణ విద్యార్థుల కోటాకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు.. మూడు నుంచి అయిదో తరగతి వరకు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ,ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల్లో చదువుతుండాలి.
- విద్యార్థులు దరఖాస్తులో పేర్కొన్న జేఎన్‌వీ నెలకొన్న జిల్లాలకు చెందిన వారై ఉండాలి. జిల్లాల పునర్విభజన జరిగితే.. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా సంబంధిత జిల్లాకు చెంది ఉండాలి.
- **వయసు:** మే 1, 2012– జూలై 31, 2014 మధ్యలో జన్మించి ఉండాలి.

100 మార్కులకు ప్రవేశ పరీక్ష

- ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఆరో తరగతిలో అడ్మిషన్స్ కల్పిస్తారు.
- దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జాతీయ స్థాయిలో.. జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్(జేఎన్‌వీఎస్‌టీ)ను నిర్వహిస్తారు. పరీక్ష మూడు విభాగాలుగా మొత్తం 100 మార్కులకు జరుగుతుంది.
- ఈ ప్రవేశ పరీక్షలో మెంటల్ ఎబిలిటీ టెస్ట్ 40 ప్రశ్నలు–50 మార్కులు, అర్థమెటిక్ టెస్ట్ 20 ప్రశ్నలు–25 మార్కులు, లాంగ్వేజ్ టెస్ట్ 20 ప్రశ్నలు–25 మార్కులు.. ఇలా మొత్తం 80 ప్రశ్నలు–100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతోనే ఉంటుంది.
- ఆయా రాష్ట్రాల మాతృభాషల్లోనూ పరీక్ష నిర్వహిస్తారు.
- విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న మాధ్యమాన్ని దరఖాస్తు సమయంలోనే పేర్కొనాలి.
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్, హిందీ, మరాఠి, ఉర్దూ, కన్నడ భాషల్లో పరీక్ష రాసే అవకాశముంది. ఏపీ విద్యార్థులు అదనంగా ఒరియా మాధ్యమంలోనూ పరీక్షకు హాజరయ్యే వీలుంది.
- తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి కూడా పరీక్ష ఉంటుంది. తొమ్మిదో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లను మాత్రమే దీని ద్వారా భర్తీ చేస్తారు.

పరీక్షలో మంచి మార్కులకు

జేఎన్‌వీఎస్‌టీ పరీక్షలో మంచి మార్కులు పొందేందుకు విద్యార్థులు.. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు అకాడమీ పుస్తకాలు, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను చదవాలి. ప్రధానంగా నాలుగు, అయిదు తరగతుల మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్ పుస్తకాలను అభ్యసనం చేయాలి.

జిల్లా స్థాయిలో ఎంపిక

ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా స్థాయిలో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అంటే.. విద్యార్థులను ఆయా రాష్ట్రాల్లోని జిల్లాలో నెలకొన్న జేఎన్‌వీల్లో ప్రవేశం కల్పిస్తారు. అభ్యర్థులు సదరు జేఎన్‌వీ నెలకొన్న జిల్లాకు చెందిన వారై ఉండాలి.జేఎన్‌వీఎస్‌టీ పరీక్షలో సాధించిన మార్కులు, దరఖాస్తు చేసుకున్న జిల్లా.. సదరు జిల్లాలోని జేఎన్‌వీలో ఉన్న సీట్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని.. రిజర్వేషన్లు తదితరాల ఆధారంగా జిల్లా స్థాయిలో మెరిట్ జాబితా ప్రకటించి ప్రవేశం కల్పిస్తారు.

పల్లె విద్యార్థులకు ప్రాధాన్యం

జేఎన్‌వీలలోని సీట్లలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తొలి ప్రాధాన్యం కల్పిస్తున్నారు. మొత్తం సీట్లలో 75 శాతం సీట్లను పల్లె ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తున్నారు. అదే విధంగా బాలికలను ప్రోత్సహించేలా మొత్తం సీట్లలో విద్యార్థినులకు 33 శాతం(1/3 వంతు) సీట్లను కేటాయిస్తున్నారు.

గురుకుల విధానం

జవహర్ నవోదయ విద్యాలయాల్లో పూర్తిగా రెసిడెన్షియల్ విధానాన్ని అమలు చేస్తున్నారు. వీటిలో ప్రవేశం పొందిన విద్యార్థులు సదరు పాఠశాలల వసతి గృహాల్లోనే ఉండి చదువు కోవాల్సి ఉంటుంది. క్లాస్ రూమ్ బోధనతోపాటు.. అది పూర్తయిన తర్వాత హాస్టల్స్‌లో మెంటార్స్ సదుపాయం సైతం అందుబాటులో ఉంటుంది.

ఎనిమిది నుంచి ఇంగ్లిష్

ఆరో తరగతి వరకు విద్యార్థులు తమ మాతృ భాష లేదా తమ ప్రాంతీయ భాషలో చదివే అవకాశం కల్పిస్తున్నారు. ఎనిమిదో తరగతి నుంచి మాత్రం ఇంగ్లిష్ మీడియంలో చదవాల్సి ఉంటుంది. ఎనిమిదో తరగతి నుంచి మ్యాథమెటిక్స్, సైన్స్ సబ్జెక్టులను ఇంగ్లిష్ మీడియంలో, సోషల్ సైన్స్ సబ్జెక్ట్‌ను హిందీ మీడియంలో చదవాల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్

జవహర్ నోవదయ విద్యాలయాల్లో ప్రాక్టికాలిటీకి ప్రాధాన్యం ఇస్తున్నారు. లెర్నింగ్ బై డూయింగ్ విధానాన్ని అనుసరిస్తారు. అంటే.. ఏదైనా అంశాన్ని బోధించినప్పుడు దానికి సంబంధించి ప్రాక్టికల్స్ లేదా పజిల్స్, క్విజ్‌లు వంటివి నిర్వహిస్తారు. తద్వారా సదరు అంశంపై విద్యార్థికి పూర్తి స్థాయి అవగాహన, ఆసక్తి కలిగేలా బోధన ఉంటుంది. విద్యార్థుల్లో వాస్తవ దృక్పథం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.

అందుకోసం యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ముఖ్యంగా సైన్స్, మ్యాథమెటిక్స్ వంటి సబ్జెక్టులలో ప్రాక్టికల్ బోధనకు ప్రాధాన్యం ఉంటుంది. ప్రాజెక్ట్ వర్క్, లేదా ఆయా సబ్జెక్ట్స్‌లో స్కూల్ స్థాయిలో ఎగ్జిబిషన్స్ నిర్వహిస్తూ.. విద్యార్థులకు తాము నేర్చుకున్న అంశాలకు వాస్తవ రూపం ఇచ్చేలా ప్రోత్సహిస్తున్నారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 10.08.2023
- జేఎన్‌వీఎస్‌టీ పరీక్ష తేదీ: 20.01.2024
- వివరాలకు వెబ్‌సైట్: https://navodaya.gov.in

క్లుప్తంగా...

ఈఏపీసెట్ ఆప్షన్ల ఎంపికకు గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఈఏపీసెట్ (ఇంజినీరింగ్) అడ్మిషన్ల ప్రక్రియలో ఆప్షన్ల ఎంపికకు గడువు పొడిగించినట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ప్రవేశాల కన్వీనర్ చదలవాడ నాగరాణి మంగళవారం తెలిపారు. విద్యార్థులు ఆగస్టు 7 నుంచి 14 వరకు ఆప్షన్ల ఎంపిక చేసుకోవచ్చన్నారు. 16న ఆప్షన్ల మార్పులకు అవకాశం కల్పించారు. 23న విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామన్నారు. 31 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

విశాఖ ఐఐఎంలో రెండు పీజీ సర్టిఫికెట్ కోర్సులు

ఆనందపురం (విశాఖ): విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో 2 పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) సర్టిఫికెట్ కోర్సులను మంగళవారం ప్రారంభించారు. డిజిటల్ ఫైనాన్స్, ఫిన్‌టెక్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ కోర్సు, డిజిటల్, సోషల్ మీడియా మార్కెటింగ్‌లో పీజీ సర్టిఫికెట్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. 9 నెలలపాటు ఆన్‌లైన్‌లో అందించే ఈ కోర్సులకు టైమ్స్ ప్రో ఎడ్యుకేషన్ సెంటర్ మెంటార్‌గా వ్యవహరించనుంది. డిజిటల్, సోషల్ మీడియా మార్కెటింగ్ పీజీ సర్టిఫికెట్ కోర్సు కోసం పలు పరిశ్రమలకు చెందిన 57 మంది, డిజిటల్ ఫైనాన్స్, ఫిన్‌టెక్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ కోర్సు కోసం 59 మంది వర్కింగ్ ఎగ్జిక్యూటివ్‌లు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ప్రోగ్రాం డైరెక్టర్లు ప్రొఫెసర్లు పూజా కుమారి, అమిత్ శంకర్ మాట్లాడుతూ డిజిటల్ ఫైనాన్స్, ఫిన్‌టెక్ కోర్సులలో చేరిన వారికి దృక్పథాలను, జ్ఞానాన్ని మరింత మెరుగు పరిచే విధంగా తర్ఫీదు ఇస్తామన్నారు.

పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా బీసీలకు అసెంబ్లీ, పార్లమెంట్‌లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీలకు కేంద్ర బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బీసీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా ధర్నా నిర్వహించారు.వైఎస్సార్‌సీపీ ఎంపీ బీద మస్తాన్‌రావ్ అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, లాల్‌కృష్ణ, బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ అధ్యక్షుడు అంజి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

పెరిగిన రొయ్యల ధరలు

20 కౌంట్ కేజీ ధర రూ.610

- ఇతర రాష్ట్రాల్లో రూ.510 నుంచి రూ.600 మాత్రమే
- 100 కౌంట్ ధర మన రాష్ట్రంలో రూ.205
- ఇతర రాష్ట్రాల్లో రూ.190 నుంచి రూ.200 మాత్రమే


సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ కృషి ఫలితంగా రొయ్యల కౌంట్ ధరలు పెంచేందుకు ప్రాసెసింగ్ కంపెనీలు ముందుకొచ్చాయి. గత నెలాఖరులో జరిగిన ఆక్వా సాధికారత కమిటీ భేటీలో తీసుకున్న నిర్ణయం మేరకు ప్రకటించిన ధరలను మరోసారి పెంచేందుకు కంపెనీలు అంగీకరించాయి. 20 నుంచి 55 కౌంట్ వరకు కేజీకి రూ.10 చొప్పున, 56 నుంచి 100 కౌంట్ వరకు కేజీకి రూ.5 చొప్పున ధర పెంచుతున్నట్టు ప్రకటించాయి. దేశంలోని మరే రాష్ట్రంలో లేనివిధంగా.. తమ పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధిపై ఆక్వా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆక్వా రైతులు ఏ దశలోనూ నష్టపోకూడదన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రుల సారథ్యంలో సమావేశమైన రైతు సాధికారత కమిటీ రొయ్యల ధరలను పెంచేందుకు కృషి చేస్తోంది. ఆక్వా రైతుల సమక్షంలో ప్రాసెసింగ్ కంపెనీలు, ఎగుమతిదారులతో ప్రభుత్వం ఎప్పటికప్పుడు జరుపుతున్న చర్చలు మంచి ఫలితమిస్తున్నాయి. గత నెలాఖరులో ప్రకటించిన ధరలు ఈ నెల 8వ తేదీ వరకు కొనసాగగా, మంగళవారం మరోసారి పునఃసమీక్షించి.. కేజీకి రూ.5 నుంచి రూ.10 చొప్పున పెంచేందుకు కంపెనీలు అంగీకరించాయి. ఈ నెల 9వ తేదీ నుంచి రానున్న పది రోజుల పాటు కొత్త ధరలు అమలులో ఉంటాయి.

కోత పెడితే చర్యలు

ప్రభుత్వం నిర్దేశించిన ధరల చెల్లింపులో ఏజెంట్లు, షెడ్ల నిర్వాహకులు కోత పెడుతున్నట్టుగా ప్రభుత్వం దృష్టికి రావడంతో ఎగుమతిదారులతో పాటు షెడ్ల యజమానులు, ఏజెంట్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇకనుండి రైతుల నుంచి కొనుగోలు చేసే వారెవరైనా కచ్చితమైన బిల్లులు ఇచ్చి కొనుగోలు చేసి తీరాల్సిందేనని స్పష్టం చేసింది. లేకుంటే అప్పుడా చట్టం ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామని, అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించింది.

ఇతర రాష్ట్రాల కంటే మిన్నగా..

దేశంలో ఒక్క ఏపీలో మాత్రమే కౌంట్‌ల వారీగా ధరలను ప్రకటిస్తున్నారు. మిగిలిన రాష్ట్రాల్లో పూర్వం నుంచి కొనసాగుతున్నట్టుగా ప్రతి 10 కౌంట్లకు ఒక ధర చొప్పున నిర్ణయిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రకటించిన కౌంట్ ధరలు పొరుగు రాష్ట్రాలతో కంటే మెరుగ్గా ఉన్నాయి. తమిళనాడు, ఒడిశా, గుజరాత్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలో ప్రధాన కౌంట్లకు మన కంటే కేజీకి రూ.5 నుంచి రూ.25 వరకు తక్కువగానే చెల్లిస్తున్నారు.



వివిధ రాష్ట్రాల్లో ధరలు ఇలా..

కౌంట్	ఏపీ	తమిళనాడు	ఒడిశా	గుజరాత్	పశ్చిమ బెంగాల్	మహారాష్ట్ర
20	610	600	510	580	590	570-580
30	380	390	350	350	335	360
40	310	290	290	290	280	290
50	270	270	260	260	245	260
60	245	250	240	240	225	240
70	235	240	230	230	220	230
80	225	230	220	220	205	220
90	215	210	200	200	200	210

నేటినుంచి కౌంట్ల వారీగా ధరలు ఇలా..

కౌంట్	ధర (కేజీకి రూ.ల్లో)	కౌంట్	ధర	కౌంట్	ధర
		28-30	380	51-55	260
		31	370	56-60	245
20	610	32	360	61-65	240
21	580	33-35	320	66-70	235
22	550	36-37	315	71-75	230
23	500	38-40	310	76-80	225
24	480	41	300	81-90	215
25	460	42	290	91-100	205
25.5	410	43-45	280		
26	400	46-47	275		
27	390	48-50	270		

నీటి దోపిడీ కోసమే పాలమూరు-రంగారెడ్డి

- తాగునీటి కోసం 7.15 టీఎంసీలు తీసుకునేందుకే అనుమతి
- 120 టీఎంసీలు తరలించేలా ఎత్తిపోతల పనులు పూర్తి
- సుప్రీం కోర్టుకు నివేదించిన కేంద్ర జల్ శక్తి శాఖ, కృష్ణా బోర్డు

సాక్షి, అమరావతి: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల్లో సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వుల్లో అనుమతి ఇచ్చిన దానికంటే తెలంగాణ సర్కార్ భారీ ఎత్తున పనులు చేసిందని సుప్రీం కోర్టుకు కేంద్ర జల్ శక్తి శాఖ, కృష్ణా బోర్డు నివేదించాయి. తాగునీటి అవసరాల పేరుతో భారీ ఎత్తున సాగునీటి అవసరాలకు నీటిని తరలించేలా తెలంగాణ ప్రభుత్వం పనులు పూర్తి చేసిందని స్పష్టం చేశాయి.7.15 టీఎంసీలను తాగునీటి అవసరాలకు తరలించేలా పనులు చేపట్టడానికి అనుమతి ఇస్తే.. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి రోజుకు 2 టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 120 టీఎంసీలు తరలించేలా ఎత్తిపోతలు, కాలువల వ్యవస్థ, 65.17 టీఎంసీలను నిల్వ చేసేలా 5 రిజర్వాయర్లను తెలంగాణ పూర్తి చేసిందని తేల్చిచెప్పాయి. ఇప్పటివరకూ పూర్తయిన పనులను పరిశీలిస్తే.. తెలంగాణ సర్కార్ భారీ ఎత్తున కృష్ణా జలాలను తరలించేలా చేపట్టిందని పేర్కొన్నాయి. ఆ ఎత్తిపోతలకు నీటి కేటాయింపులు లేని నేపథ్యంలో దాని డీపీఆర్‌ను మదింపు చేయలేమని తెలంగాణ సర్కార్‌కు తేల్చిచెప్పామని గుర్తు చేశాయి. ఈ మేరకు సుప్రీం కోర్టులో ఈ నెల 2న కేంద్ర జల్ శక్తి శాఖ, కృష్ణా బోర్డు సంయుక్తంగా అఫిడవిట్ దాఖలు చేశాయి. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలపై ఈ నెల 4న జరగాల్సిన విచారణను సుప్రీం కోర్టు అక్టోబర్‌కు వాయిదా వేసింది.

అఫిడవిట్‌లో ఏం చెప్పాయంటే..

కేంద్ర జల్ శక్తి శాఖ, కృష్ణా బోర్డు సుప్రీం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. శ్రీశైలం జలాశయం నుంచి రోజుకు రెండు టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 120 టీఎంసీలు తరలించేలా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను రూ.55,086.57 కోట్లతో తెలంగాణ సర్కార్ చేపట్టింది. ఇందులో నీటిపారుదల వ్యయం రూ.50,508.88 కోట్లు, తాగునీటి విభాగం వ్యయం రూ.4,577.69 కోట్లు. ఈ ఎత్తిపోతల కింద అంజనగిరి (8.51 టీఎంసీలు), వీరాంజనేయ (6.55 టీఎంసీలు), వెంకటాద్రి (16.74 టీఎంసీలు), కరుమూర్తిరాయ (17.34 టీఎంసీలు), ఉద్దండాపూర్ (16.03 టీఎంసీలు), కేపీ లక్ష్మీదేవిపల్లి (2.80 టీఎంసీల) రిజర్వాయర్లను చేపట్టింది. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో 10 లక్షల ఎకరాలకు సాగునీరు.. ఆ జిల్లాల్లో తాగు, పారిశ్రామిక అవసరాలు తీర్చాలన్నది ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఈ ఎత్తిపోతల కింద తరలించే 120 టీఎంసీల్లో తాగునీటి అవసరాల కోసం కేటాయించింది 7.15 టీఎంసీలు. ఇప్పటికే 65.17 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో అంజనగిరి, వీరాంజనేయ, వెంకటాద్రి, కరుమూర్తిరాయ, ఉద్దండాపూర్ రిజర్వాయర్లను.. 120 టీఎంసీలు తరలించేలా ఎత్తిపోతలు, కాలువల వ్యవస్థను పూర్తి చేసింది. ఆరో రిజర్వాయర్ కేపీ లక్ష్మీదేవిపల్లి వద్ద ఇప్పటిదాకా చేపట్టలేదు. పూర్తయిన 5 రిజర్వాయర్ల కింద తాగునీటి అవసరాల కోసం కేటాయించింది 3.40 టీఎంసీలే. కృష్ణా డెల్టాకు మళ్లించే గోదావరి జలాలకుగానూ కృష్ణా జలాల్లో అదనంగా దక్కే 45 టీఎంసీలకు, చిన్న నీటిపారుదల విభాగంలో మిగులుగా ఉన్న 45 టీఎంసీలను జతచేసి.. 90 టీఎంసీలతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను చేపట్టామని తెలంగాణ సర్కార్ డీపీఆర్‌ను సమర్పించింది. కానీ.. ఈ ప్రాజెక్టుకు బచావత్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు చేయలేదు. నీటి కేటాయింపులపై బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ చేస్తున్న నేపథ్యంలో ఆ ప్రాజెక్టు డీపీఆర్‌ను మదింపు చేయలేమని తెలంగాణ సర్కార్‌కు వెనక్కి పంపాం.

నేపథ్యం ఇదీ..

చంద్రమౌళీశ్వరరెడ్డి అనే రైతు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) పర్యావరణ అనుమతి తీసుకోకుండా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాల పనులను నిలిపేయాలని 2021 అక్టోబర్ 29న ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాలను ఉల్లంఘించి యథేచ్ఛగా పనులు కొనసాగించిన తెలంగాణ సర్కార్‌పై 2022 డిసెంబర్ 22న ఆగ్రహం వ్యక్తం చేసిన ఎన్జీటీ.. ఆ రెండు ఎత్తిపోతల పథకాల వ్యయంపై 1.50 శాతం చొప్పున రూ.620.85 కోట్లను తెలంగాణ సర్కార్‌కు జరిమానా విధించింది. తెలంగాణ ఉద్దేశపూర్వకంగా చట్టాలను ఉల్లంఘిస్తున్నందున రూ.300 కోట్లు జరిమానా చెల్లించాలని ఆదేశించింది. మొత్తం రూ.920.85 కోట్లు మూడు నెలల్లోగా కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) వద్ద డిపాజిట్ చేయాలని నిర్దేశించింది. దీనిపై తెలంగాణ సర్కార్ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఎన్జీటీ ఉత్తర్వుల అమలును నిలుపుదల చేస్తూ.. తాగునీటి అవసరాల కోసం 7.15 టీఎంసీలు తరలించేలా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులకు అనుమతిస్తూ 2023 ఫిబ్రవరి 17న సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

ఇక వైవీయూలో దూరవిద్య

- ఈ అకడమిక్ ఇయర్ నుంచి ప్రారంభం
- 8 కోర్సుల్లో ప్రవేశాలకు డెబ్ అనుమతి

వైవీయూ(వైఎస్సార్ జిల్లా): వైఎస్సార్ జిల్లాలోని యోగి వేమన విశ్వవిద్యాలయానికి దూరవిద్యను నిర్వహించేందుకు డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో(డెబ్) అనుమతి మంజూరు చేసినట్లు వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ తెలిపారు. మంగళవారం కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య కె.కృష్ణారెడ్డితో కలిసి వీసీ విలేకరులతో మాట్లాడారు. సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీవోఈ) ఏర్పాటుకు అనుమతులు లభించాయన్నారు. గతేడాది విశ్వవిద్యాలయానికి న్యాక్ ఏ గ్రేడ్ లభించడంతో డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌ను ప్రారంభించేందుకు మార్గం సుగమమైందని తెలిపారు. ఈ అకడమిక్ ఇయర్‌లో తొలి విడతలో భాగంగా ఎనిమిది పీజీ కోర్సులను(ఎంఏ ఎకనామిక్స్, ఇంగ్లిష్, జర్నలిజం, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, సైకాలజీ, స్పెషల్ తెలుగు, ఎంకామ్) ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. గ్రేటర్ రాయలసీమ పరిధిలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అనుమతులు వైవీయూకు లభించడం సంతోషంగా ఉందన్నారు.

శ్రావణమాసోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఆర్జిత సేవలు, స్పర్శ దర్శనానికి వేర్వేరుగా క్యూలైన్లు
- శ్రీశైల దేవస్థానం ఈఓ లవన్న



క్యూలైన్లను పరిశీలిస్తున్న దేవస్థానం ఈఓ లవన్న

శ్రీశైలం టెంపుల్(నంద్యాల): శ్రీశైల ఆలయంలో ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు నిర్వహించే శ్రావణమాసోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న తెలిపారు. శ్రావణ మాసోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం దేవస్థాన ఈఓ లవన్న ఇంజినీరింగ్ పనులను, ఆలయ క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్, ఆర్జితసేవా క్యూలైన్లను, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్లను, విరాళాల సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని ఈఓ ఆదేశించారు. దర్శన క్యూలైన్లు, శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం టికెటు కౌంటర్లను భక్తులు సులభంగా గుర్తించేందుకు వీలుగా తగినన్ని సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్యూకాంప్లెక్స్ మొత్తం కంపార్ట్‌మెంట్లలో 12 కంపార్ట్‌మెంట్లను ఉచిత దర్శనానికి, ఆరు కంపార్ట్‌మెంట్లు శీఘ్రదర్శనానికి వినియోగించాలని సూచించారు. దేవస్థానం నిర్వహిస్తున్న పథకాలకు విరాళాలు ఇచ్చే భక్తులకు కల్పించే సేవలను వివరించాలన్నారు. అనంతరం ఈఓ మాట్లాడుతూ ఆర్జితసేవాకర్తలు, స్పర్శదర్శనం భక్తులకు, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనం భక్తులకు ప్రత్యేకంగా క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నామని, ఆయా క్యూలైన్లలో టికెట్ల స్కానింగ్ మిషన్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శ్రావణమాసంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని శని, ఆది, సోమ, పర్వదినాలు, ప్రభుత్వ సెలవు రోజుల్లో స్వామివారి గర్భాలయ, సామూహిక అభిషేకాలు నిలుపుదల చేశామని పేర్కొన్నారు. అభిషేకాలు నిలుపుదల చేసిన నిర్దిష్ట రోజుల్లో నాలుగు విడతలుగా స్వామివారి స్పర్శదర్శనం కల్పించబడుతుందన్నారు. ఈఓ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.రామకృష్ణ, ఏఈవో మోహన్, పర్యవేక్షకులు మధుసూదన్‌రెడ్డి, హిమబిందు, అయ్యన్న, నాగరాజు, డీఈఈ చంద్రశేఖరశాస్త్రి, సుబ్బారెడ్డి, ఏఈలు ఉన్నారు.

వైవిధ్యం.. గిరిజన జీవనం

కొండగూటికి పండగొచ్చింది. కలుషితం కాని సంప్రదాయాలను గౌరవించుకోవడానికి, ఆధునికీకరణ జబ్బు పట్టని సంస్కృతిని సన్మానించుకోవడానికి, స్వచ్ఛమైన మనసులను స్మరించుకోవడానికి ఒకరోజు వచ్చింది. అదే అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం. బుధవారం ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మన్యంలోని గ్రామాల్లో వేడుకలు నిర్వహించేందుకు అడవి బిడ్డలు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. జిల్లాలోని కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ప్రభుత్వం ఆధ్వర్యంలోనూ ఈ వేడుకల నిర్వహణకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.

- సంప్రదాయ నృత్యాలకు చిరునామా మన్యసీమ
- ఆసక్తికరంగా కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు
- ఏజెన్సీ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- మారుమూల గ్రామాలకూ సంక్షేమ పథకాలు
- నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం



గిరిజన డోలు కోయ నృత్యం చేస్తున్న గిరిజనులు (ఫైల్)



గిరిజనుల సంప్రదాయ విల్లును ఎక్కుపెట్టిన సీఎం వైఎస్ జగన్ (ఫైల్)



గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు (ఫైల్)



అడవి నుంచి అడ్డాకు తెచ్చుకుంటున్న మహిళ



బాట పండుగ సందర్భంగా నృత్యాలు చేస్తున్న మహిళలు

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో అపురూపమైన సంస్కృతి, తరాలు మారినా మారని కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లు అన్నింటిలోనూ ఆదివాసీ గిరిపుత్రులది ప్రత్యేకమైన శైలి. ఆదివాసీల జీవన స్థితిగతులను మెరుగుపరిచి వారి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో బుధవారం ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అడవిబిడ్డలు ఆనందాల నడుమ వేడుకలను జరుపుకుంటున్నారు.

అన్ని చోట్లా ఒకేలా ఆదివాసీల సమస్యలు

ఆదివాసీల జీవితాల స్థితిగతులను ప్రపంచానికి తెలియజేసేందుకు ఐక్యరాజ్యసమితి 1994 ఆగస్టు 9న జెనీవాలో ప్రపంచ ఆదివాసీ వర్కింగ్ గ్రూప్ సమావేశాలు ఏర్పాటు చేసింది. ఈ గ్రూప్ ఆదివాసీలపై అధ్యయనం చేసి ప్రపంచదేశాల్లో ఆదివాసీల సమస్యలన్నీ ఒకేలా ఉన్నాయని గుర్తించింది. దీంతో ప్రతి సంవత్సరం ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలని యూఎన్‌వో నిర్ణయించింది. నాటి నుంచి ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గిరిపుత్రులు వేడుకగా జరుపుకుంటూ వస్తున్నారు.

అపురూపంగా సంప్రదాయాలు

గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, కట్టుబాట్లు, అలవాట్లు, వ్యవహార శైలిని గూర్చి కొత్తగా చెప్పవలసిన పనిలేదు. కొత్త అనే పదం వాడకుండా పాత అలవాట్లను అపురూపంగా కాపాడుకుంటూ వస్తున్నారు. తెల్లవారితే కొండపోడు వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణతోనే వారి జీవనం ప్రారంభమవుతుంది. అడవులలో లభించే ఉత్పత్తులను సేకరించి వాటిని అమ్ముకోవడంతో పాటు పోడు వ్యవసాయం ద్వారా పండించుకున్న పంటలను తింటూ జీవనం సాగిస్తుంటారు. అడవులలో గిరిజనులకు లభించే ఉత్పత్తులను వారాంతపు సంతలకు తీసుకువచ్చి వాటిని విక్రయించి వాటి ద్వారా వచ్చే సొమ్ములతో వారానికి కుటుంబ పోషణకు సరిపోయే నిత్యావసర సరుకులను కొనుగోలు చేసుకుని తీసుకువెళ్తుంటారు. జిల్లాలోని ఐదు మండలాల్లో ఏజెన్సీ ప్రాంతం విస్తరించి ఉంది. వీటిలో బుట్టాయగూడెం మండలం పూర్తి ఏజెన్సీ ప్రాంతం. అదేవిధంగా గిరిజనుల అభివృద్ధి కోసం బుట్టాయగూడెం మండలం కోటరామచంద్రపురం (కేఆర్‌పురం)లో సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఏర్పాటు చేశారు.

వనదేవతలే ఆరాధ్య దైవాలు

మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీ గిరిజనులకు వనాలే ఆరాధ్య దేవతలుగా పూజిస్తారు. ఎక్కడ పూజలు చేసినా నైవేద్యాలు తప్పనిసరిగా అమ్మవారికి సమర్పిస్తారు. వీరి సంప్రదాయాలు, కట్టుబాట్లు విభిన్నంగా ఉంటాయి. భూదేవి పండుగ, బాట పండుగ, మామిడికాయ పండుగ, కొత్త కందుల పండుగలను ఎక్కువగా చేస్తారు. పండుగల నిర్వహణలో వారికి వారే సాటి. చిన్నాపెద్దా తేడా లేకుండా గిరిజన సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఆనందంగా గడుపుతారు.

కొండపోడే ఆధారం

గిరిజన ప్రాంతంలోని ఆదివాసీలకు కొండపోడు వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. దీంతో జీవనం సాగిస్తూ గిరిజన కుటుంబాల వారు ఆనందంగా జీవిస్తారు. కొండ ప్రాంతాల్లో దట్టమైన అటవీ సమీపాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని నివసిస్తూ భయం అంటే తెలియనట్లుగా ఉంటారు. వీరు క్రూరమృగాలు, విషసర్పాల మధ్య సాహస జీవితం గడుపుతుంటారు.

గిరిజన సంక్షేమం కోసం ఐటీడీఏ కృషి

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల అభివృద్ధి కోసం జిల్లాలోని బుట్టాయగూడెం మండలం కోటరామచంద్రాపురం (కేఆర్‌పురం)లో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ద్వారా గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది. గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించడం, విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలు సురక్షితమైన మంచినీటి సదుపాయాలు అందుబాటులోకి తీసుకువచ్చింది. అదేవిధంగా గిరిజనుల అభివృద్ధి కోసం ట్రైకార్ ద్వారా రుణాలు అందిస్తోంది. అలాగే గిరిజన ప్రాంతంలో ఆదివాసీలు అనారోగ్యాల బారిన పడకుండా అన్ని ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉంచడంతో పాటు గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తోంది. అదేవిధంగా గిరిజన విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. అలాగే గిరిజన సహకార సంస్థ ద్వారా అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేసి వారికి ఆర్థిక ఆసరాగా నిలుస్తోంది.

గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

గిరిజనుల అభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. గిరిజనులకు 50 శాతం పనుల్లోనూ, పదవుల్లోనూ రిజర్వేషన్ కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంచలనమైన నిర్ణయం తీసుకోవడంతో పాటు చట్టాన్ని కూడా తీసుకువచ్చారు. ఈ చట్టంపై 50 శాతం మహిళలకు పలు పదవుల్లో అవకాశాలు లభించాయి. అదేవిధంగా అటవీ హక్కుల చట్టంలో పట్టాలు పొందిన సన్న,చిన్నకారు రైతులకు, మైదాన ప్రాంత రైతులకు సమానంగా హక్కు, ప్రభుత్వ పథకాలు పొందేలా చర్యలు తీసుకున్నారు. దీంతో సుమారు రెండు వేల గిరిజన కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి. అదేవిధంగా అటవీహక్కుల చట్టంలో పోడు భూములు సాగు చేసుకుంటున్న అర్హులైన గిరిజనులకు హక్కు పట్టాల జారీకి ఏర్పాట్లు చేశారు. గత ప్రభుత్వ పాలనలో మూతబడిన పలు గిరిజన పాఠశాలలను తిరిగి పునఃప్రారంభించి కొండరెడ్డి గిరిజన బిడ్డలకు చదువుకునేలా కృషి చేస్తున్నారు. అదేవిధంగా గిరిజన ప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించేలా సుమారు రూ.50 కోట్లతో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మారుమూల కొండప్రాంతంలో ఉన్న గ్రామాల గిరిజనులకు నేరుగా అందడంతో ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఐటీడీఏ వద్ద వేడుకలు

ప్రభుత్వ ఆదేశాలతో బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురం ఐటీడీఏ పెరేడ్ గ్రౌండ్‌లో బుధవారం ఆదివాసీ దినోత్సవం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటలకు ఆదివాసీ జెండా ఆవిష్కరణ, ప్రార్థనాగీతం, జ్యోతి ప్రజ్వలన నిర్వహిస్తారు. 10.30 గంటలకు ముఖ్య అతిథుల ఆహ్వానం, 11 గంటలకు ముఖ్య అతిథుల సందేశం, 12:30 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, 1:30 గంటలకు సన్మాన కార్యక్రమం, మధ్యాహ్నం రెండు గంటలకు వందన సమర్పణతో కార్యక్రమాలు ముగిస్తాయి.

వేడుకలకు ఏర్పాట్లు పూర్తి



అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయలు ఉట్టిపడేలా వేడుకలు కళా ప్రదర్శనలు ఏర్పాటు చేశాం.

– ఎం.సూర్యతేజ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, కేఆర్ పురం

గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట



గిరిజన అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించారు. 50 శాతం పనుల్లో, పదవుల్లో రిజర్వేషన్ కల్పించే విధంగా చట్టం చేశారు. గిరిజనుల విద్యాభివృద్ధి కోసం మూతపడిన పాఠశాలలు తెరిపించారు. విద్య, వైద్యం ఉపాధి, గిరిజన ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది.

– తెల్లం బాలరాజు, పోలవరం ఎమ్మెల్యే

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

చౌకడిపోల్లో బియ్యం, జొన్నలతోనే సరి

- నిలిచిన సబ్సిడీ వంటనూనె, కందిబేడలు, చక్కెర, గోధుమల పంపిణీ
- సక్రమంగా అందించాలని ప్రజల వేడుకోలు


రేషన్ షాపుల్లో పంపిణీ చేస్తున్న బియ్యం


చౌకడిపోల్లో అందజేస్తున్న జొన్నలు

సాక్షి,బళ్లారి: బహిరంగ మార్కెట్‌లో రోజు రోజుకు ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలు ఒకవైపు, కూరగాయాల ధరలతో మరో వైపు సామాన్య, మధ్యతరగతి ప్రజలు జీవనం సాగించడం కష్టతరం అవుతున్న నేటి రోజుల్లో రేషన్ షాపుల్లోనైనా సబ్సిడీతో అందిస్తారని ఆశిస్తే అక్కడ కూడా గత మూడేళ్లుగా కేవలం బియ్యం, జొన్నలను మాత్రమే పంపిణీ చేస్తూ ప్రభుత్వం చేతులు దులుపుకుంటోంది. జిల్లాలో దాదాపు 3.50 లక్షల రేషన్ కార్డులున్నాయి. ప్రతి నెల చౌకధాన్యం డిపోల్లో బియ్యం, జొన్నలతోనే సరిపెడుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రేషన్ షాపుల్లో బియ్యంతో పాటు సబ్సిడీ వంటనూనె ప్యాకెట్, చక్కెర, కందిబేడలు తదితర గృహావసరమైన సరుకులను పంపిణీ చేసేవారు.

తీవ్ర ఇబ్బందుల్లో పేదలు

ప్రస్తుతం కేవలం బియ్యం, జొన్నలను మాత్రమే పంపిణీ చేస్తూ మిగిలిన వాటిని నిలిపివేయడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్క బళ్లారి జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ షాపుల్లో ఇదే విధంగా పంపిణీ చేస్తున్నారని సంబంధిత అధికారి తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదు గ్యారంటీల్లో ఒకటైన 10 కేజీల బియ్యం పంపిణీలో భాగంగా ఇప్పటికే ఐదు కేజీల చొప్పున సంబంధిత రేషన్ కార్డు దారులకు వారి వారి ఖాతాల్లో నగదు జమ చేస్తోంది. ఎన్నికల ప్రణాళికలో చెప్పిన వాటిని అమలు చేయడంపై ప్రధానంగా దృష్టి పెట్టిన కాంగ్రెస్ సర్కార్ రేషన్ షాపుల్లో పేదలకు సబ్సిడీతో అందజేసే వాటిపైన పునరాలోచన చేసి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు మహిళలు పేర్కొంటున్నారు.

కందిబేడల పంపిణీకి డిమాండ్

కంది బేడల ధర బహిరంగ మార్కెట్‌లో రూ.160లకు పైగా పలుకుతుండటంతో జొన్నలకు బదులుకు ఒక్కో నెల కంది బేడలు పంపిణీ చేస్తే మేలు అని రేషన్‌కార్డు లబ్ధిదారులు పేర్కొంటున్నారు. గ్యారంటీల్లో ఒకటైన 10 కేజీల బియ్యం పంపిణీ చేసేందుకు వీలు కాకపోవడంతో ఐదు కేజీలకు సంబంధించి నగదు వారి ఖాతాల్లో వేసే బదులుగా సబ్సిడీతో కంది బేడలు, వంటనూనె, చక్కెర, గోధుమలు తదితరాలను పంపిణీ చేస్తే పేదలకు కడుపు నింపుకునేందుకు వీలవుతుందన్నారు. ఈనేపథ్యంలో మూడేళ్లకు పైగా అటకెక్కిన సబ్సిడీతో అందజేసే నిత్యావసర సరుకులను రేషన్ షాపుల్లో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కార్డుదారులు కోరుతున్నారు.

జిల్లా అభివృద్ధిపై సీఎంతో చర్చ


మాట్లాడుతున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

రాయచూరు రూరల్: జిల్లా అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో జిల్లా ప్రజాప్రతినిధులు చర్చించారు. మంగళవారం విధానసౌధలో రాయచూరు, విజయపుర, బీదర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో మాట్లాడారు. జిల్లా అభివృద్ధిపై వైద్య విద్యా శాఖా మంత్రి శరణు ప్రకాష్ పాటిల్, చిన్న నీటిపారుదల, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖా మంత్రి బోసురాజు, ఎమ్మెల్యేలు బసనగౌడ దద్దల్, టి.బసనగౌడ, హంపనగౌడ బాదర్లి, హంపయ్య నాయక్, ఎమ్మెల్సీ శరణేగౌడ బయ్యాపూర్‌లతో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం రాయచూరుకు ఎయిమ్స్‌ను కేటాయించాలని కోరుతూ కేంద్రానికి సిఫార్సు లేఖ రాశామని, ఎయిమ్స్‌ను మంజూరు చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. నగరంలో జిల్లా ఆస్పత్రి, ఒపెక్ ఆస్పత్రుల ప్రారంభం, వంతెనలు, రహదార్లు, తాగు, సాగునీటి అంశాలపై చర్చించారు.

క్లుప్తంగా

ఆ నిధులను మళ్లించొద్దు


వినతిపత్రం సమర్పిస్తున్న నేతలు

రాయచూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన గ్యారంటీ పథకాలకు బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రూ.11 వేల కోట్లను మళ్లించరాదని అంబేడ్కర్ దళిత సేనా సమితి అధ్యక్షుడు భరత్ నాయక్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో మాట్లాడారు. దీన దళితులు, దేవదాసిల సంక్షేమం కోసం ప్రభుత్వం 2023–24 బడ్జెట్‌లో ఎస్సీలకు రూ.7,750 కోట్లు, ఎస్టీలకు రూ.3,430 కోట్లను కేటాయించిందన్నారు. వాటిని గృహలక్ష్మి, గృహజ్యోతి, శక్తి, అన్నభాగ్య, యువనిధి పథకాలకు వాడుకోరాదన్నారు. ఎస్సీ, ఎస్టీ పథకాలకు కేటాయించిన నిధులను వారికే వినియోగించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

రిజర్వేషన్ల కోసం ధర్నా


ఆందోళన చేస్తున్న దళిత నేతలు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో ఎస్సీలకు రిజర్వేషన్లు కేటాయించాలని సాంఘీక న్యాయ పోరాట సమితి అధ్యక్షుడు మారెప్ప డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఎస్సీలకు 15 నుంచి 17కు, ఎస్టీలకు 3 నుంచి 7 శాతానికి పెంచడాన్ని ఖండించారు. గతంలో ఉన్న పద్ధతిని అమలు చేసి రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

వేతన బకాయిలు చెల్లించరూ


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరసభలో కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న పౌర కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని జిల్లా కాంగ్రెస్ కార్మిక విభాగం డిమాండ్ చేసింది. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి అధ్యక్షుడు ఉరుకుందప్ప మాట్లాడారు. నగరంలో చాలా ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం వేతనాలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసినా అధికారులు ఇంకా ఇవ్వలేదన్నారు. కార్మికులకు వారం రోజుల్లో కనీస వేతనాలు అందచేసి వారిని పర్మినెంట్ చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతి పత్రం అందించారు.

ఎంసీహెచ్ ఆస్పత్రి ప్రారంభించండి


మంత్రితో మాట్లాడుతున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలో తల్లీబిడ్డల ఆస్పత్రి(ఎంసీహెచ్)ని ప్రారంభించాలని కరవే అధ్యక్షుడు వినోద్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వీవీపీ భవనంలో ఆరోగ్య శాఖ మంత్రి దినేష్ గుండూరావుకు ఆయన వినతి పత్రం సమర్పించి మాట్లాడారు. ఆరు నెలల క్రితం ప్రారంభించిన 60 పడకల ఆస్పత్రిలో రూ.15 కోట్లతో విధుల నిర్వహణకు వైద్యులు, సిబ్బంది, అధికారులు, ఉద్యోగుల నియమకం చేపట్టాలని కోరారు.

ఘనంగా గురూజీ జన్మదిన వేడుకలు


జన్మదిన వేడుకల్లో పాల్గొన్న భక్తులు

గంగావతి రూరల్: తాలూకాలోని ఆనెగుంది మేగోటె ఆదిశక్తి దుర్గామాత ఆలయంలో ఉదయం నుంచి పలు పూజలతో పాటు నవచండీ హోమం, అనంతరం దాసోహ రత్న బ్రహ్మానంద గురూజీ 51వ జన్మదినాన్ని పురస్కరించుకొని గోశాల గోపాల సేవకుల నేతృత్వంలో గురూజీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వేలాది మంది భక్తులు పాల్గొని గురూజీ ఆశీర్వాదం పొందారు. ఆనెగుంది రాజమాత లలితారాణి శ్రీరంగదేవరాయలు, ఆలయ మేనేజర్ రాజణ్ణ స్వామి, జైన్ సమాజ ప్రముఖులు, శ్రీరామనగర్ కాంట్రాక్టర్ హరిబాబు, బసాపట్న జీపీ సభ్యులు శంకర్ నాయక్‌లతో పాటు భక్తులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలతో విద్యార్థులకు జ్ఞాన వృద్ధి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

బళ్లారి రూరల్: క్విజ్ పోటీలతో వైద్య విద్యార్థులకు పరిజ్ఞానం పెంపొందుతుందని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ గంగాధరగౌడ తెలిపారు. సోమవారం విమ్స్ వైద్యభవన్‌లో వైద్యవిద్యార్థులకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. విమ్స్ పీడియాట్రిక్స్ విభాగం అనేక ప్రాయోజిత కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ దుర్గప్ప మాట్లాడుతూ 60 శాతం మంది పిల్లలు అపౌష్టికతతో బాధపడుతున్నారన్నారు. విమ్స్‌లోని ఎస్‌ఐసీయూ 50 రోజుల పాటు పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించి ఆరోగ్యవంతమైన పిల్లలుగా మారుస్తూ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. విమ్స్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ కృష్ణస్వామి, సూపరింటెండెంట్ డాక్టర్ ఖాసాసోమశేఖర్ క్విజ్ పోటీల లబ్ధిని వివరించారు. ఐఏపీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీకాంత్, ఆర్‌ఎంఓ డాక్టర్ రవిభీమప్ప, డాక్టర్ వాణి, వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.

ఇలకల్ చేనేత కళాకారిణికి అవార్డు ప్రదానం


జాతీయ అవార్డు అందుకుంటున్న పద్మా విఠల్

రాయచూరు రూరల్: అంతర్జాతీయ స్థాయిలో చేనేత చీరలకు ఇలకల్ పేరు పొందిన నగరమని రాష్ట్ర జవుళి, చక్కెర శాఖా మంత్రి శివానంద పాటిల్ పేర్కొన్నారు. సోమవారం బెంగళూరులో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి చేనేతకారుల 9వ అంతర్జాతీయ చేనేత మగ్గాల దినోత్సవంలో ఆయన ప్రసంగించారు. చేనేతకారులకు రూ.5 వేల మేరకు గౌరవ ధనాన్ని పెంచామన్నారు. చేనేత మగ్గాలకు 10 హెచ్‌పీ వరకు విద్యుత్ సబ్సిడీ ఇవ్వడంపై సీఎంతో చర్చిస్తామన్నారు. పట్టు చీరల విభాగంలో పావగడ జయకీర్తి, చింతామణి మంజునాథ, పత్తి నూలు విభాగంలో ఇలకల్ పద్మా విఠల్, కిన్నిగోల్ సంజీవ్ శెటగార్, ఉన్ని విభాగంలో మొళకాల్మూర్ తిప్పేస్వామి, ఇతర దుస్తులు నేయడంలో సాతనూరు బాలాజీ అవార్డులు అందుకున్నారు. ఈసందర్భంగా చిత్రదుర్గ బసవమఠం హన్మంతరాయ స్వామీజీ, చేనేత కారుల మహా మండలి అధ్యక్షుడు డి.జె.గణేష్, ఎండీ లింగరాజ్, కార్యదర్శి రిచర్డ్ విన్సెంట్ డిసౌజా, కమిషనర్ కుమార్, డి.డి.సాచి ముత్తు, కాసియా అధ్యక్షుడు శశిధర్ శెట్టిలున్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా


ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

గంగావతి: ప్రభుత్వ విశ్రాంతి భవనాల్లో కాంట్రాక్ట్ బేసిస్‌పై విధులు నిర్వహించే కార్మికులకు వేతన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ పీడబ్ల్యూడీ శాఖ కార్యాలయం ముందు మంగళవారం కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా వేతనాల చెల్లింపులో కాంట్రాక్టర్ సకాలంలో వేతనాలు చెల్లించక తమను ఇబ్బంది పెడుతున్నారన్నారు. దీంతో కుటుంబ జీవనానికి, పిల్లల విద్యాభ్యాసానికి ఇతర కనీస అవసరాలకు నానా పాట్లు పడుతున్నామని వాపోయారు. తక్షణం తమ బకాయి వేతనాలను చెల్లించాలని, లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

బాలాంజనేయ స్వామి హుండీ లెక్కింపు


హుండీ సొమ్మును లెక్కిస్తున్న దృశ్యం

గంగావతి: ఆనెగుందిలోని బాలాంజనేయ స్వామి దేవస్థానపు హుండీ సొమ్మును మంగళవారం లెక్కించగా రూ.25,27,155ల కానుకలు లభించాయి. మంగళవారం తహసీల్దార్ మంజునాథ్ నేతృత్వంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఈ హుండీ సొమ్మును లెక్కించారు. కాగా గత నెలలో కన్నా లక్ష రూపాయలు తక్కువగా హుండీ సొమ్ము లభ్యమైందని రెవెన్యూ అధికారులు తెలిపారు. సణాపురలోని ఆలయ బ్యాంక్ ఖాతాలో ఈ నగదును జమ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ మహేష్, బ్యాంక్ అధికారి మంజునాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజర్ రూ.కోటి స్వాహా

- బినామీ ఖాతాలకు నగదు మళ్లింపు
- జీఎం ఫిర్యాదుతో కేసు నమోదు

రాయదుర్గం: అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బ్రాంచులో రూ.కోటి నగదు మాయమైంది. ఈ విషయం రెండు నెలల తర్వాత ఆలస్యంగా బయటకు పొక్కింది. మంగళవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. రాయదుర్గం అర్బన్ సీఐ లక్ష్మన్న తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గతంలో ఇక్కడ మేనేజర్‌గా ఎస్‌ఎల్‌ఎన్ ఫణికుమార్ పనిచేశారు. ఆయన తన తల్లితో పాటు ఇతరుల ఖాతాలకు రూ.1,00,07,323 నగదును మళ్లించి స్వాహాకు యత్నించారు. దీన్ని ఉన్నతాధికారులు గుర్తించి తనిఖీలు నిర్వహించారు. నగదు ఇతరుల ఖాతాలకు అక్రమంగా మళ్లించినట్లు నిర్ధారించుకున్నారు. ఈ ఏడాది జూన్ 21న ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకటేశ్వరరావు స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మేనేజర్‌పై 409, 420, 468, 471, 477–ఏ ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా.. ఈ విషయం బయటకు పొక్కకుండా ఎస్‌బీఐ సిబ్బంది, పోలీసులు ఇన్నాళ్లు జాగ్రత్తపడ్డారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఎట్టకేలకు బహిర్గతమైంది. బ్యాంకు అధికారులు నగదు రికవరీ చేయడంతో పాటు మేనేజరును విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు తెలిసింది.

అయితే అనావృష్టి.. లేకుంటే అతివృష్టి

- ఖరీఫ్‌లో రైతన్న నిరాశా నిస్పృహలు

హుబ్లీ: విత్తనం సాగు చేయాల్సిన జూన్‌లో వరుణుడు కరుణించలేదు. ఫలితంగా అత్యంత తక్కువ స్థాయిలో విత్తన సాగు జరిగింది. ఇక జూలై మధ్యలో ప్రారంభమైన వర్షాలు ఎడతెగకుండా కురిసి కంగారు పుట్టించాయి. ఇది ధార్వాడ జిల్లా ఈ ఏడాది ఖరీఫ్ స్థితి. గత ఏడాది ఖరీఫ్‌లో అతివృష్టి వల్ల రైతులు పంటలను కోల్పోయారు. ఈ సారి రెండు నెలల్లోనే కరువు, వరద రెండింటినీ అనుభవించారు. జూన్‌లో వర్షాలు లేక కరువు భూముల్లోనే రైతులు విత్తనం సాగు చేశారు. అయిన వరుణుడు కరుణ చూపలేదు. విత్తనం వేసినా విత్తనాల రక్షణకు రైతులు ట్యాంకర్లతో నీరు తెచ్చి పంటకు జీవం పోశారు. జూన్ నెలలో వానలు కురవక పోవడంతో ప్రభుత్వం కూడా కరువు ప్రాంతంగా ప్రకటించే ఉద్దేశంతో ఉంది. అంతలోనే వానలు ప్రారంభం అయ్యాయి. అయితే పూర్తి స్థాయిలో విత్తన పనులు సాగక పొలాలు బీడు పడ్డాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నా పంటల స్థితిలో ఎదుగుదల లేదు. జూలైలో అతి వర్షాలతో కొన్ని చోట్ల సాగు చేసిన పెసలు, వేరుశెనగ మొక్క దశలోనే జలమయమయ్యాయి. ప్రస్తుతం వేర్లన్ని కుళ్లిపోయి పసుపురంగులోకి వచ్చాయి.

కంప్లిలో జిల్లాధికారి పర్యటన

కంప్లి: బళ్లారి జిల్లాధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రశాంత్ కుమార్ మిశ్రా మంగళవారం తొలిసారిగా పట్టణంలో పర్యటించారు. నిర్మాణంలో ఉన్న మినీ విధానసౌధ, వంద పడకల ఆస్పత్రి, సోమప్ప చెరువు పనులను పరిశీలించారు. డిగ్రీ కళాశాల వద్దకు చేరుకొని విద్యార్థులతో అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఉపతహసీల్దార్, పీడబ్ల్యూడీ శాఖ అధికారులు పాల్గొన్నారు.


వంద పడకల ఆస్పత్రిని పరిశీలిస్తున్న జిల్లాధికారి తదితరులు

ఈ ఏడాది నుంచి కిష్కింధ వర్సిటీ ప్రారంభం


మాట్లాడుతున్న డాక్టర్ యశ్వంత్ భూపాల్, పక్కన డాక్టర్ వెంకట మహిపాల్ తదితరులు

బళ్లారిటౌన్: తుంగభద్ర ఎడ్యుకేషనల్ హెల్త్ అండ్ రూరల్ డెవలమెంట్ ట్రస్ట్(టీఈహెచ్‌ఆర్‌డీటీ) ఆధ్వర్యంలో నగరంలో బసవరాజేశ్వరి గ్రూప్ విద్యా సంస్థల పరిధిలో ఈ ఏడాది (2023–24వ విద్యా సంవత్సరం) నుంచి కిష్కింధ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌జే.వెంకట మహిపాల్ తెలిపారు. మంగళవారం బీబీసీ కళాశాల కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమకు ప్రభుత్వం నుంచి ఈమేరకు అనుమతి లభించిందన్నారు. ఈ విశ్వవిద్యాలయానికి డాక్టర్ యశ్వంత్ భూపాల్ వైస్ చాన్సలర్(వీసీ)గా నియమితులయ్యారన్నారు. కళ్యాణ కర్ణాటకలో తమ విద్యా సంస్థలు బళ్లారి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(బీఐటీఎం), సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్, ఐటీఐ, బీపీఎస్‌సీ స్కూల్, బీపీఎస్‌సీ పీయూ కాలేజ్, బళ్లారి బిజినెస్ కాలేజీ(బీబీసీ)లను నడుపుతున్న తమ అనుభవాన్ని పరిగణలోకి తీసుకుని కిష్కింధ విశ్వవిద్యాలయ స్థాపనకు ప్రభుత్వం అనుమతించిందన్నారు.

సింధిగేరి వద్ద యూనివర్సిటీ క్యాంపస్

విశ్వవిద్యాలయం కోసం సిరుగుప్ప రోడ్డులోని సింధిగేరి గ్రామం వద్ద 50 ఎకరాల్లో యూనివర్సిటీ క్యాంపస్‌ను స్థాపిస్తున్నట్లు తెలిపారు. కోట్లాది రూపాయల వ్యయంతో రెండేళ్లలో భవన నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. అంతవరకు తమకు ఉన్న కళాశాలలోనే కిష్కింధ యూనివర్సిటీ క్లాసులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నుంచి బీటెక్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, బీసీఏ డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ కోర్సులకు ఆమోదం లభించిందన్నారు. కర్ణాటక సీఈటీ ద్వారా సీట్లు పొందేందుకు సీఈటీ కౌన్సిలింగ్ కోడ్ ఈ 301 కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో పెసెట్ దయానంద సాగర్, గీతం, ఆర్‌వీ, రేవా, కేఎల్‌ఈ, జేఎస్‌ఎస్ లాంటి 25 ప్రైవేట్ యూనివర్సిటీలు పని చేస్తున్నాయన్నారు. ఇందులో తమ యూనివర్సిటీకి అనుమతి లభించడం వల్ల కళ్యాణ కర్ణాటకలో పేద, సామాన్య విద్యార్థులకు ఎంతో ఉపయోగపడనుందన్నారు. ఈసందర్భంగా యశ్వంతభూపాల్, పృథ్వీరాజ్, వీజీ భరత్, అమరరాజ్ భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లాలో మంత్రి పర్యటన

హొసపేటె: విజయనగర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అమీర్ అహ్మద్ ఖాన్ బుధవారం నగరంలో వివిధ అభివృద్ధి పనులను పరిశీలించనున్నారు. జిల్లా కేంద్రం హొసపేటెలో ఉదయం తాలూకా కార్యాలయం ఆవరణలో నిర్మించిన నూతన కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఆయన పాపినాయకనహళ్లిలో సాగునీటి పనులను పరిశీలిస్తారు. ఒంటిగంటకు నగరంలో నిర్మాణంలో ఉన్న జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి పనులను పరిశీలించనున్నారు. మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు జిల్లాధికారి కార్యాలయంలో ప్రగతిపై సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. ఈ నెల 15 వరకు జిల్లాలో ఆయన పర్యటించనున్నారు.

అప్పు చెల్లించమన్నందుకు హత్య

యశవంతపుర: ఇచ్చిన డబ్బులు అడిగినందుకు ద్వేషం పెంచుకొని హత్య చేసిన ఘటన దావణగెరె పట్టణంలో ఆదివారం రాత్రి జరిగింది. శివయోగేశ్‌ను నరసింహ అనే వ్యక్తి హత్య చేశాడు. శివయోగేశ్ తాపీ మేస్త్రిగా పని చేస్తున్నాడు. దావణగెరె తాలూకా మల్లశెట్టిహళ్లికి చెందిన నరసింహ ఇతనికి మిత్రుడు, ఒకసారి డబ్బులు చాలా అవసరమని కొంత మొత్తం అప్పు తీసుకున్నాడు. డబ్బులు తిరిగి ఇవ్వాలని శివయోగేశ్ అడుగుతున్నాడు. మల్లశెట్టిహళ్లి క్రాస్ వద్ద ఇదే విషయమై నరసింహ గొడవకు దిగి శివయోగేశ్‌ను కొడవలితో నరికి చంపాడు. దావణగెరె గ్రామాంతర పోలీసులు నిందితున్ని అరెస్టు చేశారు.

పచ్చదనమే ఊపిరి


మొక్కలను అందిస్తున్న ఉమేష్

కంప్లి: పచ్చదనమే ఊపిరి అనే నానుడికి తగినట్లుగా శాఖ తరపున నిరంతరం శ్రమించి అడవులను రక్షించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వలయ అటవీ అధికారి ఉమేష్ తెలిపారు. సబ్సిడీ ధరతో మొక్కలు అమ్మి అటవీ సంపద రక్షణకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి వార్డు, వీధి, ఇళ్ల ముందు మొక్కలు నాటడం వల్ల తమ ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందన్నారు. తక్కువ ధరకు మొక్కలు విక్రయిస్తున్నందున పర్యావరణ ప్రేమికులు ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహించాలన్నారు. అటవీ శాఖ అధికారి గిరీష్, సిబ్బంది పాల్గొన్నారు.


కోలారు వార్తలు...

క్రీడా పోటీల్లో విద్యార్థుల సత్తా


తాలూకా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కోలారు: తాలూకాలోని వక్కలేరి ఫిర్కా స్థాయి క్రీడా పోటీల్లో అరాభికొత్తనూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రదర్శననిచ్చారు. కబడ్డీలో ప్రథమ స్థానంతో పాటు అథ్లెటిక్స్ 10 విభాగాల్లో ఉత్తమ ప్రదర్శనతో విద్యార్థులు తాలూకా స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. విజేత విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీఎస్ ప్రదీప్‌కుమార్, సిబ్బంది అభినందించి మాట్లాడుతూ విద్యార్థులు తాలూకా స్థాయి పోటీల్లో కూడా మెరుగైన ప్రదర్శనతో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక వ్వాలని ఆకాంక్షించారు.

సీఎన్‌జీ గ్యాస్ బంక్ ప్రారంభం


సీఎన్‌జీ గ్యాస్ బంక్‌ను ప్రారంభించిన దృశ్యం

శ్రీనివాసపురం: పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరిగినందున వినియోగదారులు సీఎన్‌జీ గ్యాస్‌ను వాడి డబ్బును ఆదా చేసుకోవాలని ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి తెలిపారు. మంగళవారం సీఎన్‌జీ గ్యాస్ బంక్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. భవిష్యత్‌లో ఇంధనం ధరలు మరింత పెరగపేన్నందున వాహనదారులు ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ఉపయోగించాలన్నారు. బంక్ మేనేజర్ వెంకటేష్ మాట్లాడుతూ కోలారు జిల్లాలో 6 సీఎన్‌జీ బంక్‌లకు గాను పట్టణంలో మొట్టమొదటి సీఎన్‌జీ బంక్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఒక కిలో గ్యాస్ ధర రూ.80 ఉందని, దీనితో 50 కిమీల వరకు ప్రయాణించవచ్చన్నారు. పురసభ ఉపాధ్యక్షురాలు అయేషా నయాజ్, సభ్యుడు ఎజాజ్ బాషా, జెడీఎస్ మాజీ సభ్యుడు తూపల్లి నారాయణస్వామి పాల్గొన్నారు.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనకు వినతి


వినతిపత్రం సమర్పిస్తున్న క్రిస్టియన్ సమాఖ్య కార్యకర్తలు

కేజీఎఫ్: మణిపూర్‌లో అల్లర్లను ఖండిస్తూ క్రిస్టియన్ సమాఖ్య కార్యకర్తలు మంగళవారం నగరసభ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షుడు వేలంగిణిపాల్ మాట్లాడుతూ ఆ రాష్ట్రంలో హింసను అరికట్టడంలో అక్కడి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అక్కడ హింస ఇంకా చల్లారకపోవడం ఆ ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తిచూపుతోందన్నారు. ఈనేపథ్యంలో రాష్ట్రపతి జోక్యం చేసుకుని మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి అక్కడ రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో వివిధ చర్చిలకు చెందిన ఫాదర్లు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితునికి 20 ఏళ్ల జైలు

కోలారు: పోక్సో చట్టం కింద నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.70 వేల జరిమానా విధిస్తూ జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి బి.పి.దేవమానె తీర్పును వెలువరించారు. తాలూకాలోని గొల్లగురువేనహళ్లికి చెందిన ఎస్.ప్రవీణ్ అనే వ్యక్తి మైనర్ బాలికను అపహరించుకుని వెళ్లి అత్యాచారం చేసినట్లు బేతమంగల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ సమర్పించారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా శిక్షను విధిస్తూ తీర్పునిచ్చారు. బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం అందించాలని తీర్పులో సూచించారు. అలాగే ప్రవీణ్‌కు సహకరించిన మంజునాథ్ అనే మరో నిందితుడికి కూడా 4 ఏళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధించారు.

కర్బికాయలకు భలే గిరాకీ

- కిలో ధర రూ.150 నుంచి రూ.200ల వరకు
- మిట్టలు, కొండగుట్టల్లో విరివిగా కాస్తున్న వైనం


బండిపై కర్బికాయలను అమ్ముతున్న దృశ్యం

సాక్షి,బళ్లారి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తర్వాత వర్షాలు విస్తారంగా కురిస్తే కొండలు, గుట్టలు, మెట్ట భూముల్లో నైసర్గికంగా, విస్తారంగా వాటంతటకవే భూముల్లో పెరిగే కర్బికాయలకు భలే డిమాండ్ ఏర్పడుతోంది. వర్షాలు ఆలస్యంగా కురవడంతో కర్బికాయలు కూడా ఆలస్యంగా పొలాల్లో కాయడంతో మహిళా కూలీలకు మంచి ఉపాధి దొరుకుతోంది. జిల్లాలో సిరుగుప్ప, బళ్లారి, కంప్లి తాలూకాల్లో విస్తారంగా కర్బికాయలు కాస్తున్నాయి. మహిళలు పొద్దున్నే పొలాల్లోకి వెళ్లి కర్బికాయలను విడిపించుకుని వచ్చి నగరంలోని అమ్మకాలు సాగిస్తారు. గంపల్లో పెట్టుకుని అమ్ముతుంటారు. ఒక్కొక్కరు 5 నుంచి 10 కేజీల వరకు కర్బికాయలు విడిపించుకుని వచ్చి అమ్ముతుంటారు. ఒక్కో కేజీ కర్బికాయలు రూ.150 నుంచి రూ.200ల ధర పలుకుతుండటంతో వ్యవసాయ కూలీలకు, వ్యాపారులకు మంచి ఆదాయం వస్తోంది. కొందరు మహిళలు పొలాల వెంట, వర్షాధారిత భూములు, గుట్ట ప్రాంతాల్లోకి వెళ్లి స్వయానా వారే విడిపించుకుని వచ్చి అమ్ముకుని ఉపాధి పొందుతున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే కర్బికాయలకు జిల్లాలో భలే గిరాకీ ఏర్పడింది. షుగర్ వ్యాధికి, అధిక బరువు నియంత్రణకు ఎంతో ఉపయోపడుతుందని పలువురు వైద్యులు సూచిస్తున్నారు. కాకరకాయ వలే కర్బికాయలు కూడా రుచికరంగా ఉండటంతో పాటు కొంత చేదుగా ఉంటాయని, దీంతో చక్కెర వ్యాధి నియంత్రణలో కీలకంగా ఉంటుందని పేర్కొంటున్నారు. వర్షాకాలంలో సీజనల్‌గా నెల రోజుల పాటు పొలాల్లో విరగకాసే కర్బికాయలను ప్రతి ఒక్కరు అలవాటు చేసుకుని తినడం ద్వారా ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదని చెప్పవచ్చు.